**Telugu Adhikaarabhasha**
**Kaavaalante...** (Telugu)

# తెలుగు
## అధికారభాష కావాలంటే...

**నూర్‌బాషా రహంతుల్లా**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Telugu Adhikaarabhasha Kaavaalante...** (Telugu)

**TIP Series No.** : **136**

Written by : Noorbasha Rahamthulla

*All Rights Reserved with Publishers*

First Edition : February 2006

Copies : 2000

**Price** : **Rs.40**

ISBN : 81-88241-31-8

Published by : Telugu Islamic Publications
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

నా తెలుగు తల్లి

**రోశమ్మ (రోషన్‌బి) కి**



(1938-2000)

**అంకితం...**


సహజీవన భావనల పావురాయి

# గీతురాయి

వారపత్రిక

**ప్రతి వారం చదవండి!**

**మీ కుటుంబంలోని ప్రతివారూ చదవండి!**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | రు. 6 |
| సాలుసరి చందా | రు. 300 |
| ఆరు మాసాల చందా | రు. 150 |
| విదేశాలకు సం॥ చందా | రు.1500 |
| జీవిత చందా | రు. 10,000 |

చందా పైకాన్ని M.O. లేక D.D. ద్వారా పంపవచ్చు.
D.D.ని "GEETURAI WEEKLY" పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**

**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar,**
**Hyderabad -500 002. Ph: 24564583, Telefax: 24576237**
**E-mail: geeturai@rediffmail.com**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | 7 |
| | ప్రముఖుల అభిప్రాయాలు | 9 |
| 1. | తెలుగు భాష విశిష్ఠత | 31 |
| 2. | తెలుగు వారి విశిష్ఠత | 33 |
| 3. | తెలుగుభాషలో నమాజు | 34 |
| 4. | అధికారభాషగా తెలుగు ! | 36 |
| 5. | తెలుగు అధికారభాష కావాలంటే ? | 39 |
| 6. | భారతమాత వర్సెస్ తెలుగు తల్లి _ బ్రిటీష్ జడ్జి | 41 |
| 7. | తెలుగువారు పలికే ఉర్దూ పదాలు | 45 |
| 8. | అథోగతి పాలైన అధికార భాష | 52 |
| 9. | దాస్యం చేసే భాష అధికారభాష ఎలా అవుతుంది ? | 56 |
| 10. | తెలుగు లిపి సంస్కరణ | 61 |
| 11. | తెలుగు + ఇంగ్లీష్ = తెల్గిష్ | 66 |
| 12. | తెలుగు రెండవ జాతీయ అధికార భాష కావాలి | 70 |
| 13. | అమెరికాపోయే నలుగురి కోసం అంతా ఇంగ్లీషే చదవాలా? | 74 |
| 14. | లిపి సంస్కరణ తప్పదు | 76 |
| 15. | తెలుగు నిఘంటువులో చేరాల్సిన ఇంగ్లీషు పదాలు | 82 |
| 16. | ఇంగ్లీషునే లింకు లిపిగా చేస్తే? | 88 |
| 17. | అక్రమ లిపిక్లేశాలు | 96 |
| 18. | అయ్యయ్యో.... తెలుగు | 100 |
| 19. | తమిళనాయకుల్ని చూసైనా నేర్చుకోవాలి | 104 |
| 20. | అధికార భాషా సంఘానికి అధికారం కావాలి | 106 |
| 21. | ఆంగ్లప్రదేశ్‌కు స్వాగతం ? | 109 |
| 22. | మాతృభాషలో చదివితే మనసుకు హత్తుకుంటుంది | 112 |
| 23. | తెలుగు మహా నిఘంటు నిర్మాణం జరగాలి | 116 |
| 24. | భాషను నీవు రక్షిస్తే - భాష నిన్ను రక్షిస్తుంది | 120 |
| 25. | మనం తెలుగువాళ్ళం - ఏమీ చాతగాని వాళ్ళం | 124 |
| 26. | దిక్కులేని భాషలకు ఇంగ్లీషే దిక్కు | 127 |
| 27. | తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన విశిష్ట వ్యక్తులు | 132 |







**అబ్బాదుల్లా**
డైరెక్టర్
తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్
సందేశభవనం, లక్కడ్‌కోట్
ఛత్తాబజార్, హైదరాబాద్-2


# పరిచయ పలుకులు

అభిప్రాయ మార్పిడి కోసం ఆవిర్భవించిన సాధనమే 'భాష.' అయితే ఈ సువిశాల ప్రపంచంలోని భౌగోళిక స్థితిగతుల కారణంగా ప్రజలు–వారి వ్యవహారాలు కూడా విభిన్న జాతులుగా, వర్ణాలుగా, భాషలుగా, సంస్కృతులుగా, జీవన విధానాలుగా మారిపోయాయి. ఇది సహజసిద్ధమైన మార్పే.

కాని గత కొన్నేండ్ల నుంచి అమెరికా, దాని సోదర దేశమైన బ్రిటన్ తమ ఆయుధ బలంతో, రాజకీయ కుట్రలతో ఇలాంటి సహజసిద్ధమైన మార్పును ప్రపంచీకరణ పేరుతో సమూలంగా మార్చి తమ జాతిప్రజల భాష, సంస్కృతి, ఆర్థిక వ్యవహారాలు, జీవన విధానాలను ఇతర జాతులపై బలవంతంగా రుద్ది తద్వారా వాటిపై రాజకీయ పెత్తనం చెలాయించడానికి, అక్రమ ప్రయోజనాలు పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. గ్లోబలైజేషన్ క్రింద ఇంగ్లీషును కూడా విశ్వవ్యాప్తం చేయడం ద్వారా స్థానిక భాషలను క్రమంగా అంతమొందించడం ఆ కుట్రలలోని భాగమే.

తత్ఫలితంగానే మన తెలుగు భాష తన జన్మస్థానంలోనే తెలుగు బాలలకు అతి వేగంగా అపరిచితమైపోతోంది. నాలుగు దశాబ్దాలకు పూర్వం పట్టణాలకే పరిమితమై ఉండిన ఇంగ్లీషు మీడియం స్కూళ్ళు ఇప్పుడు తామరతంపరలా ప్రతి గ్రామానికి విస్తరించాయి. ఇలాంటి తరుణంలో మాతృభాషా శ్రేయోభిలాషులు కొందరు తెలుగు రక్షణ కోసం నడుం బిగించి రంగంలోకి దిగారు. వారిలో ఒకరు నూర్‌బాషా రహంతుల్లా . ఆయన గీటురాయి పత్రికలో ఈ విషయంపై ఇప్పటికే ఎన్నో వ్యాసాలు రాశారు. తెలుగు భాషను కాపాడడమే లక్ష్యంగా ఆయన వ్యాస పరంపర కొనసాగించారు.

ఇది ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయం లేని సమిష్టి లక్ష్యం. ఇలాంటి సమిష్టి లక్ష్యం కోసం మనమంతా కృషి చేయవలసిందే. కనీసం కృషి చేసేవారిని సమర్థించడం కూడా ఆ యజ్ఞంలోని భాగమే. అందుకే రహంతుల్లా గారి ఈ పుస్తకాన్ని మేము తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ తరపున ప్రచురిస్తున్నాం.

# ముందు మాట

ఏ జాతి సమస్త వ్యవహారాలు ఆ జాతి మాతృ భాషలోనే జరుగుతాయో ఆ జాతి సుఖపడుతుంది. అది ఎప్పటికీ విజేతగానే ఉంటుంది. ఇంగ్లీషు వాళ్ళ దేశాలను పరిశీలిస్తే వాళ్ళకున్న దురాక్రమణతత్వం వల్ల భౌతిక సంపదలు సమకూరటమేగాక వారి భాష కూడా వాళ్ళు ఆక్రమించిన దేశాల్లో రాజ్యం ఏలింది. ఇకమీదట కూడా ఏలుతుందని తెలుస్తోంది. తమ జీవితంలోని అన్ని రంగాల్లో తమ మాతృభాషే వాడకంలో ఉండేలా వాళ్ళు కృషిచేశారు. ఇంట్లో, ఆఫీసులో, కోర్టులో చివరికి చర్చిలో కూడా వాళ్ళ మాతృభాషలోనే వ్యవహారాలు నడుస్తాయి. కాబట్టి వాళ్ళు ఎంతో సుఖపడుతున్నారు.

తెలుగు ప్రజలు ఇంట్లో తెలుగు మాట్లాడుకున్నా , ఆఫీసులో ఇంగ్లీషు, కోర్టులో ఇంగ్లీషు, కొన్ని ప్రాంతాల్లో హిందీ లేదా ఉర్దూ మాట్లాడాల్సి వస్తుంది. చివరికి దేవుడి ప్రార్థన చేసుకుందామన్నా సంస్కృతంలోనో అరబ్బీలోనో చేసుకోవాల్సి వస్తోంది. తెలుగు మనిషి మనసుతో పనిలేని ఓ యంత్రం లాగా మారాడు. తెలుగు క్రైస్తవులు తమ ఆధ్యాత్మిక వ్యవహారాలన్నీ తెలుగులోకి మార్చుకున్నందువల్ల కనీసం మానసిక ఆనందాన్ని పొందగలుగుతున్నారు. తెలుగు హిందువులు, తెలుగు ముస్లింలు మొదట తమ ఆధ్యాత్మిక వ్యవహారాలను తెలుగులోకి మార్చుకోగలిగితే తెలుగు హృదయం స్వేచ్ఛగా పలుకుతుంది. దేవునితో మాట్లాడే భాష హోదా తెలుగుకు వస్తుంది. ఆ ఆనందం వర్ణించలేనిది.

పూర్వకాలంలో మన దేశంలోని రాజులు చక్రవర్తులు తమ తమ మాతృ భాషలలో ప్రజలతో సంభాషించేవారు. అలాగే దైనందిన జీవిత వ్యవహారాల పరిష్కారాల విషయంలో కూడా మాతృభాషని ఉపయోగించటం వలన ప్రజలకు రాజ్యపాలన దగ్గరైంది. ప్రజల భాషలోనే రాజ్యపాలన సాగింది. ఎవరైనా బాధితుడు వచ్చి ధర్మగంటను మ్రోగిస్తే, రాజు విచ్చేసి బాధితుడి మొర విని నిందితుడ్ని పిలిపించి అందరి సమక్షంలో విచారించేవాడు. అ విచారణలో ఇరు పక్షాల వాదోపవాదాలు మాతృ భాషలో జరిగేవి. తీర్పరి అయిన రాజుగారికి ఫిర్యాది-నిందితుడికీ మధ్య మధ్యవర్తిగా ఏ' ప్లీడరు' వుండేవాడు కాదు.

రాజు విచారణ జరిపేటపుడు ప్రజల భాషలోనే ప్రశ్నించి వివాద మర్మాన్ని పసిగట్టేవాడు. చివరకు ప్రజల భాషలోనే తీర్పు ప్రకటించే వాడు. ఈ మేరకు ఆటు విచారణ ఇటు తీర్పు ప్రజల సొంత భాషల్లో జరగటంతో మధ్యవర్తుల ఆవసరమే



వుండేది కాదు. తీర్పు సొంతభాషలో రావడంతో ఫిర్యాదికిగానీ, నిందితుడికిగాని అర్థంకానిదంటూ ఏమీ వుండేది కాదు. ప్రస్తుత న్యాయపరిపాలన విధానంతో అనాటి పద్ధతులను పోల్చి చూసుకుంటే ఎంతో క్షోభ కల్గుతుంది.

ఈనాటికైనా పరిపాలనా విధానాలన్నీ ప్రజల భాషలోనే జరిగితే అనాటి ఆనంద కరమైన పరిస్థితులు తిరిగి వస్తాయి. ఆ పరిస్థితులు నా మాతృభాష తెలుగులో రావాలనే ఉద్దేశ్యంతో రెండు దశాబ్దాలనుండి అడపాదడపా పత్రికల్లో వ్యాసాలు రాశాను. వీటన్నింటిని ఒక పుస్తకంగా ముద్రిస్తే బాగుంటుందని కొందరు పెద్దలు సలహా ఇచ్చారు. ఆ సూచనల ఫలితమే ఈ పుస్తకం .

ఈ వ్యాసాలు అప్పుడప్పుడు రాసినవి కాబట్టి కొన్ని విషయాలు చెప్పినవే చెప్పటం, కొన్ని అంకెలు ఆయా సంవత్సరాల నాటివి కావటం వలన ప్రస్తుత అంకెలతో పొంతన కుదరక పోవడం సంభవిస్తుంది. అందువల్ల ఆనాటి సంఖ్యల అధారంగా పరిస్థితుల్ని పాఠకులు అర్థం చేసుకోవాలి. నా అనుభవంలోకి వచ్చిన విషయాలను నాకు తోచిన పరిష్కారాలతో వ్రాసిన ఈ వ్యాసాలను ప్రచురించిన ఆంధ్రపత్రిక, గీటురాయి వార పత్రిక సంపాదకులకు నా ధన్యవాదాలు.

ఈ పుస్తకంపై తమ విలువైన అభిప్రాయాలను వెల్లడించిన దళిత నాయకులు, ప్రముఖ రచయిత, కవి, కత్తిపద్మారావుగారికి, 'విశాలాంధ్ర' విశ్రాంత సంపాదకులు పరకాల పట్టాభి రామరావుగారికి, 'నడుస్తున్న చరిత్ర' మాస పత్రిక సంపాదకులు డాక్టర్ సామల రమేష్ బాబు గారికి, తన గ్రంథాలలో తెలుగును పరవళ్ళు తొక్కించిన సి.వి. (చిత్తజల్లు వరహాల రావు) గారికి , ఖురాన్‌ను తెలుగులోకి అనువదించిన ప్రముఖ రచయిత అబుల్ ఇర్ఫాన్‌గారికి, గత రెండు దశాబ్ధాల కాలంగా నేను పని చేసిన చోటల్లా "అధికార భాషగా తెలుగు " అనే అంశంపై నిర్వహించిన పలు కార్యక్రమాలలో కొన్నింటికి పెద్దగా వ్యవహరించడమే కాకుండా, ఈ పుస్తక ప్రచురణకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన వి.జి.టి.యం. ఉడా వైస్ ఛైర్మన్ వి.యన్. విష్ణు ఐ.ఎ.ఎస్. గారికి, ఈ పుస్తకాన్ని రూపొందించటంలో తోడ్పడిన ప్రముఖ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ గారికి, కవి మిత్రులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారికి, ముద్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అధినేత తుమ్మల సుబ్బారావుగారికి నా కృతజ్ఞతలు.

**- నూర్‌బాషా రహంతుల్లా**

**1-11-2004**

# రెండవ సంపుటి గురించి

"తెలుగు అధికారభాష కావాలంటే..." అనే ఈ పుస్తకం గత సంవత్సరం 19 అధ్యాయాలతో వెలువడింది. ఇప్పుడు మరో 7 అధ్యాయాలను అధికార భాషా సంఘం అధ్యక్షులు తదితర ప్రముఖుల అమూల్యాభిప్రాయాలను కలుపుకొని రెండవ ముద్రణ పొందింది.

మన తెలుగు భాషకు అధికార పీఠం నిజంగా దక్కే వరకూ ఈ పుస్తకం వెలువడుతూనే ఉంటుంది. ఆ అవసరాన్ని ప్రజలకు తెలియజేస్తూనే ఉంటుంది. తెలుగును రక్షించుకోవాలని తపించేవారి కోర్కెలను ఈ పుస్తకం ప్రతిఫలిస్తూనే ఉంటుంది. తెలుగుజాతి ఇంగ్లీషు, హిందీ, తదితర జాతులతో సమంగా తలెత్తుకొని తిరిగే వాతవరణం రాష్ట్రంలో కలగాలి. ఎవరి భాషను వారు గౌరవించటం, వారి భాషకు సర్వాధికారాలు కలగాలని కోరుకోవటం తప్పు కాదు కదా?

తెలుగుకు రెండవ జాతీయ అధికారభాష హోదా, ప్రాచీన భాషా హోదా కల్పించాలని కోరుతుంటే.....గొంతెమ్మ కోర్కెలు మానుకోమనీ, ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికి ఎలా ఎక్కు తుందనీ, ఇంట గెలచి రచ్చ గెలవమనీ, అత్యాశ పనికి రాదని..... కొందరు తెలుగు పెద్దలే నాకు విడమరచి చెప్పారు. కాని వాళ్ళకు కూడా అంతరంగంలో వారి మాతృభాష ఉట్టికెక్కాలని, ఇంట గెలవాలని, రచ్చలో కూడా గెలవాలనే ఉంది. ఎంతైనా వారూ తెలుగు బిడ్డలే కదా! కాకపోతే ప్రస్తుత పరిస్థితిని చూసి ఇవి తీరే కోర్కెలు కావని నిరాశ. ఎప్పటికైనా ఈ కోర్కెలు తీరాలనీ, తెలుగు బ్రతకాలనీ, తెలుగు ఏలాలని, తెలుగుకు సరైన న్యాయం జరగాలనీ నా ఆశ. నేను ఆశావాదిని. ప్రజల భాషకు పట్టం కట్టడం ఏనాటికైనా తప్పదు.

"మద్రాసు లేని తెలుగు రాష్ట్రం తలలేని మొండెం లాంటిది" అని అమరజీవి పొట్టి శ్రీరాములు ఎంతగానో వాపోయారు. తెలుగు విద్వాంసులు సంగీత సాహిత్య రంగాలలోనే గాక ఇతర రంగాలన్నింటిలో ఆనాటికే చెన్నైలో చేసిన అభివృద్ధిని మనం వదులుకున్నాం. బళ్ళారి, బరంపురం లాంటి తెలుగు ప్రాంతాలు కూడా కోల్పోయాం. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన మరునాడే తెలుగు అసెంబ్లీ తరలి పోవాలని, తెలుగువారి రాజధాని మద్రాసులో ఉండటానికి ఒక్క రోజు కూడా ఆతిథ్యం ఇవ్వటం కుదరదని సి. రాజగోపాలాచారి తెగేసి చెప్పాడట.



దాంతో తెలుగు నాయకులు కర్నూలుకు వెళ్ళారు. మళ్ళీ అక్కడ్నుంచి హైదరాబాదుకు వెళ్ళారు. ఇలా నిరంతరం వలసలు వెళ్ళే శరణార్థులకు ఆశ్రయ మిచ్చేవాళ్ళ భాషే వస్తుంది కాని, వారి స్వంత భాష వికసించదు. ఏ భాషవారికైతే అత్యధిక సంఖ్యాకులు వారి భాషనే మాట్లాడే సుస్థిర రాజధాని నగరం ఉంటుందో, వారి భాష కూడా సులభంగా రాజ్యమేలుతుంది. రెండు మూడు భాషలవాళ్ళు అధికార యంత్రాంగంలో ఉన్నపుడు ఒకరి భాష ఒకరికి అర్థంగాక, ఎవరి భాష పెత్తనం కోసం వాళ్ళు పెనుగులాడుతుంటే, ఇద్దరినీ సమర్థించే మూడో భాష పెత్తనం చెలాయిస్తుంది.

"భాషను ఆధునిక శాస్త్ర సాంకేతిక పదాలతో పరిపుష్టం చేసినపుడే ఆ భాషలో చదివే చదువులు ఉపాధి చూపుతాయి" అన్నారు రాష్ట్రపతి అబ్దుల్ కలాం. మన భాషా పాటవంతో చదివినవారికి ఉపాధి రంగంలో రిజర్వేషన్లు ఇచ్చి ప్రోత్సహించినా ఎంతోమంది తెలుగు భాషలోనే శాస్త్ర సాంకేతిక విద్యలు చదవటానికి తరలి వస్తారు. కోటి విద్యలు కూటి కొరకే కదా!

ఈ పుస్తకాన్ని ముద్రించిన తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ డైరెక్టర్ అబ్బాదుల్లా గారికి, గీటురాయి వారపత్రిక ఎడిటర్ మలిక్ గారికి, ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన అబుల్ ఇర్ఫాన్ గారికి, వాహెద్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కారణం ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ గతంలో వీరందరి సహకారంతో "గీటురాయి" పత్రికలో వచ్చినవే, కాబట్టి ఈ పుస్తకానికి నిర్మాత "గీటురాయే"నని మరోసారి చెబుతున్నాను.

**- నూర్‌బాషా రహంతుల్లా**
**(రచయిత)**



**ఎ.బి.కె. ప్రసాద్,**
అధికార భాషా సంఘం అధ్యక్షులు,
సచివాలయం, హైదరాబాద్.
ఫోన్ : 9848318414

## సచివాలయంలో అధికార భాషకు

# దిక్కుదివాణం లేదు

తెలుగు వ్యాప్తి కోసం తెలుగు భాషాభివృద్ధి కోసం, పరిపాలనా భాషగా తెలుగు ఇరుగు పొరుగు దక్షిణాదిరాష్ట్రాల మాతృభాషలతో సమంగా నిత్య వ్యవహారంలో ఎదిగి రావాలని తపనపడుతున్న విద్యావంతులలో ఇటీవల నా దృష్టికి వచ్చిన వారు ఇరువురున్నారు. వారిలో ఒకరు విశాఖపట్నంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న నూర్‌బాషా రహంతుల్లా, మరొకరు హైదరాబాద్‌కు చెందిన షేక్‌బడేసాహెబ్.

ఇటీవల మిత్రులు రహంతుల్లా "తెలుగు అధికార భాష కావాలంటే ..." అన్న మకుటంతో రాసిన పుస్తకం ఎంత ప్రాచుర్యం పొందిందంటే, కొద్ది మాసాలలోనే అది పునర్ముద్రణకు వచ్చింది. రహంతుల్లా పుస్తకానికి ఇంత విలువ ఎందుకు వచ్చింది?

ప్రపంచీకరణ పూర్వరంగంలో తమ సరకులతో వర్ధమాన దేశాల మార్కెట్లను నింపి, స్థానికప్రజల వస్తూత్పత్తులను దెబ్బతీసి సంతలపై సంపూర్ణ ఆధిపత్యం నెలకొల్ప డానికి ముందు ప్రపంచ సమాచార వ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని అమెరికా - ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని సుప్రసిద్ధ అమెరికన్ మీడియా నిపుణులైన ఎడ్వర్డ్స్, మెక్‌సినేలు వెల్లడించారు. ఈ నిర్ణయం 1980-90ల మధ్య జరిగింది. దీని పర్యవసానంగానే, ఈ పూర్వరంగంలోనే మాతృభాషల స్థానే ఇంగ్లీషును సర్వత్రా ప్రాథమిక విద్యాదశనుంచి బోధనా భాషగా, మల్టీనేషనల్ గుత్తకంపెనీల వ్యాపార వ్యవహార లావాదేవీల ప్రయోజ నాలు సాధించిపెట్టడం కోసం అమలులోకి తేవాలన్న నిర్ణయం జరిగింది.

వర్ధమాన దేశాల మాతృభాషలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ రాబోతున్న ప్రమాదం గురించి ఐక్యరాజ్యసమితి (192 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచ



సంస్థ) సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక విభాగంగా ఉన్న "యునెస్కో" 2000 సంవత్సరం లోనే హెచ్చరించింది. మాతృభాషలకు ఈ ప్రమాదం ఎందుకు ఎదురవుతోందో కూడా ఆ సంస్థ వివరించింది. వాటిలో ప్రధాన కారణం 200 ఏండ్లకు పైగా ఇంగ్లీషువాళ్ళ పరాయిపాలన కింద మగ్గిపోవటం, మాతృభాషల అభివృద్ధిని కుంటుపరచడం.

నిజానికి 17వ శతాబ్దం వరకూ ఇంగ్లీషుకు ప్రపంచంలో ఇతరచోట్ల సంగతి అలావుంచి దాని పురిటి గడ్డయిన ఇంగ్లాండ్‌లోనే గతి లేదు. లాటిన్, ఫ్రెంచి భాషలదే (రాజకీయంగానూ, ఆర్థికంగానూ రోమన్, ఫ్రెంచి సామ్రాజ్యాలు బలంగా ఉన్నందున) పెత్తనం అంతా. ఆ "పెత్తనం" తోనే ఆ రెండు సామ్రాజ్యాలూ ఇంగ్లీషును "నీచమైన", "తుచ్ఛమైన", "అనాగరిక" భాషగా వర్ణిస్తూ వచ్చారని మరవరాదు! ఈ అవమానం భరించలేని ఇంగ్లాండ్ పార్లమెంటు ప్రత్యేక తీర్మానం ద్వారా ఇంగ్లీషును తమ మాతృభాషగానూ, జాతీయ భాషగానూ ప్రకటించుకోవలసి వచ్చింది!

అలాంటి ఇంగ్లీషు చరిత్ర ఎక్కడ? 2000 సంవత్సరాలకు పైబడిన భాషాచరిత్ర గల దక్షిణ భారత భాషలలో ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటైన తేటతెలుగు ఎక్కడ? అలాంటి తెలుగును ప్రాథమిక విద్యాదశ నుంచీ కనుమరుగు చేయాలని, దానిస్థానే సమాచార సాంకేతిక విప్లవం పేరిట, కంప్యూటరీకరణ పేరిట, విద్యను వ్యాపారీకరించి, ప్రయివేట్ స్కూళ్ళతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీషును ప్రాథమిక స్థాయిలోనే బోధనాభాషగా ప్రవేశ పెట్టాలని చూస్తున్న సమయంలో రహంతుల్లా పుస్తకం వచ్చింది.

ఆంగ్లభాషా వ్యామోహితులైన కొందరు తెలుగు "పెద్ద మనుషులు" కూడా బానిస విద్యావ్యవస్థకు పాదులు తవ్విన వలస ప్రభుత్వాధికారి అయిన లార్డ్ మెకాలేకు తెలుగునాట పుట్టిన "మునిమనవళ్ళ" మాదిరిగా కొత్త వంతలు పాడుతున్న సమయంలో రహంతుల్లా పుస్తకం వెలువడి విస్తృతమైన చర్చకు దారితీసింది.

సంస్కృతంతో కొంత, ఇంగ్లీషు ప్రభావంతో మరింతగానూ, అపారమైన పదసంపదతో తులతూగుతూ వచ్చిన తెలుగు ఎన్నో సొంత పదాలు కోల్పోయింది. పరభాషా సంపర్కం వల్ల భాషలు సుసంపన్నం కావటం, పెరగడం ఒకఎత్తు కాగా తన వ్యక్తిత్వాన్నీ, తన మొక్కట్లనూ చెదర గొట్టుకునేంతగా మాతృభాషను దిగజార్చుకోవడం వేరు. తెలుగునాటి ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోవడం, నేర్పడం వేరు, ప్రాథమిక విద్యాదశ అంతటా (1 నుంచి 10వ తరగతి వరకూ) మాతృ భాషలోనే విద్యాబోధన సాగించడం వేరు. ఈ తేడాను గమనించక బలవంతంగా 1-2 తరగతుల

నుంచి ప్రయివేట్ స్కూళ్ళతో పోటీగా ఇంగ్లీషునే మాధ్యమ (బోధన) భాషగా ఎక్కించడానికి ప్రయత్నాలు ముమ్మురంగా సాగుతున్నాయి.

ఇప్పటికే విద్యను వ్యాపారీకరించడం (ప్రయివేటీకరించడం) ద్వారా దాదాపు 30% దాకా మన తెలుగు పిల్లలు తల్లిభాషకు దూరమవుతున్నారని అనధికార అంచనాలు. ఈ విషయంలో జనాభాలో 30% పిల్లలు తమ మాతృభాషకు దూరమయినప్పుడు వ్యవహారంలో ఆ భాషను మృతభాషగా ప్రకటించుకోవలసిన దుస్థితి క్రమంగా వస్తుందన్న 'యునెస్కో' హెచ్చరికను తెలుగు భాషాభిమానులెవరూ మరువరాదు. సాహిత్యవేత్తలు, కవులు, పరిశోధకులు, వారి రచనలు, గ్రంథాలు బాగానే ఉంటారు, ఉంటాయి, వాటికి ఇబ్బంది లేకపోవచ్చు; కాని వ్యవహారంలో, వాడుకలో భాష చచ్చిపోకుండా ఉండాలంటే ప్రాథమిక విద్యాదశ అంతా మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి.

ఈ విషయాన్ని రహంతుల్లా 19 అద్యాయంలో చాలా చక్కగా చర్చించారు. పరభాషలను గౌరవిస్తూనే మాతృభాష ప్రాశస్త్యం గురించి, తెలుగు లిపిలో రావలసిన సంస్కరణల గురించి, అధికార భాషగా తెలుగు ఎలా ఉండాలి, దాస్యం చేసే భాష అధికార భాషగా ఎలా చెలామణీ అవగల్గుతుంది ఇత్యాది ప్రశ్నలతో, చదవముచ్చటగా రాశారు. అలాగే తెలుగు నిఘంటువులకు ఎక్కవలసిన ఇంగ్లీషు పదాల గురించీ రాశారు. ప్రజల వాడుకలో రూఢమైన పరభాషా పదాలను "ఇవి తెలుగే" అనిపించగల, గ్రాహ్యశక్తిలో తెలుగు పటువుకు, దిటవుకు నిదర్శనంగా ఉండే పారశీ, ఉర్దూ భాషా పదాలను ఉదాహరించారు. ముఖ్యంగా తెలుగు చేసుకోగల్గిన ఇంగ్లీషు పదాలను కూడా యధాతథంగా వాడే అలవాటును ఏవగించుకున్నారు.

మనం కోల్పోయిన ఎంతో పదసంపద నేటికీ అంతో ఇంతో జానపదాలలో, పల్లెవాసుల్లో, వృత్తిదారుల మధ్యనే పదిలంగా ఉంది. "మీట" మానేసి "స్విచ్"ని "రెక్క" ను పక్కకు నెట్టి "సిగ్నల్"ను పట్టుకున్నాం. "బుగ్గ"ను మరిచిపోయి "బల్బు"ను "విద్యుద్దీపాన్ని" ఎరువుతెచ్చుకున్నాం. మేలు చేసేవాడు "మేలరి" కాని ఆ పదం వదిలేసి "శ్రేయోభిలాషి"ని ఆశ్రయించాం. "ఫ్లైఓవర్"కు మనకన్నా పల్లెవాసులు "పై దారులని" చెప్పి కమ్మగా దారిచూపారు! ఇలా ఎన్నైనా ఉదాహరణలు ఇవ్వవచ్చు.

ఇక అధికార భాషా చట్టం (1966) వచ్చి నలభైయేళ్ళు గడిచిపోతున్నా దానికి సచివాలయ స్థాయిలో "దిక్కు దివాణం" లేకుండా ఉండిపోయింది. ఈ సమస్యను కూడా రహంతుల్లా "అధోగతిపాలైన అధికార భాష" అన్న శీర్షికలో చర్చించారు. అన్నింటికన్న అత్యంత విచారకరమైన విషయం- ప్రజలభాషను తిరిగి ప్రజల వద్దకు



తీసుకుపోడానికి పాలకుల్ని ఇంతగా ప్రాధేయపడవలసి రావడమూ, తెలుగును బతికించుకోండని తెలుగువాళ్ళను తెలుగువాడే మొత్తుకోవలసిన దుర్గతిలో ఉండడమూ! రహంతుల్లా వేదన తెలుగువారందరి ఆవేదన అయినప్పుడు పరిస్థితుల్ని మార్చుకోవచ్చు!

మేధావుల హృదయాలు కూడా ఈ విపరీతమయిన మార్పులకి ఏం చెయ్యాలో తెలియక, తెలిసినా ఆశయాలు వాస్తవ రూపం దాల్చక సందిగ్ధంలో ఉన్నాయి. కంటి ముందు కరిగిపోయే తెలుగు తేజాన్ని మళ్ళీ పునరుత్తేజితం చెయ్యాలనే కృతనిశ్చయంతో దీక్షాబద్ధుడై సాగి, 'తెలుగు అధికార భాష కావాలంటే...' అనే గ్రంథాన్ని రచించిన నూర్‌బాషా రహంతుల్లా బహుధా ప్రశంసనీయుడు.

ఈ పరిశోధనలో ప్రస్తుత తెలుగుభాషా స్వరూపాన్ని సమగ్రంగా విశ్లేషించడంతో పాటు, తెలుగు భాషాభ్యుదయాన్ని అన్వేషించడం ఈ గ్రంథంలోని మరొక ప్రత్యేకత. ఏ వ్యాసానికా వ్యాసం విషయపూర్ణాలై, శ్రేయోదాయకంగా ఉన్నాయి. పరిష్కార మార్గాలెన్నో రచయిత చూపించారు. భాషా చరిత్ర, లిపి విధానం, అన్యదేశాలు, నిఘంటు వుల ఆవశ్యకత, తెలుగుభాషకు జరుగుతున్న అన్యాయం, భాషే ఊపిరిగా బతికిన విశిష్టవ్యక్తుల కథనాలు వంటి అనేక అంశాలతో సాగిన విశిష్ట పుస్తకమిది.

తెలుగు దేశంలో పుట్టి, తెలుగుతనం నరనరాన ఒంటపట్టించుకొని, తెలుగు భాషను కాపాడడం అటుంచి, కనీసం తెలుగులో మాట్లాడడాన్ని అవమానంగా భావించే వారికి ఈ గ్రంథం ఒక కనువిప్పు. పార్లమెంటరీ అధికార భాషా సంఘ సభ్యుడిగా మూడు సంవత్సరాలు, అదే సంఘానికి ఉపాధ్యక్షుడుగా మరో మూడు సంవత్సరాలు పనిచేసిన నా అనుభవంతో, అక్కడ జాతీయ భాష హిందీని రాజభాషగా అమలుచేయడంలోనూ, ఇక్కడ రాష్ట్రంలో అధికార భాషగా తెలుగును అమలు చేయటంలోనూ, అడ్డంకులు సృష్టిస్తున్నది ఎక్కువ శాతం ఉన్నత అధికారులేనని చెప్పటానికి విచారిస్తున్నాను.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఒక ఉన్నత అధికారి తెలుగు భాష దుస్థితికి దురపిల్లుతూ చేసిన ఆక్రోశం ఈ గ్రంథరూపంలో వెలువడడం బహుదా ప్రశంసనీయం. ఇంత మంచి కృషి చేసిన నూర్‌బాషా రహంతుల్లా మరిన్ని రచనలు చేసి తెలుగు భాషా పునరుజ్జీవానికి దోహదం చెయ్యాలని ఆశిస్తూ......



**పద్మశ్రీ డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్,**
మాజీ రాజ్యసభ సభ్యులు
విశాఖపట్నం
ఫోన్ : 9849067343

# తెలుగు భాషా ఘోషకు ఈ గ్రంథం అక్షర సాక్ష్యం

**'ఆంధ్రత్వమాంధ్ర భాషా చ**
**నాల్పశ్చ తపసః ఫలమ్'**

'తెలుగు వాడిగా పుట్టడం, తెలుగు భాష మాట్లాడే అదృష్టం కలగడం ఒక వరం. అది చిన్నతనం కాదు. ఆ వరం చిన్నది కాదు. ఎంతో తపస్సు చేస్తే గాని లభించని ఫలం' అన్న అప్పయ్యదీక్షితుల మాటలు అక్షర సత్యాలు.

మన ఘనతను గానీ, మన చరిత్రను గానీ మనం తెలుసుకోలేం. తెలుసుకొన్నా అది ఘనతని గుర్తించం, భావించం కనీసం మెచ్చుకోలుగా ఒక్కమాటైనా చెప్పం. ఈ నిర్లక్ష్యమే నేడు తెలుగు వెలుగులు క్రమక్రమంగా కొండెక్కిపోయేలా చేస్తుంది. పై మాటల్ని చెప్పిన అప్పయ్య దీక్షితులు పొరుగు రాష్ట్రమైన తమిళదేశీయుడు. మన గొప్ప దనాన్ని పక్కవాళ్ళు గుర్తించడం ద్వారా వారి గొప్పదనం తెలుస్తుందని ఆనందించాలో, మనల్ని మనం నిర్లక్ష్యం చేసుకుంటున్నామని బాధపడాలో అర్థం కాని స్థితిలోనే గడిపేస్తున్నాం. స్వతః 'తుళు' భాషను మాతృభాషగా కలిగి, కన్నడ రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు, తెలుగు భాష గురించి, తెలుగువాళ్ళెవరూ అనని అనలేని మాటల్ని ఎలా అన్నాడో చూడండి –

'తెలుగదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్ల భుండ, తెలుగొకండ
నెల్లనృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగు లెస్స'

తెలుగు భాష అస్తిత్వానికి ప్రస్తుతం అంధయుగం. ఎన్ని విధాలుగా చర్చించినా చక్కదిద్దడంలో విఫలమౌతున్న అవాంఛనీయ పరిస్థితుల్లో ఉన్నాం. దానికి కారణాలనేకం.



# "తెలుగు అధికార భాష కావాలంటే....' పుస్తకంపై ప్రముఖుల అభిప్రాయాలు

"ఈ పుస్తక రచనలో తమకు తెలుగు భాషపైన ఉన్న మక్కువ, తెలుగు భాషాభివృద్ధికి తమరు చేస్తున్న కృషి తేటతెల్లమవుతుంది. వివరంగా పామరులకు అర్థమయ్యేలాగా తమరు రచన చేయటం ముదావహం. ప్రతి తెలుగువాడూ ఈ పుస్తక పఠనం చెయ్యాలి."

– మండలి బుద్ధ ప్రసాద్,
శాసనసభ్యులు, అవనిగడ్డ,
ఫోన్ : 08671-272221

"ఈ పుస్తకం చదువగా తెలుగు భాష పట్ల మీకున్న ఇష్టమూ, తెలుగు అమలు పట్ల మీకున్న నిబద్ధతా తెలుస్తున్నాయి. మీకు మరో అమ్మలాంటి తెలుగు భాషా గ్రంథాన్ని అమ్మకే అంకితమివ్వడం మనస్సుని ఆర్ద్రం చేసింది. ఈ గ్రంథంలో తెలుగు అధికార భాషగా కుదురుకోవడం పట్ల మీ అభిమతాన్ని తెలుపడమే గాక, ఎందుకు ఆ అమలు అవసరమో శాస్త్రీయంగా చర్చించారు. తెలుగు మహా నిఘంటువు నిర్మించాలనేది మా మీ ఆకాంక్ష. దానికంటే ముందుగా, చారిత్రక కాలంనుండి తెలుగు భాషలో కలిసిపోయిన ఉర్దూ, పారసి మొదలైన భాషా పదాలు, అర్థాలు ఒక చిన్న నిఘంటువుగా ప్రచురిస్తే బాగుంటుంది."

– డాక్టర్ ఆవుల మంజులత,
మాజీ సంచాలకులు, తెలుగు అకాడెమీ, వైస్ ఛాన్సలర్,
తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

"ఈ పుస్తకంలో ఉన్న 102 పేజీలలో ఎంతో విలువైన సమాచారం అందించారు. మీరు ఇంకా ఎన్నో పుస్తకాలు రాసేలా మిమ్మల్ని దీవించాలని దేవుని ప్రార్థిస్తున్నాను"

– ప్రొఫెసర్ జె. ప్రతాపరెడ్డి
రిజిస్ట్రార్, శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం
తిరుపతి, ఫోన్ : 0877-2240570

"తెలుగు భాష లిపి పరిణామ క్రమం నుంచి, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార భాషగా, పాలనా భాషగా తెలుగు సార్వభౌమస్థానాన్ని సంతరించుకోవడానికి చేపట్టవలసిన వ్యూహాల వరకు అనేక విషయాలను చక్కగా పాఠకమైత్రీ భాషా ఫణితిలో వివరించారు. మంచి పరిశోధక పత్రంగా ఈ పుస్తకం భాసిస్తోంది. నూర్‌భాషా రహంతుల్లా సహృదయశేఖరుడు. ఆకరణీయమైన శుభాకాంక్షి. తెలుగునేల నాలుగు చెరగులా ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు పాలనా భాషగా ఏలాలనీ, తెలుగు మహా నిఘంటు నిర్మాణం చేయాలని ఆకాంక్షిస్తున్న అభ్యుదయ మనస్కుడు."

**– డాక్టర్ సి. విజయరాఘవాచార్యులు**
ప్రొఫెసర్ & హెడ్, సెంటర్ ఫర్ రెగ్యులేటరీ
అడ్మినిస్ట్రేషన్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఇన్‌స్టిట్యూట్
ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డవలప్‌మెంట్, హైదరాబాద్
ఫోన్ : 98485 59228

"ఈ పుస్తకం నాకెంతో ఆనందాన్నిచ్చింది. ఇక నేను ప్రశాంతంగా చచ్చిపోయినా నాకు సంతోషంగా ఉంటుంది. కాళోజీ, వావిలాలతో కలిసి గురుకుల మిత్రాగారు, నేను తెలుగు భాషా సంఘాన్ని గతంలో ఏర్పాటు చేశాం. "బహుజనుల తల్లి భాష తెలుగు" అనే నా పుస్తకానికి మీరు ముందుమాట రాయాలి. తెలుగుభాష మీద మీ తపన, వేదన, స్పందనా నాకెంతో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించాయి."

**– భూపతి నారాయణమూర్తి, అధ్యక్షులు**
తెలుగు ప్రజా సమితి, మలికిపురం

"తెలుగు రాష్ట్ర పరిపాలన తెలుగులోనే జరగాలని మీరు పడే తపన, మేథో శ్రమ శ్లాఘనీయం. తలపుతలపునా పలుకుపలుకునా నిర్విరామంగా మీరు నడుపుతున్న ఉద్యమం ఫలించి తెలుగు భాషా చరిత్రకారునిగా, తెలుగువారికి 'మరొక బ్రౌను'గా మీరు కొనసాగాలి. 'బిడ్డకు మొదటిబడి తల్లి బడి' అంటారు. అలాంటి మీ తెలుగు తల్లి రోశమ్మ గారికి మీ పుస్తకాన్ని అంకితమివ్వటం అభినందనీయం."

**– ఇనగంటి దావూద్**
రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ, హైదరాబాద్.
(నూర్ బాషీయులు గ్రంథ రచయిత)
ఫోన్ : 040–23345660



"తెలుగు సొంతగెడ్డమీదే నిరాదరణకు గురవుతోంది. వేదికలపైనా, పత్రికల్లోనూ ఆవేదన పడడం వేరు. వాస్తవాలను పరిశోధించి భాషను సమున్నతంగా నిలబెట్టేందుకు పటిష్టమైన కృషి చేయడం వేరు. అటువంటి ఉదాత్తమైన కార్యాన్ని నూర్‌బాష రహంతుల్లా తలకెత్తుకున్నారు. ఎం.కాం. చదివి డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనలో తెలుగుభాష వర్తమాన పరిస్థితిపై అవగాహన, దాన్ని మార్చాలన్న తపన ఉన్నాయి. రెండు దశాబ్దాలపాటు ఆయన రాసిన వ్యాసాలు ఈ పుస్తక రూపంలో వెలువడ్డాయి. పాలనా వ్యవహారాలన్నీ పరభాషల్లో జరగడం వల్ల సామాన్యులు ఎదుర్కొంటున్న అవస్థల్ని ఒక అధికారిగా ఆయన దగ్గరగా చూశారు. అందుకే పాఠశాల స్థాయి నుండి ప్రభుత్వ కార్యాలయాల స్థాయి వరకూ తెలుగును అధికారభాషగా అమలు చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను సూచనల్ని ఆయన సహేతుకంగా విశ్లేషించారు. ఈ ఆశయం నెరవేరేందుకు సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకూ అధికారుల నుంచి భాషా పండితుల వరకూ చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పరభాషా వ్యవహారం వల్ల, మాతృభాషలో సమస్యలవల్ల సామాన్యులతో పాటు తానుసైతం ఎదుర్కొన్న సమస్యల్ని వివరించారు. రహంతుల్లా గారి ఆకాంక్షలైన తెలుగు మహానిఘంటు నిర్మాణం, తెలుగు లిపిసంస్కరణ, తెలుగులో పాలన సఫలమైతేనే మనజాతి సగర్వంగా తలెత్తుకొని నిలబడగలదు."

– వార్త దిన పత్రిక, విశాఖపట్టణం
19–2–2005.




**వి.యన్. విష్ణు,** ఐ.ఎ.ఎస్
ఉపాధ్యక్షులు, వి.జి.టి.యం. పట్టణాభివృద్ధి సంస్థ
విజయవాడ.
ఫోన్ : 9848034546


# చక్కని ప్రయత్నం

"తెలుగు అధికార భాష కావాలంటే..." అనే పుస్తకమును రూపకల్పన చేయుటకు నూర్‌బాషా రహంతుల్లాగారు విశేష కృషి చేశారు. వారికి తెలుగు భాషపై వున్న యిష్టానికి నిదర్శనము – ఈ కృషే. భావాలను వ్యక్తీకరించడంలో వారికి వారే సాటి. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' గా తెలుగు భాష కొనియాడబడింది. ద్రవిడ భాష పునాదిగా వున్న తెలుగు భాష, సంస్కృత భాష సంపర్కముతో త్రిలింగ దేశములో అభివృద్ధి చెందింది. తెలుగు భాషకు సంబంధించి అనేక నిఘంటువులు ఉదాహరణకు తెలుగు నుంచి తెలుగుకు, ఇంగ్లీషు నుండి తెలుగుకు, అలాగే తెలుగు నుండి ఇంగ్లీషుకు – ప్రచురించబడినాయి. యావత్ భారత్ దేశములో హిందీ తరువాత మాట్లాడే భాషగా తెలుగు గుర్తింపు పొందింది. భారతదేశములో వివిధ రాష్ట్రాలలో వృత్తి, ఉద్యోగరీత్యా స్థిరపడిన తెలుగువారు తెలుగు భాషను వాడుకలో పెట్టుటకు కృషి చేస్తున్నారు.

తెలుగు భాషను ప్రోత్సహించి అధికార భాషగా చేయుటకు నూర్‌బాషా రహంతుల్లా గారు సంకలనం చేసిన ఈ పుస్తకము ఒక చక్కని ప్రయత్నము. ఈ పుస్తకము ద్వారా అనేకమంది లాభం పొందుతారని ఆశిస్తూ, నూర్ బాషా రహంతుల్లా గారి సంకల్పం సిద్ధించాలని, వీరి రచన భావి తరాల వారికి మార్గదర్శకం కావాలని మనసారా కోరుకుంటున్నాను.






**సి.వి**
(చిత్తజల్లు వరహాలరావు)
ప్రముఖ రచయిత,
విజయవాడ.
ఫోన్:0866-2414514


# స్ఫూర్తి దాయకం

నూర్‌బాషా రహంతుల్లా గారు వ్రాసిన "తెలుగు అధికార భాష కావాలంటే..." పుస్తకాన్ని చూశా. ఈ విషయం మీద ఆయనతో కొద్దిసేపు ముచ్చటించా. తెలుగు భాషను అధికార భాషగా చూడాలని ఆయన వ్యక్తం చేస్తున్న బలమైన ఆకాంక్ష ఎంతో ముచ్చట కలిగించింది.

"తెలుగు అధికారభాష కావాలంటే..." పుస్తకానికి ఎవరి ఇంట్రోడక్షన్ అక్కర్లేదు. ఇది నిజంగా గొప్ప పుస్తకం. ఈ పుస్తకాన్ని రూపొందించటంలో రహంతుల్లా గారు చాలా సీరియస్‌గా వర్క్ చేశారు. గొప్ప కాంట్రిబ్యూషన్. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన ఆచరణాత్మక సూచనలు తెలుగు భాషాభిమానుల్లో ఆలోచనలను రేకెత్తించ గలవు. అడుగంటి పోతున్న తెలుగు భాష ప్రాధాన్యతను కాపాడేందుకు ఆయన పడుతున్న తపన స్ఫూర్తిదాయకం. ఈ పుస్తకం చదవటం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. తెలుగుభాషాభివృద్ధిని కోరుకునే ప్రతి తెలుగువాడు తప్పకుండా చదవదగిన పుస్తకం ఇది.

రహంతుల్లా అభినందనీయులు



**అబుల్ ఇర్ఫాన్,**
ఫౌండర్ ఛైర్మన్,
ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్,
హైదరాబాద్.
ఫోన్: 040-55710795

# ప్రతిపాదిత సూచనలు ప్రయోజనకరం

నా మాతృభాష తెలుగువ్యాకరణం, తెలుగు పదాలతో సంయోగం చెందిన ఉర్దూ భాష. అంచేత నేను ఉర్దూలో ఎన్ని పుస్తకాలు చదివినా, ఉర్దూ ప్రజలున్న హైదరాబాద్ పాతబస్తీలో ఇరవై నాలుగు సంవత్సరాల నుంచి నివశిస్తున్నా, ఇప్పటికీ నన్ను ఉర్దూ కంటే తెలుగే ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. దివ్య ఖుర్ఆన్‌ని ఉర్దూ నుండి తెలుగులో అనువదించి నప్పుడు నాకీ సంగతి మరింత స్పష్టంగా బోధపడింది. నూర్‌బాషా రహ్మతుల్లాకు ఇంగ్లీషు మీద గట్టి పట్టున్నా మాతృభాష గురించిన ఈ భావోద్రేకాలే ఆయనలో కూడా ఉన్నాయని నాకు అన్పిస్తోంది. మాతృభాష మీద అభిమానం ఉండటం సహజమే అయినప్పటికీ ఇతర భాషల కంటే మాతృభాష ప్రభావం ఎక్కువగా ఉంటుందనేది ఓ తిరస్కరించలేని యదార్థం.

ఒక భాష ద్వారా విషయం అర్థం చేసుకోవడం వేరు; ఆ విషయాన్ని ఆచరణకై ప్రేరేపించేటంతగా ప్రభావితం కావడం వేరు. అలాంటి ప్రభావం మాతృభాషలోనే సాధ్యమవుతుంది. కాకపోతే ఆ మాతృభాషలో ఎన్ని పరభాషా పదాలున్నా అది ఉచ్చారణ సౌలభ్యం లేని కఠిన పదాలతో కలుషితం కాకుండా సవ్యంగా సాఫీగా సాగిపోయే శైలితో కూడినదయి ఉండాలి. తెలుగులో చేరిన ఎన్నో పరభాషా పదాలను ఇప్పుడు తీసేసి సంస్కరించడం కుదరదు. వాటిని అలాగే ఉంచి ప్రభుత్వం తెలుగును ఆచరణాత్మకంగా అధికారభాషగా చేసి, ఆంగ్లేయభాషా ప్రవాహానికి అడ్డుకట్ట వేసినప్పుడే మన మాతృభాష, దాని మాధుర్యం మనగలుగుతాయి.

పాలకులు పరదేశీయులయినప్పుడు వారి భాషను రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రజలపై రుద్దడం సహజం. ఇప్పుడు మన దేశంలో పరదేశ పాలన లేకపోయినా వారు మన మీద రుద్దిపోయిన ఆంగ్లేయభాష ప్రభావం నుండి మనవాళ్ళు బయటపడ లేకపోవడం ఎంతో విచారకరం. ఆంధ్రప్రదేశ్ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన నాటి నుండి మన రాష్ట్ర పాలకులు తెలుగుకు అధికారభాషా స్థాయి ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రకటనలకు, కాగితాలకే పరిమితమై పోతున్నాయి.

ప్రభుత్వ కార్యకలాపాలలో ఇంగ్లీషు రోజురోజుకు పటిష్ఠమవుతూ తిష్ఠ వేసు కుంటోంది. ఇప్పుడు ప్రభుత్వం ప్రైవేటు విద్యాలయాలతో పోటీ పడలేక ప్రభుత్వ విద్యా



లయాలన్నిటినీ ఇంగ్లీషు మీడియం విద్యాలయాలుగా మార్చడానికి కూడా తాపత్రయ పడుతోంది. తన దగ్గరున్న మంచి రంగుకు పొగడ్తలు లభించకపోవడంతో ఇతరుల దగ్గరున్న నాసిరకం రంగు తీసుకొని పులుముకున్నట్లుందీ వ్యవహారం. ఈ ధోరణి మారాలి. ప్రభుత్వం తలచుకుంటే ప్రైవేటు విద్యాలయాలలో సైతం ఇంగ్లీషు మీడియంను తీసేయించి తెలుగు మీడియంను నిర్బంధంగా ప్రవేశపెట్టించవచ్చు.

మనవాళ్ళు ఆంగ్లేయభాషా వ్యామోహం నుండి బయటపడలేక పోవడానికి ముఖ్యంగా నాకు రెండు కారణాలు కన్పిస్తున్నాయి. **ఒకటి:** ఇంగ్లీషు అంతర్జాతీయ భాష గనుక ఆ భాష నేర్చుకొని అందులో మాట్లాడటం తమకు గర్వకారణంగా భావిస్తున్నారు అనేకమంది. ప్రభుత్వాధికారుల్లో, ధనికులలో, మధ్యతరగతి ప్రజలలో కూడా ఇంగ్లీషు మాట్లాడే వారికే గౌరవం లభిస్తుంది. పైగా అధికారులతో, ఉన్నత విద్యావంతులతో తెలుగులో మాట్లాడటం నామోషిగా భావిస్తున్నారు. తెలుగు వచ్చినా ఇంగ్లీషులో మాట్లాడటం, పాశ్చాత్య నాగరికతను అనుకరించడం మన భావదాస్యాన్నే ప్రతిబింబిస్తాయి కాని మన భాష, సంస్కృతుల ఔన్నత్యాన్ని ఇతరుల ముందు ఎన్నటికీ చాటుకోలేము.

**రెండు:** సైన్సు సాంకేతిక రంగాలలోని ఇంగ్లీషు పదాలను తెలుగులో అనువదించడం సాధ్యంకాదని భావించడం. ఇది కొంతవరకు సమంజసమే అయినా మనసుంటే మార్గం లేకపోలేదు. ఇప్పటికే కంప్యూటర్ రంగంలోని సాంకేతిక ఇంగ్లీషు పదాలు వందల సంఖ్యలో పత్రికల ద్వారా యధాతథంగా తెలుగు లిపిలో వచ్చిచేరాయి. వాటిని అలాగే కొనసాగనివ్వడం మంచిది. సైన్సు సాంకేతిక రంగాలలోని ఇంగ్లీషు పదాలలో కొన్నిటిని వాటికి సమానార్థంగల తెలుగు పదాలను సృష్టించవచ్చు మిగిలిన ఇంగ్లీషు పదాలను తెలుగీకరణ చేయవలసి ఉంటుంది. తెలుగు అధికార భాషగా చేయడానికి రహ్మతుల్లా గారు ప్రతిపాదించిన సూచనలు ఎంతో ప్రయోజనకరమైనవి. మన రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సూచనలను దృష్టిలో పెట్టుకొని చిత్తశుద్ధితో కృషిచేస్తే తెలుగు అధికారభాష కావడం అసాధ్యమేమీ కాదు.

ఈ పుస్తకంలో రహ్మతుల్లాగారు " తెలుగుభాషలో నమాజు" అనే శీర్షికతో ఒక జటిల సమస్యను లేవనెత్తారు. హిందూమతంలో కూడా కొన్ని ఆచారాలు, సంప్రదాయాలలో సంస్కృత శ్లోకాలు తప్పనిసరిగా పఠించవలసి ఉంటుంది. కాని ఇవన్నీ మతవిశ్వాసానికి సంబంధించిన విషయాలు. వీటిని మతపండితుల నిర్ణయానికే వదిలేయాలి.

నూర్‌బాషా రహ్మతుల్లా నాకు చిరకాల మిత్రులు. మాతృభాషాభిమానం ఆయన్ని ఈ రచనకు ప్రేరేపించింది. ఈ పుస్తకంలోని వ్యాసాలు కేవలం రచన కోసం రచించిన వ్యాసాలు కావు. ఇవి ప్రజలను, పాలకులను ఆలోచింపజేసి ఆచరణకై సమాయత్త పరచడానికి చేస్తున్న చిరుప్రయత్నాలు. తెలుగును అధికారభాషగా చేయడానికి వారు తీసుకునే చర్యలకు ప్రేరణనిచ్చే మౌలిక ఆలోచనాసరళి. కనుక పాఠకులు దీని గురించి ప్రశాంతంగా ఆలోచించి, తమ భావాలను ఇతరులతో పంచుకుంటారని, వాటిని ప్రభుత్వం దృష్టికి కూడా తీసికెళ్ళడానికి ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను. ఈ కార్యసాధన కోసం నడుం బిగించిన రహ్మతుల్లా గారు ఎంతో అభినందనీయులు.




**కత్తి పద్మారావు**
ప్రముఖ కవి, రచయిత,
పొన్నూరు.
ఫోన్ : 9849741695


# తెలుగు వెలుగులకు ఇదొక ముందడుగు

భాష ఒక సామాజిక జీవన ప్రతిఫలం. మనిషి గుంపుగా, గణంగా, గమనంగా, మారుతూ వెళ్ళినంత కాలం భాష ఒక సజీవ ప్రవాహంగా మనిషిని పునరుజ్జీవింప చేస్తూనే వుంటుంది. జాతికి భాషే ఒక తూనికరాయి. ప్రతిజాతి తమ భాషా మూలాల్ని వెతుక్కోవాలి. తమ చరిత్రను తామే నిర్మించుకోవాలి. ఈ దిశగా భాషా చరిత్రకారులు ఎంతో కృషి కొనసాగిస్తున్నారు. తెలుగు భాషా చరిత్రకారులలోకి నూర్‌బాషా రహంతుల్లా చేరటం ఒక నూతన ఆవిష్కరణ.

రహంతుల్లా గారు తెలుగు భాష సజీవమైందని, సంపన్నమైందని స్వతంత్రంగా నిలబడగల శక్తి గలదని ఈ గ్రంథంలో నిరూపించారు. కులమత భేదం లేకుండా తెలుగు మాట్లాడేవారంతా ఒకే జాతి అని చెప్పటం, సంభాషణలోను తెలుగు భాషను సుసంపన్నం చేయాలనేది ఆయన అభిలాష. అందుకు సంబంధించిన మూలభూతమైన పదసంపద గురించిన చర్చ ఆయన చేశారు. ఈ విషయమై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. ఈ గ్రంథాన్ని బట్టి ఆయన మంచి చదువరిగా కన్పిస్తున్నారు. భాష గురించిన ప్రతి విషయాన్నీ ఆయన ఉటంకిస్తూ వచ్చారు. నిఘంటువులు, సామెతలు, పలుకుబడులు, క్రియాపదాలు, వాక్య నిర్మాణానికి సంబంధించిన అనేక విషయాలు చెబుతూ వెళ్ళారు.

రహంతుల్లాగారిలోని ప్రధాన దృక్పథం తెలుగు రాష్ట్రం తెలుగు బాషలోనే పరిపాలించబడాలనేది. అది ఒక ఉద్యమంగా సాగాల్సిన అంశం. అటువంటి విషయాన్ని ఓ అధికారిగా చెప్పటం ప్రత్యేకత. ఆయనలోని తపనలో ఒక ఉద్యమకారుడు కూడా ఉన్నాడు. ఆ ఉద్యమకారుడు ప్రజాస్వామ్యవాది. ఆలోచనాపరుడు కూడా. ఆ ఉద్యమకారుడ్ని ఆయన భాషలోనే చూద్దాం, భాషా ప్రాతిపదిక మీద తెలుగు రాష్ట్రం ఏర్పడి 43 ఏళ్ళు గడిచినా, తెలుగులో చట్టాలు చేయకపోవటం వల్ల అధికార భాషగా తెలుగు అధోగతి పాలయ్యింది. ఐ.ఎ.ఎస్ మొదలు అటెండర్ వరకు అందరికీ ఈ భాష మీద చిన్న చూపే, ప్రపంచంలో 15వ స్థానాన్ని, భారత దేశంలో రెండవ స్థానాన్ని



పొందిన ఈ భాషకు విలువ లేదు. ఇప్పుడు కంప్యూటర్ల రాకతో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ తెలుగు వాడకాన్ని తుంగలో తొక్కాయి. పరిపాలనా పరంగా భాష విషయంలో ఆయనకున్న తపన ఈ మాటలు నిరూపిస్తున్నాయి.

ప్రధానంగా తెలుగు భాషకు, ఉర్దూ భాషకు, ఆంగ్ల భాషకు ఉండే సంబంధ బాంధవ్యాల మీద ఈ రచయిత చర్చించారు. బ్రౌను నిఘంటువు మీద వీరికి సాధికారత ఉంది. తెలుగు భాష బ్రౌను నిఘంటువు తరువాత ఎదక్కపోవటం మీద ఆయన చారిత్రిక విశ్లేషణ చేశారు. ఇక్కడే ఈయనకు భాషా చరిత్రకారుని లక్షణాలు అనువర్తించాయి. భాషా చరిత్రకారుడు పూర్వ భాషాభివృద్ధిని చెప్పటమే కాకుండా, వర్తమానంలోను, భవిషత్తులోను భాష ఎలా అభివృద్ధి చెందాలో చెప్పవలసి ఉంది. ఆ పనిని నిజాయితీగా ఈయన చేశారు.

ఉర్దూ భాష భారతీయ భాష, ఈ భాషలో భారతీయ భాషా శబ్దాలతో పాటు పార్సీ, అరబిక్, తుర్కి శబ్దాలు విరివిగా వచ్చి చేరాయి. ఉర్దూలో తెలుగు భాషాపదాలు పుష్కలంగా ఉన్నాయి. తెలుగులో ఎన్నో ఉర్దూ భాషాపదాలు ఒదిగి పోయాయి. ఉర్దూ భాషలో కవిత్వాన్ని అనుకరించి తెలుగు కవులు ఎందరో పైకివచ్చారు. కాని ఆ పదజాలానికి సంబంధించిన తులనాత్మక నిఘంటువు లేదు. ఈ విషయంలో రచయిత పట్టుదలగా ఉన్నారు. బ్రౌను తరువాత ఈ కృషిని రహంతుల్లా గారు కొనసాగిస్తే బాగుంటుంది. ఎందుకంటే బ్రౌను కూడా ప్రభుత్వాధికారే. ప్రభుత్వాధికారు లకు పరిపాలనా భాషకు సంబందించిన అవగాహన ఎక్కువ ఉంటుంది. రహంతుల్లా గారు చేసిన ప్రతిపాదనలు శాస్త్రీయంగా ఆచరణాత్మకంగా ఉన్నాయి.

రహంతుల్లా గారి మరొక చూపు ఆంగ్ల భాష గురించి. వేలాదిగా తెలుగు భాషలో వచ్చి చేరిన ఆంగ్ల భాషా పదాలను ఆయన పేర్కొన్నారు. రహంతుల్లా గారు లేవనెత్తిన ప్రధానాంశం ఆర్థిక, సాంఘిక, భౌగోళిక శాస్త్రాలతోపాటు, రసాయనిక, భౌతిక, ఖగోళ శాస్త్రాల సంకేతపదాలు తెలుగులో రూపొందించాలని. అయితే దానికి ప్రత్యేక మైన కృషి కావాలి. ఆంగ్లభాషా నిఘంటువులు ఎలా పెరిగాయో ఆ ప్రణాళిక పద్ధతులను మనం అనుసరించాలి. లిపి పరమైన అంశాలలో కూడా ఆయన పారదర్శక సూత్రాలను చేశారు. తెలుగు భాషా లిపి చిత్రలేఖనా లిపి. దీనిలో సౌందర్యం ఉంది. అది ఆధునిక సాంకేతిక టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

భాషకు మతానికి సంబంధం లేదు. అయితే తెలుగు రాష్ట్రం మీదకు వలస వచ్చిన మూడు మతాలు మూడు భాషలతో వచ్చాయి. వైదిక హిందూమతం సంస్కృతంతోను, ఇస్లాం అరబ్బితోను, క్రైస్తవం ఆంగ్లంతోను పురోహితులు మూలభాషనే

ప్రచారంలో ఉంచుతున్నారు. ఈ కారణంగా తెలుగు జాతిలోనే కొన్ని అరలు ఏర్పడినాయి. ఏ మతం వారైనా, తెలుగు భాషను తమ కార్యకలాపాలలో వాడితే తెలుగు సంస్కృతి వర్ధిల్లే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మత, కుల సంస్కృతే గాని బాషాసంస్కృతి లేదు. ఈ దిశగా ప్రయాణం సాగాలంటారు రహంతుల్లా గారు. ఇది చాలా విశాల దృక్పదం. లౌకిక భాషావాదిగా మనకు ఇక్కడ ఈయన కన్పిస్తాడు. సాంప్రదాయక భాషా చరిత్రకారులకు ఇంత లోతు లేదు. కారణం వారు మతకోణం నుంచి తప్ప భాషను చూడలేకపోవటం. ఇక్కడే రహంతుల్లా గారి ఔన్నత్యం మనకు కన్పిస్తుంది.

ఈ రచయిత భాషా బానిసత్వానికి వ్యతిరేకి. న్యాయం, వైద్యం, జ్ఞానం తెలుగు భాషలో ఉండాలని ఆయన ఆశయం. ఇదొక బృహత్ప్రణాళిక, జాతీయ దృక్పధం. అన్నీ ప్రభుత్వాలే చేస్తాయనుకోవడం అధికారులలో ఉన్న భ్రమ. ఈ భ్రమలు ఈ రచయితకు లేవు. ఏదైనా ఉద్యమంగానే నడవాలి. రాష్ట్రం సాధించటం వేరు, కులాధిపత్యాన్ని, మతాధిపత్యాన్ని భాష మీద తొలగించటం వేరు. ప్రజలు ఆ దిశగా కదలినప్పుడే ప్రభుత్వాలు ఆచరణకు తీసుకొస్తాయి. ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోకి వస్తే చట్టం నల్లకోటు ముసుగులో దాగి ఉండదు. విద్యకు ఇన్ని కార్పొరేట్ కాలేజీలు అక్కరలేదన్న విషయం బహిర్గతమవుతుంది. పరిషత్తు నాటకాలు మూతపడతాయి. గ్రామాలలో ఉన్న కళారూపాలు వేదికెక్కుతాయి. గ్రామ స్వాతంత్ర్యం వర్ధిల్లుతుంది. భాషా విప్లవం వల్ల సామాన్యుడు మాన్యుడవుతాడు.

ఈనాడు మేధావులుగా వర్ధిలుతున్న వారిలో పరభాషాటోపమే తప్ప, అందులో మేధో విలువలు ఏమీలేవని అర్ధమైపోతుంది. అంటే ఒక గ్రామ పెద్దకే వ్యవహార దక్షత ఉందనేది బయటకు వస్తుంది. భాషా విప్లవం వెనుక ఇంత మర్మం ఉంది. ఇది ఒక సమాలోచన, ఒక చారిత్రక దృక్పధం, ఒక పరిపాలనా వ్యవహార సంబంధ పద సంపద అందించే పుస్తకం. రహంతుల్లా గారు ఒక నిర్దుష్టమైన వ్యాస రచయిత. ఆయన రచనలు నేను చాలా కాలంగా పత్రికల్లో చదువుతున్నాను. ఆయనది వాస్తవిక దృక్పధం. వాక్యం సరళంగా చాలా స్పష్టంగా ఉంటుంది. ఆయన లౌకికవాది. ఈయన రచనలలో ప్రణాళికలు ఉంటాయి. ఈయన మీద బ్రౌను ప్రభావం ఉంది. ఆంధ్రులకు మాత్రం ఇప్పుడు ఓ బ్రౌను అవసరం. ప్రతి భాషాశాస్త్రకారుడికి, నిఘంటుకర్తకి బ్రౌను ఆదర్శమయ్యారు. రహంతుల్లా గారు కూడా తన కృషిని ఇలా కొనసాగిస్తే తెలుగువారికి మరొక బ్రౌను లభ్యం కాగలడు.






**పరకాల పట్టాభిరామారావు,**
స్వాతంత్ర సమరయోధులు,
విశాలాంధ్ర దినపత్రిక విశ్రాంత సంపాదకుడు
విజయవాడ
ఫోన్:0866-2474635


# ‘ఒక్కొక్క వ్యాసం ఒక్కో మణిపూస’

భారతదేశ స్వాతంత్రోద్యమంలో భాగంగానే భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనోద్యమం సాగింది. ఒకటి రెండు తరాలు గడిచేటప్పటికి తెలుగు మృతభాషగా దిగజారి పోయే పరిస్థితులు దాపురించాయి. ‘అధికార భాషా సంఘం’ అంటూ ఒకటి ఏర్పడినప్పటికీ ఈ నాటికీ పరిపాలన అంతా ఇంగ్లీషులోనే సాగిపోతున్నది.

తెలుగు భాషా ఉద్యమం ఒక చారిత్రక కర్తవ్యంగా మనముందున్న నేటి పరిస్థితుల్లో, నూర్‌బాషా రహంతుల్లా గారురచించిన “తెలుగు అధికార భాష కావాలంటే...” అన్న ఈ గ్రంథం ఎంతో ప్రాధాన్యత సంతరించు కుంటుంది. రహంతుల్లా గారు అనేక ఉద్యోగాలలో అనేక ప్రాంతాలలో పనిచేసినప్పుడు ప్రజల సమస్యలకు సంబంధించిన ఫైళ్లు తెలుగులోనే నడవాలంటే ఎదురవుతున్న సమస్యలను స్వానుభవంతో తెలుసుకున్నారు. వారి జీవితానుభవం నుండే మరొక ఆశ్చర్యకరమైన ఉదంతం వారికి మాతృభాష యందు అభిమానం కల్గించింది. తెలుగు భాషలో నమాజు ఎందుకు చేయకూడదు? అరబ్బీ భాషలో ఖురాను ఉంది గనుక అరబ్బీలోనే నమాజు చేయాలనే నిర్భంధం దేనికి? అచ్చ తెనుగులో నమాజు చేస్తే ముస్లిమ్‌లకే కాక, సర్వ మతాలవారికి కూడా దైవప్రార్ధన అర్ధమవు తుందికదా! దేవుడే కదా అన్ని భాషలను సృజించింది? అటువంటప్పుడు అర్ధంకాని అరబ్బీని ఆంధ్ర ముస్లింలపై రుద్దేకంటే తెలుగులోనే వారిని ఖురాన్ చదువుకో నివ్వడం, నమాజు చేసుకోనివ్వడం, వివాహాలు జరుపుకోనివ్వడం మేలుకాదా? తెలుగుదేశంలో ముస్లిమ్‌లు గణనీయ సంఖ్యలోనే ఉన్నారు. ఇదివరకు ఈ ప్రశ్న ఎవరికైనా స్పురించిందో లేదో తెలియదు కాని రహంతుల్లా గారికి తోచడం వారి మాతృ భాషాభిమానాన్ని తెలుపుతుంది.

రహంతుల్లా గారు తమ మాతృభాష తెలుగు అన్ని చెప్పుకొంటూ, వారి భాషాభిమానాన్ని మనసులోనే అట్టే పెట్టుకోలేదు. 1980 నుండి తెలుగు భాషా పరిరక్షణకు ఆంధ్రపత్రిక, గీటురాయి మున్నగు వివిధ పత్రికలలో లేఖలు, వ్యాసాలు వ్రాయడం ఒక ఉద్యమంగా కొనసాగించారు. ఈ వ్యాసాలన్నింటిని కలిపి ఈ గ్రంథంగా తెలుగు పాఠకులకు అందిస్తున్నారు. ఇందులో ఒక్కొక్క వ్యాసం ఒక్కో మణిపూస అని చెప్పవచ్చు. ఆంధ్రపత్రికలో 1988 జులైలో అధికార భాషగా తెలుగును అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వమూ, ప్రజలు చేయవలసిన కర్తవ్యాలను రహంతుల్లాగారు సవివరంగా తెలిపారు. ద్రావిడ భాషలన్నింటిలోకి తెలుగు మధురాతిమధురమైన భాష అని ప్రశంసించిన హెన్రీమోరిస్, ఇది సంస్కార యుతమైన భాష, భావాలను సొంపుగా, సౌలభ్యంతో వ్యక్తం చేయవచ్చునని చెప్పిన క్రైస్తవ మిషనరీ విలయమ్ కేరీ, అలాగే డి.కాంప్‌బెల్, ఆర్. కాలెట్టిల్ మున్నగు ఆంగ్ల భాషా కోవిదుల అభిప్రాయాలను ఈ వ్యాసాలలో రహంతుల్లాగారు ఉదహరించారు. మహోన్నతమైన తెలుగు భాషను ప్రజలు, ప్రభుత్వమూ కలిసి అభివృద్ధి చేయాలని రహంతుల్లాగారు చేసిన సూచనలు నేడు తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమకారులందరూ శిరోధార్యంగా భావించవలసిన అవసరం ఉంది.

ఇతర భాషలలోని అనేక పదాలు వచ్చి తెలుగులో చేరాయని, వాటినన్నింటిని చేర్చుకొని తెలుగుభాషను సుసంపన్నం చేసుకోవలసిన అవసరాన్ని కూడా రహంతుల్లా గారు సోదాహరణంగా "తెలుగువారు పలికే ఉర్దూపదాలు", "తెలుగు + ఇంగ్లీషు = తెల్గీష్" మొదలైన వ్యాసాలలో తెలియజేశారు. "దాస్యం చేసే భాష అధికార బాష ఎలా అవుతుంది!" అనే వ్యాసంలో పేద దేశాల భాషలు ధనిక దేశాల భాషలకు ఎలా ఊడిగం చేయవలసి వస్తున్నదో ప్రపంచబ్యాంకు అంతర్జాతీయ సంస్థలు తమ అంతర్జాతీయ భాషపేరుతో జాతీయ భాషలను ప్రాంతీయ భాషలను ఎలా అణగ ద్రొక్కుతున్నదీ రచయిత అనేక వివరాలను తెలిపి మన తెలుగు భాషను ఇటువంటి దాస్యాన్నుండి విముక్తి చేయాలని ఉద్ఘాటించారు. తెలుగు లిపిని సంస్కరించవలసిన ఆవశ్యకతను మరో వ్యాసంలో తెలిపారు. షెడ్యూలులో ఉన్న భాషలు, తెలుగు అకాడమీ డైరెక్టర్లు, వివిధ విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాల అధిపతులు మున్నగు సమాచారం గ్రంథం చివర చేర్చారు.



"తెలుగువారు పలికే ఉర్దూపదాలు", "తెలుగు నిఘంటువులో చేర్చాల్సిన ఇంగ్లీషుపదాలు" మున్నగు వ్యాసాలలో సమాచార సేకరణకు రచయిత ఎంత పరిశోధన ఎంతశ్రమ చేశారో మనకు అర్ధమవుతుంది.

తాను ఎక్కడ ఉద్యోగం చేస్తున్నప్పటకీ ప్రతిసారీ ఆంధ్రావతరణ దినోత్సవాలను జరుపుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ, రాష్ట్రావతరణ లక్ష్యాలు నెరవేర లేదనీ, వాటిని నెరవేర్చాలనీ రహంతుల్లాగారు పదేపదే జ్ఞాపకం చేసిన తీరు చూసినప్పుడు వారి మాతృభాషాభిమానానికి, అంకిత భావానికి వారి శ్రద్ధాసక్తులకు ప్రతి తెలుగువాడు చేయెత్తి జైకొట్టాలి తప్పదు!

భారతదేశంలో రెండవ పెద్ద భాష అయిన తెలుగును జాతీయ అధికార భాషగా చేయడం, అంతకన్నా ముఖ్యంగా ఈ నాటికైనా అన్ని స్థాయిల్లోను తెలుగును అధికార భాషగా చేయడం. టైప్‌మిషన్‌లకు కాలదోషం పట్టి కంప్యూటర్లు వచ్చిన నేటి దశలో తెలుగు సాఫ్ట్‌వేర్‌ను, కీ బోర్డును ఇంగ్లీషుకు దీటుగా అభివృద్ధి పరచాలని రహంతుల్లాగారు చేసిన సూచనను ప్రభుత్వము ప్రజలు గమనించడం నేటి తక్షణ కర్తవ్యం.

తెలుగును విద్యారంగంలో, ప్రభుత్వ పరిపాలనా రంగంలో ఇప్పటికైనా ప్రవేశపెట్టాలని నేడు జరుగుతున్న ఆందోళనకు, ఎంతో విలువైన సమాచారాన్ని అందించడమే కాక అనేక నిర్దిష్ట సూచనలను చేసిన ఈగ్రంధాన్ని అందించిన రహంతుల్లాగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలుగు భాషోద్యమ కారులందరూ ఈ గ్రంధాన్ని తప్పక చదవాలనీ, ప్రతి గ్రంధాలయంలోను ఈ గ్రంధాన్ని ఉంచాలనీ కోరుతున్నాను.



**డాక్టర్. సామల రమేష్ బాబు,**
ప్రధాన కార్యదర్శి, తెలుగు భాషోద్యమ సమాఖ్య,
సంపాదకుడు, నడుస్తున్న చరిత్ర మాసపత్రిక,
విజయవాడ.
ఫోన్:0866-2439466, సెల్ : 9848016136

# అచరణాత్మక సూచనలు అభినందనీయం

ఈ పుస్తక రచయిత నూర్‌బాషా రహంతుల్లాగారిని ప్రతి తెలుగువాడూ అభినందించాలి. ఆంధ్రపత్రిక(1987-91)లో ప్రచురింపబడిన వ్యాసాలను, 'గీటురాయి' (1996-2004) లో వచ్చిన వ్యాసాలను వరుస క్రమంలో గుది గ్రుచ్చి ప్రచురిస్తున్న వ్యాసమాలిక ఈ పుస్తకం.

నూర్‌బాషా రహంతుల్లాగారు తన మాతృభాష తెలుగు అధికార భాషగా వికసించాలని స్థిరమైన అభిప్రాయం కలిగివున్నారు. ప్రజల మాతృభాష అధికార భాషగా ఎందుకుండాలో, అందుకోసం ఏంచేయాలో, ఏవిధమైన కృషి జరగాలో ఆయన తన వ్యాసాల్లో వివరించారు. తెలుగు రెండవ జాతీయ అధికార భాష కావాలని ఆయన కోరిక. ఇందుకోసం తెలుగువారి సంఖ్యావివరాలను ఆయన ఉటంకించారు. అయితే, ప్రభుత్వలెక్కల్ని ఆధారంగా తీసుకోవడం వల్ల ఆ సంఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. తమిళనాడులో 42 శాతం తెలుగువారున్నారని అందరూ ఒప్పుకుంటున్న సత్యం. తమిళనాడులో ద్రవిడ పార్టీల పాలనలో క్రమబద్ధంగా జరుగుతున్న తమిళీకరణ వల్ల లెక్కలన్నీ తారుమారయిపోయాయి. ఇది ప్రత్యేకించి చర్చించ వలసిన సంగతి. విశేషమేమిటంటే-ప్రభుత్వ లెక్కల ప్రకారం చూచినా, తెలుగే రెండవ పెద్దభాషగా కనిపిస్తుంది. అయినా, భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగును అధికారభాషగా రూపొందించడంలో ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు శ్రద్ధలేదు. అధికారం కోసం ఏర్పడిన ప్రత్యేకతే తప్ప, తెలుగువారి రాజకీయాలకు మాతృభాష సంస్కృతుల భూమిక లేకపోవడం వల్ల-మన ప్రభుత్వాలు సామాన్య ప్రజల శ్రేయస్సుకు వ్యతిరేకంగా నడుస్తున్నాయి. తెలుగు భాషోద్యమం ఇటీవలి కాలంలో సరికొత్తగా ప్రారంభమై విస్తరిస్తుండడానికి కారణం ఇదే. ఈ పుస్తక రచయిత నూర్‌బాషా రహంతుల్లా వంటి వారు ప్రభుత్వ రంగంలో కొందరైనా ఉండబట్టే ఈ మాత్రమైనా తెలుగు అధికార భాషగా మిగిలివుందను కోవడం తప్పేమీకాదు.



అధికార భాషగా తెలుగును పటిష్టంగా, సమున్నతంగా చేయడానికి రచయిత చేసిన సూచనలు ఇప్పటి వరకు అనేక సందర్భాలలో వ్యక్తులు, సంఘాలు చేసినవే. అయితే ఇందులో చెప్పిన తీరును ఆయన అందించిన ఆచరణాత్మక సూచనలను అందరూ గమనించాలి. ప్రభుత్వ విద్యా విధానంలో తెలుగుపట్ల అనుసరించవలసిన సూత్రాల గురించి రచయిత స్పష్టంగా ఎన్నో విషయాలు సూచించారు.

తెలుగు మాధ్యమాన్ని తొలగించి, ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రభుత్వ బడులలో ప్రవేశపెట్టాలనే ధోరణిని రచయిత ఖండించడం ముదావహం. అయితే, ఇంగ్లీష్‌ను అనుసంధాన భాషగా చేయాలనడంలో ఇంగ్లీష్‌లిపిని తెలుగులిపికి బదులుగా ఉపయోగిస్తూనే తెలుగులో కంప్యూటర్‌పైన పనులు సాగించవచ్చుననడం కంటే తెలుగు లిపిని సంస్కరించి, కంపూటర్లను అందుకు అనుగుణంగా తీర్చి దిద్దుకోవచ్చు. ఈ విషయంలో ఇప్పుడున్న స్థితి కంటె అభివృద్ధి చెందడానికి మరింత పట్టుదలగా కృషి చెయ్యాలి.

"తెలుగు అధికార భాష కావాలంటే..." అనే ఈ వ్యాసమాలికను తెలుగు ప్రజలకు సమర్పిస్తున్న రచయిత నూర్‌బాషా రహంతుల్లాగారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఈ పుస్తకాన్ని ప్రభుత్వంలో అన్ని స్థాయిల్లోని బాధ్యులకు అందించాలి. భాషోద్యమంలో పనిచేస్తున్న కార్యకర్తలందరూ విధిగా చదవాలి. రహంతుల్లా గారి వంటి ఎందరో తెలుగుతల్లి ముద్దుబిడ్డలు తెలుగు భాషకు బంగరు భవిష్యత్తును సాధించడానికి దీక్షాకంకణులై ఉన్నారు. తెలుగు భాషోద్యమం దశదిశలా విస్తరిస్తుంది. రాష్ట్రంలో, దేశంలో తెలుగుకు రావలసిన స్థానం లభించితీరుతుంది.

# తెలుగు భాష విశిష్టత

✧ తెలంగా, తెలింగా, తిలాంగ్ అనేవి జాతికి, భాషకి, లిపికీ పేర్లు. తెలుంగులు వ్రాసే లిపిని ఆంధ్రీ లిపి అంటారు. **-అల్ బెరూనీ క్రీ.శ.1014**

✧ తెలుగు తూర్పు దేశాలలో ఇటలీభాషలాంటిది **-నికోలాకాంటి 1420**

✧ తెలుగులిపి ఒరియా లిపిలాగా గుండ్రంగా ఉంటుంది. గంటంతో అడ్డగీతలు గీస్తే తాటాకు చినిగి పోతుంది కాబట్టి గుండ్రంగా రాసేవాళ్ళు. **-జె.డి. ఆండర్‌సన్ 1913**

✧ దేశభాషలందు తెలుగులెస్స **-శ్రీకృష్ణదేవరాయలు**

✧ తెలుగు కష్టమయిన భాషే కానీ సంస్కారయుతమైన భాష. భావాలను సొంపుగా సౌలభ్యంతో చక్కగా వ్యక్తం చేయవచ్చు. **-విలియంకేరీ 1814**

✧శబ్ద సంపదలో, శబ్దసౌష్టవంలో, భావ వ్యక్తీకరణంలో, శ్రావ్యతలో తెలుగుతో మిగతా దేశ భాషలు సాటిరావు. వీనుల విందుగా ఉండబట్టే తెలుగును ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్ అన్నారు. తెలుగు భాష అభివృద్ధి చెందుతున్న కొద్దీ తనకు దగ్గరగా వచ్చే చాలా శబ్దాలను ఆయా ప్రాచీన కావ్యభాషల నుండి గ్రహించింది కాబట్టి "ఇంగ్లీష్ ఆఫ్ ది ఈస్ట్" అనవచ్చు. సంస్కృతం తనంతటతాను వాడుక భాష కాలేకపోయింది. కానీ సరళమయిన సులభ మయిన తెలుగు భాష ద్వారా సంస్కృతం వాడకంలోకి వచ్చింది.

**-ఎ.డి.క్యాంప్‌బెల్ 1816**

✧ అన్ని ప్రాంతీయ భాషలకంటే జెంటూ (తెలుగు) భాష మధురమైనది.

**-మూల్‌బర్నెల్ 1837**

✧ తెలుగు భాషలో అచ్చులు ఎక్కువగా ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్ అనే పేరు వచ్చింది. **-మోనియల్ విలియమ్స్ 1878**

✧ ద్రావిడ భాషల్లో తెలుగే అతిమధురమైనది ప్రాచీనతలో రెండవది **- రెవరెండ్ రాబర్ట్ కాల్‌వెల్ 1857**

✧ తెలుగు వీనులకు విందు. ద్రావిడ భాషల్లోకెల్లా మధురాతి మధురం. చదువురానివాడు మాట్లాడినా చెవుల కింపుగా ఉంటుంది. దీనిని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనడం ఎంతో సమంజసం. **- హెన్రీమోరిస్ 1890**

✧ తూర్పు దేశాల భాషల్లో కెల్లా తెలుగు అతి మృదువైన భాష. తెలుగువారి సంస్కృతోచ్చారణ కాశీ వాసుల సంస్కృతోచ్చారణ లాగా ఉంటుంది.

**-మాన్యువల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, మద్రాసు 1893**

✧ ద్రావిడ భాషల్లో కెల్లా తెలుగే శ్రావ్యమైనది. ప్రతిపదం అజంతం. అందుకే అది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనిపించుకుంది **-జి.ఎ.గారిసన్, 1906**

✧ తెలుగు ద్రావిడ భాషా కుటుంబంలో ఉత్తరాదిది. ఆర్య భాషా కుటుంబంలో దక్షిణాదిది. రెంటిలక్షణాలూ కొద్దిగా దీనిలో ఉన్నాయి. పొందిక గల శక్తి వంతమయిన భాష, వ్యాకరణ సౌలభ్యం గల భాష ఇతర భాషల్ని తేలికగా తనలో కలుపుకుంటుంది. సహజంగా శ్రవణానందకరంగా ఉంటుంది. పరభాషా పదాలను ఉపయోగించినా ఔదార్యంతో అన్ని భాషలను స్వీకరిస్తుంది. దానికి సంకుచితత్వం లేదు.

**-జి.హోమ్ ఫీల్డ్ మెక్‌లాయిడ్ 1958**

✧ బ్రిటీష్ పరిపాలన అంతమయి ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పడ్డనాడు వారి భాషలోనే వారిపాలనా వ్యవహారాలు సాగించడానికి తప్పక ప్రయత్నం చేయాలి.

**-ఆర్.కాల్‌టెల్ 1935**

✧ భారతీయ భాషలన్నింటిలోకీ, పరభాషాపదాలను తెలుగు గ్రహించినంత సులభంగా మరే భాషా స్వీకరించలేదు. కాబట్టి ఎప్పటికైనా సైన్సు, మెడిసిను,ఇంజనీరింగ్‌ల బోధనలో హిందీకి తెలుగే ధీటైన ప్రత్యర్థి అవుతుంది. జాతీయ భాషకు కావలసిన అన్ని లక్షణాలు తెలుగు భాషకు ఉన్నాయి. **-జె.బి.యస్.హాల్‌డేన్ 1958**

✧ సుందరమైన తెలుగు పాట పాడుతూ సిందూ నదిలో పడవ నడుపుదాం

**-సుబ్రహ్మణ్య భారతి**

✧ ఏ భాష చెణుకైన, ఏ యాస చినుకైన తనలోన కలుపుకొని తరలింది తెలుగు

**-సి.నారాయణ రెడ్డి**

✧ తక్కిన ద్రవిడ భాషలకు మహానిఘంటువులు సిద్ధమయినాయి గానీ, తెలుగువారి దురదృష్టమేమో! తెలుగు భాషకు లేవు. వేదం వేంకటరాయ శాస్త్రి, గిడుగు వేంకట రామమూర్తి వంటి మహా విద్వాంసులను కాదని సూర్యరాయాంధ్ర నిఘంటువును సిద్ధం చేసి నవ్వుల పాలయినారు, ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు తెలుగు అకాడమీ ఏర్పడ్డ తరువాత శబ్దసాగరమని ఒక మహానిఘంటువు నిర్మించాలని ప్రయత్నించారు గాని అఖండ భాషాభిమానులయిన పాలకులు అది నెరవేరకుండా శక్తి వంచన లేకుండా శ్రమించారు.

**-బూదరాజు రాధాకృష్ణ 2001**

✧ తల్లిపాలతో తేన్చిన తెలుగు భాష
సర్వభావాలకు రుచులు నేర్పిన అమృతాంగి
ఎంత చక్కని నాదం నా తెలుగు భాష
మాటలు మందారాలు-పదాలు సుందర శిల్పాలు
నాతల్లి నాకందం - నా భాష నాకానందం
నా భాషా రవళే నా జీవన హేళి **-గురుకులమిత్రా 1998**

1961 సెన్సస్‌లో తెలుగుజనం తమ మాతృభాషగా చెప్పుకొన్న తెలుగు యాసలు:- తెలుగు, ఆంధ్ర, బేరాది, బుడబుక్కల, చెంచు, డొక్కల, దాసరి, దొమ్మరి, ఎకిడి, గొడారి, గోలారి, జోగుల, కామాటి, కమ్మర, కాశీకావిడి, కొడువ, కొండరెడ్డి, మేదరి, మాలబాస, మాతంగ, నగిలి, పద్మశాలి, పిచ్చుకుంట్ల, పాముల, సగర, వడగ, వదరి, వాల్మీకి, యానాది, తెలంగాణా, బగట తెలుగును తమిళులు 'వడుగ' అంటే ఒరిస్సా వాళ్ళు 'బడగ' అంటారు.

# తెలుగు వారి విశిష్టత

❀ విశ్వామిత్రుడి కుమారులు కొందరు ఆంధ్రులనే పేరుతో దక్షిణాపథంలో నివశించారు.

**-ఐతరేయ బ్రాహ్మణమ్ 8:3.18(క్రీస్తు పూర్వము 500 సం॥)**

❀ ఆంధ్రులు కౌరవుల పక్షాన పోరాడారు. **-సంస్కృత మహాభారతము**

❀ మగధ చక్రవర్తి బలికుమారులలో ఒకడు ఆంధ్ర రాజ్యాన్ని స్థాపించాడు.

**- భాగవతం నవమస్కందం 23వ అధ్యాయం**

❀ ఆంధ్రులు బౌద్ధ ధర్మాన్ని అవలంబించారు.

**-గిర్నర్, షాహబాజ్‌గర్, కాల్సీ ధర్మలిపి శాసనాలు**

❀ ఉత్తరాన పూరీ జగన్నాధం, మధ్యన శ్రీశైలం, దక్షిణాన చోళదేశం తెలుగుదేశానికి ఎల్లలు. **- శబ్దకల్పద్రుమమ్**

❀ పోలికల్లో ద్రావిడజాతికి చెందిన వారైనా ఆంధ్రులు తమిళుల కంటే పొడగరులు, అందగాళ్ళు, సాహసులు మంచికర్షకులు, నిపుణులైన నావికులు.

**-ఎన్ సైక్లోపెడియా ఆఫ్ బ్రిటానికా 1911**

❀ తెలుగు వారు ఐరోపా ఖండ వాసులవలె నాగరికులు. వారిభాష ఇటలీభాష లాగా ఉంటుంది. **- సి.పి.బ్రౌన్ 1857**

❀ కృష్ణా గోదావరీ నదుల నడుమ ప్రదేశాన్నుంచి వచ్చామని నంబూద్రీలు నమ్ముతారు. తెలుగుదేశపు ప్రజలకీ నంబూద్రీలకు చాలా పోలికలున్నాయి.

**- తిరువాన్కూరు జనాభాలెక్కలు 1937**

❀ ఇప్పుడు మన రాష్ట్రంలో 7.8 కోట్లమంది, రాష్ట్రం వెలుపల 6.7 కోట్ల మంది కలిపి మొత్తం 14 1/2 కోట్ల జనం తెలుగు మాట్లాడుతున్నారు. సి.రాజగోపాలాచారి, బంగారప్ప, సినీనటుడు రాజ్‌కుమార్‌ల పూర్వీకులు తెలుగువారే. హోసూరు ఎమ్మెల్యే గోపినాథ్ తమిళనాడు అసెంబ్లీలో తెలుగులో మాట్లాడి ముఖ్యమంత్రి జయలలిత నుండి తెలుగులో సమాధానం రాబట్టారు.

**- తుర్లపాటి కుటుంబరావు(దిహిందు 1-7-2003)**

1901 జనాభాలెక్కల ప్రకారం తమిళనాడులో 9% ఉన్న తెలుగుజనం ఈనాడు 2%కు తగ్గిపోయారు.



# తెలుగు భాషలో నమాజు

ఖురాను గ్రంధాన్ని వివిధ భాషలలోనికి అనువాదంచేసి దైవసందేశాన్ని సర్వభాషల వారికి అందించాలని ఎందరో మహాత్ములు విశ్వ ప్రయత్నం చేశారు. కొందరు తమ ప్రయత్నంలో సఫలులుకాగా మరికొందరు మత చాందసుల చేతిలో హింసించబడ్డారు. ఖురాను గ్రంధాన్ని ఏ భాషలోనికి అనువదించకూడదని మూర్ఖంగా వాదిస్తూ హత్యలకు తలపడినవారూ కొన్ని దేశాలలో ఉన్నారు.

సర్వభాషలూ దేవునివే అని ఒక ప్రక్క చెబుతూనే మరో ప్రక్క అరబ్బీ భాషను సర్వజనంపై నిర్భంధంగా రుద్దజూస్తున్న వారి బెడద నేడు తీవ్రమైంది. ఖురాను గ్రంధం సర్వమానవాళి కోసం వచ్చిందని చెప్పేవారే ఆ మానవాళికి దేవుడు వివిధ మాతృభాషల నిచ్చాడని మరిచిపోయి అరబ్బీని తప్పనిసరి చేస్తున్నారు.

ప్రతి ప్రవక్తకూడా తన మాతృభాషలోనే మత ప్రచారం చేసేవారు. అసలు దైవసందేశం కూడా ప్రవక్తల యొక్క మాతృభాషలోనే వచ్చేది. ఎందుకని? ప్రవక్తకు ముందు అర్ధం కావాలి. ఆ తరువాత ఏ ప్రజలకైతే చెప్పబోతున్నాడో ఆ ప్రజలకు అర్ధం కావాలి. అర్ధమయ్యిందే మతం.

ఈ మర్మం ఖురాను లోనే విప్పి చెప్పబడింది. ఖురానును దేవుడు అరబ్బీ లోనే ఎందుకు పంపాడు?

“నీకు అర్థం కావాలని ఖురానును అరబ్బీభాషలోనే పంపాము.” (ఖురాను 12:2)

మేము ఖురానును అరబ్బుకాని వారికెవరికైనా పంపిన తరువాత వారు దాన్ని చదివి అరబ్బులకు వినిపిస్తే వారు దాన్ని నమ్మరు (ఖురాను 26 :198, 199.).

అరబ్బులు గ్రహించడం కోసం అది ఖురానుగా చేయబడింది. “ మీరు గ్రహించటం కోసం మేము అరబ్బీ ఖురానుగా చేసితిమి ” (ఖురాను 43 :2,3).

మరి తెలుగు వాళ్ళు గ్రహించాలంటే అది తెలుగు ఖురానుగా చేయబడవద్దా? ఖురాను అరబ్బీలో ఎవరికోసం వచ్చింది?

“నీవు మక్కావారిని చుట్టుపక్కల ఉన్నవారిని హెచ్చరించటం కోసం అరబ్బీ భాషలో ఖురాను ను నీవద్దకు పంపాము.” (ఖురాను 12:7)

మరి మచిలీపట్నం వారిని హెచ్చరించాలంటే అరబ్బీ భాషలో ఎంత అరచినా వారికి అర్థంకాదు, "దేవుని తీర్పు సింహాసనం ముందు మనమంతా ఒక రోజు నిలబడతాము" అని తెలుగులో చెప్పి హెచ్చరించవచ్చు గదా! అర్థం కాని కర్మకాండ బండెడు చేసేకంటే అర్థవంతమైన సత్క్రియ ఒక్కటేచాలు.

స్వర్గప్రాప్తి కోసం మనిషి చేయవలసింది ఏమిటి?

" దేవుడే మాప్రభువు అని, ఎవరు సద్వర్తనులై ఉంటారో వారికి ఎలాంటి భయంగాని దుఃఖగాని లేవు. వారు స్వర్గనివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. అది వారు చేసుకున్న కర్మల ఫలితం." (ఖురాను 46:13,14)

అంటే సత్క్రియల ఫలితమే స్వర్గం! ఈ పరమ సత్యాన్ని అన్నిమతాలు బోధిస్తున్నవి. వివిధ ప్రాంతీయ భాషలలోనికి చొచ్చుకొని వెళ్ళి, ఆయా ప్రజల సంస్కృతిని దెబ్బతీయకుండా వారివారి భాషల్లోనే "ఏకేశ్వరోపాసన" వ్యాప్తి చేయవచ్చు. అర్థం కాని, అరబ్బీని ఆంధ్రముస్లింలపై రుద్దటం కంటే ....... తెలుగులోనే వారిని ఖురాను చదువుకోనివ్వటం, నమాజు చేసుకోనివ్వటం, వివాహాలు జరుపుకోనివ్వటం మేలు. ఈ విషయంలో సంస్కరణలు జరగాలి.

**(ఆంధ్ర పత్రిక 19.7.87)**

# ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో హిందీ పదాలు

ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువు కొత్త ఎడిషన్‌లో వహ్వా పదం చోటుచేసుకొంది. ఈ ఒక్క పదమే కాకుండా ఎన్నో హిందీపదాలు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువులో చోటుచేసుకొన్నాయి. ఆంగ్లభాషను అభివృద్ధి పరిచాయి.

భారతదేశానికి చెందిన 900 పదాలు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువులో చోటుచేసుకొన్నాయి. భగవాన్, భక్తి, భజన్, భంగ్, అడ్డా, బురా దిన్, కరోర్, లంగర్, పరిషత్, భిండీ , బేల్‌పురీ, బునే వంటి భారతదేశానికి చెందిన పదాలకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువులో స్థానం లభించింది.హిందీలో ఇంగ్లీషు వాళ్ళని ఆంగ్రేజ్ అని అంటారు. ఈ పదం కూడా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువులో చోటుచేసుకొంది.

**(వార్త 6-7-2004)**



# అధికార భాషగా తెలుగు

తెలుగు అధికార భాషగా అమలు జరపాలని రాష్ట్రప్రభుత్వం ఎంతగానో ఆశిస్తున్నప్పటికి ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం 5 కోట్ల మందికి తెలుగు మాతృభాష. ఇది ప్రపంచ భాషలన్నిటిలో 15వ స్థానాన్ని, భారతదేశంలో రెండవ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. అయినా పరిపాలనలో ఈ భాష ఆశించినంతగా అమలు జరగటంలేదు.

**ఈ పరిస్థితికి కారణాలు :**

ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల పోటీని తట్టుకొని ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు అతికష్టంగా నెగ్గుకురావలసి వస్తున్నది. ఐ.ఎ.యస్. అధికారులు మొదలుకొని చిరుద్యోగుల వరకు తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపటాన్ని చిన్నతనంగా భావిస్తున్నారు. కొందరు ఉద్యోగులు తెలుగును బాహాటంగా ఈసడిస్తున్నారు కూడా.

ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులో జరపటానికి ఉత్సాహం చూపే ఉద్యోగుల భాషాపరిజ్ఞానాన్ని పెంచేందుకై వివిధ శాఖల శాసనాలను చట్టాలను తెలుగులోనికి అనువదించి వారికి నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారు ఉద్యోగులకు నిర్వహించే శాఖాపరమైన పరీక్షలు ఇంకా ఆంగ్లంలోనే నిర్వహిస్తున్నారు.

సచివాలయం మిగతా కార్యాలయాలకు తెలుగుభాష వాడకం విషయంలో మార్గదర్శిగాను ఉండటం లేదు. ప్రభుత్వ శాసనాలు సచివాలయం నుండి ఇప్పటికీ ఆంగ్లంలోనే చేయబడుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలలో నుండి ఇంగ్లీషు టైపుమిషన్లు పూర్తిగా తొలగించబడలేదు. ప్రస్తుతం వాడుకలోఉన్న తెలుగు టైపు అక్షరాలు మరింత చిన్నవిగా స్పష్టంగా తీర్చిదిద్దబడాలి. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలలో తెలుగు టైపు యంత్రాలు మాత్రమే ఉంచాలి. కాని ఈపని ఇంకా పూర్తికాలేదు.

ఇన్ని లోపాలు మనలో ఉంచుకొని కేవలం తెలుగు భాష అంటూ అరిస్తే ప్రయోజనం ఏమిటి? "తెలుగు ద్రావిడ భాషా కుటుంబంలో ఉత్తరాది భాష. ఆర్య భాషా కుటుంబంలో దక్షణాది భాష. ఇతర భాషలను తేలికగా తనలో కలుపుకోగలదు. దానికి సంకుచితత్వంలేదు" అని జి. హామ్ ఫీల్డ్ మెక్‌లాయిడ్ రాశారు. "శ్రావ్యతలో తెలుగు తమిళాన్ని మించింది. ప్రతి పదం అజంతం. తీయనైన ఆ భాష మాధుర్యాన్ని బట్టి తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ ", అని జి.ఎ. గారిసన్ వ్రాశారు. " నిరక్షర కుక్షి మాట్లాడినా తెలుగు శ్రవణానందకరంగా ఉంటుంది. తెలుగు ద్రావిడ భాషలన్నిటిలోకి

మధురాతి మధురమైనది" అని హెన్రీమోరిస్ తన తెలుగు వ్యాకరణం పుస్తకంలో పేర్కొన్నారు. (1890). "తెలుగు సంస్కారయుత మైన భాష. భావాలను సొంపుగా సౌలభ్యంతో చక్కగా వ్యక్తం చేయవచ్చు" అని విలియం కేరీ అను క్రైస్తవ మిషనరీ 1814 లో తన తెలింగ వ్యాకరణంలో రాశారు. అలాంటి సులభమైన భాషను వాడటం మన తెలుగు ఉద్యోగులకు కష్టంగా ఉంది. "శబ్ద సంపదలోను, శబ్ద సౌష్టవంలోను, భావ వ్యక్తీకరణలోను, శ్రావ్యతలోను తెలుగుతో తక్కిన భాషలు సాటిరావు. ప్రజలు మాట్లాడే సులభ సంస్కృతానికి తెలుగు ఒక ఉదాహరణ " అని ఎ.డి.కాంప్‌బెల్ 1816 లో తన తెలుగు వ్యాకరణం అను గ్రంథంలో అన్నారు.

1935లో ముద్రించబడిన తన తెలుగు నిఘంటువుకు ముందుమాట వ్రాస్తూ " బ్రిటీష్ పరిపాలన అంతమయి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిననాడు వారి భాషలోనే వారి పాలనా వ్యవహారాలను సాగించటానికి ప్రయత్నం చెయ్యాలి " అని ఆర్. కాలెట్టిల్ కోరారు. తెలుగు భాషపై మన నాయకులకు, అధికారులకు, ఉద్యోగులకు, ప్రజలకు కూడా ఇలాంటి గౌరవం ఉంటే పరిస్థితి చాలా బాగుంటుంది.

మహోన్నతమైన తెలుగు భాషను ప్రభుత్వం, ప్రజలు కలిసి అభివృద్ధి చెయ్యాలి. అందుకోసం ఈ క్రింది చర్యలు తోడ్పడగలవు. నాయకులు, అధికారులు, ప్రజలు ముందుగా తమ మనస్సుల్లో తెలుగుభాష పట్ల గౌరవాన్ని పెంచుకోవాలి. ఆ భాష మర్యాదను కాపాడటానికి శపథం తీసికోవాలి. ఎంతో విలువనిస్తూ ఆ భాషను మాట్లాడాలి, వాడుకలోకి తేవాలి, అభివృద్ధి చెయ్యాలి. పిల్లలను తెలుగు మాధ్యమంలో చదివించాలి.

రాష్ట్ర ప్రభుత్వం తన చట్టాలు, శాసనాలు, స్మృతులు అన్నిటినీ సరళమైన తెలుగులోకి అనువదించి ముద్రించి అన్ని కార్యాలయాలకు సరఫరా చేయాలి. వాటి ఆధారంగా పబ్లిక్ సర్వీసు కమీషన్ శాఖాపరమైన పరీక్షలన్నీ తెలుగులోనే జరపాలి. వివిధ పోటీపరీక్షలలో ఆంగ్లభాషా పరిజ్ఞానానికి బదులు " తెలుగుభాషా పరిజ్ఞానం " మీద ఒక ప్రశ్నాపత్రం ప్రవేశపెట్టాలి. సచివాలయం విధిగా తెలుగులోనే శాసనాలు జారీచెయ్యాలి. కార్యాలయాలలోని ఇంగ్లీషు టైపు మిషన్లనన్నిటిని తీసివేసి తెలుగు టైపు మిషన్లను మాత్రమే ఉంచాలి. తెలుగు టైపు అక్షరాల నాణ్యతను పెంచాలి.

రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న ఇంగ్లీషు మీడియం పాఠశాల లన్నిటినీ తెలుగు మాధ్యమం పాఠశాలలుగా మార్చాలి. తెలుగు మాధ్యమ ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే ప్రభుత్వం ధనసహాయం చెయ్యాలి. అదనపు ప్రోత్సాహకాలు ప్రకటించాలి.

రాష్ట్రప్రభుత్వం ఒక సమగ్రమైన తెలుగు-తెలుగు నిఘంటువును తయారు చేయించాలి. తెలుగు జాతీయాలను, సామెతలను, వివిధ ప్రాంతాల యాస పదాలను



క్రోడీకరించి ప్రామాణిక గ్రంధాలుగా వెలుపరించాలి, స్నాతకోత్తర, పరిశోధక విద్యలను కూడా తెలుగులో నడపడానికి వీలుగా శాస్త్ర, సాంకేతిక గ్రంథాలను తెలుగులోకి మార్చాలి. తెలుగు విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలలోని తెలుగు విభాగాలు, అధికార భాషాసంఘం, తెలుగు భాషాభిమాన సంఘాలు విడివిడి గాను, కలిసి కట్టుగాను ఈ విషయాలలో కృషి జరపాలి.

అందరూ కలిసి కృషిచేస్తేనే తెలుగు భాష ఈ రాష్ట్రంలో వెలుగులు విరజిమ్ముతుంది. తెలుగు తల్లిమెడలో దండ వేసినంత మాత్రాన, ప్రారంభించిన పథకాలకు తెలుగును జోడించినంత మాత్రాన తెలుగుభాష వర్ధిల్లదు. తెలుగు భాషను ప్రజలందరికి బోధించినప్పుడే తెలుగు అభివృద్ధి చెందుతుంది.

తెలుగుభాష పట్ల మక్కువను పెంచుకోవటం ప్రాంతీయతత్వమనో, వేర్పాటుధోరణి అనో అనేవాళ్ళు సంకుచితంగా ఆలోచిస్తున్నారని అనక తప్పదు. భారతదేశం అనేక భాషల మణిహారం అనుకుంటే ఆ హారంలోని మణిపూసలన్నీ అందంగా, సౌష్టవంగా ఉండాలి. కొన్ని సుందరంగాను, మరికొన్ని అందవికారంగాను ఉంటే హారం యొక్క అందమే చెడిపోతుంది. ఏ భాషా రాష్ట్రం ఆ భాషను ముమ్మాటికీ మక్కువతో అభివృద్ధి పరుచుకోవాలి. నేను నా మాతృభాషను ప్రేమించడమే ప్రాంతీయతత్వం అని అంటే నీవు నీ భాషను నాకు బలవంతాన నేర్పాలని చూడటం నాపై దౌర్జన్యం కాదా ? స్వచ్ఛందంగా అనేక భాషలను నేర్చుకొనే వారికి ఈ విశాల విశ్వంలో అడ్డమేదీలేదు.

మాతృభాష హీనదశలో పడియున్న సమయంలో మరో భాషను తెచ్చి నిర్బంధంగా రుద్దటానికి ప్రయత్నించటం బ్రిటిష్ పాలకుడు ఆంగ్లాన్ని రుద్దిన తీరునే గుర్తుకు తెస్తుంది. ఏ మనిషికైనా మాతృభాషలోని మాధుర్యం మరో భాషలో చిక్కదు. ఈ సూత్రాన్ని గమనించే క్రైస్తవ సాహిత్యం తెలుగులో బాగా వికసించింది. కొంచెం ఆలస్యంగా నయినాసరే తెలుగు గడ్డకు చెందిన ముస్లిములు కళ్ళుతెరిచారు. ఇస్లామిక్ సాహిత్యం ఈనాడు తెలుగులో ఎంతో వేగంగా ప్రచురించబడుతున్నది.

తెలుగు మాతృభాషగా కలిగిన ప్రజలు ఏ మతస్థులయినప్పటికీ వారు తెలుగువారు. తల్లిని గౌరవించినట్లుగా తెలుగును గౌరవిద్దాం. అందరమూ కలసి మన భాష ఔన్నత్యం కోసం, ప్రగతి కోసం, పరివ్యాప్తి కోసం కృషిచేద్దాం !

**ఆంధ్రపత్రిక (6-7-88), గీటురాయి (1-7-88)**

# తెలుగు అధికార భాష కావాలంటే...

తెలుగును అధికార భాషగా విస్తృతంగా వ్యాపింపచేయడానికి ఒక కొత్త పథకాన్ని రూపొందిస్తున్నట్లు అధికార భాషా సంఘం అధ్యక్షురాలు శ్రీమతి పి. యశోదారెడ్డి ప్రకటించారు. ఆ పథకం ప్రకారం ఎం.ఎ స్థాయిలో అధికార భాష వాడకంపై ఒక పాఠ్యాంశం ప్రవేశపెట్టాలని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లను కోరతారట. తెలుగును బాగా వాడుకలోకి తేవాలని అధికార భాషా సంఘం ఎన్నో అవస్థలు పడుతోంది. రకరకాల ప్రయోగాలు చేస్తోంది. కాని ఆ సంఘం ఏమీ చేయలేకపోతున్నది. ప్రజలను ఓదార్చటం కోసం ఆ సంఘాన్ని స్థాపించారే తప్ప, ఆ సంఘానికి అవసరమైన అధికారాలను అప్పగించి ప్రోత్సహించలేదు. అధికార భాషా సంఘం ఒక సలహా సంఘం లాంటిదే గాని దానికి ఎలాంటి చట్టబద్ధమయిన అధికారాలూ లేవు. తెలుగుభాషను అమలు జరపని అధికారులమీద చర్యలు తీసుకునే అధికారం అధికార భాషా సంఘానికి దత్తం చెయ్యాలి.

ప్రపంచ భాషలన్నిటిలో తెలుగు 15వ పెద్ద భాష. ఇండియాలో రెండవస్థానాన్ని ఆక్రమించిన భాష. అయినా అతిగా నిర్లక్ష్యం చెయ్యబడిన భాష.ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, సంస్కృతం లాంటి భాషల దురాక్రమణకు బాగా గురయిన భాష. ఐ.ఎ.యస్. అధికారులు మొదలు అటెండర్ల వరకు చిన్నతనంగా భావించి ఈసడించే బాష. భాషా ప్రాతిపదికమీద రాష్ట్రం ఏర్పడి 34 ఏళ్ళ గడిచినా పాలకులు చట్టాలు ఇంకా చెయ్యలేక పోతున్న భాష. పబ్లిక్ సర్వీస్ కమీషన్, సచివాలయం మొదలైన కార్యాలయాల్లో అడుగడుగునా అవమానాలకు గురౌతూ, ఆంగ్ల సవతిపోరు అనుభవిస్తున్న భాష. ఇంతవరకు ఒక సమగ్రమైన శాస్త్రీయమైన నిఘంటువును సైతం సమకూర్చుకోలేక పోయిన భాష. మమ్మీ, డాడీల డాబుసరి చదువుల ముందు సిగ్గుతో ముడుచుకు పోయిన భాష. ఇన్ని బాధల వలయంలో ఉన్న మన భాషను రక్షించుకొని, దానికి పరిపాలక భాషగా పట్టం కట్టాలంటే ఎన్నో పనులు చేయవలసి ఉంటుంది. అయితే తెలుగు తెలుగు అని తెగ అరుస్తూ, ఎలాంటి అభివృద్ధి చేయకుండా పాలకులు కాలం గడపటం అనవాయితీ అయ్యింది. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ క్రింది చర్యలు అమలు జరపాలి.

1. నాయకులు, అధికారులు ముందు తమ మనసుల్లో తెలుగుభాష పట్ల గౌరవాన్ని పెంచుకోవాలి. ఆ భాషపట్ల అభిమానాన్ని పెంచుకోవాలి. ఆ భాష మర్యాదను కాపాడటానికి శపథం తీసుకోవాలి. ఎంతో విలువనిస్తూ ఆ భాషను మాట్లాడాలి, వాడుకలోకి తేవాలి, అభివృద్ధి చెయ్యాలి. పిల్లలను తెలుగు మాధ్యమంలో చదివించాలి.
2. రాష్ట్ర ప్రభుత్వం తన చట్టాలన్నీ తెలుగులోకి అనువదించి, ముద్రించి అన్ని కార్యాలయాలకు సరఫరా చెయ్యాలి. వాటి ఆధారంతో పబ్లిక్ సర్వీస్ కమీషన్ శాఖాపరమైన పరీక్షలన్నీ తెలుగులోనే జరపాలి. అన్ని పోటీ పరీక్షల్లో తెలుగు భాషా పరిజ్ఞానం మీద ఒక ప్రశ్నాపత్రం ఉండాలి. తెలుగులో పట్టభద్రులైన వారికి 5 శాతం మార్కులు గ్రూప్ 1 పరీక్షల్లో కూడా ఉచితంగా ఇవ్వాలి. ఆ విధంగా జిల్లా అధికారుల స్థాయిలో తెలుగు పట్టభద్రులను ప్రోత్సహించాలి.
3. సచివాలయంలోని ఇంగ్లీషు టైపు మిషన్లన్నీ తీసివేసి, వాటి స్థానంలో తెలుగు టైపు మిషన్లు ఉంచాలి. ప్రతి జి.వో. తెలుగులో రావాలి. లిపి సంస్కరణ జరిపి తెలుగు టైపును సులభతరం చెయ్యాలి.
4. రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న ఇంగ్లీషు మీడియం పాఠశాలలన్నిటినీ తెలుగు మీడియంలోకి మార్చాలి. తెలుగు మీడియం పాఠశాలలకు మాత్రమే ప్రభుత్వ సహాయం అందాలి. విశ్వవిద్యాలయాల్లోని చదువులన్నీ క్రమంగా తెలుగులోకి మార్చాలి.
5. రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన తెలుగు-తెలుగు నిఘంటువును తయారు చేయించాలి. తెలుగు జాతీయాలను, సామెతలను, మాండలికాలను, వివిధ ప్రాంతాలలోని యాసపదాలను క్రోడీకరించి ప్రామాణిక గ్రంథాలుగా వెలువరించాలి. స్నాతకోత్తర పరిశోధన విద్యలను కూడా తెలుగులో నడపటానికి వీలుగా శాస్త్ర, సాంకేతిక గ్రంథాలను తెలుగులోకి మార్చుకోవాలి.
6. దూరదర్శన్ రెండవ ఛానెల్‌ను తెలుగు కార్యక్రమాల కోసం సాధించాలి. తెలుగును దేశంలో రెండవ అధికార భాషగా ప్రకటించేందుకు కేంద్రం మీద వత్తిడి తేవాలి.
7. తెలుగు మాధ్యమం ద్వారానే కళాశాల స్థాయి వరకు చదివిన అభ్యర్థులకు అన్ని ఉద్యోగాల్లో కొంతశాతం రిజర్వేషన్ కల్పించాలి. ముఖ్యంగా గ్రూప్ 1 సర్వీసుల్లో ఇలాంటి రిజర్వేషన్ ఉండాలి. అలాగే స్నాతకోత్తర విద్యను కూడా తెలుగులోనే పూర్తిచేసిన ఉద్యోగులకు ప్రమోషన్ విషయంలో ప్రోత్సాహకాలు ప్రకటించాలి. అధికార భాషగా తెలుగు బాగా అమలు కావాలంటే తెలుగుబాగా వచ్చిన అధికారులు అధికంగా ఉండాలి.
8. ఇక అచ్చతెలుగు వాడాలనే ఛాందస నియమాలు వదులుకొని ఇప్పటికే తెలుగులో బాగా పాతుకుపోయిన ఇతర బాషల పదాలను యథాతథంగా వాడుకోనివ్వాలి. అనువదించటానికి వీలులేని మాటలు, తెలుగులో వేరే పదాలులేక బహుళ ప్రచారం పొందిన పరభాషా పదాలను, వాడుకభాషలోని సంకర పదాలను స్వేచ్ఛగా ఫైల్స్‌లో రాసుకోనివ్వాలి.

ఈ పనులు చేసేందుకు రాష్ట్ర పాలకులు నడుం బిగించాలి. ప్రజల భాషకు ద్రోహం చేస్తే ప్రజలకే ద్రోహం చేసినట్లవుతుంది.

**(ఆంధ్రపత్రిక 15-7-90)**

# భారతమాత ఎర్సెస్ తెలుగు తల్లి = బ్రిటీష్ జడ్జి

**"సర్కారు, రాయలసీమ ప్రజలు ఇంగ్లీషు నుండి బయటపడి తమ తెలుగు భాష - రాజభాషగా ఉంటుందని ఆశిస్తే, స్వాతంత్ర్యం రాకపూర్వం కన్నా, అదేమి దురదృష్టమో, స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఇంగ్లీషు మీద మమకారం ఎక్కువయ్యింది. తెలుగు ప్రజానీకానికి తెలుగు రాజ్యం వచ్చినట్లు గుర్తెట్లా? హైదరాబాదు సంస్థానంలో ఉర్దూ నెత్తిన రుద్దారని అంధ్రోద్యమం నడువగా, ఆంధ్రప్రదేశ్‌గా ఆవతరణ చెందిన తర్వాత ఉర్దూ బదులు ఇంగ్లీషే పెత్తనం చెయ్యసాగింది. ఎరుగని మిత్రుడు కన్నా ఎరిగిన శత్రువు నయం అన్న సామెతగా ఉర్దూ స్థానంలో ఇంగ్లీషు రావడం సమైక్యానికి సహాయపడక పోగా, భాషా రాష్ట్రాల ఆశయమే 20 సంవత్సరాలు అయినా అమలు జరుగదాయె "** అని 1977లో ఆనాటి అధికార భాషా సంఘం అధ్యక్షుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. ( ' విశాలాంధ్రం ' పేజీలు 77, 78 )

35 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ అధికారభాషగా తెలుగు సుస్థాపితం కాలేదు. "మా తెలుగుతల్లికీ మల్లెపూదండ" అంటూ మంత్రులంతా మంగళారతులిస్తున్నారే తప్ప ఆ తల్లికి ఒరగబెట్టింది ఏమీలేదు. "చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా" అనే పాటలో శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ ఇలా ఉద్బోదించారు.

ముక్కోటి బలగమోయ్ (ఇప్పుడు ఏడుకోట్లబలగం)
ఒక్కటై మన ముంటె
ఇరుగు పొరుగులోన
ఊరు పేరుంటాది
తల్లి ఒక్కతె నీకు తెలుగోడా
సవతి బిడ్డల పోరు మనకేలా
నట్టనడి సంద్రాన నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా
నావ దరిజేర్చరా మొనగాడా"

కీ.శే. మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి గారు ఇలా వాపోయారు.

"భాషలనెల్ల లెస్సయనబడ్డ స్వభాషను
మాటలాడ నామోషియా?



ఇంటిలో ముసలి మోళ్ళును
ఇంగిలిపీసులోనె సంభాషణ
సేయగావలెనా? పండిన పాపమదెల్ల
ఇట్లు నీ వేషము నిన్ను జూడ
తలవేపన గాయయిపోయె తమ్ముడా!

.........................................

ఈడిచి చెంపకాయ నొకటిచ్చు నియంతలు
లేక కాద యీ పోడిమిలోనికిట్లు
దిగిపోయితి వాఖరుకున్ సహోదరా?"

కీ.శే. వేలూరు శివరామ శాస్త్రిగారు కూడా తన ఆవేదన ఇలా వ్యక్తపరచారు.

"తెలివికి సంస్కృతమున్ మరి
కలిమికి ఆంగ్లేయమో ఇక తురకంబో విలువయిడి నేర్చి ఈ నీ
తెలుగెవ్వరి పాలుజేసి తిరిగెదవాంధ్రా!"

వాస్తవం పలికారు శాస్త్రిగారు. సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషల ప్రభావానికి తెలుగు ఎంతగానో గురయ్యింది. తెలుగు నిఘంటువు తెరిస్తే ఈ మూడు భాషల పదాలు కలిపి 75 శాతం ఉంటాయి. అచ్చతెలుగు పదాలు కేవలం 25 శాతమే. వాటిలో మనకు అర్థమయ్యే మాటలు చాలా తక్కువ. అంటే క్రమంగా మన మాటలు మనకే వాడుకలో లేకుండా పోతున్నాయి. మన కవులంతా గొప్పలకోసం పోయి సంస్కృతాన్ని మన నెత్తిన రుద్దారని వేంకటరామకృష్ణ కవులు విమర్శించారు.

"ఆంధ్రలోకోపకారమ్ము నాచరింప
భారతమ్మును నన్నయభట్టు తెలుగు
జేయుచున్నాడు సరియె. బడాయిగాక
తొలుత సంస్కృతపద్యమెందులకు జెపుడి?

" ఇప్పటి కైతగాంధ్రహహ, ఇంగిలిపీసొక యింత నేర్చి పై జెప్పెద రాంధ్రపుంగయిత. సీ! అవి పండితులాదరింతురే? " అని తిరుపతి వేంకటకవులు నిరసిస్తే, సుందరరామశాస్త్రిగారు మాత్రం ఇలా అన్నారు.

"కమలన్ జూడదు భార్య యేనియున్
ఈ కాల స్థితింబట్టి, జర్మను

తైలమ్ము, జపాను సబ్బుమెరికా క్రాపున్,
వియన్నా సులోచనముల్, స్వీడన్
చేతిబెత్తమును, స్విడ్జర్లెండు రిస్ట్వాచి,
ఫారెన్ డ్రెస్, ఫ్రెంచి కటింగు మీసలున్
ఫారిన్ ఫ్యాషన్ లేనిచోన్!"

ఇదంతా ఇలా ఉంటే గోగులపాటికూర్మనాధ కవిగారి గోల ఇంకో రకంగా ఉంది.

"బేగీ అరె అరబ్బీ పడోరేయని
బోడి సన్యాసుల బొడుచువారు
మత్రఖో మూపరు మాటీయనుచు వైష్ణ
వుల బొట్లు దుడువగ బోవువారు
పత్తరు కాయకు బందియారే ఛోడు
దేవని శైవుల దిట్టు వారు
కాలటీకా తూనికాల్దేవటంచు మా
ధ్వుల బ్రల్లదము లాడి త్రోయువారు"

" ఆవు బైటో అని ఆదరింతురుగదా, తురకలతో మైత్రి నెరపవైతి " అంటూ భల్లా పేరయ్య సలహాలు ఇస్తాడు. శ్రీ విస్సాప్రెగడ కామరాజు, తిరుమల వేదాంతం శ్రీనివాస దీక్షితయ్యరు, పెంటయ్యకవి, అజ్మతుల్లా, దాశరథి, సినారె, దేవులపల్లి లాంటి వాళ్ళు తెలుగు–ఉర్దూ కలగలిపి కవిత్వాలు చేశారు. ఉదాహరణకు : ' ఖుషీ ఖుషీగా నవ్వుతూ..చలాకి మాటలు రువ్వుతూ..హుషారుగొలిపేవెందుకే..నిషా కనులదానా '. మొత్తం మీద సంస్కృతం, హిందూస్థానీ, ఇంగ్లీషు పదాలు కొల్లలుగా చేరాయి. అందువల్ల తెలుగుభాష సుసంపన్నం అయ్యిందనుకోవాలి. గిడుగు రామమూర్తి పంతులుగారు పరభాషా పదాలను మనవిగానే వాడుకోవాలని అంటూ ఇలా అన్నారు.

"మాలమాటయేని మాదిగ మాటేని
నాటిదేని గాక నేటిదేని
ఈదదైన నేమి యాడదైనను నేమి
ఏడదైన జెల్లు వాడికైన"

ఇలాంటి వాళ్ళ అందరి కృషివల్ల తెలుగుభాష క్రమ క్రమంగా శక్తిని పుంజుకొని ప్రభుత్వ కార్యాలయాల్లోకి ప్రవేశించింది. 1746లో రెవరెండ్ బెంజిమిన్ షూల్జి తెలుగులో



ఆరు క్రైస్తవ పుస్తకాలను జర్మనీ దేశంలోముద్రించాడు. 1814లో విలియం కేరీ తెలుగు వ్యాకరణం 1816లో ఎ.డి.కాంప్‌బెల్ వ్యాకరణం, 1817లో విలియం బ్రౌన్ వ్యాకరణం, 1821లో కాంప్‌బెల్ నిఘంటువు, 1852లో సి.పి. బ్రౌన్ నిఘంటువులు, 1827లో సి.పి. బ్రౌన్ వ్యాకరణం వెలువడ్డాయి. 1840లో మహమ్మద్ రహ్మతుల్లా తెలుగులో మొదటి వారపత్రిక వెలువరించారు. 1926లో వాల్టేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపించబడింది. 1948 లో తెలుగుభాషా సమితి తెలుగు విజ్ఞాన సర్వస్వాలు ముద్రించే ప్రయత్నం ఆరంభించింది. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పడింది. 1966లో తెలుగును అధికార భాషగా ప్రకటించారు. 1967 లో తెలుగు అకాడమీ ఏర్పడింది. 1969లో డిగ్రీ స్థాయి విద్య తెలుగులో ఉండాలని నిర్ణయించారు. 1975లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. 1976లో జిల్లా స్థాయిలో తెలుగును అధికార భాషగా ప్రకటించారు. 1979లో నంద్యాల మున్సిఫ్ మేజిస్ట్రేటు ఎ ఖాదర్ మొహియుద్దీన్ మొట్టమొదటి "తెలుగు తీర్పు" ఇచ్చారు. అదే ఏట డైరెక్టరేట్ల స్థాయిలో తెలుగును అధికార భాషగా చేశారు. 1981లో మున్సిఫ్ మెజిస్ట్రేటు కోర్టుల్లో తెలుగు వాడాలని శాసించారు. 1982లో నాగార్జున సాగర్‌లో సార్వత్రిక విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన జరిగింది. 1983లో సచివాలయ స్థాయిలో తెలుగును అమలు జరపాలని ఆదేశాలిచ్చారు. 1985లో తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించబడింది. 1988లో దీనికి గుర్తింపు లభించింది. 1988 నవంబర్ 1 నుండి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో నుండి ఇంగ్లీషును తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. "తరతరాల తెలుగుజాతి" సంగ్రహాలయం ఒకటి సిద్ధమౌతోంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కూడా తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టారు.

" సాధించినదానికి సంతృప్తిని చెందీ, అదే విజయమనుకుంటే పొరబాటోయి "అన్న శ్రీశ్రీ పాటను స్మరిస్తూ తెలుగును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. చట్టాలు, కోడ్‌లన్నీ తెలుగులోకి మార్చాలి. తెలుగులో పరిశోధనా స్థాయి విద్యలు (పి.హెచ్.డి) తీసుకురావాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ తెలుగులో చేసిన అభ్యర్థులకు ఉద్యోగార్హత పరీక్షల్లో బోనస్ మార్కులు ఇవ్వాలి. తెలుగులో పాలనా వ్యవహారాలు నడపగల ఐ.ఏ.యస్. అధికారుల్ని మాత్రమే మనకు పంపమని కేంద్రాన్ని అడగాలి. అలాగే గవర్నరు విధిగా తెలుగు నేర్చుకోవాలి. తెలుగు రాని గవర్నర్లు, ఐ.ఏ.యస్. అధికారులు మన భాషలో పాలన జరుగకుండా అడ్డుబండలయ్యారు.

**(ఆంధ్రపత్రిక 10-5-91)**

# తెలుగు వారు పలికే ఉర్దూ పదాలు

తెలుగు ప్రజల మాటల్లో ఎన్నో సంస్కృత, ఆంగ్ల, ఉర్దూ పార్సీ భాషల పదాలు దర్శనమిస్తుంటాయి. ఈ అన్య దేశ్య పదాలను తెలుగు తనలో దాదాపు పూర్తిగా కలుపుకొని సుసంపన్నమయ్యింది. పరభాషా దురభిమానము, మొండితనములేని సరళమైన భాష తెలుగు. తెలుగు వారి కున్నంత పరభాషా సహనం, ఈ దేశంలో మరెవరికీలేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ సహనం వలనే అనేక పరభాషా పదాలు తెలుగులోకివచ్చి స్థిరపడి దాని స్వంతమే అన్నట్లయిపోయాయి. సంస్కృత, ఆంగ్ల పదాలు మన అనుదిన జీవితంలో ఎన్నో వాడుతున్నాము. అవి మనకు తెలిసినవే. అయితే మనం రోజూ మాట్లాడే తెలుగులో దొర్లే కొన్ని పదాలు ఉర్దూ పదాలని మనకు తెలియదు. సి.పి.బ్రౌన్ గారి తెలుగు ఇంగ్లీషు నిఘంటువు నుండి సేకరించిన పదాలను మాత్రమే ఇక్కడ ఇస్తున్నాను. చాలావాటి అర్థం మనకు తెలిసే ఉంటుంది. తెలియకపోతే నిఘంటువును సంప్రదించగలరు. అచ్చ తెలుగులో మాట్లాడబూనటం సాహసకార్యమే. తెలుగులో స్థిరపడిన ఈ క్రింది హిందూస్థానీ పదాలను గమనించండి:-

అంగరకా, అంగరేకు, అంగిక, అంగీ, అంగుస్తాను, అంగూరు, అంజూరు, అండా, అందాజు, అందేషా, అంబారము, అంబారి, అకరం, అకస్వారీ, అకీకత్, అక్కసరి, అక్కసు, అక్షాయి, అగాదు, ఆగావు, అజా, అజమాయిషీ, ఆటకాయించు, ఆరావణీబంద్రోతు, అర్వాడా, అడతి, అడితి, అడిసాటా, అతలషు, అత్తరు, అదాపరచు, అదాలతు, అదావత్, అనీం అపరంజి, అబ్బాబు, అభిని, అమలు, అమాంతము, అమాదినుసు, అమానతు, అమానీ, అమానుదస్తు, అమీనా, అమ్రాయి, అయబు, అయివేజు, అర్జీ, అర్జు, అలంగము, అలకీహిసాబు, అలగా, అలాదా, అలాహిదా, అలామతు కర్ర , అల్కి, అల్జడి, అల్మార, అలమారు, అల్లీసకర్ర, ఆవాజా,అవుతు, అవుతుఖానా, అవ్వల్, అవ్వాయిచువ్వలు, అసలు, అస్తరు, అహలెకారులు, అహషాంబంద్రోతులు. ఆఖరు, ఆజుబాజు, ఆజమాయిషీ, ఆబాదు, ఆబాలు, ఆబ్కారీ, ఆమిషము, ఆమీను, ఆరిందా, ఆలుగడ్డ, ఆవర్జా, అసరా, ఆసామీ, ఆసాయము, ఆసోదా,

ఇక్తియారు, ఇజారా, ఇజారు, ఇనాము, ఇరుసాలు, ఇర్సాలు ఇలాకా, ఇస్తిమిరారి, ఇస్తిరి, ఇస్తిహారు, ఉజాడ, ఉజయబోడ, ఉతావుఠి (హూతాహుటి), ఉడాయించు, ఉద్దారి, ఉపరిరయితు, ఉమేదు (ఉమేజు), ఉల్టా, ఏకరారు, ఓకు, కంకర, కంగాళీ, కంగోరీ, కచేరీ, కచ్చా, కజ్జా, కదపా, కదము, కదీము, కబాతుకోడి, కబాయీ, కబురు, కబేలా, కమాను, కమామిషు, కమ్మీచేయ, కరారు, కరుబూజుపండు, కలాలు ఖానా, కళాయి, కళాసి, కవాతు, కసరతు, కసాయి, కసుబా, కాగితము, కాజీ, కాతా, కామందు, కాయము, కాయిలా, కార్ఖానా, కాళీ, కాసా, కితాబు, కిఫాయతు, కిమ్మత్తు, కిరాయి, కిస్తీ, కిస్తు, కుంజడా, కుంజరి, కుందా, కుంబీ, కుడతా, కుడితినీ, కుమ్మకు, కురింజ, కురిచీ, కుల్లాయి, కుశాలు కుస్తీ, కుషీ, (ఖుషీ) కూజా, కూనీ (ఖూనీ) కేపు, ఖైదీ (ఖైదీ), కైఫియ్యతు, కైరి, కైలు, కొజ్జా, కొరీ, కొత్వాలు, కొర్నా (కొర్నాసిగండు), కౌలు (కవులు) ఖజానా, ఖరాగా, ఖరారా (ఖరారు), ఖరీదు, ఖర్చు, ఖసిచేయు, ఖామందు, ఖాయము, ఖాయిదా, ఖాళీ (కాళీ), ఖాసా, ఖిల్లా, ఖుద్దున, ఖులాసా (కులసా)

గప్పిప్పు, గప్పాలు, గమ్మత్తు, గయాళీ, గలబ, గల్లా, గల్లీ, గస్తీ, గాగరా, గాడీ, గాబరా, గిరాకీ, గుంజాయిషీ, గుజరానీ, గుజరాయించు, గుజర, గుజిలి, గుజస్తీ, గుబారు, గుమాస్తా, గులాబి, గులాము, గైరు, గైరుహాజరు, గోడా, గోందు, గోరీ, గోలీ, గోషా, గోష్వారా, ఘాటీ, ఘాటు,

చలాకి, చలానా, చలామణీ చాందినీ, చాకిరీ, చాకు, చిరునామా, చెలామణి, చందా, చందుకా, చోపుదారు, చౌరాస్తా, ఛాపా, ఛావు,

జంజీరు, జంపఖానా, జంబుఖానా, జనాభా, జనానా, జమాదారుడు, జరిమానా, జవాబు, జవాహిరి, జాగ, జాగీరు, జాటి, జారీ, జాస్తి, జిరాయితీ, జిల్లా, జిల్లేదారుడు, జెండా, జేబు, జేరుబందు, జట్టీ, జప్తీ, జమ, జమీను, జమీందారు, జముజాలి, జరబాజు, జరీ, జరూరు, జాబితా, జామీను, జుబ్బా, జుమలా, జుల్మానా, జూటు, జోడా, జోడీ, జోరు, ఝుడితీ, ఝుడ్డి, ఝూడాగా, ఝూటా.

టపా, టలాయించు, టాకీ, రాణా, దలాయతు, దల్లీ, దవాలీ, డీలా, డోలి, తండేలు, తకరారు, తగాదా, తనఖా, తనిఖీ, తప్సీలు, తబ్దీలు, తరందారీ, తరద్దూదు, తరహా, తరీఖు, తర్జుమా, తవాయి, తస్రపు (తసరబు), తహశ్శీలు, తాకీదు, తాజా, తారీఖు, తాలూకా, తాలూకు, తాళాబందు, తివాసీ, తీరువ, తీరువజాస్తి, తుకిడీ, తుపాను, తైనాతీ, తోపరా, దంగా, దగా, దగుల్బాజీ, దఫా, దబాయించు, దబేనా, దమదమా, దమ్మిడీ, దరఖాస్తు, దరిమిలాసు, దరియాప్తు, దరుజు, దరోబస్తు, దర్జా, దర్జీ, దర్బారు, దలాలీ, దవుడు (దౌడు) దాణా, దామాషా, దారోగా, దాల్చిని, దాళా, దావా, దినుసు, దిమాకు, దివాణము, దివాలా, దివాలాకోరు, దుకాణము, దుప్పటి, దుబారా, దుబాసీ, దురాయీ, దుర్భిణి, దేవిడీ, దౌలత్తు, ధూకళి, నంజ (నంజి), నకలు, నకషా, నకీబు, నక్కీ, సఖరా, నగదు, నగారా, నగీషీ, నజరానా, నఫరు, నఫరు జామీను, నఫా (సభా), నమూదు (నమోదు), నమూనా (నమోనా), నమ్మకు, నవరసు, నవారు, నవుకరీ (నౌకరీ),

నవుకరు, నాగా, నాజరు, నాజూకు, నాడా, నాదూరు, నామోషి, నారింజ, నిఘా, నిరుకు, నిలీను, నిశాని, నిషా, నిషిందా, నిసబు, నెజా, నౌబత్తు, పంఖా, పంచాయితీ, పకాళి, పకోడి, పచారు, పజీతి, పటాకి, పట్కా, పట్టా, పట్టీ, పత్తాపరంజు,పరకాళా గుడ్డ, పరగణా, ఫర్మానా, పరవా, పరారీ, పలాన, పల్టీ, పసందు, పస్తాయించు, పాంజేబు, పాజీ, పాపొచి, పాపోసు, పాయకట్టు.

పాయకారీ, పాయమాలీ, పాయిఖానా, పారా, పారీఖత్తు, పాలకి (పల్లకి) పావు, పావులా, పిచాడీ, పిచ్చికారు, పితూరీ, ఫిరాయించు, ఫిర్యాదు, పీరు, పిరుసుడి, పుంజనేల, పుకారు, పులావు, పుసలాయించు, పూచీ, పూరా, పేరస్తు, పేషిగీ, పేష్కషు, పేష్కారు, పైజారు, పైమాయిషీ, పైలుమాను, ఫైసలా, పోరంబోకు, పోచాయించు, పోంచావణి, పోస్తకాయ, పౌజు, ఫకీరు, ఫక్తు, ఫయిసలా, ఫర్మానా, ఫలానా, ఫసలీ, షాయిదా, ఫిరాయించు, ఫిర్యాదు, బంగి (భంగి) బంజారి, బంజరు బందోబస్తు, బకాయి, బజంత్రీ (భజంత్రీ), బట్టువాసంచి, బట్వాడా, బడా, బడాయి, బత్తీస, బత్తెము (భత్తెము).

బనాతు (బణాతు), బసాయించు,బయాన, బర్తరపు, బరమా, బరాబరి, బరాబరిక, బస్తా బస్తీ, బహద్ధర్ (బహద్దూర్), బాకా, బాకీ, బాకూ, బాజా, బాజారు, బాజు, బాజుబందు,బాతాఖానీ, బాతు, బాదము, బాపతు, బారా, బాలీసు, బావుటా, బావుడోరు, బిచానా, బిడాయించు, బినామీ, బిబ్బీ, బిల్మక్తా, బిసాతు, బస్తీ, బీమా, బుంగ, బురకా, బురుజు, బులాకీ, బూబు, బూర్నీసు, బేగి, బేజరూరు, బేజారు, బేడౌలు, బేపరాకు, బేబాకి, బేమరమ్మతు, బేరీజు, బేవారసు, బేషకు, బేషు (బేషు), బేసరి, బోణి, బోనాంపెట్టె, బోషాణం, బరవాసా, భర్తీ, బాట (బాట), భేటీ, భోగట్టా, మంజూరు, మండీ, మకాము, మక్తా, మఖమలు, మగ్దూరు, మజిలీ, మజ్కూరు, మజుబూతు, మజుమూను, మజూరి, మజ్దూరు, మజా, మజాకా, మతలబు, మతాబు, మతించు, మద్ధతు, మిన్నా.

మన్న, మరమ్మతు, మర్తబు, మలాము (మొలాము), మొహమల్, మల్వావు, మషాకత్తు, మషాలు, మషాల్జీ, మసాలా, మసీదు, మహజరు, మహస్సూలు, (మసూలు), మాజీ, మాపుచేయు, మామూలు, మారీఫత్తు, మాలీసు, మింజుమల, మిజాజు (మిజాదు), మిఠాయి, మినహా, మిరాసీ, ముక్తసరు, ముక్యారు, ముగ్దరు, ముచ్చివాడు, ముచ్చలికా, ముతా, ముదరా, (ముజరా), ముద్దతు, ముద్దాయి, మునసబు, మునిషీ, ముభావము, మురబ్బా, ముల్కీ, ముసద్దీ, ముసనాబు, ముసల్మాను, ముస్తాబు, ముస్తీదు, మెహదా, మెహనతు. యకాయకి (ఏకాయెకి), యదాస్తు యునాని, రకము, రజా, రద్దు రప్పు,



రయితు (రైతు), రవాణా, రవేసు (రవీసు), రస్తా, రస్తు, రహదారీ (రాదారి), రాజీనామా, రాయితీ, రివాజు, రుజువు, రుమాలు, రుసుము, రేవల్చిని, రొట్టె, రోజు, రోదా, లంగరు, లగాము, లగాయతు, లడాయి, లడి, లమిడి (లమ్డి), లస్కరు, లాచారు, లాడము, లాయఖు, లాలు, లాలూచీ, లిఫాఫా, లుంగీ, లుగుసాను, లుచ్చా, లూటీ, లేవిడి, లోటా, లోటు, వకాలతు, వకీలు, వగైరా, వజా, వజీరు, వర్దీ, వసూలు, వస్తాదు, వహవ్వా, వాకబు, వాజీవీ, వాపసు, వాయిదా, వారసుడు, వారీ, వారీనామా, విలియా, వేరియా, వేలము (వేలాము), వేలంపాట, శాబాసు (సెబాసు), శాయి, శాయిరు (సాయిరు), శాలువ, శకస్తు శికా, శిస్తు, విస్సాల, శెమ్మె (సెమ్మె), శేరు (సేరు), షరతు, షరా, షరాబు, షహా, షికారీ, షికారు, షుమారు, సంజాయిషీ, సందుగు, సకాలాతు, సక్తుచేయు, సగటు, సగతు, సగలాతు, సజావు, సజ్జనకోల, సదరు (సదరహీ), సన్వారు, సన్నదు, సన్నాయి, సన్నీ, సఫేదా, సబబు, నబరు, నబురు, సబ్జా, నబ్నివీను, సముద్దారుడు, సరంగు, సరంజామ, సరదా, సర్దారు, సరకు, సరేసు, సర్కారు, సలహా, సలాము, సలిగ, సవాలు, సాంబా, సాకీన్, సాబా, సాదరు, సాదర్వారీ, సాదా, సాపు (సాపు), సాబకు, హుకుం, సామాను, సాలస్త్రీ, సాలు, సాలాబాదుగా, సాలీనా, సాలు బస్సాలు, సాళవాదాళవాలెక్క, సాహెబు, సిద్దీ, సిపాయి, సిరా, సిబ్బంది, సిలువ, సిసలు, సిస్తు, సిస్సాల, సీదా, సీసా, సుకారి, సుక్కాను (చుక్కాని), సునామణి (సుణామణీ), సున్నతి, సుమారు, సురమా, సుల్తాను, సుసారము, సుస్తీ, సెల్లా, సోదా, హంగామి, హండా, హంసాయి, హకీకత్తు, హక్కసు, హక్కు, హజారము, (అజారము), హద్దు, హమేషా, హయాము, హరామి, హర్కారా, హల్కా (అల్కి), హవేలి, హాజరు, హమీతకావి, హాలు, హాలుసాలు, హాశ్శీలు (హసీలు), హిజారు (ఇజారు), హుండీ, హుకుము, హుజారు, హురుమంజి, హురుమత్తు, హాషారు (ఉషారు), హేజీబు, హైరానా (హైరాను), హోదా, హోదా (హవుదా), హౌసు, హవుసుకాడు, హౌసుతోట.

కీ.శే. గిడుగు రామమూర్తి పంతులుగారు తన "బాల కవి శరణ్యము" అనే గ్రంథంలో అన్యదేశ్యముల గురించి వివరిస్తూ ఇలా వ్రాశారు. "మన తెలుగు భాషలో అన్యదేశ్యములు అనేకమున్నవి. కవులు కూడా వాడుతున్నారు. అట్టి శబ్దములు ఏయే భాషల నుండి ఎప్పుడెప్పుడు వచ్చి తెలుగులో చేరినవో, ఎలాగున మారినవో మన తెలుగు పండితులు విచారించ లేదు. శ్రీ వావిలి కొలను సుబ్బారావు పంతులు గారు తమ సులభ వ్యాకరణములో రోజు, ఖర్చు, జమ, జాబు, మొదలయిన తురకమాటలు ప్రయోగార్హములు కావని నిషేధించినారు గాని ఆయన రచించిన సుభద్రా విజయము (పుట 54)లో 'కంతుతేజీ' అని ప్రయోగించినారు 'తేజీ' అన్న పదమేభాషో? ...మన

దేశమును ముసల్మాను ప్రభువులు చాలా కాలము పరిపాలించి యుండినందునను, ఆ మతము వారు తురుష్కులు, పఠానులు, అరబ్బులు మొదలగువారు కోటాను కోట్లుగా అన్ని మండలములలోను స్థిర నివాసము ఏర్పర్చుకొని మనకు తోడికాపులయి ఉన్నందున, వారి భాషలో చేరిన అరబ్బీ, పారసీ, తుర్కీ మాటలు ఒక్క మన తెలుగులోనే కాదు అన్ని భాషలలోను చేరినవి.

ఈ "తురక మాటలు" అపరిహార్యములు. సరస కవితకు ఆలంబనములు, శ్రీనాధుడు అక్కడక్కడా ఒక్కొక్క మాట 'ఖుసి మీరన్' అని ప్రయోగించాడు. నార్మను రాజులు ఇంగ్లాండు జయించి పాలించిన కాలమందు నార్మన్, ఫ్రెంచి శబ్దములు, ఇంగ్లీషులో కలసినట్లే, మన తెలుగులో ఉర్దూ మాటలు చేరి, భాషాభివృద్ధికి కారణము లయినవి. సాలాఖరువలెనే నెలాఖరు, మాసవారీ, బేమర్యాద, పెత్తనదారుడు, కలక్టరీ, నిజాయితీ, గుమాస్తాగిరి, బంట్రోతుగిరి ఎంత పొందికగలిగి యున్నవో చూడండి. హిందూస్తానీలో కుడౌల్ అంటారు. వేలకొలదిగా ఉన్న ఈ హిందుస్తానీ మాటలు నిత్యవ్యవహారములో ఆంధ్ర భారతి శరీరములోని అంగములయినవి. ఛేదిస్తే గాయములు పడకతప్పదు. ఆంధ్రనామ సంగ్రహము మొదలగు నిఘంటువులలో ఉర్దూ మాటలు తెలుగునకు పర్యాయపదాలుగా పూర్వులే చేర్చినారు. 'ఎకిమీడు పాదుసా యేలిక మన్నీడు సాహేబురాయడు' బ్రౌణ్య నిఘంటువులో ఇవి అనుబంధముగా ఉన్నవి. శబ్ద రత్నాకరమందు "హిం" అనే గుర్తుకలిగికొన్ని, మరికొన్ని అన్యదేశ్యములయినా దేశ్యములుగాను చాలా శబ్దములున్నవి. ఇంగ్లీషు మాటలు, సంస్కృత శబ్దములు, ఉర్దూ పదములు మన భాషలో కలిసిపోయిన వన్నీ మన మాటలే. అవి విడిచితే వ్యవహార హాని... తెలుగులో కలిసిపోయిన అనాంధ్ర శబ్దములన్నీ పూర్వము ఏ భాషలోనివైనా ఇప్పుడు తెలుగులే. నేటి వ్యావహారికాంధ్ర భాష అభినవాంధ్ర భారతి యొక్క వాఙ్మయ శరీరము భాషలో చేరిన అన్యదేశ్యాలు ఆమె శరీరములో అంతర్భూతములే. అవి, అవసరమును బట్టి వేసే వేషాలు, పెట్టుకునే అలంకారాలు, పూసుకొనే మెరుగులు." (పుటలు 227 – 229)

గిడుగువారు మరోచోట ఇలా అన్నారు. "పండితులు పుస్తకాలు ఏ భాషలో వ్రాసినా శాస్త్రాలు ఎలాగు కల్పించుకున్నా లౌకిక భాషను నిర్మూలము చేయలేరు. అది వారి నోట్లోనే కాపురముంటుంది. నాలుక మీద నెక్కి నాట్యమాడుతూ ఉంటుంది. సలక్షణముగా వృద్ధి పొందుతుంది." (పుట 24) తెలుగులో మిళతమైపోయిన ఉర్దూ పదాలను పండితులు పుస్తకాల్లోంచి ఏరి పారవేయవచ్చు గాని జనం నోళ్ళలోంచి తీయలేరు.



తెలుగు భాషలోకి వచ్చిన వేలాది ఉర్దూ పదాలను చూస్తే ఈ ఉర్దూ పదాలను తెలుగు నుండి ఇక తొలగించలేమేమో అనిపిస్తుంది. అవి పూర్తిగా తెలుగు పదాలు అయినట్లుగా, తెలుగులో స్థిరపడిపోయినట్లుగా భావించే బ్రౌన్, తెలుగు–ఇంగ్లీషు నిఘంటువులో వాటి అర్థాలను ఇచ్చాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ రీడరు డాక్టర్. కె. గోపాలకృష్ణరావు గారు " తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము" అనే తన గ్రంథంలో ఆదికవి నన్నయ మొదలు సి.నారాయణ రెడ్డి వరకు ఎందరో తెలుగు కవులు తమ రచనలలో ప్రయోగించిన ఉర్దూ, పార్శీ పదాలను సోదాహరణంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి బహుమతి పొందిన ఆ గ్రంథం ఆంధ్ర సారస్వత పరిషత్తు వారిచే 1968లో ప్రచురించబడింది. బ్రౌణ్య నిఘంటువులో కానరాని అనేక ఉర్దూ పదాలు, ఉర్దూతో మిళతమయిన తెలుగు పదాలు ఎన్నో ఈ గ్రంథంలో దర్శనమిస్తాయి. వాటన్నిటినీ వ్రాయాలంటే, వ్యాసంలో కుదరదు. మరో గ్రంథమే అవుతుంది. గోపాలకృష్ణారావుగారు ఆ గ్రంథానికి ' ప్రస్తావన 'లో, " బ్రౌను పండితుల మిశ్రభాషా నిఘంటువును ఆధారముగొని అరబీ, ఉర్దూ పారశీకములకు సంబంధించిన అన్యదేశ్యముల నిఘంటువును కూర్చుట అవసరము " అని కోరారు. అయితే 20 ఏళ్ళ అనంతరం కూడా అలాంటి నిఘంటువు ఏదైనా ప్రచురించబడినట్లు కనబడటం లేదు.

' తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము ' అను గ్రంథము యొక్క 'పరిశిష్టము' లో గోపాల కృష్ణారావుగారు ఇలా అన్నారు. "ఇప్పుడు దేశమునందుకాని రాష్ట్రమునందు కాని ఉరుదూ పారశీకములకు అధికార భాషాస్థాయి లేదు. కొన్ని రాష్ట్రములలో మాత్రమే ఉరుదూ అనుబంధ అధికార భాషగా స్వీకరింపబడినది. ఇట్టి పరిస్థితులందును ఉర్దూ పారశీక ప్రభావము ప్రసరించుచున్న అంశము విస్మరింపరానిది. పత్రికల భాష, వివిధ సంస్థల ప్రకటనలు, ప్రభుత్వ శాసనములు, చట్టములు వ్యవహారభాష మున్నగు వానిని పరిశీలించినచో ఈ అంశము స్పష్టమగును... ఉరుదూ పారశీకములందు అరబీ భాష నుండి పెక్కు పదములు ప్రవేశించినవి. కనుక పరోక్షముగా అరబీ పదములు కూడా తెలుగులో చేరినవనుట నిశ్చయము. చారిత్రక దృష్టితో చూచినచో ద్రావిడ భాషలపై అరబీ భాష ప్రభావమే మొట్టమొదట కలిగినట్లు కన్పించును... నావికుల పదజాలమును పండితులు పరిశీలించినచో, అమూల్యమయిన అంశములు వెల్లడియగును, పారిభాషిక పదములను రూపొందించుకొనుటలో తెలుగు వారు ఉదారదృష్టి వహించుట అవసరమే. ప్రతిపదము కూడా అచ్చమయిన తెలుగు పదముగా మాత్రమే ఉండవలయునను నిర్బంధమును పూనినచో కార్యము క్లిష్టతరమగును. సంకుచిత దృష్టితో మడిగట్టుకొని

పారిభాషిక పదములను తెలుగు పదముల తోడనే బలవంతముగా నిర్మించుకొనినచో అవి బహుజన ఆదరపాత్రములు కాక వ్యవహారమును కష్టతరమొనర్చును. విధిలేనపుడు ఎంత గొలుసు పదములను, చిత్ర విచిత్రములైన పదములను నిర్మించుకొనుట శాస్త్రసిద్ధమైన మార్గము కాదు. జేబురుమాలు, గుండీ, అంగీ, కుద్దా, టోపి, అమలు, వాయిదా వంటి పదములకు సమానార్థకములగు తెలుగు పదములను ప్రత్యేకముగా కృషి సలిపి నిర్మించుకొనుట వృథాశ్రమయని అనుభవజ్ఞుల అభిప్రాయము... నిత్య పరివర్తన శీలమయిన భాషకు నిర్బంధములు తగవు అన్యభాషల నుండి పదములు స్వీకరించినంత మాత్రమున తెలుగు భాష గౌరవ ప్రతిష్టల కెట్టి భంగము వాట్లిలదు. తెలుగు ఇంకను పరిపుష్టమగును...ఆదాన ప్రదాన పద్ధతి ఉభయ భాషా సాహిత్యములకు లాభదాయకము. దక్షిణాది భాషలపై ఉర్దూ పారశీకముల ప్రభావమును తులనాత్మకముగా పరిశీలించి తెలుగుపై ప్రసరింపజేసిన ప్రభావ వైశిష్ట్యమును కూడా నిరూపించుటకు పండితులు కృషి యొనర్పవలసియున్నది. ఇట్టి పరిశోధనకు కృషికి పునాదిగా పనికి వచ్చునది పదజాలము. ఈ పదజాలమును నిఘంటువు రూపమున సంతరించుట ఎంతయో అవసరము. ఇది ఒకరి వలన అగు కార్యము కాదు. బహుభాషజ్ఞులగు పండితుల సహాయముతో సాహిత్యసంస్థలు, అకాడమీలు బృహత్ప్రణాళికను సిద్దము చేసి సాధింపదగిన కార్యము. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అన్యదేశ్య నిఘంటువును కూడా నిర్మించుటకు సాహసింపవలయునని వినయపూర్వకముగా విన్నవించు కొనుచున్నాను."

రద్దయిన అకాడమీలలో పై అకాడమీ ఉందో లేదో నాకు తెలియదు గాని నిఘంటువు మాత్రం నిర్మించబడలేదని తెలుసు. ఉర్దూ ఉద్యమం అంటూ ఉపవాసాలు చేసే జనం ఉర్దూ–తెలుగు. తెలుగు–ఉర్దూ నిఘంటువుల నిర్మాణం కోసం కృషి చేస్తే ఇరువర్గాల మధ్య భాషా పరిజ్ఞానం పెరిగి పరాయితనం పోతుంది. సఖ్యత వెల్లివిరుస్తుంది. రానురాను మిశ్రమ భాషేమేలైన వారథి అవుతుంది. భాషాద్వేషం సమసిపోతుంది. ఇరు భాషలలోని జాతీయాలు, సామెతలు, లోకోక్తులు, యాస పదాలు క్రోడీకరించి పరస్పరం అనువదించి గ్రంథాలుగా వెలువరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాషాప్రియ సంస్థలీ పనికి పూనుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పనులకు తగిన నిధులు కేటాయించి తెలుగు ఉర్దూ అకాడమీలను గ్రంథాల ప్రచురణకు పురమాయించాలి.

**(గీటురాయి 27-1-89, 20-12-96 )**



# అథోగతి పాలైన అధికార భాష

భాషా ప్రాతికపదిక మీద తెలుగు రాష్ట్రం ఏర్పడి 43 ఏళ్ళు గడిచినా, తెలుగులో చట్టాలు, చేయకపోవటం వల్ల అధికార భాషగా తెలుగు అథోగతి పాలయ్యింది. ఐ.ఎ.ఎస్. మొదలు అటెండర్ వరకు అందరికీ ఈ భాష మీద చిన్న చూపే. ప్రపంచంలో 15వ స్థానాన్ని , భారత దేశంలో రెండవ స్థానాన్ని పొందిన ఈ భాషకు విలువలేదు. ఇప్పుడు కంప్యూటర్ల రాకతో రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలన్నీ తెలుగు వాడకాన్ని తుంగలో తొక్కాయి.

" చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ ", " మా తెలుగు తల్లికీ మల్లెపూదండ " లాంటి గీతాలను మనం పాడుకోవచ్చు. ఆంధ్ర రాష్ట్రావతరణ దినోత్సవాలను జరుపుకోవచ్చుగానీ, తెలుగు భాషకు పాలనా భాషగా ఎంతశక్తిని కల్పించామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తెలుగు తల్లి విగ్రహం సచివాలయ సమీపంలోనే విరిగి పోయింది. అంతకు ముందు నలభై ఏళ్ళ నుండి సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు భాషల సమ్మెట దెబ్బలకు తెలుగు భాష తునాతునకలైపోతూ నానాటికి తీసికట్టునాగం భట్టూ అన్నట్లు మనుగడ సాగిస్తూ ఉంది. మరి మన ఆంగ్ల భాషాదాస్యం పోయి, తెలుగుకు సముచిత స్థానం రావాలంటే ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్ని నిషేధించాలి. ఇంగ్లీషు, హిందీ, మరే ఇతర భాషనైనా నేర్చుకోవటం వ్యక్తుల స్వేచ్ఛకు వదిలేయాలి. మన మాతృభాష అయిన తెలుగును మాత్రం నిర్బంధంగా నేర్పాలి. డిగ్రీ స్థాయి వరకు ఎక్కడా ఇంగ్లీషు, హిందీ తగలగూడదు. అప్పుడు మాత్రమే తెలుగు బలపడుతుంది.

2. చందస్సుతో కూడిన తెలుగు వ్యాకరణాలను చెప్పి పిల్లల్ని భయపెట్టటం ఆపి, వాడుక భాషను, ఆధునిక సాంకేతిక పదజాలాన్ని విస్తారంగా నూరిపోయాలి. భాషను సులభతరం చెయ్యాలి.

3. తెలుగులోనే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి. అధికార భాషగా తెలుగు అమలు కాకుండా అడ్డుబండలుగా ఉన్న గవర్నర్లు, ఐ.ఎ.ఎస్‌ల వ్యవస్థలో మార్పు తేవాలి. కేంద్రప్రభుత్వం కూడా మన రాష్ట్రంలోని తన కార్యాలయాలలో తెలుగు వారినే నియమించాలి. హిందీతో సమానంగా తెలుగును గౌరవించాలి.

4. కోర్టు తీర్పులు, జీ.వో.లు తెలుగులో రావాలి. చిన్నద్వీపం నుండి వలసవచ్చిన తెల్లవాడు తన భాషకు మనల్ని దాసులుగా చేసి పోయాడు. మనం ఇతరుల మీద మన

భాషను రుద్దలేకపోయినా, కనీసం మనలోనైనా మన భాషను పరిపుష్టం చేసుకోలేమా? ఇంగ్లీషో, హిందీనో నేర్చుకుంటేనే మనకు మనుగడ అంటే ఇక తెలుగు వల్ల లాభం ఏమిటి?

5. మన నాలుకలపై స్థిరపడిన పరభాషా పదాలను మనవిగానే భావించి (బస్సు, సైకిలు. రైలు, పంపు.....లాంటివి) సమగ్రమైన తెలుగు–తెలుగు నిఘంటువులు తరచుగా ముద్రిస్తూ ఉండాలి. అన్ని చట్టాలూ తెలుగులో ముద్రించాలి. సర్వీస్ కమిషన్ తన శాఖా పరమైన పరీక్షలన్నీ తెలుగులోనే నిర్వహించాలి. ఇంటర్వ్యూలన్నీ తెలుగులో ఉండాలి.

6. ఇంగ్లీషు టైపు మిషన్లను కార్యాలయాల్లో నుంచి పూర్తిగా తీసివేసి, తెలుగు టైపు మిషన్లు, తెలుగు కంప్యూటర్లు మాత్రమే ఉంచాలి. తెలుగు లిపిని సంస్కరించాలి. వత్తులు, గుణింతాల సంస్కరణ జరిపి, ఆంగ్లభాషకు దీటుగా టైపు చేయదగిన రీతిలో తెలుగును తీర్చిదిద్దాలి. ( ఉదాహరణకు, **ఋ,ౖ, ఌ, ః** లాంటి వాటిని ప్రజలు వదిలేశారు.) చాదస్తపు గ్రాంధిక భాష వాడకాన్ని మందగింపజేస్తుంది. అక్కరలకు అనుగుణంగా, స్వేచ్ఛగా నర్తింపగల భాష. విస్తారంగా వ్యాపిస్తుంది.

ఒకరు చెప్పిన సంగతి మరొకరికి సరిగా అర్థమవుతున్నదా లేదా అని చూడక, వ్యాకరణ దోషాలు వెతికే గ్రాంథిక సంప్రదాయ ఛాందస పండితులకు, శిష్ట కరణాలకు, గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు వాడుక భాషలో ఆనాడు పాఠాలు చెప్పారు. అన్యదేశ్యాలు, అపభ్రంశాలు, గ్రామ్యాలు, రూపాంతరాలూ, సందులూ గొందులూ అని అదే పనిగా వెతకకుండా స్వేచ్ఛగా హృదయపూర్వకంగా భాషను వినియోగించండి అంటూ సవాలక్ష ఉదాహరణలతో గిడుగు వారు వ్రాసిన “బాలకవి శరణ్యము”లో నేటి కవులు, విలేకరులు, రచయితలు తెలుసుకోవలసిన విషయాలు బోలెడన్ని ఉన్నాయి.

**లోకయాత్ర కొరకు లౌకిక భాషలు**
**పుట్టి ప్రజల నోట పొంది యుండు**
**జీవలోక మందు జీవించు భాషలు**
**జనుల తలపు దెలుపు సాధనములు.**

**మాల మాటయేని మాదిగ మాటేని**
**నాటిదేని గాక నేటిదేని**
**ఈడదైన నేమి యాడదైనను నేమి**
**ఏడదైన జెల్లు వాడికయిన**



**వాడిక గద మాట ప్రాణంబు మానంబు**
**వాడనట్టి మాట పాడువడును**
**చెల్లుబడిని బట్టి చేకొంద్రు లోకులు**
**మాదలైన కవుల మాటలైన**

**లోక సిద్ధమైన లౌకిక పదములు**
**సార్థకంబు లెల్ల జనుల కగును**
**మాసినట్టి మాట మరి మరి పరికింప**
**కోశమందెతెలియు కోవిదులకె.**

**పుస్తకాల లోన ప్రుచ్చిన మాటలు**
**ప్రాతలైన వాని ద్రవ్వి యెత్తి**
**నేడు ఎల్లవారు వాడ గావలెనన్న**
**గొంతు కడ్డపడదె క్రొత్త మాట?**

# తెలుగు భాషా చరిత్రలో మైలు రాళ్ళు

1746 – రెవరెండ్ బెంజిమిన్ షుల్జి తెలుగులో ఆరు క్రైస్తవ పుస్తకాలను జర్మనీ దేశంలో ముద్రించారు.

1814 – విలియం కేరీ తెలుగు వ్యాకరణం

1816 – ఎ.డి. క్యాంప్ బెల్ వ్యాకరణం

1817 – విలియం బ్రౌన్ వ్యాకరణం

1821 – క్యాంప్ బెల్ నిఘంటువు

1827 – సి.పి. బ్రౌన్ వ్యాకరణం

1840 – ముహమ్మద్ రహ్మతుల్లా తెలుగులో మొదటి వారపత్రిక వెలువరించారు.

1852 – సి.పి. బ్రౌన్ నిఘంటువు

1926 – వాల్తేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన

1948 – తెలుగుభాషా సమితి విజ్ఞాన సర్వస్వాలు ముద్రించింది.

1956 – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

1957 – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పాటు.

1966 – తెలుగును అధికార భాషగా ప్రకటించారు.

1967 – తెలుగు అకాడమీ ఏర్పడింది.

1969 – డిగ్రీ స్థాయి విద్య తెలుగులో ఉండాలని నిర్ణయించారు.

1975 – మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు.

1976 – జిల్లా స్థాయిలో తెలుగును అధికార భాషగా ప్రకటించారు.

1979 – నంద్యాల మున్సిఫ్ మేజిస్ట్రేట్ శ్రీ ఖాదర్ మొహియుద్దీన్ మొట్టమొదటి "తెలుగు తీర్పు " ఇచ్చారు.

1979 – డైరెక్టొరేట్ల స్థాయిలో తెలుగు అధికార భాషఅయ్యింది.

1981 – మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టుల్లో తెలుగు వాడాలని శాసించారు.

1982 – నాగార్జున సాగర్‌లో ఓపెన్ యూనివర్శిటీ స్థాపించారు.

1983 – సచివాలయ స్థాయిలో తెలుగు అమలుకు ఆదేశాలు.

1985 – తెలుగు విశ్వవిద్యాలయ స్థాపన.

1988 – రాష్ట్రప్రభుత్వకార్యాలయాల్లో ఇంగ్లీషు తొలగించాలని ఉత్తర్వులు

1989 – తరతరాల తెలుగు జాతి సంగ్రహాలయం స్థాపన. పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టారు.

1990–99–కూడిక, తీసివేత, హెచ్చవేత లాంటి తేలికైన తెలుగు పదాలను తొలగించి, ఆ స్థానంలో సంకలనము, వ్యవకలనము, గుణకారము లాంటి సంస్కృత పదాలను చేర్చి పిల్లలకు పాఠ్యపుస్తకాలు తయారు చేశారు. పిచికారీ అనే పదం 'ముషలికం' అయ్యింది. ఎక్కువ మార్కులు వస్తాయని సంస్కృతం తీసుకుంటున్నారు. కంప్యూటర్ల రాకతో తెలుగును నెట్టివేసి ఇంగ్లీషు రాజభాషగా వెలిగిపోతోంది. అధికార భాషా సంఘం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ, తెలుగు భాషకు ఊపిరి పోసే చర్యలు ఏం తీసుకున్నా యో, తెలియటం లేదు. ప్రభుత్వం తెలుగు వైపు దృష్టి సారించాలి.

**(గీటురాయి 29-10-99)**

> "చిన్నయసూరి సూత్రముల జిక్కి కృశించి విషాదమొందుతూ
> ఉన్న తెనుంగు, శృంఖలములూడి, సుఖంబుగ మేడమీద గూ
> ర్చున్నది, నూత్నకాంతి గనుచున్నది, హాయిగ నేడు సంచరి
> స్తున్నది, రామమూర్తి విబుధోత్తమ నీశ్రమకున్ ఫలంబుగాన్"
>
> **-భోగరాజు నారాయణమూర్తి**



# దాస్యం చేసే భాష అధికార భాష ఎలా అవుతుంది ?

డర్బన్‌లో కామన్‌వెల్త్ దేశాల ప్రభుత్వాధినేతల సదస్సు (చోగమ్)ను ప్రారంభిస్తూ ఎలిజిబెత్ రాణి "ఇంగ్లీషు మన ఉమ్మడి భాష. వరల్డ్‌వైడ్ వెబ్‌లాగా ఇది మన దేశాల ప్రజలందరినీ ఒక దగ్గరకు చేరుస్తుంది" అన్నారు. (ఈనాడు 13.11.99). 54 దేశాల ప్రభుత్వాధి నేతలు తమ తమ మాతృ భాషల్లో ఏమనుకున్నారో గానీ, ఆవిడకు ఎదురు చెప్పలేదు.

అక్కడే కామన్ వెల్త్ బిజినెస్ ఫోరంలో పాల్గొన్న భారత ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా మాత్రం ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులపై ఇలా నిరసన వ్యక్తం చేశారు: " ప్రపంచంలో ఆయా దేశాల స్థానిక స్థితిగతులను బట్టి ప్రమాణాలు వేరువేరుగా ఉంటాయి. ఈ భేదాలను గుర్తించాలి. ఒక దేశం తన ప్రమాణాలను మరో దేశంపై రుద్ద రాదు."

**(ఈనాడు 15.11.99)**

కామన్ వెల్త్ ప్రధాన కార్యదర్శి ఎమేకా అనయోకు ఇలా అన్నారు. "అంతర్జాతీయ ద్రవ్యనిధి. ప్రపంచ బ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థలు, ఇప్పటికీ కొన్ని ధనిక దేశాల గుప్పిట్లోనే ఉన్నాయి. పేద దేశాలు, ప్రధానంగా చిన్న దేశాలు ఈ సంస్థల కార్యకలాపాల్లో పాలు పంచుకోలేక పోతున్నాయి. దీంతో ఈ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఏవో కొన్ని ధనిక దేశాలకు పరిమితం అనీ, పేద దేశాలను విస్మరించటం సరైనదేనన్న భావం బలపడుతోంది."

ఈ సంగతులన్నీ ప్రపంచ భాష జాతీయ భాషలను, జాతీయ భాషలు ప్రాంతీయ భాషలను ఎలా అణగద్రొక్కి పరిపాలన చేస్తాయో మనకు వివరిస్తున్నాయి.

పేద భాషలు ధనిక భాషలకు పాదాక్రాంతమై ఊడిగం చేస్తూ, కాల గమనంలో నామ రూపాలు లేకుండా నశించి పోతాయన్నది చరిత్ర నేర్పిన పాఠం. ధనికుడు పేద వాడి భాషను నేర్చుకోడు. తన భాషను బానిస మీద నిర్బంధంగా రుద్దుతాడు. ఆఫ్రికా నుండి నీగ్రోలను పట్టుకెళ్ళి వారిచేత పశువుల్లాగా పని చేయించుకున్న అమెరికా వాళ్ళు, నీగ్రో వాళ్ళకు కూడా ఒక భాష ఉంది అనే విషయం పట్టించుకోలేదు. అసలు వాళ్ళను మనుషుల్లాగానే చూడలేదు. ఈ రోజు మానవ హక్కుల గురించి మాట్లాడుతున్నారు.

దోపిడీ దురాక్రమణ తత్వం గల వారి భాషలు అభివృద్ధి చెందుతుంటే, పరభాషా సహనం, దాస్య ప్రవృత్తిగల వారిభాషలు కునారిల్లిపోతాయని చరిత్ర రుజువు చేసింది. ప్రపంచ భాష, జాతీయ భాషలు ఇలాగే పెత్తనం చేస్తే వచ్చే శతాబ్దానికి మన తెలుగు భాష ఈనాటి ఎరుకల, యానాది, లంబాడీ, కోయ, సవరలాంటి భాషల స్థాయికి దిగజారిపోతుంది. ఆ తరువాత శతాబ్దానికి మనం జాతీయ భాష అని చెప్పుకునే హిందీ కూడా అంతరించి ఒకే అంతర్జాతీయ భాష రాజ్యమేలుతుంది. ప్రపంచ బ్యాంకులో ప్రపంచ పోలీసులో ఎవరి ఆధిక్యత ఉంటే వారిభాషే ప్రపంచ భాష అవుతుంది. మిగతా భాషల వారికి వారి భాష గుండెల్లో ఆవేదన రూపంలో ఉంటుందే తప్ప, గొంతుపెగిలి భావం పలకాలంటే, అది ఆంగ్లంలోనే పలకాలి. లేకపోతే అమెరికావాడి ముందు ఆనాటి నీగ్రోవాడి గోలలాగానే ఉంటుంది. అప్పిచ్చేవాడి భాషను అప్పు తీసుకునేవాడు తప్పక నేర్చుకోవాలి.

"పొట్ట – మనసు" అనే అంశం మీద డాక్టర్ రామ్మనోహర లోహియా 1958లో ఇలా అన్నారు. '... స్వతంత్ర భారతదేశం ఒక విచిత్ర పరిస్థితిని సృష్టించింది. దేశపు నిజమైన యజమానిని పరాయివాడిగా తయారుచేసింది. ఎవరో పరాయివాడు మన పొలాన్ని ఆక్రమించుకుని మనల్నే బయటకు గెంటివేసినట్లుగా ఉంది. ఇంగ్లీషు భాషను తొలగించినట్లయితే ప్రభుత్వం, చట్టాలు, కార్మిక సంఘాలు, సార్వజనిక సంస్థలూ, వాటి నాయకులూ అందరూ కూడా కోట్లాది ప్రజలతో ముఖాముఖిగా నిలబడాల్సి వస్తుంది. సామంత రాజ్యపు చక్రమంతా సడలి పోతుంది. సైన్యం సంగతే తీసుకోండి. కల్నల్ కంటే పై పదవుల్లో నియామకానికి గీటురాయి ఏమిటి? యుద్ధకౌశలం కాదు. ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం. ఇంగ్లీషులో నోట్‌రాయగలగడం, మాట్లాడ గలగటం. మామూలు మనుషులు హవల్దార్లు కావచ్చు. పై పదవులకు ద్వారాలు మూత పడ్డాయి. ఇంగ్లీషురాని వాళ్ళకు ఎంత యుద్ధ కౌశలం ఉన్నా అంతకంటే పైపదవులకు పోలేరు.

దేశీయ భాషల ద్వారా జ్ఞానసముపార్జన అసంభవం అనే వాదం అర్థరహితమైంది. రష్యా శాస్త్రజ్ఞులు విధిగా ఆంగ్లభాషను నేర్చుకొనవలసి వచ్చివుంటే, స్పుత్నిక్‌ను కనుక్కోగలిగే వారు కాదు. జ్ఞానాన్ని ఆర్జించదలుచు కున్నట్లయితే, భాషాజ్ఞానం సంపాదించటానికి శ్రమపడే కంటే, విషయజ్ఞానాన్ని సంపాదించటానికి శ్రమపడాలి. భారత దేశంలోని బాల బాలికలకు ఐదేళ్ళ వయస్సు నుంచే వెర్రి ఎక్కిస్తారు. చివరి వరకు ఈ వెర్రితోనే విద్యాభ్యాసం కొనసాగుతుంది. భాషాజ్ఞానాన్ని సంపాదించే బరువు



చిరుప్రాయంలోనే వారి మేధస్సు మీద మోపుతారు. విషయ జ్ఞానం వారికి లభ్యంకాదు. విశ్వ విద్యాలయాల్లోని విద్వాంసులు గాడిదల్లాగా తయారయ్యారు.

రష్యా, జపాను, జర్మనీ దేశాల్లో వైజ్ఞానికులు ఆంగ్ల భాషా జ్ఞానపు బరువును మోయకుండా, విషయ జ్ఞానం ఆధారంగానే అనేక ఆవిష్కరణలు చేయగలిగారు. భారతీయ బాల బాలికల మెదళ్ళపై నుంచి భాషా జ్ఞానపు బరువును తొలగిస్తే, వారికి గంభీరమైన విషయపరిజ్ఞానం కలుగుతుంది. భాషా పరిజ్ఞానం సంపాదించటానికి భారతీయులు పడే శ్రమభారం వల్ల భూగోళ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రం వంటి శాస్త్రాల విషయపరిజ్ఞానం అసలు అబ్బనే అబ్బదు. ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని సంపాదించటానికే విద్యార్థి జీవితం అంతా ఖర్చయిపోతుంది. అందువల్లనే ఈనాడు భారతీయుల శాస్త్రవిజ్ఞానం ఆంగ్ల పరిజ్ఞానానికి అనుకరణలుగా ఉన్నాయి. మనదేశ పరిస్థితులను, ప్రత్యేక సమస్యలను, అవసరాలను పరిష్కరించటానికి వాటిలో మార్గాలు కనిపించవు. అంతేకాదు, ఆంగ్లం రాకపోతే ప్రపంచంలోని ఇతర దేశాలకు చెందిన వైజ్ఞానికుల స్థాయిని అందుకోగల విద్వాంసులు కూడా మనలో లేరు. భారతీయ విద్యార్థుల్ని ఆంగ్లభాషా సంకెళ్ళతో బంధించి వేశారు. ఫలితంగా వారి మెదళ్ళు బూజుపట్టి పోయాయి.

ఇంగ్లీషు ప్రపంచభాష అవుతుందని కొంతమంది భ్రమ పడుతుంటారు. ఏ భాష కూడా ప్రపంచ భాష కాలేకపోయింది. 19వ శతాబ్దంలో ఫ్రెంచి భాషను ప్రపంచ భాషగా భావించేవారు. ఈనాడు ఇంగ్లీషును ప్రపంచభాషగా భావించేవారు మూర్ఖులు. 8వ లేదా 9వ శతాబ్దంలో అరబ్బీని ప్రపంచభాషగా భావించేవారు. రెండువేల ఏళ్ళ క్రిందట సంస్కృతాన్ని ప్రపంచభాషగా భావించారు. ఇదంతా ప్రవహిస్తున్న జలం. ఇంగ్లీషు ప్రపంచ భాష కాగలదన్న ఆశ అడియాసే..." ("భాషా సమస్య" తెలుగు అకాడమి ప్రచురణ పేజీలు 29–35)

రామ్మనోహర లోహియా తన మాతృ భాష హిందీ గురించి ఎంత పరితపించాడో, నేను నా మాతృభాష అయిన తెలుగు గురించి అంతగా పరితపిస్తాను. లోహియా భారతదేశంలో ఇంగ్లీషును తొలగించి హిందీని రాజభాషగా అమలు చేయాలని ఉద్యమం తెచ్చాడు. నేను దీనిని వ్యతిరేకిస్తాను. నాకు తెలుగే రాజభాష. ఎందుకంటే దేవుడు నన్ను ఈ భాషవారిలోనే పుట్టించాడు. నా తల్లి ఈ భాషలోనే మాట్లాడింది. ఈ భాషలోనే నా ఆనందం, నా విచారం స్వేచ్ఛగా వ్యక్తం చేయగలను. ఈ భాషలోనే హృదయాన్ని దైవం ముందు కుమ్మరించగలను. నిర్బంధించి నేర్పేది ఏదైనా యాంత్రికమే అవుతుంది గానీ

ఐచ్ఛికం కాదు. ఐచ్ఛికత లేకుండా చేయించేది ఏదైనా బానిసత్వమే అవుతుంది భాషా దాస్యం చేసే బానిసలకు స్వంత ఆలోచనలు రావు. వారు యజమాని భాషను మోస్తూ అవస్థ పడుతుంటారుగాని, తమ భాషద్వారా అభివృద్ధి పథాన్ని అందుకోలేరు.

అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు డాక్టర్. పి. యశోదారెడ్డి ఇలా అన్నారు. “పాలకులు దేశీయులైనప్పుడు అధికారభాష దేశభాష రూపంలో ఉంటుంది. దౌర్భాగ్య విశేషంతో దేశం పరహస్తగతమైనప్పుడు పరిపాలకులు వారి సౌకర్యాన్ని అనుసరించి వారి అభిమానభాషను అధికారభాషగా గుర్తిస్తూ రాజదండాన్ని దాని చేతికి అందిస్తారు. రాజాశ్రయాన్ని ఆశించిన వారికీ, ఉద్యోగులకూ, వ్యాపారస్తులకూ, ఆ భాషను నేర్వక తప్పదు. దాని దుష్ప్రభావాన్ని సామాన్యుడు అనుభవించక తప్పదు. ఒకే జాతి, ఒకే భాష, ఒకే దేశం అనే ఈ మూడు విశేషాలు ఒకే చోట సిద్ధించటం ఆ జాతి నోచిన నోము ఫలం, ఒక వరప్రసాదం, ఒక భాగ్య విశేషం. సాహిత్య భాషకు అధికార దండం ఏది? ఏలుబడిని నెరిపే గౌరవం ఏది? అధికార భాషకు కావలసింది సొగసులు, అలంకారాలు, రసధ్వనులూ కాదు. అధికారికంగా ఆ భాషలో చేసే విషయ నివేదనం ప్రధానం. అంటే అనేక తరాలనుండి ఆ భాష అధికారికంగా ఆయా శాఖలకు, ఆయా సాంకేతికమైన ప్రత్యేక పదజాలంతో ఆజ్ఞలనూ, ప్రకటనలనూ, సూచనలనూ, సమాచారాన్నీ పంపే అలవాటు, ప్రజా ప్రభుత్వరంగాలలో ప్రభుత్వపాలనా పరిభాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపే స్తోమత. ఈ స్థైర్యం ఆ జాతి పాలకులు తమ భాషలో రాజ్యాంగాన్ని నడుపుతూ పరిపాలన సాగించి ఉంటే, దానంతట అదే వచ్చి ఉండేది. కానీ మన పరిస్థితి వేరు. తెలుగువారు ఆరంభ శూరులు. ఉద్యమ ప్రారంభకులే కాని దాని ఫలితాలను సంపూర్ణంగా చూడగల ఓపిక లేనివారు. ఏదైనా ప్రణాళిక విజయవంతం కావాలంటే ఆలోచన, ఆచరణ రెండూ కావాలి. ప్రాంతీయ భాషలకు సామంతత్వమే కాని సార్వభౌమత్వం లేదు. అందుకు కారణం భారత ప్రభుత్వం కేంద్రంలో గుర్తించిన అధికారభాష హిందీ. అది మనకు జాతీయ భాష. మన రాష్ట్రం ఆంధ్రరాష్ట్రమైనా సచివాలయాల్లో పనిచేసే ఉన్నత అధికారులు తెలుగువారు కారు.ఆయా జిల్లాల కలెక్టర్లు తెలుగువారు కారు. మరి మన ప్రభుత్వ ధ్యేయం ప్రజా సంక్షేమం సామాన్య జనానీకపు కష్టసుఖాలను వింటూ వారి వీపు తట్టి అండగా నిలువవలసిన ఈ ఉన్నతాధికారులు తెలుగు మాట్లాడగలరే కాని నిర్ణయాలు తెలుగులో వ్రాయడం కష్టం. ఈనాడు ఇంగ్లీషు భాషను ఎంత తప్పుగా వ్యవహరించినా, వ్రాసినా ఆ భాషమాత్రం ఒక సంస్కార చిహ్నంగా నాగరికతా లక్షణంగా మారింది. తెలుగు భాష సాధికారికంగా న్యాయస్థానాల్లో, పోలీసు



శాఖల్లో, తంతితపాలాశాఖలో మెలిగే ప్రతిపత్తిని సంపాదించిననాడే అధికార భాషగా చెలామణి స్థిరపడుతుంది.”

(ఆంధ్రప్రదేశ్ దర్శిని, విశాలాంధ్ర ప్రచురణ పేజీలు 945–853)

అధికార భాషగా తెలుగు అమలు కావాలని ప్రజలు కోరుతుంటే, విశ్వవిద్యాలయాలను ప్రైవేటుపరం చేయాలని, ప్రభుత్వ స్కూళ్ళల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టాలని రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వపాలనా వ్యవహారాల్లో తెలుగు వాడకంపై అసిస్టెంట్ సెక్షనాఫీసర్లకు శిక్షణ నిచ్చే కార్యక్రమాన్ని 22.11.99న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆనందరావు ప్రారంభిస్తారనీ, ఇది 30.11.99 వరకు కొనసాగుతుందని రాష్ట్ర సమాచారశాఖ “ఇంగ్లీషులో” పంపిన ఒక ప్రకటనలో పేర్కొందని ఈనాడు దిన పత్రికలో 22.11.99న వచ్చింది.

రామ్మనోహర లోహియా 26.5.1960 తేదీన హైదరాబాదులో చేసిన ప్రసంగంలో ఇలా అన్నారు. “ తెలుగు భాష పునాది మీద విశాలాంధ్ర రాష్ట్రాన్నయితే ఏర్పరచుకున్నారు. గానీ తెలుగులో ఆ రాష్ట్రాన్ని పాలించుకోలేరు. కొంత కాలం క్రితం తెలుగు రచయితల మహాసభలో అనేక ప్రసంగాలు ఇంగ్లీషులోనే జరిగాయట ! డబ్బూ, ప్రతిష్ఠా, ఆంగ్లభాషలో ఉంటే ప్రజలు అటువైపే పరుగులిడటం సహజం. వీటిని తగ్గించటానికి ఒకటే మార్గం ఉంది. భారతదేశంలో కలెక్టర్ పదవి కూడా ఇంగ్లీషు భాష రాకపోయినా పొందవచ్చని ప్రజలకు తెలిసినప్పుడు భారతదేశంలో వకీలు, ఇంజనీరు, డాక్టరు కావడానికీ ఆంగ్లభాషా పరిజ్ఞానం బొత్తిగా అక్కరలేదని తెలిసినప్పుడు ప్రత్యేకంగా ఎటువంటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనవసరం లేదు. కోట్లాది ప్రజలు తమ ఇష్టపూర్వకంగా అత్యంత త్వరగా తెలుగు, తమిళం, హిందూస్తానీ లాంటి దేశీయ భాషలను నేర్చుకుంటారు. ఇంగీషు నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది వారికి? ఈనాడు తమ ఆర్థిక, సాంఘిక పరిస్థితులను కాస్త మెరుగుపరుచుకోవాలన్న దృష్టితో విధిలేక వారు ఇంగ్లీషు నేర్చుకుంటున్నారు. ఇదంతా అంతం కావాలంటే భారతదేశంలో ఎంత పెద్ద పదవికైనాసరే, నియామకం కోసం జరిగే పరీక్షలకు ఇంగ్లీషు రానివారు కూడా హాజరవడానికి అవకాశం లభించాలి.” (భాషా సమస్య పేజీలు 81–83)

మన రాష్ట్ర ప్రభుత్వం, సర్వీసు కమీషన్ ద్వారా ఆరు నెలలకొకసారి జరిపే డిపార్ట్‌మెంటల్ పరీక్షలనైనా తెలుగులో జరుపుతుందని ఆశిద్దాం!

**(గీటురాయి వారపత్రిక 17-12-99)**

# తెలుగు లిపి సంస్కరణ

"...56 అక్షరాలున్న తెలుగు భాషకంటే 26 అక్షరాలే ఉన్న ఇంగ్లీషు ఎక్కువ వాడుకలోకి వచ్చింది, ప్రపంచ భాష అయ్యింది. కాబట్టి తెలుగు భాషకు 16 అక్షరాలే పెట్టి నంబర్ వన్ పొజిషన్ తెస్తాను చూడండి.." అంటాడొక నాయకుడు సినిమాలో. అది అతను భావావేశంలో సాధ్యసాధ్యాలను గమనించకుండా అన్నమాట అయినప్పటికీ భాషా సంస్కర్తలు ఈ పనికి పూనుకోవచ్చు. తెలుగులో ఎదురయ్యే మొదటి సమస్య గుణింతాలు, వత్తులు. వీటివలన అక్షరానికి క్రిందా పైనా మరో రెండు లైన్లు స్థలం అవసరమవుతుంది. టైపుమిషను, కంప్యూటర్‌లలో అక్షరాలు ముద్రించేటప్పుడు ఈ విషయం తెలుస్తుంది. ఇంగ్లీషులో కేవలం ఎ,ఇ.ఐ.ఓ.యు. అనే అచ్చులతో మిగతా 21 హల్లులు కలిసి భాష ఒకే లైనులో సాఫీగాసాగి పోతుంది. తెలుగులో అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ, ఋ,ౠ,ఎ, ఏ,ఐ,ఒ,ఓ,ఔ,అం,అః, అనే 16 అచ్చులు. ఇప్పుడు ఋ, ౠ, ఁ (అరసున్న), ః (విసర్గ) లాంటివి వాడుకలోలేవు. అలాగే చే,జే,ఱ లాంటి హల్లులుకూడా వాడటం లేదు. వీటికి తోడు వత్తులు, గుణింతాలు. వాటికోసం ప్రత్యేక అక్షరాలు. తెలుగులోని పదాలు అజంతాలు (అచ్చుతోటే అంతమవుతాయి) హిందీ వాళ్ళు రామ్ అంటే మనం ' రామ ' అంటాము. సాంకేతికంగా యంత్రాలకు కూడా సులభంగా వాడగలిగేలా భాషను సంస్కరించాలి. అనవసరమయిన అక్షరాలను వత్తులను వదిలించుకోవాలి. ' ఐతే ' అనే మాటను అయితే, అఇతే అని కూడా రాయవచ్చు. గొట్టము అనే మాట ఇంగ్లీషు తరహాలోనైతే, ' గఒటటఅమఉ ' అవుతుంది. కానీ ముందుగా అక్షరాలను ' నకారపొల్లు ' శబ్దానికి మార్చి పలికితేనే ఈ సంస్కరణకు వీలు చిక్కుతుంది. ఇప్పుడు కంప్యూటర్లలో కూడా ఇంగ్లీషు కీబోర్డు వాడి తెలుగులిపిని పొందే సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు.

"తెలుగు లిపి పరిణామం" అనే వ్యాసంలో డాక్టర్ తిరుమల రామచంద్ర వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలివి. "..తెలుగు లిపి గుండ్రంగా అవటానికి 2500 ఏళ్ళు పట్టింది. అంతకు ముందు ఇవి అడ్డపు, నిలువు గీతలే. భాష ధ్వనిరూపం. ఈధ్వనికి సంకేతాలే లిపులు. అచ్చు వచ్చిన తరువాత లిపి స్వరూపం మరింత సుందరమయి స్థిరపడింది. ఇక్ష్వాకుల కాలంలో శిల్పులు అక్షరాలకు ఒంపులు వయ్యారాలు చేకూర్చారు. అక్షరాల నిలువు గీతలు అడుగున పొడవై కుడి వైపునకు వంపు తిరిగాయి. శాలంకాయనుల కాలంలో కొన్ని అక్షరాల తలపై అడ్డగీత ఏర్పడింది. కొన్ని అక్షరాలు గుండ్రతనం వదిలి కోణాకారం దాల్చాయి. విష్ణుకుండినుల కాలంలో తలపై అడ్డుగీత అన్ని అక్షరాలపై కనిపించింది. వీరి కాలంలో 'ఙ్గ' లనే వింత అక్షరం ఉండేది. తరువాత



అంతరించింది. చాళుక్య లిపి చక్కగా నిలువుగా ఉంటుంది. నన్నయ కాలం నుంచి వేంగీ చాళుక్య లిపిలో మార్పులు ప్రారంభమై 200 ఏళ్ళకు కన్నడ, తెలుగు లిపులు విడిపోయాయి. తెలుగు మరీ గుండ్రమై పోయింది, కన్నడ లిపి కోణాకార మయ్యింది. నన్నయ్య కాలపు అక్షరాలకు మధ్యన అడ్డంగా గీత గీస్తే తలకట్టు దగ్గర తెగుతుంది. అంటే తలకట్టు సగమూ, తక్కిన అక్షరం సగమూను. కాకతీయుల అక్షరాలలో తలకట్టు చిన్నదై తక్కిన భాగం పెద్దది కావటంతో అక్షరాలు పొంకంగా , దీర్ఘవర్తులంగా అయి అందం వచ్చింది. ప, హలు తలకట్టు విదిల్చుకున్నాయి. చాప, జల్లెడ వంటి వాటిలో 'త ఒత్తు' వంటి గుర్తు '్త' 19వ శతాబ్దంలో సి.పి. బ్రౌన్ పెట్టించాడు. మరో వింత అక్షరం అరసున్న. 16వ శతాబ్దానికి ముందు కనిపించదు.

ముఖ్యాక్షరాలు ఎంతగా మారాయో గుణింతాల గుర్తులు అంతకు రెండింతలుగా మారాయి. క్రావడి మరొక్క రూపం వలపల గిలక 'కర్మ' అని వ్రాయడానికి **కర్మ** అని వ్రాసేవారు. ఈ విధంగా తెలుగు లిపి 23 వందల సంవత్సరాలలో ఎన్నో మార్పులు పొంది నేటికీ రూపానికి వచ్చింది. ప్రస్తుత యంత్రయుగంలో ఎన్నో మార్పులు పొందవచ్చు. లోహాక్షరాలు చేతితో పేర్చుకొనే అవసరం పోయి, ఆంగ్లంలో లాగా మోనోటైప్ యంత్రాలలోను, లైనోటైప్ యంత్రాలతలోను టైప్‌లాగా కొట్టే వరకు అభివృద్ధి చెందింది. అక్షరాలను విడగొట్టి కలిపే పద్ధతిలో స్వరూపాలు గూడా ముందుకన్నా మారాయి. కంప్యూటర్ ద్వారా కంపోజ్ చేసే పద్ధతి ప్రస్తుతం గొప్ప విప్లవం. ఒకచోట వాడిన మాట పలుచోట్ల అక్షరరూపం దాల్చే పద్ధతి కూడా వచ్చింది. శ్రమ తగ్గించుకొని లాఘవం కోరే మానవుని బుద్ధి ఈ వర్ణమాలలోనూ ఎన్నోమార్పులు తలపెట్టవచ్చు.

మూడు సంవత్సరాల క్రితం కర్నాటక గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య గారు ఆంధ్ర-కర్నాటక లిపి ఏకీకరణకు బెంగుళూరు విశ్వవిద్యాలయం కన్నడ శాఖాధ్యక్షులు సచ్చిదానంద మూర్తిగారి అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించారు. అది లిపిలో ఎలాంటి మార్పు చేయకుండా రెండిటినీ ఆదాన ప్రదాన పద్ధతిలో కలిపింది. ఈ వివరాలను విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించిన "మన లిపి పుట్టుపూర్వోత్తరాలు" లో చూడవచ్చు. దీనిని ' విజయలిపి ' అన్నారు.(ఆంధ్రప్రదేశ్ దర్శిని -2 పేజీలు 389-398)

"కొన్ని తెలుగు ముద్రాక్షరాలు అచ్చు కూర్పరులకు విసుగు పుట్టించేవి. తెలుగు లిపిలో ఉన్న క్లిష్టత వల్ల తెలుగులో అచ్చు కూర్చటానికి (కంపోజింగ్‌కు) చాలా ప్రయాస పడేవారు. ఉదాహరణకు ఆనాడు అచ్చులో ఉపయోగిస్తున్న అర్ధచంద్రాకారంలో వేరొక వర్ణానికి కిందరాస్తూ ఉండిన రావడి కూర్పు చాలా శ్రమ కలిగించేది. దీన్ని సి.పి. బ్రౌన్

తెలుగు శాసనాలలో ఉన్న గుర్తును నమూనాగా గ్రహించి ( ) లాంటి రెండు రూపాలు కల్పించారు. ఈ సంస్కరణల వల్ల కూర్పరులకు కొంత శ్రమ తగ్గింది. అచ్చు కూర్పు కొంత మేరకు వేగవంతమయ్యింది. ఈ కొత్త రూపాలకు 'బ్రౌన్ రావళ్ళు' అనే పేర్లు కలిగాయి. ఇలాగే ప,వ,న, స, ల విషయంలో లిపిలో ఉన్న సామ్యాన్ని బట్టి పొరబాటు పడటానికి అవకాశం ఉన్న దాన్ని గ్రహించి కన్నడంలో ఉన్నట్లు ఈ అక్షరాలలో స్పష్టంగా మార్పు కనబడే విధంగా టైపులు పోత పోయించి సి.పి.బ్రౌన్ వాటిని వాడుకలోకి తెచ్చారు. కాని ఇవి తెలుగులో నిలిచినట్లు కనబడదు. బ్రౌన్ కొన్ని సంస్కరణలు ప్రవేశ పెట్టినా, తెలుగు, ముద్రణ పెక్కు లోపాలతో సాగుతూ వచ్చింది. ముద్రాక్షరాల సంఖ్యను 405 కన్నా తగ్గించటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు. బందరులోని కళ్యాణీ టైపు ఫౌండ్రీ అధిపతి కె.వి. కొండయ్యగారు అక్షరాల సొంపు చెడకుండా ముద్రణా యంత్రానికి ఒదిగే విధంగా టైపు తయారీలో సాంకేతిక మార్పులు చేసి, 350కి తెలుగు లిపి రూపాలను కుదించారు. దీన్ని " కళ్యాణీ టైపు " అన్నారు. తక్కువ వ్యవధిలో అచ్చుకూర్చి తక్కువ వ్యయంతో తెలుగు పుస్తకాలు ముద్రించవలసిన అవసరం ఏర్పడింది. దీనికి తెలుగు లిపి ప్రతిబంధక మైంది. అది ముద్రణకు అనుకూలంగా లేదు. గుణింతపు గుర్తులు (తలకట్టులు, గుడులు, సుడులు) మొదలైనవి అక్షరానికి పైనా కిందా ఉండటం, సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలూ, వీటి గుర్తులు కొన్ని సూటిగా అక్షరం కింద ఉండటం, అక్షరాలు అధికంగా ఉండటం అనే అంశాలు తెలుగు లిపిలోని క్లిష్టతకు ముఖ్యమైన కారణాలు. ఇలాంటి క్లిష్టత వల్లే తెలుగులో పుస్తక ముద్రణ వేగంగా జరగటం లేదు. లోపాలను తొలగించి తెలుగు లిపి సంస్కరణ తప్పనిసరిగా జరపవలసి ఉంది.

మన మీనాడు కంప్యూటర్ యుగంలో పురోగమిస్తున్నాం. పరిణామాలను ఆహ్వానిస్తున్నాం. వేగం నేటి యుగధర్మం. ఈ వేగానికి తట్టు కోలేనిదేదీ నిలవదు. మందకొడిగా అక్షరాలు కూడా నడక సాగించలేవు. తెలుగు భాషకు. ఇదొక సంధియుగం. మద్రాసులో మురళీకృష్ణ అనే ఇంజనీరు బాపు అక్షరాలతో సహా అందంగా అక్షర స్వరూపాలకు కంప్యూటర్ ప్రింటింగ్‌కి అనువుగా కీ బోర్డులు రూపొందించాడు. లిపిని ఇంకా సంస్కరించి తెలుగు భాషా స్వరూపాన్ని ఆధునీకరించటానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది." (ఆంధ్రప్రదేశ్ దర్శిని -2పేజీలు 506-514). ప్రభుత్వం, అధికార భాషా సంఘం "లిపి సంస్కరణ" కొరకై నడుము బిగించాలి.

ఇక తెలుగులో తీర్పులివ్వటం సాధ్యమని కొందరు, అసాధ్యమని కొందరు,

**(గీటురాయి 25-2-2000)**



# తెలుగు లిపి పరిణామక్రమం





(ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము 3వ సంపుటి)



# తెలుగు + ఇంగ్లీష్ = తెల్గిష్

ప్రాకృత మ్మొకనాడు ప్రాభవమ్మును జూపి
చక్కని నా తెల్గుటుక్కు నణచె
గీర్వాణ మొకప్రొద్దు నిర్వాకమును జూపి
బంగరు నా తెల్గు భంగపరిచె
ఉర్దూ భాషొక రోజు దుర్దమ ప్రక్రియ
ముద్దుల నాతెల్గు పుటము నార్పె
ఇంగ్లీషు మొన్న మొన్న యినుమడించిన దీప్తి
తేనెవంటి తెనుంగు హీనపరచె
మధుర మాతృభాష మర్యాదకెన్నడు
నోచుకొనగలేదు పేచకమ్మ!
సొంత బిడ్డలైన సంతరింతుర టన్న
ఆస కానరాదు వీసమంత!
మమ్మీ డాడీ చదువులు
ముమ్మరమై పల్లెపల్లె ముసురుకొనగా
అమ్మా, విహగ వధూటీ!
కమ్మని తల్లిబాస నేర్వకనరాడొకడున్"

19.7.2003న మిత్రుడు సయ్యద్ నశీర్ అహ్మద్‌తో పాటు మంగళగిరి దగ్గర నిడమర్రులోని చార్వాకాశ్రమంలో బి. రామకృష్ణ గారిని కలిశాను. తెలుగు భాష గురించి అడిగితే ఆయన తన 'ఉత్తర గబ్బిలం' పుస్తకంలో నుంచి పై పద్యాలు ఆలపించారు.

నేను ఎక్కడ పనిచేస్తే అక్కడ నవంబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రావతరణ దినోత్సవం జరుపుతూ ఉంటాను. గత ఏడాది ఆకివీడులో జరిపాను. "తెలుగులో తీర్పులివ్వటం మన రాష్ట్రంలోని న్యాయస్థానాలకు సాధ్యమేనా?" అనే అంశంపై రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీ పెట్టాం. "అచ్చ తెలుగులో 5 నిమిషాలు మాట్లాడండి" అనే పోటీ పెట్టాం చేతికొచ్చిన అంశంపై అక్కడికక్కడే ఆంగ్లపదం దొర్లకుండా పండితులనుకున్న వాళ్ళే మాట్లాడలేక బోర్లపడితే చదువు అంతగాలేని రంగస్థల కళాకారు డొకడు గెలిచాడు. ఈ పోటీలో చదివినోడికన్నా చదవనోడే మిన్న అయ్యాడు.

ప్రమాదమని మరికొందరు సెలవిచ్చారు. బ్రిటీష్ వాళ్ళు, మొగలాయిలు రాకముందు ఈదేశం అనేక దేశాలుగా ఉండేది. ఎవరి భాషలో వారి పాలన సాగేది. ధర్మగంట మోగిస్తే రాజుగారొచ్చి వాదోపవాదాలు విని తీర్పు ఇచ్చేవాడు. న్యాయవాదులు ఉండేవారు కాదు. వాయిదాలు తక్కువ. ప్లీడర్ ఫీజులు లేవు. సత్వరన్యాయం చౌకగా దొరికేది. ఆనాడే సాధ్యమవగా ఈనాడెందుకు సాధ్యం కాదు? అని కొందరన్నారు.

అదంతా అరాచక కాలం. అప్పుడు చెల్లిందికానీ ఇప్పుడు రాచరికం లేదు, రాజు తీర్పులివ్వకూడదు. అందుకే న్యాయవాదులు న్యాయమూర్తులతో కూడిన న్యాయవ్యవస్థ ఏర్పడింది. పోలీసు చేతిలో, పెత్తందారు చేతిలో న్యాయపెత్తనం పెట్టకూడదు. ఇచ్చిన తీర్పు దేశమంతటా అర్థం కావాలి గాబట్టి ఇంగ్లీషులోనే ఉండాలి. హైకోర్టు న్యాయమూర్తుల్లో తెలుగు రానివారు కూడా ఉంటారు సుప్రీంకోర్టులో తెలుగు అనుమతించరు. ఇంగ్లీషే ఈ దేశ అధికార భాష కాబట్టి తీర్పులు ఇంగ్లీషులోనే ఉండాలి అని కొందరన్నారు. అసలు మన రాజ్యాంగాన్ని తెలుగులోకి అనువదించారా? ఆ అనువాదానికి రాష్ట్రపతి ఆమోదముద్ర పడిందా? సివిల్, క్రిమినల్ చట్టాలు తెలుగులో అధికార పూర్వకంగా విడుదల అయ్యాయా? అవి నోరుతిరిగే భాషలో ఉన్నాయా? అర్థం అవుతాయా? మన పిల్లలకు న్యాయవిద్య తెలుగులో అందిస్తున్నారా? పారిభాషిక పదాల కొరత ఎలా తీరుస్తారు? లాంటి ప్రశ్నలతో కొందరు ఇదంతా అయ్యేపని కాదని పెదవి విరిచారు. తెలుగు భాష మీద నాకు ఎంత ప్రేమో! "తీర్పులు తెలుగులో ఇవ్వొచ్చు" అని ధైర్యపరిచేవాడిని. తెలుగు దీనావస్థను చూచి కూడా ఏదో ఆశ, ఇది పునరుద్ధరించ బడుతుందని. నేను పెట్టిన పోటీ నాకే పోటీ అయికూర్చొంది.

ఈ మధ్య నేనే న్యాయమూర్తినయ్యాను. రంపచోదవరం మొబైల్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ అంతా గిరిజనులు, మన అచ్చ తెలుగువాళ్ళు, ఆహా, ఇంకేం తెలుగులో తీర్పులివ్వొచ్చు అని ఆనందపడుతూ వెళ్ళాను. అక్కడా పదిమంది లాయర్లు ' యువరానర్' అంటూ ప్రత్యక్షమయ్యారు. ఆంగ్ల భాషాకోవిదులైన అడ్వకేట్లు నల్లకోట్లు వేసి నాముందుకొచ్చి, నేను తెలుగు న్యాయం మాత్రమే చెప్పబూనటం అపూర్వం, సాహసం, ప్రమాదభరితం అని ఆంగ్లంలో ఉపదేశించారు. అడివిలో కూడా ఆంగ్లమేనా ఇక నా తెలుగెక్కడ తల్లీ? అని తడుముకున్నాను, మదనపడ్డాను. వాది, ప్రతివాది, సాక్షులు అంతా తెలుగులో చెబుతున్నారు. వాళ్ళు చెప్పింది చెప్పినట్లు వాంగ్మూలం టైపు చేయమంటే "తెలుగు టైపు మిషన్ లేదు, అయినా అది కష్టం, మీరు ఇంగ్లీషులోకి మార్చి చెప్పండి



కొడతాం" అని సిబ్బంది ఇబ్బంది పడ్డారు. శక్తిచాలనివాడు సాధుత్వం వహించినట్లుగా బహుశా తెలుగును అభిమానించే న్యాయమూర్తులంతా ఇటువంటి ఇబ్బందుల్ని నెగ్గకు రాలేక మౌనం దాల్చారని స్వానుభవం మీద అర్థం అయ్యింది.

కంప్యూటర్లొచ్చాయి, కోర్టులో తెలుగు సాఫ్ట్‌వేర్ వాడుకోవచ్చుగదా అని కొందరు ఉచిత సలహాపడేశారు. నిజమే గదా అని కంప్యూటర్ అడిగాం. ఇస్తామన్నారు అయితే దానికి ఇంగ్లీష్ కీబోర్డే ఉంటుంది. ఇంగ్లీష్‌లో కొడితే తెలుగు అక్షరాలు ప్రత్యక్షమవుతా యన్నారు. మాడుమీద కొడితే మోకాలు పగిలినట్లు ఈ బాధ మనకెందుకు తెలుగు మాటల్నే ఇంగ్లీషులో కొడదాం తేలికగా పనైపోతుంది annaru kondaru అసలు విషయం అర్థంకాకుండా పోతుంది annaru in kondaru ఇలాంటి తీర్పులు ఎవరు ఒప్పుకొంటారండీ అని ఇంకొంత మంది ఆక్రోశించారు. వత్తులు గుణింతాలతో పడిలేచి చచ్చేకంటే, యంత్రానికి అనువైన ఆంగ్లాక్షరాలతో పనిచేసుకోవచ్చు గదా అప్పుడు మన తెలుగును ఇంగ్లీషొచ్చినోళ్ళంతా చదువుతారు, తద్వారా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఇంగ్లీష్ సౌలభ్యాలన్నీ మనం కొట్టేయవచ్చు అన్నారింకొందరు అయ్యవారిని చెయ్యబోతే కోతి అయినట్టవు తుందేమోనని ఆచర్చ అంతటితో ఆపాము.

ఇంతకీ తెలుగుకు వైభవం తేవటానికి ప్రభుత్వం నడుం బిగించిదనే వార్తలు, అధికారభాషా సంఘం అధ్యక్షులు పరుచూరి గోపాలకృష్ణ, ప్రజల భాషకు పట్టం కట్టడానికి పలుచర్యలు తీసుకుంటామని ప్రకటించటం సంతోషాన్ని కలిగిస్తున్నాయి. నా తల్లి నా కందం, నా భాష నాకానందం" అంటాడు గురుకుల మిత్రా. "ఈనాటి కోర్టులు పరాయివి, ఊరిలో న్యాయం ఊరిలోనే జరగాలి" అనే వ్యాసంలో (వార్త 8-7-2003) ఆయన ఇలా అంటాడు. "ఉదయం కేసు వేస్తే సాయంత్రానికి న్యాయం ఒనగూడుతుందనే పద్ధతిని ప్రజాకోర్టుల నుండి ఈ ప్రజాస్వామ్యం నేర్చుకోవాలి. ఇప్పటి పంచాయితీలకు కోర్టు అధికారాలు కూడా ఇస్తే అక్కడే ఒక సారి కాకపోతే రెండోసారి లేక మూడోసారి కూడా కేసును తడివి తడివి విమర్శిస్తే సరిపోతుందేమో చూసుకోవాలి. ఎక్కడి ప్రజల సమక్షంలో అక్కడే తీర్పు జరిగితే ఆ కోర్టు గొప్పదవుతుంది."

ఎన్టీరామారావుగారు న్యాయ పంచాయితీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. అవి వస్తే ప్రజల భాషలో తీర్పులొస్తాయి. పరాయి ప్లీడర్లు, పరాయిభాష, పరాయి ప్రాంతం లాంటి సమస్యలు ఉండవు. ఏ భాషలో న్యాయస్థానం తీర్పులిస్తుందో అదే నిజమైన అధికార భాష. తెలుగుకు ఆ స్థాయి రావాలి అని నాఆకాంక్ష! "సముద్రాల అవతలి

నుంచి వచ్చిన ఇంగ్లీషు ప్రభావంతో తెలుగు తెల్లబోతోంది. ఆధునికులు మాట్లాడే నాలుగు ముక్కల తెలుగులో మూడుమాటలు ఇంగ్లీషువే ఉంటున్నాయి. తెలుగు ఇంగ్లీషు కలవ్వేమో అని కొందరికి డౌటేహం కానీ అటువంటి సందేహాలు అవసరం లేదని ఇప్పటి తెలుగు రుజువు చేసింది. అందువల్లే 'అతను అదో టైపు' 'నీ కంత సీన్ లేదులే' వంటి తరచూ వినపడే మాటలు అచ్చ తెలుగులానే అనిపిస్తున్నాయి ఇంగ్లీషు మాటలతో చక్కగా కలిసి పోయి కొత్తరకం "తెల్గిష్" భాష తయారయింది. ప్రస్తుతం "తెల్గిష్" వీరవిహారం చేస్తోంది.(ఈనాడు సంపాదకీయం 20.7.2003)

విశృంఖలమైన భాషను ఎవరూ ఆపలేరు. జనం నాలుకలపై నాట్యమాడే భాషే అధికార భాష కూడా. అయితే వారి భాషలోనే సమస్త పాలనా వ్యవహారాలూ జరిగితే, ఆ ప్రజలు సుఖపడతారు. ప్రాకృతం, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు మొదలైన భాషల నుండి ఎన్నో పదాలు మన తెలుగులో కలిసిపోయి వందల ఏళ్ళ నుండి మన వాడుకలో మన పదాలే అయిపోయాయి. వాటిని మన నిఘంటువులో చేర్చి మన భాషను శక్తివంతం చెయ్యాలి. ప్రజలు విరివిగా మాట్లాడే "మిశ్రమ భాషే" అందరికీ అర్థమై పాలకభాషగా చక్కగా రాణిస్తుందేమో! ఉర్దూ అలాంటిదే గదా!

**(గీటురాయి 8-8-2003)**

## నామాటలు నాకే రావటం లేదేమిటి?

నేనెవరిని? నా జన్మభూమి ఏది? నా మాతృభాష ఏమిటి? నేను పుట్టి పెరిగిన ఊళ్ళో మాట్లాడిన భాష, ఊపిరి తీసుకున్న శ్వాసలేవి? నా బాల్యంలో నేను నా మిత్రులతో ముచ్చటించిన మాటలేవి? అన్నీ ఏమైపోయినై? నాభాషకు నేనే ఎంతగా పరాయి వాణ్ణయ్యాను? జన్మనిచ్చిన తల్లితో సంభాషించి, కడుపు గట్టుకుని సాది సంరక్షించిన తండ్రితో ముచ్చటించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి, మిత్రబృందంతో అలవోకగా సల్లాపించిన నా సమస్తపదజాలం ఎక్కడ మరుగున పడింది? తొక్కు పలుకుల నుండి, నాకు ఊహ తెలిసిన నాటి నుండి నాలో ఒక అవిభాజ్య అంగమైన నామాట ఇవాళ నా నోటే ఇంతగా తత్తరపడుతూ తడబడుతున్నదెందుకు?

**-నలిమెల భాస్కర్, తెలంగాణా పదకోశం, 2003.**



# తెలుగు రెండవ జాతీయ అధికార భాష కావాలి

25-7-2003 న పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు గారిని కలిశాను. ఆయన కోర్కెకు స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు తెలుగుకు జాతీయ అధికార భాష ప్రతిపత్తిని కల్పించవలసిందిగా ప్రధానికి వ్రాసిన లేఖను చూపించారు. "తెలుగుకు జాతీయ అధికార భాషార్హత లేదా?" అనే తన కరపత్రంలో "ఉక్కుమనిషికి పట్టాభి చురక" అనే అంశాన్ని ఇలా చదివి వినిపించారు.

"ఆంధ్రులు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆందోళన చేస్తున్న సమయంలో ఇప్పటి ఆంధ్రప్రాంతం సమిష్టి మద్రాసు రాష్ట్రంలో ఉండేది. అప్పుడు ఆంధ్రులను ఆంధ్రేతర ప్రాంతాల్లో 'మద్రాసీ' లని పిలిచేవారు. ఒకసారి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతున్నది. గాంధీజీ, పండిట్ నెహ్రూ, ఉక్కుమనిషి సర్దార్ పటేల్, ఆంధ్ర ప్రముఖుడు మహామేధావి డాక్టర్ పట్టాభి ప్రభృతులున్నారు. పట్టాభి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సమస్యను తీసుకువచ్చేసరికి పటేల్ ఏకసక్కెంగా పట్టాభీ! ఆంధ్రరాష్ట్రం ఆంధ్రరాష్ట్రం అని ఎప్పుడూ అంటుంటావు. అసలు నీ ఆంధ్రరాష్ట్రం ఎక్కడ ఉన్నదయ్యా? మీరు మద్రాసీలు కదా? అన్నారు. వెంటనే పట్టాభి తన జేబులోనుంచి అణాకాసు తీసి, 'సర్దార్‌జీ! ఈ అణాపైస 'ఒక అణా' అని అధికార భాషయిన ఇంగ్లీషులోను మన జాతీయ భాషయిన హిందీలోను, భారత దేశంలో అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే బెంగాలీలోను, ఆతర్వాత 'ఒక అణా' అని తెలుగులోను రాయబడి ఉంది. ఇది బ్రిటీష్ ప్రభుత్వం తయారుచేసిన నాణెం (అప్పటికి భారతదేశానికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదు.) మరి, దీనిపై మా తెలుగు భాష ఉంది. కానీ మీ గుజరాతీ ఎక్కడా లేదే? అని చురక వేశారు. పటేల్ నిరుత్తరుడు అయ్యారు. గాంధీజీ చిరునవ్వుతో చూస్తున్నారు! మహాత్మాగాంధీ మాతృభాష కూడా గుజరాతీ".

ఇండియాలో రెండవ పెద్ద భాష అయిన తెలుగును జాతీయ అధికార భాషగా చెయ్యాలని ముఖ్యమంత్రి కోరేలా చేసినందుకు తుర్లపాటిని అభినందించి, 1986 నుండి ఇప్పటివరకు తెలుగు భాషాభివృద్ధి కోసం నేను వ్రాసిన వ్యాసాల కాపీలను ఆయనకు అందజేశాను. అవన్నీ చూసి మీరు ముస్లిం అయ్యుండి తెలుగు భాష కోసం ఇన్నేళ్ళ పాటు ఇంత కృషి చేయటం ఆశ్చర్యంగా ఉంది. మీరు రాసిన వ్యాసాలు మాలాంటి తెలుగు భాషాభిమానులకు బైబిలు, కురాను, భగవద్గీత లాంటివి అన్నారు. అయ్యా,

నేను ముస్లిమునేగాని నా మాతృభాష తెలుగు అంటే ఆయన ఒక పట్టాన నమ్మలేకపోయారు. ముస్లిముల మాతృభాష ఉర్దూ మాత్రమేనని ఆంధ్రలో చాలా మంది అనుకొంటారు. నేను పాలకొల్లు ఎమ్మార్వోగా పని చేసేటప్పుడు హైదరాబాద్ నుండి ఒక ముస్లిం అధికారి వచ్చారు. పాలకొల్లు ఎమ్మెల్యే అల్లు సత్యనారాయణ మమ్మల్నిద్దర్నీ కలిపి. "ఇక మీరు ఉర్దూ భాషలో మాటాడుకోండి" అన్నారు. ఆ అధికారికి భాషొచ్చి నోరు తెరిస్తే నాకు భాషరాక నోరు తెరిచాను. నాకు ఉర్దూ రాదు బాబో అంటే ఇంగ్లీషులోకి మళ్ళాడు. ఉర్దూరాని సాయిబులు కూడా ఉంటారని ఎమ్మెల్యేగారికి తెలిసొచ్చింది. హైదరాబాదులో ఎన్నేళ్ళున్నా హైహై అంటం తప్ప ఉర్దూరాని వాళ్ళు ఎంతో మంది ఉన్నారు.

ఆకివీడులో రెండేళ్ళ క్రితం రంజాన్‌కి తెలుగు దేశం మండలాధ్యక్షుడు ఇఫ్తార్ విందిచ్చారు. ముస్లిములంతా అజాన్ ఇచ్చి నమాజు చేసుకొచ్చారు. అప్పటిదాకా వాళ్ళ నమాజును చూస్తూ హిందూ ప్రముఖులంతా కూర్చున్నారు. తరువాత విందు ఆరగించారు. అప్పుడు నేను మీరిచ్చిన అజాన్ అర్థం, మీరు చేసిన ప్రార్థన అర్థం తెలుగులో చెబితే తెలుగు వాళ్ళందరికీ అర్థమవుతుంది అన్నాను. అప్పుడొకాయన దాని అర్థం తెలుగులో చెప్పాడు. అది విన్న శాసనసభ్యుడు కలిదిండి రామచంద్రరాజు "ఇంత మంచి అర్థం ఉందా? మా గాయత్రీ మంత్రానికీ మీ అజాన్‌కీ తేడా ఏమీ లేదు, అల్లాహు అక్బర్ అంటే మీరు అక్బర్ చక్రవర్తిని తలుచుకుంటున్నారేమో అని ఇంతకాలం అనుకున్నాను" అన్నారు. అంతేగాకుండా ఆయన హాజరయిన ప్రతి జన్మభూమి సభలో "ముస్లిముల పిలుపుల్లో ప్రార్థనల్లో ఎన్నో మంచి విషయాలున్నాయి, వాటిని మనమంతా తెలుసుకోవాలి" అంటూ ఇదే అంశాన్ని ప్రజలకు తెలియజేశారు. రోజుకు అయిదు సార్లు మసీదు మైకుల్లో నుండి అందించే ప్రార్థనా పిలుపు ముస్లిమేతరులకు, ముస్లింలకు కూడా ఆర్థం కాకపోవటానికి కారణం అది అరబీ భాషలో మాత్రమే ఉండటం. దానికి తెలుగు అనువాదాన్ని ఇచ్చి అర్థాన్ని తెలుగులో కూడా చెబుతూ వచ్చినట్లయితే మసీదు చుట్టు ప్రక్కల ఉన్న తెలుగు సోదరులంతా విని స్పందించేవారు.

war against telugu@yahoogroups. com అనే ఒక తెలుగు వ్యతిరేక సంఘం ఇంటర్నెట్‌లో ఒక కథ ప్రచారం చేస్తోంది. " ఒక బావిలో రెండు కప్పలున్నాయి. ఒకటి తమిళం మాట్లాడేది. ఇంకోటి తెలుగు మాట్లాడేది. బావి మీదికి ఎక్కి బయటికి రావటం కోసం అవి పరస్పరం సహాయం చేసుకుంటూ, చివరికి వచ్చాక, తెలుగు కప్ప



తమిళ కప్ప మీద ఎక్కి బలంగా తమిళ కప్పను బావిలోకి నెడుతూ బయటికి దూకేసింది." తమిళులంతా తెలుగువాళ్ళ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆ సంఘం సదా సూచనలిస్తూ ఉంటుంది. మద్రాసు వెళ్ళిన తెలుగువాడు తమిళం నేర్చాడు, హైదరాబాదెళ్ళిన తెలుగువాడు ఉర్దూ నేర్చాడు, బళ్ళారి వెళ్ళిన తెలుగువాడు కన్నడం నేర్చాడు, ఢిల్లీ వెళ్ళిన తెలుగువాడు హిందీ నేర్చాడు, ఇంటింటా తెలుగువాడు ఇంగ్లీషు నేర్చాడు, క్రమేణా తెలుగును మరిచాడు. కానీ మరే భాషనూ తెలుగువాడు అణగద్రొక్కలేదు. పరభాషల పీడనలో తెలుగు అణిగిపోయిందే కానీ, అధికారంలోకి రాలేక పోయింది. తెలుగు భాషను జాతీయ భాషగా గుర్తించేవరకు మన పోరు సాగాలి.

"తెలుగును జాతీయ భాషగా గుర్తించాలని తెలుగు దేశం పార్టీ ఎం.పి. కంభంపాటి రామ్మోహన రావు రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శ్రీకృష్ణదేవరాయలతో పాటు అనేక మంది ప్రముఖులు తెలుగును కీర్తించారని, సుబ్రమణ్యభారతి తెలుగు తీయదనాన్ని శ్లాఘిస్తూ 'సుందర తెలుగు'గా అభివర్ణించారని తెలిపారు. సి.పి. బ్రౌన్, బిషప్ కాల్డ్‌వెల్ తదితర విదేశీయులు తెలుగును అభిమానించారని, జాతీయ భాషగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని అర్హతలు తెలుగుకు ఉన్నాయని బ్రిటన్ జీవశాస్త్రవేత్త ప్రొఫెసర్ జె.బి.యస్. హాల్‌డేన్ తెలిపారన్నారు. తెలుగుకు జాతీయ భాష హోదా కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత నెలలో ప్రధాన మంత్రికి లేఖ రాశారని తెలిపారు." **(ఈనాడు 5-8-2003).**

ఇవన్నీ తుర్లపాటి కరపత్రంలో ఉన్నవే, అందరూ అడపాదడపా అనుకుంటూ ఉండేవే. కాకపోతే రాజకీయ నాయకుల నోటి నుంచి వెలువడితే శాసనాలు తయారవు తాయి. శాసనం ద్వారా భాష చెల్లుబాటవుతుంది. అది ప్రజల భాషలోఉంటే మరీ సంతృప్తిని, సుఖాన్నీ ఇస్తుంది.

## తెలుగు జాతీయ అధికారభాష అయితే లాభమేమిటి?

1. తెలుగు జాతికి గుర్తింపు, మనలో ఎన్నో కులాలు మతాలు ఉన్నాయి. అవి మనల్ని విడదీస్తున్నాయి. ఈ భాష మనల్ని కలుపుతుంది. ఈ భాష మాట్లాడేవాళ్ళ సంఖ్యనుబట్టి, జనబలాన్ని బట్టి పార్లమెంటులో మన గౌరవం మనకు దక్కుతుంది. హిందీతో పాటు తెలుగును కూడా ఇతర భాషలవాళ్ళు నేర్చుకోవాల్సి వస్తుంది.
2. పార్లమెంటులో హిందీ వాళ్ళలాగా మనం కూడా తెలుగులో మాట్లాడవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులన్నీ తెలుగులో పొందవచ్చు. కేంద్రంతో

ఉత్తర ప్రత్యుత్తరా లన్నీ తెలుగులో నడుపవచ్చు. చట్టాలన్నీ తెలుగులోకి మార్చబడతాయి. తెలుగులో తీర్పులొస్తాయి. తెలుగులో ఇచ్చే అర్జీలు ఢిల్లీలో కూడా చెల్లుతాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారికి కొండంత అండ, గౌరవం హిందీ వాళ్ళతో పాటు సమానంగా లభిస్తాయి.

3. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్లలో బోర్డుల మీద తెలుగులో కూడా పేర్లు రాస్తారు. ఈ రోజున హిందీ భాష వల్ల హిందీ వాళ్ళకు ఏయే ప్రయోజనాలు ఒనగూడాయో అవన్నీ తెలుగు వాళ్ళు పొందవచ్చు. తెలుగు నాయకులు నడుం బిగించాలి.

**(గీటురాయి 22-8-2003)**

# పది సూత్రాల ప్రణాళిక

ప్రభుత్వం ముందుండవలసిన ప్రధాన లక్ష్యం తెలుగు భాషా సాహిత్య భవన నిర్మాణం. అందులో జరగాల్సిన పనులు.

1. తెలుగు భాషా, సాహిత్య, చరిత్ర, సంస్కృతుల మంత్రిత్వ శాఖను రూపొందించాలి.
2. పరిపాలనా రంగంలోని లావాదేవీలు అన్నీ తెలుగు భాషలోనే జరగాలి.
3. ఒకటవ తరగతి నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు అన్ని కోర్సుల్లోను తెలుగు భాష, సాహిత్య పాఠ్యగ్రంథాలు విధిగా ఉండాలి. అందులో నిష్ణాతులైన వారికే సర్టిఫికెట్లు ఇవ్వాలి.
4. తెలుగు భాషకు సంబంధించి 100 పదాల నుంచి 20 వేల పదాల వరకు ఆయా క్రమాల్లో నిఘంటువులు ప్రచురించాలి. పదము, పద వివరణ ప్రయోగం ఉండాలి.
5. ఎలక్ట్రానిక్ మీడియాలోను తెలుగు భాష సాహిత్య చరిత్రలను ప్రజలకు బోధించాలి.
6. తెలుగు భాషావేత్తల పేరు రాష్ట్రమంతటా వీధులకు పెట్టాలి. వారి సూక్తులు రాయించాలి.
7. బృహత్తర తెలుగు నిఘంటువు నిర్మాణానికి కనీసం 20 మందితో ఒక ప్రణాళికను రూపొందించాలి.
8. తెలుగు భాష అభివృద్ధికి సంబంధించిన పత్రికను ప్రభుత్వమే స్వయంగా నడపాలి.
9. తెలుగు కవిత్వం, పాట, నాటకం, కథ, నవల, కళారూపాలను ప్రాథమిక విద్యస్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయివరకు కోర్సులు పెట్టి అభివృద్ధి చేయాలి.
10. తెలుగు భాషా చరిత్రని ఇతర భాషలతో పోల్చి తులనాత్మక పద్ధతిలో అభివృద్ధి చేయాలి.

(కత్తి పద్మారావు, నడుస్తున్న చరిత్ర, జూన్ 2004)



# అమెరికా పోయే నలుగురికోసం అంతా ఇంగ్లీషే చదవాలా?

"నియంతకుండే అధికారాలు నాకుంటే, విదేశీ భాషల ద్వారా విద్యా బోధనను ఆపేసేవాడినే. మాతృభాషల్లో విద్యనేర్పని పంతుళ్ళను, ప్రొఫెసర్లను ఉద్యోగాల్లో నుండి ఊడబీకే వాడిని. ఈ చెడుగుకు తీవ్ర చికిత్స అవసరం. బోధనా మాధ్యమం ప్రాంతీయ భాషల్లోకి తక్షణం మారాలి. రోజురోజుకీ పేరుకుపోతున్న ఈ అన్యాయం కంటే కొంతకాలం కల్లోలం జరగటాన్నే నేను కోరుకుంటాను" అని మహాత్మాగాంధీ "హరిజన్" పత్రిక 9-7-1938లో పేర్కొన్నారు. తిలక్, రాజేంద్రప్రసాద్, నెహ్రూ, నేతాజీ, పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి, టాగోర్ లాంటి వాళ్ళంతా ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన జరగాలని కోరారు. 1948లో రాధా కృష్ణన్ కమిషన్ ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. కొఠారీ కమిషన్ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించింది.

## ఏదిగొప్పభాష?

ప్రజలకోసం, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాస్వామ్య ప్రభుత్వంలో, పాలనా యంత్రాంగానిదొక భాష, ప్రజలదొక భాష కావటం మన ప్రజల దురదృష్టం. అధికారులకీ ప్రజలకీ మధ్య పరాయి భాష అడ్డు తెరలాగా ఉంది. ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తున్నది. పాలకుల్లో అహంకారం, అవినీతి, ఇంగ్లీషులో ప్రజల్ని హడలగొట్టడం, పెరిగి పోయాయి. ప్రజలకు అధికారులకు మధ్య దూరం పెరిగింది. ఇప్పుడు పరాయి భాషను తొలగించలేక, మాతృభాషను మరుగునపడేసి, పరాయి భాషనే ప్రజలందరినీ నేర్చుకోమంటున్నారు. "అమెరికా పోయే నలుగురికోసం అంతా ఇంగ్లీషు చదవాలా?" అని కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్య (అధికార భాషా సంఘం మొదటి అధ్యక్షులు) బాధపడేవారు. ఆంగ్లభాషా వేత్త మెకాలే "మేము వెళ్ళి పోయినా మా భాష మిమ్మల్ని పరిపాలిస్తుంది" అన్నాడంటే, ఇంగ్లీషుకు ఈ దేశం ఎంత వశమైపోయిందో దేశీయ భాషలు ఎంతగా పరాధీనమై పోయాయో ఊహించుకోవచ్చు.

వాసమూర్తి " భాషా సమస్య (1968 ) " అనే పుస్తకంలో ఇలా అన్నారు: "..ప్రపంచంలో ఏ భాషా భగవంతుని నోటినుంచి ఊడిపడ్డట్లు పరిపూర్ణమై గొప్పదై పుట్టలేదు. ఏ భాషా నీచమై జన్మించలేదు. ఏ భాషైనా ఎంతైనా వికసించవచ్చు. ఎంతైనా

పోవచ్చు. అంతా ఆ భాషలు వాడే ప్రజలపైనా పరిస్థితులపైనా అవకాశాలను బట్టి ఆధారపడి ఉంటుంది. అంతేకానీ కొన్ని భాషలు గొప్పవి. కొన్ని వెనుక బడ్డవి. అందుచేత అవి గొప్ప భాషలకు దాస్యం చేయాలని పరోక్షంగానే అయినా చెప్పబూనడం భాషారంగంలో నాజీలుగా వ్యవహరించడమే కాగలదు. ఇంగ్లీషు పుట్టడమే గొప్ప భాషగా పుట్టలేదు. స్కాండినేవియన్, ఫ్రెంచి, లాటిన్, గ్రీకు భాషలనుంచి అది అపారశబ్ద సముదాయం, మంచి మార్పులూ తెచ్చుకుంది. మన భాషలు కూడా తగిన అవకాశం ఇచ్చి, విరివిగా వాడుక చేస్తే, శక్తివంతమైన వైజ్ఞానిక భాషలుగా రూపొందుతాయి."

## మన రాజ్యాంగం ఏంచెబుతోంది?

346 వ నిబంధన – కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ రాష్ట్రాల మధ్య ఆంగ్లభాష వాడకంలో ఉండాలి. రెండు అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు అంగీకరిస్తే హిందీ వాడుకోవచ్చు.

347వ నిబంధన– ఒక రాష్ట్రంలో తాము వాడుతున్న భాషను అధికార భాషగా గుర్తించాలని రాష్ట్రపతికి విన్నవిస్తే రాష్ట్రపతి ఆదేశాలివ్వవచ్చు.

348 వ నిబంధన – సుప్రీంకోర్టు, రాష్ట్రహైకోర్టులలో, పార్లమెంట్ బిల్లులు, రాజ్యాంగసవరణలు, రాష్ట్రపతి గవర్నర్లు జారీచేసే చట్టాలు ఇంగ్లీషులో ఉండాలి.

348 (2)వ నిబంధన – ఒక రాష్ట్రం రాష్ట్రపతి అనుమతిపొంది హిందీని రాష్ట్రభాషగానే కాకుండా హైకోర్టులో కూడా హిందీ వాడటానికి నిర్ణయం తీసుకోవచ్చు.

349 వ నిబంధన – రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మొదటి 15 సంవత్సరాల్లో అధికార భాష సవరణ ప్రతిపాదనలు చేయరాదు.

350 వ నిబంధన – దేశంలోని ఏ వ్యక్తి అయినా కేంద్ర, రాష్ట్ర అధికారులకు ఏ భాషలోనైనా ధరఖాస్తు పెట్టుకోవచ్చు.

348, 349 వ నిబంధనలవల్ల 1965 వరకు ఇంగ్లీషు అధికారభాషగా దేశంలో వేళ్ళూనుకు పోయింది. దాన్ని తొలగించటానికి, ఎవరి తరం కాలేదు. 348 (2)వ నిబంధన తెలుగు భాషకు కూడా వర్తింపజేయవలసిందిగా మన రాష్ట్రం కేంద్రాన్ని కోరాలి. అప్పుడు మన రాష్ట్ర హైకోర్టులో తెలుగు ప్రవేశిస్తుంది.



# లిపి సంస్కరణ తప్పదు

బ్రహ్మ ఏర్పరచిన లిపి 'బ్రహ్మలిపి' అనుకుంటున్నారేమోగాని మనవాళ్ళు లిపి సంస్కరణకు భయపడుతున్నారు. సవరభాషకు గిడుగు లిపిని తయారు చేయటం మన కళ్ళముందే జరిగింది. భాష వాక్కు రూపంలో ధ్వనిస్తే, ఆ ధ్వనికి సంకేతమే లిపి, ఈ లిపి మనిషి తన సౌలభ్యంకోసం తయారు చేసుకున్నాడు. మోషేకు పది ఆజ్ఞలు దేవుడు రాతి పలకల మీద హెబ్రూ లిపిలో చెక్కి ఇచ్చాడట. ఎందుకంటే మోషే భాష హెబ్రూగనుక. మనమంతా కలిసి ఈ శబ్దాన్ని ఈ అక్షరంతో రాయాలి. ఇలా రాయాలి అని నిర్ధారించుకుంటే అదే మన లిపిగా నిలబడుతుంది. ప్రపంచంలో వేలాది బాషలకు లిపి లేదు. ఆ భాషలు రానురాను నాశనమై పోతున్నాయి. కేవలం 26 అక్షరాలతో వత్తులు, గుణింతాలను కూడా కల్పించుకొని సాఫీగా యంత్రాల మీద సాగిపోతున్న ఇంగ్లీష్ తరహాలో తెలుగు లిపిని కూడా సంస్కరించుకోవాలి.

భూపతి నారాయణమూర్తి 'భోధన, పాలన జనజీవన రంగాలలో తెలుగు' (1998) అనే పుస్తకంలో ఇలా అంటారు: మన లిపిలో ఉపయోగం లేని అక్షరాలు మూడోవంతు వరకు ఉన్నాయి. వాటిని రద్దుచెయ్యాలి. ఉ,ఖ,ఘు,ఈ,ఝు,థ,ణ వగైరా అక్షరాలను తీసి వేయాల్సి ఉంది. చైనా 3 సార్లు తన లిపిని సంస్కరించింది. శాస్త్ర సాంకేతిక పరికరాలకు అనుకూలంగా లిపిని తయారు చేసుకున్నారు. అలాగే తెలుగు లిపిని కూడా సంస్కరించాలి. అప్పుడే అధికార భాషగా తెలుగు రాణించగలదు. లిపిని సంస్కరించటం వల్ల అత్యధిక సంఖ్యలో ఉన్న నిరక్షరాస్యుల్ని కూడా అక్షరాస్యులుగా చేయటం తేలిక అవుతుంది." ఇప్పటికే మనం ఋ,ఋూ,c,ఱ,చ,జ,లాంటి అక్షరాలను వదిలించుకున్నాము. "అక్షర దీక్ష" వాచకాల్లో కేవలం 30 అక్షరాలే ఉపయోగించారు.

బూదరాజు రాధాకృష్ణ "భాషాశాస్త్ర వ్యాసాలు" (1990) అనే పుస్తకంలో ఇలా అన్నారు. "నిజానికి పారిశ్రామిక విప్లవం, సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలైన రోజుల్లో యూరప్‌లోని దేశాలు లాటిన్, గ్రీకు భాషల ప్రభావం నుంచి వేర్పడి దేశభాషల్లో సమస్త వ్యవహారాలు జరుపుకోవటం మొదలుపెట్టినప్పుడు ఇప్పుడు మనం పడుతున్న కష్టాలన్నీ తామూ అనుభవించాయి. అన్ని సమస్యలూ మనకే రాలేదు. ప్రయత్నలోపం వల్ల, భాషాస్వభావ పరిజ్ఞాన లోపం వల్ల, మాతృభాషాభిమాన లోపంవల్ల, తెచ్చిపెట్టుకున్న చిక్కులే మనకెక్కువ. ఉపయోగం వల్ల భాష పెరుగుతుంది. తెలుగును అధికార భాషగా వినియోగించినప్పుడు అదే సహజంగా అభివృద్ధవుతుంది."

# ఇంకేంచేస్తే బాగుంటుంది?

1. ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియంలో చదివిన వారికి ఇంజనీరింగ్, మెడిసిన్, బి.ఇడి. కోర్సుల్లో రిజర్వేషన్, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇవ్వాలి. కర్నాటకలో 5% రిజర్వేషన్ ఇస్తున్నారు.
2. తెలుగు మీడియంలో చదివిన వారికి ఉద్యోగ పోటీపరీక్షల్లో గతంలోలాగా 5% వెయిటేజి మార్కులు ఇవ్వాలి.
3. వృత్తివిద్యా కోర్సులన్నింటి సిలబస్ (ఇంజనీరింగ్, మెడికల్, లీగల్, బి.ఇడి తదితరా)లను తెలుగు అకాడమీ చేత పాఠ్యపుస్తకాలుగా తెలుగులో ముద్రింప చేయాలి.
4. తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు రాయగల ఐ.ఎ.యస్. ఐ.పి.యస్ అధికారుల్ని, గవర్నర్లును మాత్రమే మన రాష్ట్రంలో నియమించేలా కేంద్రాన్ని కోరాలి.
5. కూడిక, తీసివేత లాంటి తెలుగు పదాలకు బదులు సంకలనం, వ్యవకలనం లాంటి భయంకరమైన సంస్కృత పదాలను వాడి తెలుగు మీడియం అంటే పిల్లలు భయపడేలా చేశారు. పిల్లల పుస్తకాలు వాడుక తెలుగుతో చెయ్యాలి.
6. కేవలం తెలుగు మీడియంలో మాత్రమే చదివిన వాడికి ఇంగ్లీషురాక పోయినా ఎటువంటి శాస్త్ర సాంకేతిక రంగంలో నయినా ఉద్యోగం గ్యారంటీగా వస్తుందనే వాతావరణం కల్పించాలి. అంటే ఇంగ్లీషు రాకపోయినా కలెక్టర్, డాక్టర్, ఇంజనీరు కాగలిగే విధంగా మన విద్యా వ్యవస్థ మారాలి! అప్పుడు జనం తండోపతండాలుగా తెలుగులో చదువుతారు.
7. పరిపాలక గ్రంథాలు అంటే కోడ్లు, మాన్యువల్‌లు, లాంటివన్నీ తెలుగులో ప్రచురించి అన్ని కార్యాలయాలకు పంపాలి. సర్వీస్‌కమిషన్ పోటీ పరీక్షలు, శాఖాపరమైన పరీక్షలు తెలుగులో నిర్వహించాలి.
8. తెలుగు విశ్వవిద్యాలయం, అధికార భాషా సంఘం, తెలుగు అకాడమీ, అన్ని విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలు కలసికట్టుగా కృషిచేసి ఏయేటికాయేడు అవి తెలుగు భాషాభివృద్ధి కోసం ఏంచేశాయో, ఏం సాధించాయో ప్రగతి నివేదికలను తెలుగు ప్రజలకు బయటపెట్టాలి. ఈ సంస్థలన్నీ ప్రజల నుండి సూచనలు తీసుకోవాలి.
9. లిపి సంస్కరణ యంత్రాలకనుగుణంగా జరగాలి. కంప్యూటర్‌లలో వాడకానికి ప్రస్తుతం తెలుగు సాఫ్ట్‌వేర్‌లో ఏయే సమస్యలు తలెత్తుతున్నాయో వాటిని నిశితంగా, పరిశీలించి నిరంతరం వాటిని బాగుచేసే నిపుణుల్ని నియమించాలి. పరిశోధకుల్ని ప్రోత్సహించాలి.



అప్పటి అధికార భాషా సంఘం కార్యదర్శి సి.ధర్మారావు గారు వ్రాసిన "అధికార భాష తీరు తెన్నులు" అనే పుస్తకానికి మున్నుడి రాస్తూ 25-3-1989న నండూరి రామకృష్ణమాచార్య "తెలుగు జగన్నాథ రథం కదిలింది" అన్నారు. ఎన్టీరామారావు గారి తెలుగు ఆవేశాన్ని, ఆదేశాలను చూసి ఆయన ఆనందంతో ఆమాట అని ఉంటారు. కానీ 14 ఏళ్ళ తరువాత ఇప్పుడు చూస్తే ఆ తెలుగు జగన్నాథ రథం వాస్తవానికి వెనక్కి వెనక్కి సాగి అక్కడే కూలబడిపోయింది. జగన్నాథుని రథం ప్రతి ఏటా కొత్తది కడుతుంటారు. అయితే కూలబడిన ఈ తెలుగు రథాన్ని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. భాషను పాడుచేసుకోవడం, మళ్ళీ బాగుచేసుకోవాలన్న అలోచనే లేకపోవటం, అరకొరగానైనా చేపట్టిన పనిని పూర్తి చేసుకోలేక చతికిల పడటం వల్ల, ఆంధ్రులు ఆరంభ శూరులు అన్న నానుడిని సార్థకం చేసుకుంటున్నాం.

# షెడ్యూల్‌లో ఉన్న భాషలు - 18

| క్రమ సంఖ్య | భాషపేరు | మాట్లాడేవారి సంఖ్య (లక్షలలో) (జమ్మూ కాశ్మీర్‌ను మినహాయించి) | | |
|---|---|---|---|---|
| | | 1991 | శాతం | 2001 |
| 1 | హిందీ | 3372 | 39.85 | |
| 2 | బెంగాలీ | 695 | 8.22 | |
| 3 | తెలుగు | 660 | 7.80 | |
| 4 | మరాఠీ | 624 | 7.38 | |
| 5 | తమిళం | 530 | 6.26 | |
| 6 | ఉర్దూ | 434 | 5.13 | |
| 7 | గుజరాతీ | 406 | 4.81 | |
| 8 | కన్నడ | 327 | 3.87 | |
| 9 | మళయాళం | 304 | 3.59 | |
| 10 | ఒరియా | 280 | 3.32 | |
| 11 | పంజాబీ | 233 | 2.76 | |

| | | | | |
|---|---|---|---|---|
| 12 | అస్సామీ | 130 | 1.55 | |
| 13 | కాశ్మీరి | 31 | 0.46 | |
| 14 | సింధీ | 21 | 0.25 | |
| 15 | నేపాలీ | 20 | 0.25 | |
| 16 | కొంకణి | 17 | 0.21 | |
| 17 | మణిపురి | 13 | 0.15 | |
| 18 | సంస్కృతం | 0.49 | 0.01 | |

అంటే మొత్తం దేశజనాభా 1991లో 8463 లక్షలైతే ఈ 18 భాషలు మాట్లాడేవారు 8097 లక్షలు అంటే 96% ఇంకా 365లక్షల మంది షెడ్యూల్‌లో చేరని భాషలు మాట్లాడుతున్నారన్న మాట

# షెడ్యూల్లో చేరని భాషలు - 96

సంస్కృతం కంటే ఎక్కువ మందిమాట్లాడే భాషలు - 45 వాటి వివరాలు:

| క్రమ సంఖ్య | బాషపేరు | మాట్లాడేవారి సంఖ్య (వేలలో) | |
|---|---|---|---|
| | | 1991 | 2001 |
| 1 | ఆది | 158 | |
| 2 | అవో | 172 | |
| 3 | అంగామి | 97 | |
| 4 | బివి | 5572 | |
| 5 | బోటియా | 55 | |
| 6 | బిష్ణుపూరియా | 59 | |
| 7 | బోడో | 1222 | |
| 8 | కూర్గి కొడగు | 97 | |
| 9 | దిమాసా | 88 | |
| 10 | డోగ్రి | 90 | |
| 11 | ఇంగ్లీషు | 179 | |
| 12 | గారో | 676 | |
| 13 | గోండి | 2125 | |



| | | | |
|---|---|---|---|
| 14 | హలబి | 534 | |
| 15 | హ్మార్ | 65 | |
| 16 | హో | 949 | |
| 17 | కబుయి | 69 | |
| 18 | కర్బి/మిక్రి | 366 | |
| 19 | కెందేషి | 974 | |
| 20 | కారియా | 226 | |
| 21 | కాసా | 912 | |
| 22 | కోందు | 221 | |
| 23 | కిన్నౌరి | 62 | |
| 24 | కిసాన్ | 162 | |
| 25 | కొలిమి | 98 | |
| 26 | కుకి | 58 | |
| 27 | కురుక / బరవ | 1427 | |
| 28 | లోతా | 85 | |
| 29 | లుషాయి / బరవ | 539 | |
| 30 | మాల్టో | 108 | |
| 31 | మావో | 78 | |
| 32 | మిరి / మిషింగ్ | 391 | |
| 33 | ముండా | 414 | |
| 34 | ముందరి | 816 | |
| 35 | నిస్సి / దఫ్ల | 173 | |
| 36 | పోము | 65 | |
| 37 | రబా | 139 | |
| 38 | సంతాలి | 5216 | |
| 39 | సవర | 273 | |
| 40 | సేమ | 166 | |
| 41 | తంగకుల్ | 102 | |
| 42 | తాడో | 108 | |
| 43 | టిబెటిన్ | 69 | |
| 44 | త్రిపురి | 694 | |
| 45 | తుళు | 1552 | |

బిలి, సంతాలి, గోండు, తుళు, కురుక, బోడో, లాంటి పది లక్షల పై బడిన జనం మాట్లాడే భాషల్ని షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతున్నారు. దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్ అన్నారు కదా!

| తెలుగు జనం | 1991 | 2001 |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 56375755 | |
| తమిళనాడు | 3975561 | |
| కర్నాటక | 3325062 | |
| ఒరిస్సా | 502102 | |
| పాండిచేరి | 34799 | |
| మిగతా రాష్ట్రాలలో | 6,42,13,279<br>18,04,336 | |
| మొత్తం దేశంలో | 6,60,17,615 | |

( గీటురాయి 26-09-2003 )

## తెలుగు భాషోద్యమ సమాఖ్య విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారికి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈ క్రింది విజ్ఞప్తిని అందజేసింది. 15 కోట్ల మందిమి మన తెలుగు జాతి. ప్రపంచంలో మొదటి 10 పెద్ద భాషల్లో తెలుగు ఒకటి. వివరాలు:

| రాష్ట్రం | జనాభా కోట్లలో | శాతం |
|---|---|---|
| 1.ఆంధ్రప్రదేశ్ | 7.5 | 88 |
| 2.తమిళనాడు | 2.8 | 42 |
| 3.కర్నాటక | 1.7 | 33 |
| 4.మహారాష్ట్ర | 1.5 | 16 |
| 5.ఒరిస్సా | 0.8 | 22 |
| 6.కేరళ, పాండిచేరి, ఛత్తీస్‌గఢ్ | 0.6 | - |
| 7. మిగతా దేశంలో | 0.1 | - |
| మొత్తం | 15 కోట్లు | .... |

తెలుగు ప్రాథమిక విద్యార్థులు రాష్ట్రంలో ఇప్పటికే 20 శాతం పైగా తెలుగు చదవటమే మానేశారు. ఇది జాతి మనుగడకే ప్రమాద సూచికగా యు.ఎన్.వో. సంస్థ హెచ్చరిస్తున్నది. తెలుగు(మాతృభాష)ను 5వ తరగతి వరకు అన్ని రకాల స్కూళ్లలోను మీడియం చెయ్యాలి. ఇంగ్లీషును రెండో భాషగా బోధించాలి. మన రాష్ట్రంలో "ప్రాథమిక విద్య, భాషా సంస్కృతులు" పేర ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలి. విద్య, భాష పట్ల ఆసక్తి ఉన్న మంత్రి ఈ శాఖను నిర్వహించాలి.

**(నడుస్తున్న చరిత్ర, జూన్ 2004)**



# తెలుగు నిఘంటువులో చేరాల్సిన ఇంగ్లీషు పదాలు !

నిఘంటువులలోని పదాల సంఖ్య పెరిగే కొద్దీ ఆ భాష శక్తివంతమవుతుంది. పరాయి భాషలకు చెందిన పదాలనే వ్యతిరేకతతో ప్రజల్లో పాతుకుపోయిన పదాలను కూడా మనం నిఘంటువులలో చేర్చుకోకపోయినందు వలన మన తెలుగు నిఘంటువు చిక్కిపోయింది. ఇంగ్లీషు నిఘంటువు మాత్రం ఏటేటా కొత్తపదాలతో బలిసిపోతోంది. ఉదాహరణకు Penis, Vegina, anus, cunt, ass, లాంటి పదాలను కూడా ఇంగ్లీషు వాళ్ళు సిగ్గుపడకుండా డిక్షనరీలో పొందుపరచారు. కానీ మన తెలుగులో వాటికి ధీటైన పదాలు పల్లెప్రజల్లో వాడుకలో ఉన్నా మన నిఘంటువులో ఆ పదాలు చోటుచేసుకోలేదు. ఒకవేళ పై ఇంగ్లీషు పదాలకు అర్థాలు చెప్పాలన్నా సంస్కృత పదాలు వాడుతారుగానీ, తెలుగు పదాలు వాడరు. వాడటం అవమానకరంగా భావిస్తారు. తెలుగు ప్రజలు పుట్టించినవి, ఎంత నీచమని మనం అనుకొనే పదాలైనా నిఘంటువులో చేరాలి. మన మాటల్ని పోగొట్టుకో కూడదు. అలాగే సంస్కృతపదం అర్థంకాకపోయినా మన తెలుగు పదంలాగానే భావించి ఆదరిస్తాం. వేలాది ఉర్దూ, ఇంగ్లీషు పదాలు మన తెలుగు ప్రజల వాడుకలోకి వచ్చాయి.

గతంలో తెలుగువారు పలికే ఉర్దూ పదాలను గీటురాయిలో (27-1-89, 20-12-96) ప్రచురించాం. అలాగే మనం అనుదిన జీవితంలో విస్తృతంగా వాడే ఇంగ్లీషు పదాలు ఇవిగో :-

అబార్షను, అబ్సెంటు, యాక్సిలరేటరు, యాక్సిడెంటు, అకౌంటఉ, ఆసు, యాసిడు, అకనాలెడ్జిమెంటు, ఎకరా, యాక్టు, యాక్షను, యాక్టరు, అడ్రసు, అడ్జస్టుమెంటు, అడ్మిరలు, అడ్మిషను, అడ్వాన్సు, ఎఫెక్షను, అఫిడవిటు, ఆఫ్‌ట్రాలు, ఏజి, ఏజెన్సీ, ఏజెంటు, అగ్రిమెంటు, ఎయిడు, ఎయిరుపంపు, అలారం, అల్బం, అల్కహాలు, ఆల్జీబ్రా, అలాట్‌మెంటు, అలవెన్సు, అంబాసిడర్, ఆమెన్, యాంకరు, యాంగిలు, యానివర్సరీ, ఆన్సరు, అపార్టుమెంటు, ఆర్చి, ఆర్కిటెక్టు, ఏరియా, ఆర్గుమెంటు, ఆర్టు, ఆర్టిస్టు, అసెంబ్లీ, అసైన్‌మెంటు, అసిస్టెంటు, అసోసియేషను, ఆస్తమా, అట్లాసు, అటెండెన్సు, అటెన్షను, అటెస్టేషను, ఆక్షను, అదారిటీ, ఆటో, ఆటోమాటిక్, ఏవరేజి, అవార్డు, అకాడమీ, ఎయిర్‌కండిషను, ఎయిర్‌పోర్టు, ఆర్మీ, అరెస్టు, అరియర్సు, ఆర్టికిల్స్, అసెస్‌మెంటు, ఆడియన్సు, ఆడిటు, ఎయిడ్సు, ఆంటీ,

బాచిలరు, బాసు, బ్యాగు, బెయిటు, బ్యాంకు, బ్యాలెన్సు, బాలు, బెలూను,బ్యాలెటు, బ్యాను, బ్యాండు, బ్యాంగిల్సు, బ్యానరు, బాప్టిస్మం, బారు, బార్బరు, బార్లీ, బ్యారను, బ్యారేజి, బారికేడు,బేసుబాలు, బేసుమెంటు, బేసిను, బాస్కెటు, బ్యాచి,

బాత్‌రూము, బ్యాటరీ, బెడ్రూము, బేరరు, బీటు, బెడ్‌లైటు, చీపు, బెగ్గరు, బిగినింగు, బిలీవరు, బెల్లు, బెంచి, బెనిఫిటు, బెస్టు, బెటర్‌మెంటు, బైబిలు, బిడ్డు, బిట్టు, బిల్లు, బర్త్‌డే, బిషపు, బ్లాక్‌బోర్డు, బ్లాస్టింగు, బ్లూ, బోల్టు, బాంబు, బెల్టు, బాండు,బోరు, బోనసు, బుక్కు, బూటు, బూతు, బోర్డరు, బోటిలు, బాక్సు, బ్రేకు, బ్రాంచి, బ్రాండు, బ్రెడ్డు, బ్రోకరు, బ్రదరు, బస్సు, బ్రష్షు, బబుల్‌గము, బకెట్టు, బఫూను, బగ్గీ, బిల్డింగు, బల్బు, బులెట్టు, బులియను, బుల్‌డోజరు, బడ్జెట్, బరెస్ట్, బిజినసు, బిజీ, బైలా, బైపాసు, బెటాలియను, బిల్లు, బ్లాక్‌మార్కెటు, బ్లాక్‌లిస్టు, బ్లాకౌటు, బ్లాక్‌మనీ, బ్లాంకుచెక్కు, బ్లడ్‌బ్యాంకు, బ్లూప్రింటు, బోగస్.

కేజినేటు, కేబులు, కేడరు, కేలిక్యులేటరు, కేలండరు, కాలింగ్‌బెల్లు, క్యాంపు, క్యాంపసు, కేన్సిలు, కేసిటలు, కెప్టెను, క్యారటు, కార్డు, కార్గో, క్యారేజి, సెస్సు, కాట్రిడ్జి, కేసుఫైలు, క్యాషియరు, కేటలాగు, కేటగిరీ, కవేటు, సీలింగు, సెల్, సెన్సారు, సెన్ససు, సెంటరు, సర్టిఫికేటు, చైన్‌మాను, చైర్మన్, చాలెంజి, చాంబరు, చాంపియను, చాన్సు, చానెలు, చార్జి, చెక్, కెమికలు, చీఫ్, చిట్‌ఫండు,సర్కిలు, సివిలు, సర్కులరు, క్లెయిము, క్లాసు, క్లియరెన్సు, క్లర్కు, క్లయింటు, క్లబ్బు, కోచింగు, కోటు, కోడు, కలెక్టరు, కోల్డ్‌స్టోరేజి, కాలనీ, కలరు, కాలం, కోమా, కమాండరు, కమర్షియలు, కమిషను, కమిటీ, కామన్, కంపార్ట్‌మెంటు, కంపెనీ, కాంప్లెక్సు, కంపల్సరీ, కన్సెషను, కాంక్రీటు, కాన్ఫిడెన్సు, కండిషను, కండక్టరు, కాన్ఫరెన్సు, కాంగ్రెసు, కన్సొలేషను, కంటెస్టు, కానిస్టేబులు, కంటిన్యూ, కంటింజెన్సీ, కాంట్రాక్టు, కంట్రోలు, కోపరేషను, కాపీ, కార్పొరేషను, కారు, కాస్టు, కౌంటరు, కూపను, కోర్సు, కోర్టు, క్రేను, క్రిమినలు, క్రాస్‌ఓటింగు, కల్చర్, కర్ఫ్యూ, కరెన్సీ, కస్టడీ, కరెంటు, కస్టమరు, కట్‌మోషను, కాఫీ, సిగిరెట్టు, కాన్వెంటు,

డైలీ, డేంజరు, డ్యాము, డేస్కాలరు, డీలరు, డిబారు, డిబెంచరు, డిక్లరేషను, డిక్రీ, డిఫాల్టు, డిఫెన్సు, డిగ్రీ, డెలివరీ, డిమాండు, డిపార్ట్‌మెంటు, డిపాజిటు, డిపో, డెప్యుటేషను, డిజైను, డిస్పాచ్, డిటెక్టివ్, డైరీ, డిజిటలు, డివైడెడ్‌బై, డాడీ, డిప్లొమా, డైరెక్టరు, డిసిప్లైన్, డిస్కౌంటు, డిస్మిసు, డిస్పెన్సరీ, డిస్సెంటు, డిస్టిలరీ, డిటో, డివిజను, డాకెటు, డాక్‌యార్డు, డాక్యుమెంటు, డాలరు, డైమండు, డాటు, డౌన్‌లోడు, డబలెంట్రీ, డ్రాఫ్టు, డ్రైనేజి, డ్రాయరు, డ్రిల్లు, డ్యూటీ, డమ్మీ, డ్రైవరు, డూపు, డూప్లికేటు,

ఈజీ, ఎలాస్టికు, ఎలక్షను, ఎమర్జన్సీ, ఎంప్లాయిమెంటు, ఇ.సి., ఎండార్సుమెంటు, ఎన్‌లార్జు, ఎంట్రెన్సు, ఈక్విటీషేర్లు, ఎస్కార్టు, ఎస్టాబ్లిష్‌మెంటు, ఎస్టేటు, ఎస్టిమేటు, ఎట్‌సెట్రా, ఎగ్జాంపులు, ఎగ్జామినేషను, ఎక్సేంజి, ఎక్సైజు, ఎక్స్‌పర్టు, ఎక్స్‌ప్రెసు,

ఫేస్‌సౌదరు, ఫ్యాక్షను, ఫెయిలు, ఫైలు, ఫెయిర్‌కాపీ, ఫాల్స్ ప్రిస్టేజి, ఫ్యామిలీ, ఫేవరేటు, ఫెదరలు, ఫ్యూడలు, ఫీల్డు, ఫిగరు, ఫైనలు, ఫైనాన్సు, ఫైర్‌స్టేషను, ఫస్టు, ఫిష్‌ప్లేటు, ఫిట్‌నెసు, ఫిక్సుడుడిపాజిటు, ఫ్లాట్‌రేటు, ఫ్లడ్‌లైటు, ఫ్లోర్‌లీడరు, ఫోల్డరు, ఫుడ్‌పోయిజను, ఫుట్‌బోర్డు, ఫుట్‌పాతు, ఫోరెన్సిక్‌లాబరేటరీ, ఫోర్టరీ, ఫారం, ఫార్ములా,



ఫోరం, ఫౌండేషను, ఫండమెంటల్‌రూల్సు, ఫ్రేము, ఫ్రీలాన్సు, ఫ్రైటు, ప్రెష్‌వాటరు, ఫుల్‌బెంచి, ఫర్నిచరు, ఫ్యాను, ఫ్రిజు,

గేము, గ్యాపు, గేటుకీపరు, గజెటు, గజిటెడ్ ఆఫీసరు, గేరు, జిన్నింగుమిల్లు, గ్లాసు, జీ.వో., గోడౌను, గోల్డెన్‌జూబిలీ, గూడ్సు, గుడ్‌విల్లు, గవర్నమెంటు, గవర్నరు, గ్రేడు, గ్రాడ్యుయేటు, గ్రాంటు, గ్రీన్‌కార్డు, గ్రౌండ్‌ఫ్లోరు, గ్రూపు, గ్యారంటీ, గార్డు, గైడు, గన్‌పౌడరు, జీప్సీ, గ్రిల్లు,

హాలు, హాల్‌టిక్కెట్టు, హాల్టు, హెల్మెటు, హేండిలు, హార్బరు, హెడ్‌పోస్టాఫీసు, హెడ్‌క్వార్టర్సు, హెలికాప్టరు, హెల్పరు, హీరో, హీరోయిను, హైక్లాసు, హైకోర్టు, హైస్కూలు, హైజాక్, హోంగార్డు, హాస్పిటలు, హౌస్‌కమిటీ, హరికేన్‌లాంతరు, హైబ్రీడు,

ఇంటర్మీడియటు, ఇమ్మిడియేటు, ఇంపార్టంట్, ఇంప్రెస్టు, ఇన్‌చార్జి, ఇన్‌కంటాక్సు, ఇంక్రిమెంటు, ఇండెలిబుల్‌ఇంకు, ఇండెమ్నిటీబాండు, ఇండెంటు, ఇండిపెండెంటు, ఇండెక్సు, ఇండియను, ఇండికేటరు, ఇన్‌డైరెక్టు, ఇండస్ట్రీ, ఇనిషియల్సు, ఇన్నింగ్స్, ఇంక్వెస్టు, ఐ.పి, ఇన్‌స్పెక్షను, ఇన్‌స్టాల్‌మెంటు, ఇన్యూరెన్సు, ఇంటరెస్టు, ఇంటర్వ్యూ, ఇన్‌వెస్టిగేషను, ఇన్విటేషన్‌కార్డు, ఇన్‌వాయిసు, ఇరిగేషన్‌బంగళా, ఇష్యూ, ఇంటు, ఇంజెక్షను,

జైలు, జాయింటుకలెక్టరు, జెట్, జాబ్‌వర్కు, జాయినింగ్‌రిపోర్టు, జర్నలిస్టు, జడ్జి, జూనియరు, జంక్షను, జస్టిసు,

కీ, కిడ్‌నాపు, కిచ్చెను, కిలో, కమాండరు, కమిటీ, కంప్యూటరు, కీబోర్డు,

లాబరేటరీ, లేబులు, లేబరు, ల్యాండు, లాస్టు, లాఫ్సు, లైసెన్సు, లేటు, లాయరు, లీడరు, లీజు, లీవు, లెడ్జరు, లీగల్‌నోటిసు, లెటర్‌లెవెలు, లెవీ, లెవెల్‌క్రాసింగు, లైబ్రరీ, లీను, లైఫు, లిఫ్టు, లిమిట్స్, లైను, లింకు, లిక్కరు, లైవ్, లోడు, లోను, లాబీ, లోకలు, లోకాలిటీ, లాకప్, లాడ్జి, లాంగ్‌జంపు, లాసు, లక్కీ, లాకులు, లెన్సు,

మెషిను, మేగజైను, మెజిస్ట్రేటు, మేడమ్, మెయిలు, మెయిను, మెంబరు, మేజరు, మేకపు, మేనేజరు, మాండేటు, మేనిఫోల్డ్‌పేపరు, మానర్సు, మ్యాపు, మార్జిను, మార్కెటు, మార్షల్, మాస్టరు, మేట్రన్, మెచ్యూర్, మెడికల్‌కాలేజి, మెకానిక్, మీడయం, ఎం.ఎల్.ఎ, మెమో,మెంటలు, మెరిటు, మెసేజి, మెటలు, మెట్రికు, మైలు, మిలిటరీ, మిల్లు, మినరల్, మినిస్టరు, మైనరు, మైనారిటీ, మింటు, మైనసు, మిషనరీ, మినిట్స్, మిసైలు, మిక్చరు, మొబైలు, మోడలు, మనియార్డరు, మంత్లీ, మునిసిపాలిటీ, మమ్మీ, మీటరు, నేమ్‌ప్లేటు, నేరోగేజి, ఎన్.సి.సి, నేవీ, నెగిటివు, నెట్‌క్యాషు, నెట్‌వర్కు, న్యూస్‌రీలు, నైట్‌షిఫ్టు, నోవేకెన్సీ, నామినేషను, నాన్‌టీచింగ్ స్టాఫు, నార్మలు, నోటరీ, నోటు, నోటీసు, నవల, న్యూసెన్సు, నంబరు, నర్సు, ఆఫరు, ఆఫీసరు, ఆఫీసు, ఆయిల్‌పెయింట్సు, ఒలంపిక్సు, ఆన్‌డ్యూటీ, ఓపెన్‌ఎయిర్ థియేటరు, ఆపరేటరు, ఆపరేషను, అపోజిషన్, ఆప్షను, ఆర్డరు, ఆర్డినరీ, ఆర్గనైజేషను, ఔట్‌డోర్ షూటింగు, ఒరిజినలు, అవుట్ పేషంటు

(ఓ.పి), ఓవర్‌బ్రిడ్జి, ఓవర్‌డ్రాఫ్టు, ఓవర్‌హోలు, ఓవర్‌టైము, ఓనరు, ఓవర్‌హెడ్‌ట్యాంకు, పేకెటు, పేజి, పెయింటరు, పేపరు, పార్సిలు, పార్టనరు, పేరెంట్సు, పర్సంటేజి, పార్లమెంటు, పెట్రోలు, పార్టీ, పార్ట్‌టైము, పాసు, పాస్‌బుక్కు, పాసెంజరు, పాస్‌పోర్టు, పేటెంటు, ప్యాట్రను, పాన్‌బ్రోకరు, పెండింగ్ ఫైలు, పెనాలిటీ, పెన్షను, పిరియడు, పర్సను, పర్మనెంటు పోస్టు, పర్మిషను, పర్మిటు, పిటీషను, ఫేజు, ఫోటోస్టాట్, పైలట్, పయొనీరు, ప్లాను, ప్లాస్టిక్, ప్లీడర్, ప్లీజు, ప్లింత్ ఏరియా, ప్లెబిసైటు, ప్లెడ్జి, ప్లాటు, పాయింటు, పోలు, పోలీసు, పాలసీ, పాలిటిక్సు, పోలింగు, పాలిటెక్నికు, పాపులరు, పోర్టు, పోర్షను, పోజిటివ్, పోస్టు, పోస్టింగు, పోస్టుమార్టం, పొటెన్సీ, పవరు, ప్రాక్టికల్స్, ప్రాక్టీసు, ప్లేయరు, ప్రికాషను, ప్రొసీడు, ప్రిఫరెన్సు, ప్రిగ్నెంటు, ప్రిలిమినరీ, ప్రజెంటు, ప్రసిడెంటు, ప్రెస్సు, ప్రైజు, ప్రైమరీ, ప్రిన్సిపాలు, ప్రింటింగుప్రెస్, ప్రైవేటు, ప్రొబేషనరు, ప్రొబ్లం, ప్రొసీజరు, ప్రొడ్యూసరు, ప్రోఫిటు, ప్రోగ్రెస్ రిపోర్టు, ప్రాజెక్టు, ప్రామిసరినోటు, ప్రమోషను, ప్రూఫు, ప్రాపర్టీ, ప్రొప్రయిటరు, ప్రాసిక్యూటరు, ప్రోటోకాలు, సైకియాట్రిస్టు, పబ్లిక్‌గార్డెను, పబ్లిషరు, పంచరు, పనిష్‌మెంటు, పర్సు, పజిలు, పెన్ను, పెన్సిలు, ప్లగ్గు, పంపు, క్వాలిఫికేషను, క్వాలిటీ, క్వార్టరు, కొర్రీ, కొచ్చిను, కోరం, కోటా, కొటేషను, కారు, కార్నరు, ర్యాకు, రేడియో, రెయిడింగ్, రైలు, రైసు, రైన్‌గేజి, ర్యాలీ, రేంజి, ర్యాంకు, రేపు, రేటు, రేషను, ఆర్.సి.సి, రియాక్షన్, రీడరు, రియాక్టరు, రిక్రియేషన్ క్లబ్బు, రీడింగ్‌రూం, రెడీమేడు, రీలు, రియల్‌ఎస్టేటు, రీజను, రిబేటు, రీకాలు, రిసీటు, రిసెప్షను, రికగ్నిషను, రికార్డు, రీకౌంటింగు, రికవరీ, రిక్రూట్‌మెంటు, ఆర్.డి, రిఫరెన్సు, రిఫరెండం, రిఫండు, రిజిస్టర్డు పోస్టు, రిజిస్ట్రేషను, రిజిస్టరు, రెగ్యులరు, రిలేషను, రిలీజు, రిమైండరు, రెమిషను, రిమోట్‌కంట్రోలు, రెన్యూవలు, రీచార్జికూపను, రిపేరు, రిప్లై, రిపోర్టు, రిప్రజెంటేటివు, రిపబ్లికు, రిక్వెస్టు, స్టాపు, రీసేలు, రీసెర్చి, రిజర్వేషను, రెసిడెన్సు, రిజైను, రెస్పెక్టు, రెస్టు, రెస్పాన్సిబులు, రిజల్టు, రిటైల్ డీలరు, రిటైర్‌మెంటు, రెవిన్యూ, రివర్షను, రివార్డు, రిబ్బను, రైటు, రిస్కు రోబోటు, రోల్‌నంబరు, రఫ్, రొటేషను, రూటు, రాయల్, రాయల్టీ, రబ్బర్‌స్టాంపు, రూల్సు, రన్నింగు, రూము, రెంచి, రోడ్డు, రేజరు, రింగురోడ్డు, రెగ్యులేటరు, రిజర్వాయరు, సేఫ్‌టీలాకరు, శాలరీ, సేల్సు, సెలైను, శాంక్షను, శానిటరీ ఇన్‌స్పెక్టరు, సేటలైటు, సేవింగ్సు, స్కేలు, షెడ్యూలు, స్కీము, స్కూలు, సైన్సు, స్కోపు, స్క్రీను, స్క్రిప్టు, సీలు, సీజను, సీటు, సెకండు, సీక్రెటు, సెక్రటరీ, సెక్షను, సెక్టారు, సెక్యూరిటీ, సెగ్మెంటు, సెలెక్షను, సెల్ఫ్‌సర్వీసు, సెమినారు, సెనేటు, సీనియరు, సెన్సు, సెంట్రీ, సీరియలు, సర్వీసు, సెటిల్‌మెంటు, సర్వెంటు, సెషన్స్‌కోర్టు, షేరు, షిప్పు, షెల్ఫ్, షాపు, షోకాజ్‌నోటీసు, షోరూము, సైటు, సిగ్నలు, సిల్వర్‌జూబిలీ, సింపులు, స్కిప్పింగు, శ్లాబు, స్లోగను, స్మగ్లింగు, సొసైటీ, సౌండ్‌ప్రూఫు, స్పేర్‌పార్టు, స్పీకరు, స్పెషలు, స్పెషలిస్టు, స్పెసిమన్‌సిగ్నేచరు, స్పాంజి, స్పాట్‌లైటు, స్క్వాడు, స్టాఫ్, స్టేజి, స్టాంపు, స్టాండు, స్టేటు, స్టేట్‌మెంటు, స్టేటస్‌కో, స్టే, స్టెప్స్, స్టెథెస్కోపు, స్టాకు, స్టోరు, స్ట్రెయిటు, స్ట్రీటు, స్ట్రయికు,



స్ట్రాంగ్‌రూము, స్టయిలు, సబ్‌డివిజను, సబ్జెక్టు, సబ్‌స్క్రిప్షను, సబ్సిడీ, సడెను, సూటు, సమను, సస్పెన్సు, సుపీరియరు, సూపరు, సప్లై, సుప్రీంకోర్టు, సరెండరు, స్వీపరు, సర్‌చార్జీ, సస్పెన్షను, సిండికేటు, సిస్టము, స్విచ్‌బోర్డు, సెప్టిక్‌ట్యాంకు, సిమెంటు, షట్టరు, సైడ్‌ఎఫెక్టు, సూటుకేసు, స్వీటు, సర్వరు, స్కూటరు, స్క్రూడ్రైవరు, స్టెనో, స్టీరియో, టేబులు, టాలెంటు, ట్యాంకరు, టేపు, టార్గెటు, తారు, టారిఫ్, టాక్సు, టీచరు, టెక్నికలు, టెలిఫోను, టెల్లర్‌కౌంటరు, టెంపరరీ, టెండరు, టెర్మ్, టెస్టు, టెక్స్టుబుకు, తీసిసు, టైటిల్‌డీడు, టోకెను, టన్ను, టానిక్కు, టోటలు, టూరు, టౌను,ట్రేసింగ్ పేపర్, ట్రేడ్ మార్కు ట్రాఫిక్ కంట్రోల్, ట్రైనింగు, ట్రాన్స్‌ఫరు, ట్రాన్సిట్, టి.ఎ.బిల్లు, ట్రెజరీ, ట్రెండు, ట్రయల్, ట్రబుల్, ట్రంక్‌కాల్, ట్రస్టీ, టర్నోవర్, ట్యూటోరియల్, టైపిస్టు, ట్యూబులైటు, ట్యాపు, టాపు, టాబ్లెటు, టీ,

అండర్‌లైను, అండర్‌టేకింగ్, అండర్‌ట్రయల్, యూనిఫారం, యూనియన్, యూనిట్, యూనిటీ, యూనివర్శిటీ, అన్‌లాక్, అర్జెంటు, అగ్లీ, అంపైర్, అంకులు

వేకెన్సీ, వెరైటీ, వెజిటేరియన్, వెహికిల్, వెంచర్, వెన్యూ, వెరిఫికేషన్, వయా,వయామీడియా, వైస్‌వర్సా, విజిల్, విజిలెన్సు, విలేజి, వీసా, వి.ఐపి, విటమిను, వాల్యూమ్, వాలంటరీ, ఓటు, వోల్టు,వారంటు, వాచి, వాటర్‌ప్రూఫ్, వేబిల్లు, వీక్లీ, విత్‌డ్రాయల్ ఫారం, రైట్ ఆఫ్, వైరు, వాషింగ్ మెషను, వర్కరు, విల్లు,వార్డు,వైపు, వాటర్,

జీరో, జోను.

మాతృభాష అంటే పసిపిల్ల వాడికి తల్లి ఉగ్గుపాలతో పాటు రంగరించి పోసే భాష. మమ్మీ,డాడీ,ఆంటీ,అంకుల్,బ్యాగు,బుక్కు,స్లేట్‌పెన్సిల్ లాంటి మాటలు తెలుగు తల్లులు తమ పిల్లలకు రంగరించి పోస్తున్నారు. బయట స్కూలు, ఆఫీసు, మార్కెట్టు, కోర్టుల్లో ఎన్నెన్నో పదాలు ఎడతెరిపి లేకుండా వాడుతున్నారు. మాటకు వాడుకే గదా ప్రాణం? వాడకం అంతా ఆంగ్లపదాల్లో జరుగుతూఉంటే తెలుగు గ్రంథానికి పరిమితమై పోయింది. కవులు, సాహితీవేత్తలు మాత్రమే భాష గురించి బాధ పడుతున్నారు. పాలక భాషకు ఉండవలసినంత పదసంపద ఎన్నేళ్లు గడిచినా సమకూర్చలేక పోతున్నారు. అనువాదకులు తేటతెలుగుకు బదులు సంస్కృతం వాడి భయపెడుతున్నారు. కాలగమనంలో కొత్త కొత్త ఆంగ్లపదాలే మనకు అబ్బు తున్నాయిగానీ, కొత్త తెలుగు పదాలుగానీ, పాతవేగాని కొత్తగా వాడకంలోకి రావడం లేదు. ఇది మన జాతి చేతకానితనం, దౌర్భాగ్యం.

పైన పేర్కొన్న వందలాది పదాలేగాక ఇంకెన్నో ఆంగ్ల పదాలు మన తెలుగు ప్రజల నాలుకలపై నాట్యమాడుతూ, మన పదాలే అన్నంతగా స్థిరపడిపోయాయి. ఈ పదాలను విడిచిపెట్టి మనం తెలుగులో సంభాషణ చేయలేము. చేసినా ప్రజలకు అర్థంగాదు. ఉర్దూ, సంస్కృత పదాలెన్నింటినో తెలుగు తనలో కలుపుకుంది. అలాగే

తెలుగు ప్రజల వాడుకలో బాగా బలపడిన, ఇక ఎవరూ పెకలించలేనంతగా పాతుకుపోయిన, ఇంగ్లీషు పదాలను మన తెలుగు డిక్షనరీలో చేర్చటం వల్ల మన భాష తప్పక బలపడుతుంది. సంస్కృత, ఉర్దూ పదాలు వేలాదిగా తెలుగు నిఘంటువులో చేరకపోయి ఉన్నట్లయితే తెలుగు భాషకీపాటి శక్తి వచ్చి ఉండేది కాదు గదా?

కొందరికి పూర్తిగా ఆంగ్లభాషపై వెర్రి వ్యామోహం ఉంటుంది. అలాకాకుండా వాస్తవస్థితిని గ్రహించి మనభాషను రక్షించుకుంటూ, ఆంగ్లపదాలను వాడుకోవడం తెలివైన పద్ధతి. లెక్కల మాస్టరు 2+2=4 అనే దాన్ని " రెండు ప్లస్ రెండు ఈజ్ ఈక్వల్‌టు నాలుగు " అంటాడు. ఇప్పటి వరకు ప్లస్, ఈజీక్వల్టు, మైనస్, ఇంటు లాంటి ఆంగ్ల పదాలకు సమానార్థక పదాలను కల్పించి లెక్కలు చెప్పలేదు. తెలుగు మీడియం వాళ్ళు కూడా ప్లస్, మైనస్ అనే శబ్దాల్నే వాడుతున్నారు. గత్యంతరం లేదు, అనుకున్న ఆంగ్లపదాలను మాత్రం తెలుగు నిఘంటువులో చేర్చటం అవశ్యం, అత్యవసరం. వాడుక పదాల సంపద భాషకు జీవమిస్తుంది. అవి పరభాషపదాలు కూడా కావచ్చు. మనం తెలుగును సరిగా నేర్చుకోక ముందే మనకు ఇంగ్లీషు నేర్పారు. వందలాది ఏళ్ళు మనం ఇంగ్లీషును గత్యంతరం లేక హద్దు మీరి వాడినందు వల్ల, అది మన భాషాపదాలను కబళించి తానే తెలుగై మనలో కూర్చుంది. మన ఆత్మలను వశం చేసుకుంది. ఇక ఇప్పుడు ఈ ఇంగ్లీషు పదాలను నిర్మూలించడం మన తరం కాదు. వాటిని మన పదాలుగా అంగీకరించడమే మంచిది. ఏఏటికాయేడు మన నిఘంటువుకి పదసంపద సమకూర్చాలి. మరోభాషాపదం మనలో పాతుకు పోకూడదనే ఆశయం ఉంటే, మనభాషలోనే కొత్త పదాలను సృష్టించటమేగాక, వాటిని ప్రజలంతా నిరంతరం వాడుతూ ఉండాలి.

## ఇటీవల కొన్ని మంచి పరిణామాలు:

1. ఇంగ్లీషు మీడియంను రద్దుచేసి, విద్యార్థి మాతృభాషలోనే విద్యాబోధన జరపాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి మురళి మనోహర్ జోషి కోరారు. ఈయన కోరిక అమలయితే షెడ్యూల్‌లో చేరని 96 భాషలకు మేలు జరుగుతుంది.
2. రైల్వే పోటీ పరీక్షలు, రైల్వే ఉద్యోగులకు జరిపే పరీక్షలు తెలుగులో కూడా జరుగు తాయని రైల్వే శాఖా సహాయమంత్రి బండారు దత్తాత్రేయ ప్రకటించారు. మిగతా అన్ని ప్రభుత్వ శాఖలు ఈ బాటలో నడవాలి.
3. తెలుగులో మాట్లాడండి అని వీడియో కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐ.ఎ.యస్ అధికారులని కోరారు.
4. తెలుగు వికాసం కోసం సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొత్త సాఫ్ట్‌వేర్ తయారీకి అధికార భాషా సంఘం నిర్ణయించింది.
5. యం.కాం పరీక్షలు తెలుగులో రాయడానికి నాగార్జున విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ యల్. వేణుగోపాల రెడ్డి అనుమతించారు.

**( గీటు రాయి 3-10-2003 )**



# ఇంగ్లీషునే లింకు లిపిగా చేస్తే?

23-12-2003న పార్లమెంటు 100వ రాజ్యాంగ సవరణ ద్వారా బోడో, డోగ్రి, మైతిలి, సంతాలీ భాషల్ని 8వ షెడ్యూల్‌లో చేర్చే బిల్లును ఆమోదించింది. కాబట్టి ఇక మీదట షెడ్యూల్‌లో ఉన్న భాషల సంఖ్య 22కు పెరుగుతుంది. ఇంకో 35 భాషల్ని షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండు ఉన్నట్లు అప్పటి ఉపప్రధాని అద్వానీ చెప్పారు.

1991 జనాభా లెక్కల ప్రకారం ఇండియాలో ఇంగ్లీషు మాట్లాడే వారి సంఖ్య 1,78,598. అదే మన రాజభాష. షెడ్యూల్‌లో ఈ భాషలేదు అయినా మకుటంలేని మహారాజు. సింధీ, కాశ్మీరీ, నేపాలీ, కొంకణి, మణిపురి, సంస్కృతం లాంటి భాషలు ఇప్పటికే షెడ్యూల్‌లో ఉన్నాయి. అయితే షెడ్యూల్‌లో చేర్చినంత మాత్రాన ఈ భాషలకు ఒరిగిందేమిటో అర్థం కావటం లేదు.

హిందీ మొదలుకొని అస్సామీ వరకు మొదటి 12 భాషల్నీ ఆయా భాషలు మాట్లాడే జనసంఖ్యను బట్టి షెడ్యూల్‌లో చేర్చారు. బాగానే ఉంది. కానీ అక్కడి నుండి ఏ కారణాల వల్లనో జనసంఖ్యను ప్రాతిపదికగా తీసుకోలేదు. భాషీయుల సంఖ్యను బట్టి షెడ్యూల్‌లో 23 భాషలుండాలంటే 13 నుండి 23 స్థానాలు ఇలా వస్తాయి:-

| స్థానం | భాషపేరు | భాషస్తుల సంఖ్య | |
|---|---|---|---|
| | | (1991 జనాభా) | 2001 జనాభా |
| 13. | బిలి / బిలోడి | 55,72,308 | |
| 14. | సంతావి | 52,16,325 | |
| 15. | కాశ్మీరీ | 31,.76,975 | |
| 16. | గోండి | 21,24,852 | |
| 17. | సింధి | 21,22,848 | |
| 18. | నేపాలీ | 20,76,645 | |
| 19. | కొంకణి | 17,60,607 | |
| 20. | తులు | 15,52,259 | |
| 21. | కురక్/బరావో | 14,26,618 | |
| 22. | మణిపురి | 12,70,216 | |
| 23. | బోడో/బోరో | 12,21,881 | |

ఇలా షెడ్యూల్ చేస్తే 10 లక్షల పైబడిన జనం మాట్లాడే భాషలన్నీ షెడ్యూల్‌లోకి వచ్చి ఉండేవి. కానీ బిలి, గోండి, తులు, కురుక్ భాషలకు ఆ భాగ్యం ఇంకా కలుగలేదని అర్థం అవుతోంది. వీటికంటే చిన్న భాషలైన సంస్కృతం (50 వేలు), డోగ్రి (90 వేలు), షెడ్యూల్‌లో చేరాయి. మైతిలి (78 లక్షలు) హిందీ భాషా కుటుంబానికి చెందినదే అయినప్పటికీ మరొక భాషలాగా దానిని షెడ్యూల్‌లో చేర్చటం విచిత్రం!

భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తరువాత రాజస్థానీ భాష, కోటి ముప్పయి మూడు లక్షల మందికి మాతృ భాష అయినా ఇంకా షెడ్యూల్‌లో చేర్చలేదు. అది హిందీ కుటుంబంలోనే కలిసిపోయింది. 63 వేల మంది మాట్లాడే ఎరుకల భాషను తమిళ కుటుంబంలో కలిపి వేశారు. 1,04,686 మందికి మాతృభాష అయిన “వదరీ”ని తెలుగు కుటుంబంలో కలిపారు. ఈ వదరీ అనే పదమే మనం వినలేదు. కానీ వదరీ, కామాటీ, బేరాదీ అనే తెలుగు మాండలికాలు ఆంధ్రేతర ప్రాంతాల్లో ఉన్నాయట! ఒక్క హిందీలోనే 48 యాసలున్నాయి. అంటే మైతిలిని వంక పెట్టుకొని భోజ్‌పురి (2.31 కోట్లు), బుందేల్ ఖండీ (16 లక్షలు), ఛత్తీస్ ఘరీ (1.06 కోట్లు), ఘర్‌వాలీ (18 లక్షలు), మగదీ (1.06 కోట్లు) లాంటీ హిందీ యాసలన్నీ పోటీకి రావొచ్చు.

27-5-2004న ఐక్యప్రగతిశీల కూటమి రూపొందించిన ఉమ్మడి కనీస ప్రణాళికలో “తమిళాన్ని ప్రాచీన భాషగా గుర్తిస్తాం” అన్నారు. తమిళులు పదవులను సాధించడమే గాక వారి భాషను కూడా రక్షించుకుంటూ ముందుకెళుతుంటే, వారి కంటే ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే తెలుగు భాష అభివృద్ధి కోసం కేంద్రాన్ని అడిగే నాయకులు కరువయ్యారు. అసలీ భాష గురించి ఎవరూ అడగనే లేదు. అడగకపోతే అమ్మయినా పెట్టదంటారు గదా! తమిళులతోపాటు మన వాళ్ళూ అడగనక్కరలేదా?

పూర్వం మన భాష నశించిపోతుందే అని కొంత మంది నాయకులైనా బాధపడేవారు. కానీ ఇప్పుడు తెలుగు ఎందుకూ పనికిమాలిన భాషనీ, ఇంగ్లీషు, హిందీ వస్తే మనం ఎక్కడైనా చలామణీ కావొచ్చనీ, పదవులు దక్కాలన్నా, పరపతి పెరగాలన్నా కేవలం తెలుగు వస్తే చాలదనీ, హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా నేర్వాలనీ, చచ్చిపోయే ముసలి భాషను ఎవరూ బ్రతికించలేరనీ మన తెలుగు మేధావులే వాదిస్తున్నారు. మన నాయకులు అందుకు వంతపాడుతున్నారు. ఇక వీళ్ళు తెలుగుకు అధికార పీఠం దక్కనిస్తారా? 8 కోట్ల తెలుగు జనం ఉద్యోగాల కోసం, విజ్ఞానం కోసం ఇంగ్లీషును ఆశ్రయించక తప్పదంటున్నారు మన మేధావులు.



“తెలుగు మీడియంలో బోధన-చదువులోనూ పేదరికాన్ని పెంచుతోంది” అనే వ్యాసంలో (వార్త 22-5-2004) ప్రొఫెసర్ చందు సుబ్బారావు గారు అందుకు కొన్ని కారణాలు చెప్పారు. అవి:

1. పేద గ్రామీణ విద్యార్థులను విద్యా ఉద్యోగ రంగాలలో పైకి రానివ్వకుండా మాతృభాషా మాధ్యమం వారికి కట్టు గొలుసుగా మారుతోంది. వెనుకబడిన కులాల విద్యార్థులే తెలుగు మీడియంలో చేరుతున్నారు.
2. లెక్చరర్లు తప్పులతోనైనా ఇంగ్లీషులోనే బోధించగలుగుతున్నారు. కానీ తెలుగు మీడియంలో విజయవంతంగా చెప్పలేకపోతున్నారు.
3. తెలుగు మీడియం విద్యార్థులు ఆత్మన్యూనతా భావంతో ఇంగ్లీషులో జవాబులు చెప్పలేక మౌనం వహిస్తున్నారు.

పై కారణాలను బట్టి మన పిల్లలంతా ఇంగ్లీషు మీడియంలోకి మారకపోతే వారికి మంచి భవిష్యత్తు దొరకదని ప్రొఫెసర్‌గారు చెప్పకనే చెప్పారు. మరి తెలుగు విద్యార్థులకు మరోదారి లేదా?

మన నాయకులు తలచుకుంటే దారి ఉంది. కానీ వాళ్ళు తలుచుకోరు. ఎందుకంటే ఇంగ్లీషు రాకపోతే అంతర్జాతీయంగా పనికిరాని వాళ్ళమవుతామనీ, హిందీ రాకపోతే జాతీయ జీవనస్రవంతిలో ఉండని ఒంటరిగాళ్ళ మవుతామనీ భయం. గాడిదలాగా పరుగెత్తావెందుకురా అంటే, గుంపులో చేరబట్టి నా భయం తీరిందన్నాడట ఒకడు. హిందీ, ఇంగ్లీషు రాని వాళ్ళకు కేవలం తెలుగు మాత్రమే వచ్చిన వాళ్ళకు బ్రతుకు భయంకరంగానే ఉంది. 24-5-2004న ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి పర్వతనేని సుబ్బారావు గారిని కలిశాను. “యుద్ధాలు చేసి గెలిచిన జాతుల భాషలే అధికార భాషలయ్యాయి. పరాజితుడు విజేత భాష నేర్చుకోక తప్పదు. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా మాతృభాషలో పాలన జరగకపోవటానికి కారణం మన పాలకులు గత్యంతరం లేక పరాయి భాషకు పట్టం గట్టారు. అభివృద్ధి చేసుకుంటే తెలుగు అధికార భాష అవుతుంది. కానీ చేసే వాళ్ళేరి?” అన్నారాయన. “అధికార భాషగా తెలుగు” అనే అంశం మీద పి.హెచ్.డి. కూడా ఎవరూ చేయలేదట. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం నుండి గొడుగు నిర్మల గారు ఈ అంశం మీద పి.హెచ్.డి చేసినట్లు తెలిసింది.

తెలుగు అధికార భాష కావాలంటే ఇంగ్లీషు స్థాయికి దానిని అభివృద్ధి చెయ్యాలి. తెలుగు నేర్చుకునే వాళ్ళ సంఖ్య పెరగాలి. ఇంగ్లీషు హిందీ నేర్చుకునే వాళ్ళ సంఖ్య తగ్గాలి. ఎందుకు? ఎలా? అని మన పాలకులు, ప్రజలు ప్రశ్నించుకోవాలి. చందు సుబ్బారావు గారి వాదన ప్రకారం అయితే మన ప్రభుత్వం నడుపుతున్న స్కూళ్ళన్నీ ఇంగ్లీషు మీడియంలోకి మారిస్తే చాలు. ఒక్క చర్యతో అన్నిసమస్యలూ పరిష్కార మవుతాయి. కానీ, ఇప్పుడున్న ఇంగ్లీషు మీడియం స్కూళ్ళన్నింటినీ తెలుగు మీడియం లోకి మార్చాలంటే అడుగడుక్కీ అడ్డంకులొస్తాయి. ముందు ఇంగ్లీషులో తీర్పులిచ్చే కోర్టులే అడ్డుపడతాయి. కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుంది. గవర్నర్లు, ఇతర భాషల ఐ.ఎ.యస్. ఆఫీసర్లు అడ్డుపడతారు.

2010 నాటికి అమెరికాలో కంటే ఇండియాలోనే ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉంటుందట. ఆ మేరకు మన భాషలు నాశనం అయిపోతాయి. దీనికి ప్రధాన కారణం మన దేశానికి లింకు భాష కావాల్సి రావటం. జాతీయ, అంతర్జాతీయ భాషల్ని మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా దేశం కోసం మోస్తూ, మన భాషను గత్యంతరం లేక నిర్లక్ష్యం చేస్తూ పోవటం.

ఒక్కో భాష మాట్లాడేవారు ఒక్కో జాతి వారికో దేశం ఉండాలి అనే సిద్ధాంతం అమలయినట్లయితే ఎవరి భాషను వాళ్ళు ఉద్ధరించుకొని వారి భాషలోనే పాలన జరుపుకునేవాళ్ళు. కానీ ఇన్ని భాషల వాళ్ళకూ దేశాలివ్వకుండా, రాష్ట్రాలిచ్చి భారత దేశంగా, భారతీయులుగా కలిసి ఉండమన్నారు. మొగలాయిలు, బ్రిటీష్ వాళ్ళు రాక ముందు ప్రజల భాషలే పాలక భాషలుగా ఉండేవి. ఎవరి భాష వారికి గొప్ప. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని మనమంటే కాదు హిందీయే గొప్ప అంటారు ఉత్తరాది వాళ్ళు. ఇంగ్లీషు కంటే ముందే రాజ్యమేలిన ఉర్దూ లింకు భాష కావటానికి ఆమోదం దొరకలేదు. ఇక ఇంగ్లీషే భారతీయులందరికీ ఇష్టమైన లింకు భాషగా తప్పనిసరి అయ్యింది. నిరాఘాటంగా ఇండియాను పాలిస్తోంది.

మరి ఇటువంటి పరిస్థితుల్లో ఇంగ్లీషు భాషను పాశ్చాత్యులే కాకుండా భారతీయులు కూడా సాంకేతికంగా, శాస్త్రీయంగా ఎంతో అభివృద్ధి చేశారు. కోట్లాది మంది భారతీయులు ఇంగ్లీషు నేర్చారు. **అఆ**లు రాకపోయినా **ABCD** లు వచ్చేస్తున్న రోజులివి. తప్పదు మరి. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకుని భవిష్యత్తు ప్రణాళిక వేసుకోవాలి. ఇంగ్లీష్ వాళ్ళు **I,II,III, IV** లాంటి రోమన్ అంకెలు వాడేవారు. తరువాత



1,2,3,4,5,6,7,8,9 అనే అంకెల్ని అరబ్బుల నుండి, '0' ను ఇండియా నుండి తీసుకెళ్ళి తమవిగా చేసుకున్నారు. ఏమీ సిగ్గుపడలేదు. దొంగతనంగా భావించలేదు. పరాయి భాషలకు చెందిన అంకెలని ద్వేషించలేదు. తమ అంకెలు నామ రూపాల్లేకుండా పోతున్నాయే అని బాధపడలేదు. కేవలం సౌకర్యం చూసుకున్నారు. తమ భాష చెలామణీ కావటం చూసుకున్నారు.

మరి మనవాళ్ళు లింకు భాషగా ఇంగ్లీషును ఎన్నుకున్న రోజున, ఇంగ్లీషు లిపిని కూడా లింకు లిపిగా నిర్ణయించినట్లయితే భారతీయ భాషల నడక వేగం పెరిగి ఉండేది. దేశ వ్యాప్తంగా అన్ని భాషల వాళ్ళకూ ఒకే లిపి నేర్పబడేది. భారతీయ భాషలు శబ్ద రూపంలో ఎన్ని విన్యాసాలు చేసినా, ఒకే లిపిలో ఉంటే కనీసం దేశస్తులంతా చదివే వాళ్ళు. ఒక లిపికి అలవాటైన మనిషి తన భాషను మరో లిపిలో రాయటానికి, తన భాషను మరో లిపిలో చదవటానికి అంత సుళువుగా ఇష్టపడడు. లిపి మారితే తన భాషే మారిపోయినట్లుగా ఫీలవుతాడు. కానీ ఈనాడు మనం మన పొరుగు భాషలను కూడా చదవలేకపోతున్నాం. దేశమంతటికీ ఒకే లిపి ఉన్నప్పుడు ఇరుగు పొరుగు భాషలు అర్థం కాకపోయినా, మాట్లాడలేకపోయినా కనీసం చదవటం వస్తుంది. ఏ భాష వాడికైనా చదివిపెట్టడం వస్తుంది. వంద రూపాయల నోటు మీద 18 లిపుల్లో ముద్రించనక్కరలేదు. ఆయా భాషల వాళ్ళు వందరూపాయల్ని ఏమని పలుకుతారో ఆ శబ్దాన్ని ఇంగ్లీషు లిపిలో ముద్రించవచ్చు. వందరూపాయల్ని ఏ భాష వాళ్ళు ఏమని పిలుస్తారో మిగతా అన్ని భాషల వాళ్ళూ చదివి తెలుసుకోవచ్చు. దీన్ని **Transliteration** అంటారు. సంస్కృత శ్లోకాల్ని మనం తెలుగు లిపిలో రాసుకుంటున్న మాదిరిగానన్న మాట.

మన ఆర్టీసీ బస్సుల మీద తెలుగు అంకెలు వేశారు కానీ అరబీ అంకెల్ని అంటే నేటి ఇంగ్లీషు అంకెల్నే జనం చదువుతున్నారు. కాలగమనంలో పారవేయబడిన వాటిని వెతికి తీసుకొచ్చి జనానికి అలవాటు చేస్తామంటున్న భాషాప్రియులు, అంతకంటే సుళువుగా జనమందరికీ అలవాటైన వాటితోనే భాషాభివృద్ధి చేయవచ్చు. వాక్కు రూపంలో ఉండే భాషకు మనిషి కల్పించిన రూపమే లిపి. లిపిరాని వాడికీ భాష ఉంటుంది. అసలు భాషే రాని వాడికి లిపి ఏముంటుంది? భాషను చదవటానికీ, రాయటానికీ పెట్టుకున్న గుర్తులే అక్షరాలు. అవి మన దేశంలో **LKG** పిల్లల దగ్గర నుండి ప్రొఫెసర్ల దాకా అందరికీ **ABCD** ల రూపంలో నేర్పబడ్డాయి. "అఆ" అనే అక్షరాలొచ్చిన పిల్లలు

దేశమంతటా ఉండరు కానీ **ABCD** అనే అక్షరాలొచ్చిన పిల్లలు దేశమంతటా ఉన్నారు. వండి వడ్డించిన దాన్ని తినటానికి తిరస్కరించినందువల్ల మన జాతి శుష్కించిపోతున్నది. తెల్లవాడు అందరివీ దొంగలించి తిని బలిసిపోయాడు. నల్లవాడు అలిగి నీలిగి నీరసించాడు.

సుప్రీం కోర్టు నుండి, ఈ దేశ సర్వోన్నత పాలక పీఠాల నుండీ ఇక ఇంగ్లీషును తొలగించటం సాధ్య కాదు గనుక రకరకాల లిపుల్ని సంస్కరించి యావత్తు భారత జాతికీ అర్థం అయ్యేలా చేయటం అసాధ్యం గనుక, ఆంగ్ల లిపిని స్వంతం చేసుకుని, దేశంలోని అన్ని భాషలకూ దాన్నే లిపిగా అమలు చేస్తే మనకు ఎన్నో కష్టాలు తగ్గుతాయి. అంతర్జాతీయంగా ఆంగ్లభాష లిపికి సమకూరిన యాంత్రిక ప్రయోజనాలన్నీ మన దేశీయ భాషలకూ సమకూరుతాయి. ఈ మార్పుకొక తరం పడుతుంది. వివిధ లిపులకు అలవాటు పడిన పెద్దలు తప్పనిసరిగా ఇబ్బంది పడతారు. కానీ కొత్తగా నేర్చుకునే పిల్లలు సునాయాసంగా ఇంగ్లీషుతోపాటే తమ మాతృభాషల్నీ ఒకే కీ బోర్డుతో సాధన చేస్తారు. ఇంగ్లీషు అక్షరమాలలో లేని కొన్ని శబ్దాలకు కొత్త అక్షరాలను జోడించుకోవటం కన్నా, ఉన్న అక్షరాలకే కొన్ని గుర్తులు జోడించటం ద్వారా ఈ శబ్దం వస్తుందని శాసనం చేయవచ్చు. దేశీయ భాషల మధ్య నిఘంటువుల తయారీ కూడా సులువవుతుంది. భాషలు నేర్చుకోవటం కూడా తేలికవుతుంది.

ఈ మధ్య e-సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు ఫిర్యాదులు పంపుతున్నారు. ఇంగ్లీషు రాని వాళ్ళు కూడా ఇంగ్లీషు లిపిలో తమ ఫిర్యాదుల్ని ఎంతో చక్కగా పంపించారు. ఒక ఫిర్యాదు ఇలా ఉంది:-

**Ayyaa,**
**NAA BHARTHA CHANIPOYI NAALUGELLAYYINDI. KUTUMBHA SANKSHEMA PADHAKAM KINDA NAAKU SAHAYAM INKAA ANDALEDU. TAMARU DAYATO AA SAHAYAM IPPINCHAGALARU.**

ఈ ఫిర్యాదు యథాతథంగా కలెక్టర్ నుండి **MRO**కు వెళితే, **MRO** కూడా **Telugu** లోనే చక్కగా జవాబిచ్చాడు. పనిలో వేగం పెరిగింది. ఆంగ్ల భాష రాకపోయినా, అనువదించి కూర్చుకునే నేర్పు లేకపోయినా భావం చక్కగా చేరాల్సిన చోటికి చేరింది. ఆంగ్ల లిపి ద్వారా ఒన గూడే ఈ సదుపాయాన్ని మనం ఎందుకు స్వంతం చేసుకోకూడదు? నేటి పెద్దలు ముందు చూపుతో చేసే త్యాగాలే రేపటి పౌరులకు సుఖమైన జీవితాన్నిస్తాయి.



# తెలుగు అక్షరాల కు రోమన్ లిపి

## అచ్చులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఎ |
| a | ā(aa) | i | ī(ee) | u | ū | e |
| ఏ | ఐ | ఒ | ఓ | ఔ | అం | అః |
| ē | ai | o | ō | au | am | ah |

## హల్లులు

| | | | | |
|---|---|---|---|---|
| క | ఖ | గ | ఘ | ఙ |
| ka | kha | ga | gha | ṅ |
| చ | ఛ | జ | ఝ | ఞ |
| ca | cha | ja | jha | n̈ |
| ట | ఠ | డ | ఢ | ణ |
| ṭa | ṭha | ḍa | ḍha | ṇa |
| త | థ | ద | ధ | న |
| ta | tha | da | dha | na |
| ప | ఫ | బ | భ | మ |
| pa | pha | ba | bha | ma |
| య | ర | ల | వ | శ |
| ya | ra | la | va | ṡa |
| ష | స | హ | ళ | క్ష |
| sha | sa | ha | ḷa | ksha |

గుండ్రని అందమైన నా లిపి అంతరిస్తోందనే బాధ నాకూ ఉంది. కానీ లిపిని అంకెల్ని యంత్రానికి తగ్గరీతిలో ఆంగ్లేయులు అభివృద్ధి పరిచారు. వాళ్ళ అంకెల్ని మనం ఎలాగూ వాడుతూనే ఉన్నాం. ఇక అక్షరాలను కూడా వాడుకుంటే అధికార భాషగా రోమన్ తెలుగును ఫైళ్ళలో కంప్యూటర్ల ద్వారా అమలు చేయటం ఎంతో సులువవుతుంది. లిపిసమస్య సాకుతో అధికారభాష అమలును ప్రక్కన పెట్టటం కంటే అంతర్జాతీయంగా అమలవుతున్న లిపినే మన భాషకు వాడుకుంటే మేలు జరుగుతుందని ఆశ. రానున్న రోజుల్లో దేశమంతటికీ ఉమ్మడి లిపిగా ఆంగ్లాక్షరాలను ఉపయోగించుకునే విషయమై విస్తృతంగా చర్చలు జరగాలి. దేశ భాషలన్నింటికీ జవసత్వాలను సమకూర్చే నిర్ణయాలు జరగాలని ఆశిద్దాం

భాషల మధ్య పోటీ అనివార్యం అయ్యింది. ఏ భాష నేర్చుకుంటే ఉపాధి లభిస్తుందో, ఆ భాష వైపుకే మనిషి పరుగులు తీస్తాడు. అది అతని అవసరం. తెలుగుభాష మాత్రమే వచ్చిన వాడికి కూడా శాస్త్ర విజ్ఞానం, ఉపాధి లభిస్తుందనే హామీ దొరికిన నాడు తెలుగు తప్పని సరిగా బ్రతుకుతుంది. ఆ మంచి రోజుల కోసం ప్రతి ఒక్కరం ప్రయత్నిద్దాం.

**(గీటు రాయి 11-6-2004)**

## సిగ్గుపడవలసిన విషయం.

"తెలుగు దేశాన్ని పరిపాలించిన వాళ్ళందరూ వాళ్ళ భాషల్లో అధికారపత్రాలు, కార్యకలాపాలు సాగించారు. విధిలేక మనం అనుసరించవలసి వచ్చింది. అంటే మనం ఆది నుంచి చారిత్రకంగానే కాక భాషాసంస్కృతుల్లో కూడా తీవ్రమైన అణచివేతకు గురి అయ్యాము... భాష ద్వారా జాతినంతా ఏకోన్ముఖం చేయవచ్చు. ఒక జాతి ఐక్యతకు ఆజాతి మాతృభాషే ప్రధానకారణమౌతుంది. ఒక జాతి మాట్లాడేభాష ఆజాతి పురోభివృద్ధికి జీవనాడి. మాతృభాష పట్ల అభిమానం లేని జాతి బానిసజాతి కిందలెక్క. పరాధీనపు బతుకులేని దేశంలో ప్రజల వాడుకలో ఉన్నభాషే అధికార పనులకు వినియోగమవుతుంది. పరాధీనపు బతుకుల్లో మన భాష వాడుకునే స్వేచ్ఛ ఉండదు. దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, ఇంకా మనం పరాధీనపు భాషలోనే ఉన్నాం. ఇది ఎంతో విచారించదగ్గ విషయం. సిగ్గుపడవలసిన విషయం.

(డాక్టర్ వెలమల సిమ్మన్న, తెలుగుభాషా చరిత్ర 2004)



# అక్రమ లిపిక్లేశాలు

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు "తెలుగు మెరుగులు" అనే పుస్తకంలో (1948) ఆంధ్ర లిపి సంస్కారము అనే అధ్యాయంలో ఇలా అన్నారు. నేడు వాడుకలో ఉన్న మన తెలుగు లిపి మనకు మిక్కిలి చిక్కులు కలిగించేదిగా ఉంది. పసిపిల్లలకు లిపి నేర్పటం ఎంతో కష్టంగా ఉంది. టైపు రైటింగు నిర్మాణానికి అసౌకర్యంగా ఉంది. వర్ణోచ్చారణ రీతికి గూడా విరోధంగా ఉంది. ఇవన్నీ చిన్న చిక్కులు కావు. ఇ,ఈ లకు పోలికే లేదు. ఇ,ఞ ఒకేలా ఉన్నాయి. ఋ,ౠ లు బు, బూ ల పోలికతో రెండు కొమ్ములు కలిగి పొందికలేక మోటుగా ఉన్నాయి. ఒ,ఓ,ఔలు జ తో పోలిక గలిగి ఉన్నాయి. క వర్గ మంతా భిన్న లిపులతో పోలికేలేని అక్షరాలు... చకు ముద్ది క్రింద ఒత్తిచ్చినచో ఛ అగునని చెప్పుటకు వీలులేదు. క,ఖ,ట,ఠ,త,థ లు అలా లేవు కాబట్టి సాజాత్యబోధము కుదరదు. ఇంత వరసవావిలేని లిపిరూపాలను భిన్న భిన్నముగా నేర్చుకొనుట కష్టమేకదా?... అక్షరాలు వడిగా రాకపోవటంచేత బాలలెందరో బండబారి చదువులో సన్నగిల్లుతున్నారు. బడంటే భయపడుతున్నారు. ఈ లిపి బాధలు వారి హృదయ ప్రసాదాన్ని చెరుస్తున్నాయి. అక్రమలిపి క్లేశాలకు పిల్లల్ని గురిచేసి బాధించకూడదు.. అచ్చుకు తెలుగు లిపిని కూర్చటం చాలా జాగు అవుతుంది. ఇంగ్లీషులో, అరవంలో ఉన్నట్లుగా లిపి సంకేతాలు పక్కపక్కనే (ఒకదాని క్రింద ఒకటి ఉండకుండా) ఉండాలి. ఈ సంకేతాలు గూడా నలభైకంటే మించకుండా ఉంటేనేగాని టైపురైటింగు సాధ్యంకాదు కాబట్టి ఇప్పటి లిపి రీతికి టైపురైటింగు కుదరనే కుదరదు...

....తాతలు తవ్విన బావిగదా అని దానిలోని ఉప్పునీళ్ళే ఎల్లప్పుడూ త్రాగుతూ ఉండొచ్చా? దగ్గరలోనే మంచి నీళ్ళబావి తవ్వుకోకూడదా? అంతేకాదు, ఈనాటి లిపి కూడా ఏమంత స్థిరమైనదికాదు. అయిదొందల ఏళ్ళనాటి లిపికీ మననాటి లిపికీ ఎంతో తేడా ఉంది. ఈనాటి లిపి కూడా ఎన్నో పరిణామాలను పొందుతూ వస్తున్నదే.... అచ్చుల్లో 'అ'కారమొకటి తప్ప మిగతా అక్షరాలన్నీ విడిచిపెట్టాలి. ఇందువల్ల 15రకాల అక్షరాలను పిల్లలు నేర్చుకునే బాధ తగ్గుతుంది."

అచ్చులు:

అ ఆ ఇ ఈ ఉ ఊ



ఋ ౠ ఌ ౡ ఎ ఏ



ఐ ఒ ఓ ఔ



(మరొక తీరు)









హల్లులు

క ఖ గ ఘ ఙ



చ ౘ ఛ జ ౙ ఝ ఞ



ట ఠ డ ఢ ణ



త థ ద ధ న



ప ఫ బ భ మ



య ర ఱ ల ళ



వ శ ష స హ



## నేనూ అక్రమ లిపిక్లేశ బాధితుడినే

చిన్నప్పుడు 'క' దాకా నేర్చుకున్నాను 'ఖ' రాలేదు. సంకా అప్పారావు పంతులు గారు 'ఖ' అనే అక్షరం రానందుకు చావబాదారు. బడి మానేశాను. సంవత్సరంపాటు గాలికి తిరిగాను. తరువాత మా నాన్న బడి మార్చాడు. ప్రేమయ్య మాస్టరుగారు, 'ఖ' రాకపోతే రాక పోయిందిలే మిగతా అక్షరాలు నేర్చుకోమన్నారు. చదువులో ఇక వెనక్కి తిరిగి చూడలేదు. చదువుల పండుగ, అక్షర దీక్ష ఉద్యమాల్లో ఈ సంగతే జనానికి చెప్పేవాడిని. అక్షరాల సంఖ్య తగ్గింది. వత్తులు గుణింతాల్లోని చిక్కు తనం కూడా తగ్గాలి. తెలుగు బాలల అక్షరాభ్యాసం మరింత సులువు కావాలి. ఈ తరం పెద్దలు త్యాగం చేస్తే రేపటి పౌరులకా ఫలాలు దక్కుతాయి. తెలుగు భాష యంత్రాల కనువైన భాషగా మారి వ్రాతలోనూ, ముద్రణలోనూ వేగం పుంజుకుంటుంది. ఇంగ్లీషుకు ప్రపంచంలో ఎక్కడైనా ఒకే కీ బోర్డ్ ఉంటుంది. కాని తెలుగుకు ఎన్నో రకాల కీబోర్డులు ఉన్నాయి. ఆపిల్, మాడ్యులర్, ఫోనొటిక్, ఐలీప్ .... లాంటివి. కంప్యూటర్‌లలో ఒక కీబోర్డ్ అలవాటైన వాళ్ళకు మరో కీబోర్డు కొత్తగా ఉంటుంది. అది నేర్చుకునేందుకు సమయం పడుతుంది. లిపి సంస్కరణ జరిపాక ఒకే తెలుగు కీబోర్డును స్థిరపరచాలి. అప్పుడే మన కీబోర్డుపై నిపుణులు తయారవుతారు.

**(గీటురాయి 23-7-2004)**

## తెలుగు భాష కు వైభవం తేవాలి

"తెలుగువారికి భాషాభిమానం చాలా తక్కువ. దేశంలో మిగిలిన భాషలతో పోలిస్తే తెలుగుకు ఆదరణ మరీ తక్కువ. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడినా కూడా భాషాభివృద్ధి సరిగా జరగలేదు. ఉత్తరాధి రాష్ట్రాలు హిందీని రాజభాషగా గౌరవించి విశేష ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నాయి. రాజ్యాంగ విధానంలో మన భాషనెలా పోషించుకోవాలో విజ్ఞులు సూచించాలి. తెలుగు భాషకు వైభవం కలిగే కృషి జరగాలి".

(నందమూరి తారక రామారావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 23-4-1995)



## అయ్యయ్యో...తెలుగు

ఈనాడు దిన పత్రికలో ఈ శీర్షికతో 22-06-2004 న పడిన వార్తలోని అంశాలు ఇలా ఉన్నాయి.

"చట్టాలు రూపొందించే శాసనసభలోనే రాష్ట్ర అధికారభాష తెలుగుకు అవమానం జరిగింది. ఒక బిల్లు ముసాయిదా ప్రతిని ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన క్రమంలో భాషాదోషాలు చోటుచేసుకున్నాయి. అనువాదాలు చేయటంలో భాషాపరమైన ఉదాసీన వైఖరినీ, తప్పిదాలు అలవోకగా జరిగిపోవటాన్నీ సమావేశం తప్పుపట్టింది. ముసాయిదా రూపకర్తలు ఆంగ్లంలో ఆలోచించి ఆంగ్లంలో రచించి వాటికి తర్జుమాలు చేయించడం... అది కూడా భాషపై చిత్తశుద్ధి, నిబద్ధత లేకుండా జరుగుతుండటంవల్ల ఈ దుర్గతి పడుతోందని సీనియర్ సభ్యుడయిన చెన్నమనేని రాజేశ్వరరావు పేర్కొనడం వాస్తవస్థితికి అద్దం పడతోంది. అలాకాకుండా తెలుగు అధికార భాష అయిన రాష్ట్రంలో తెలుగులో ఆలోచించి తెలుగులో రచించిన ప్రతుల్ని ఆంగ్లంలోకి అనువదించడం సమంజసంగా ఉంటుందని ఆయన సూచించారు.

శాసనసభకు సంబంధించి, వివిధ సమాచార పత్రికల్లో ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రతుల్లో, బిల్లు ముసాయిదాల్లో వాడుతున్న తెలుగుభాష దారుణంగా ఉంటోందని, వాడుక భాషే కనిపించడం లేదనే విమర్శలున్నాయి. అనువాదాలు నాణ్యత కొరవడి పేలవంగా, మృతభాషలా ఉంటున్నాయని యువ సభ్యులతోపాటు సీనియర్ ఎమ్మేల్యేలూ అభిప్రాయపడుతున్నారు. సరళమైన వాడుక భాష బాగా వృద్ధిచెందిన ఈ రోజుల్లో కూడా పడికట్టు పదజాలంతో ఉండే శాసనసభా ప్రతుల్ని రూపొందిస్తున్నారనీ, వాటిని చదవలేక పోతున్నామనీ వారంటున్నారు. మచ్చుకొక భాగం ఇలా ఉటుంది:-

2. ఉపపరిచ్ఛేదములు (3) మరియు (4) యొక్క నిబంధనలకు లోబడి ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంత) జిల్లా పోలీసు చట్టము 1329 ఫసలీ ఈ చట్టము ప్రారంభమైనట్టి నుండి సైబరాబాదు మహానగర ప్రాంతములకు వర్తించుట సమాప్తం కావలెను.

3. అట్టి సమాప్తము వలన (ఎ) సైబరాబాదు మహానగర ప్రాంతములో కూడియున్నట్టి ప్రాంతము విషయములో ఆంధ్రప్రదేశ్ (తెలంగాణాప్రాంత) జిల్లా పోలీసు చట్టము 1329 ఫసలీ పూర్వ అమలుకు ఎట్టి ప్రభావము ఉండదు...

ఇదే క్రమంలో సాగుతుంది. తెలుగు తెలిసిన వారికెవరికైనా ఇది అర్థమౌతుందా? అని శాసన సభ్యుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.(ఈనాడు 22-06-2004)

తెలుగు రాష్ట్రంలో చట్టాలు చేయవలసిన తెలుగు శాసన సభ్యులకు వారి భాషే వారికి అర్థంకాని రీతిలో అనువాదం చేస్తున్నారు, మన తెలుగు పండితోద్యోగులు.

వీళ్ళు తమ ఇళ్ళల్లో ఇలాంటి భాషే మాట్లాడితే భార్యాబిడ్డలు కూడా పిచ్చి పట్టిందంటారు.

ఉపపరిచ్ఛేదము, అర్థాధికారలేఖ, కార్యవర్తనములు, ఉపవలయాదికారి.... లాంటి సంస్కృత పదాలతో తెలుగు జనాన్ని హడలగొడుతున్నారు. ఇంతకంటే వాడకంలో ఉన్న ఇంగ్లీషు పదాలనే వాడితే ఎంతో సుఖంగా ఉంటుంది: ప్రజలు వాడని కృతకమైన సంస్కృతపదాలు తెలుగు అనువాదం పేరుతో తెలుగు చట్టాలలోకి పండితులు చొప్పించినా, అవి జనం నాలుకల పైకి చేరి నాట్యం చేయడం లేదు. వేమన పద్యం తెలుగు వాడి నోటికి వచ్చినట్లుగా నన్నయ పద్యం వస్తుందా? రానేరాదు ఎందుకని? మన తెలుగు అనువాదకులు తమను తామే ప్రశ్నించుకోవాలి. ఎంత అర్థంగాకుండా సంస్కృత పదాలతో అనువాదం చేస్తే అంత గొప్ప అనువాదకు లనుకుంటారేమో మరి.

ఈ పరిస్థితి మారాలంటే చట్టం ముసాయిదా బిల్లు ముందు తెలుగులోనే తయారై ఆ తరువాత ఆంగ్లంలోకి అనువదించబడాలి. సమస్య తెలుగు వాళ్ళది. ఆ సమస్య పరిష్కారం కోసం ఏం చెయ్యాలను కుంటున్నారో చెప్పే చట్టనిర్మాతలు తెలుగు శాసన సభ్యులు. మరి చట్టం ఇంగ్లీషులోనే మొదట తయారవుతున్నదేమిటి? ప్రజలు తెలుగులో మొరపెడుతున్నారు. శాసనసభ్యులు, మంత్రులు తెలుగులోనే చట్టం ఇలా చెయ్యాలని చెబుతున్నారు. వాళ్ళ మాటల్లోనే మొదట తెలుగులో చట్టం చేస్తే, చట్టం వాడుక భాషలో సజీవభాషలో అందరికీ అర్థమయ్యే తెలుగులో తయారవుతుంది. ఆ తరువాత ఇంగ్లీషులోకి అనువదించుకోవచ్చు.

కొంత మంది ఉత్తరాది అధికారుల ఆంగ్ల ఉచ్చారణ పిసాపిసామని పిల్లిని పిలిచి నట్లుంటుంది. జర్మనీవాళ్ళు, అరబ్బులు మాట్లాడే ఇంగ్లీషు ట,డ అనే అక్షరాలు పలకలేని నత్తివాళ్ళ పద్ధతిలో ఉంటుంది. ణ,ళ, అనే అక్షరాలు ఎన్నో భాషల వాళ్ళుపలకనే లేరు. వాళ్ళకా ధ్వనులే లేవు. ఇన్ని రకాల శబ్దాలుండీ తెలుగువాడి భాష పేదదయ్యిందే! ఒకడు ఇంగ్లీషులో, ఒకడు హిందిలో, మరొకడు సంస్కృతంలో, ఇంకొకడు ఉర్దూలో తెలుగువాడిని హడలగొడుతున్నారు. తెలుగుకంటే ఈ భాషలన్నీ గొప్పవి అనే భావం కల్పించారు. తెలుగును వదిలేసి వాటిని నేర్చుకుంటేనే బ్రతుకుతెరువు, గౌరవం దొరుకుతాయనే సామాజిక వాతావరణం సృష్టించారు. తెలివి ఉండీ పామరుడయ్యాడు తెలుగువాడు. ఉపాయముండీ మూగ వాడయ్యాడు తెలుగువాడు. నోరున్నా తెరువలేడు. మెదడు మొద్దు బారింది. సొంత భాషలో స్వేచ్ఛగా జవాబులిచ్చే మేధావి, ఇంగ్లీషులో వేసే ప్రశ్న అర్థంకాక, ఇంగ్లీషులో చెప్పటానికి భాషరాక ఏమీ తెలియని అజ్ఞాని అనిపించు కోవటం ఎంత అన్యాయం? ప్రజలు ఎన్నుకొని తమ నాయకులుగా అసెంబ్లీకి, పార్లమెంటుకీ పంపిన తెలుగువాళ్ళు సైతం, ఇంగ్లీషో, హిందీనో వస్తేనే చట్టసభల్లో రాణించగలుగుతున్నారు. మాతృభాషలో నోరుతెరవలేని దీనస్థితి వారిది.



ఇక ఇప్పుడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇంగ్లీషు మీడియం మొదలు పెడుతున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ప్రకటించారు. భేష్! ఆ ఉన్న కాస్త తెలుగు ఇక తుడిచిపెట్టుకుపోయే రోజులు రాబోతున్నాయన్న మాట. అంతేలే, ఎన్ని భాషలు చరిత్రలో గతించిపోలేదు. ఇంగ్లీషొచ్చినోడే ఘనుడు, బలవంతుడు, భగవంతుడు అన్న మానసిక స్థితికి ఎన్నో దేశాలొచ్చాయి. బకాసురుడికి వంతుల వారీగా ఆనాడు జనం విందైనట్లు ఈనాడు ఇంగ్లీషుకి వంతులవారీగా భాషలు బలైపోతున్నాయి.

ఎలిమెంటరీ స్కూలు నుంచే ఇంగ్లీషు మీడియంలో చదివిన వాళ్ళకు మాతృభాష తెలుగే అయినా, తెలుగు లిపి బాగా రాదు. వచ్చినా మన లిపిలో చదవటం, రాయటం వారికి బాగారాదు. ఇక మన భాష శబ్దరూపంలోనే చలామణిలో ఉంటుంది. లిపి వాడకం తగ్గాక భాష గ్రంథస్తం కాదు. గ్రంథస్తంకాని భాష క్రమేపీ నశిస్తుంది. 2010 నాటికి ఇండియాలో ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళసంఖ్య అమెరికా మొత్తం జనాభాకంటే ఎక్కువ ఉంటుందట. కాబట్టి మన భావితరాల వాళ్ళు ఇంకా, ఇంకా ఇంగ్లీషునే ఆశ్రయిస్తుంటారు. అలాంటప్పుడు వారికి మన తెలుగు పుస్తకాలను రోమన్ తెలుగు (తెలుగు వాక్యాలను ఇంగ్లీసు లిపిలోకి మార్చటం)లో ప్రచురించి ఇస్తే, మన భాష మరికొన్ని వందల ఏళ్ళు నిలిచి ఉంటుంది. మన తెలుగు చాటువులు, సామెతలు, జాతీయాలు, పద్యాలు, పాటలు, ఆంగ్ల లిపిలోకి మార్చి భద్రపరచటం వల్ల తెలుగు అంతరించి పోకుండా కాపాడవచ్చు. ఎన్నో భాషల బైబిళ్ళు రోమన్ లిపిలోకి మార్చారు.

ఉద్యోగాల కోసం, గౌరవం కోసం, పాలనా సౌలభ్యం కోసం అంతా ఇంగ్లీషు వైపు ఎగబడి పరుగులుతీస్తున్నారు. కాబట్టి, మన రాష్ట్రప్రభుత్వం కూడా ప్రజల ఆంగ్ల కాంక్షకు అనుగుణంగానే నడుచుకుంటున్నది కాబట్టి, మన భాషను ఇంకొంత కాలం రక్షించుకోటానికి ఆఖరి ప్రయత్నంగా ఈ రోమన్ తెలుగులోకి మన మంచి పుస్తకాలను మార్పించి పుణ్యం కట్టుకోవాలి.

ఈనాడు మన శాసనసభలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు, జానారెడ్డిగారు, రోశయ్య గారు, ధర్మాన ప్రసాదరావు గారు ఇంకా ఎంతో మంది శాసనసభ్యులు చక్కని తెలుగులో సులువుగా మాట్లాడుతున్నారు. తెలుగు ప్రజలు వారిమాటల్ని ఆనందంగా ఆలకిస్తున్నారు, అర్థం చేసుకుంటున్నారు. కారణం వీళ్ళందరూ గ్రాంధికంలో కాకుండ వాడుక భాషలో మాట్లాడుతున్నారు. వీళ్ళువాడే వాడుక పదజాలంతోటే చట్టాలు తయారైతే తెలుగు జాతికదే పదివేలు.

ప్రక్కన కర్ణాటకలో నాలుగవ తరగతివరకు కన్నడంలో ప్రాథమిక విద్యా బోధన తప్పనిసరి చేశారు. మహారాష్ట్రలో ఎనిమిదవ తరగతి వరకు మరాఠీ భాషను నిర్బంధం చేశారు. తమిళనాడులో ప్రభుత్వ పాఠశాలల్లోగానీ ప్రభుత్వ సహాయం పొందే ప్రైవేటు పాఠశాలల్లోగాని ఆంగ్ల మాధ్యమం అనుమతించడం లేదు. పైగా ఇంజనీరింగ్, వైద్య

శాస్త్రాల్లో కూడా తమిళ మాధ్యమం ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. మన ఇరుగు పొరుగు రాష్ట్రాలు వారివారి భాషల రక్షణ కోసం ఇలాంటి చర్యలు తీసుకుంటుంటే, 'ఆంగ్ల ప్రదేశ్' సాధన కోసం మన వాళ్ళు శక్తివంచన లేకుండా కృషి చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు.

'తెలుగుతల్లి' అని ఎంతో గౌరవంతో మన భాషను పిలుచుకుంటున్నాం. కన్న తల్లిలాగా మన భాషను గౌరవించాలనుకున్నాం కాబట్టి మన బాసకు తెలుగుతల్లి అనే పేరు పెట్టాం. తన తల్లి బాగోలేదని మరొకడి తల్లిని గౌరవించేవాడిని ఏమనాలి? తన తల్లిని పస్తులుంచి మరొకడి తల్లికి భోజనం పెట్టే వాడిని ఏమనాలి? తన తల్లి రోగాలతో కృశిస్తుంటే మరొకడి తల్లికి బలవర్ధక ఔషధాలను సమకూర్చే వాడిని ఏమనాలి? నీ వంటికి బట్టలుకూడా పెట్టకుండా ఆంగ్లామ తల్లికి అలంకరణలు చేస్తూ ఉన్న నీ తెలుగుబిడ్డల్ని ఏమనాలో నీవే చెప్పు తెలుగుతల్లీ!

**(గీటురాయి 16-7-2004)**

## సొంత గెడ్డపై బానిస

తెలుగు భాష మాట్లాడితే
ఏమిటా ఘోష అంటారు
ఆంగ్లంలో వాగితే
వినసొంపుగుంది అంటారు
సభలలో ఊదరగొట్టి ఊరిస్తారు
మాతృభాషపై ప్రేమ నటిస్తారు
అందలం అందగానే
మందమతులై షరా మామూలే
దేశభాషలందు తెలుగు లెస్స
సొంతగెడ్డపై తెలుగు ఒక బానిస

– కరుకు సత్తిరాజు

**(వార్త, విశాఖపట్నం 7-08-2004.)**



# తమిళ నాయకుల్ని చూసైనా నేర్చుకోవాలి!

"తమిళాన్ని శాస్త్రీయ భాషగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దేశ భాషల్లో ఈ తరహా హోదా పొందిన తొలిభాష ఇదే. ప్రాచీనత, ఘనతను బట్టి సంస్కృతంతో సహా మరిన్ని భాషలకు ఈ గుర్తింపు నివ్వాలని యోచిస్తున్నారు. ఇందుకు కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. సంబంధిత భాషకు కనీసం వెయ్యేళ్ళ చరిత్ర ఉండాలి. ఆ భాషలోని సాహిత్య ప్రక్రియ తనదైన శైలిలో ఉండాలి. అరువు తెచ్చుకున్నది కాకూడదు వీటితోపాటు మరికొన్ని పరిమితులకులోబడి... సాహిత్య అకాడమీలోని ఓ నిపుణుల బృందం భాషల "శాస్త్రీయత"ను నిర్ణయిస్తుంది. శాస్త్రీయ భాషలకు చెందిన పండితులకు రెండు అంతర్జాతీయ పురస్కారాలు ఇవ్వాలని కూడ కేంద్ర కేబినెట్ తీర్మానించింది".
(ఈనాడు 18-9-2004)

"ఈ శాస్త్రీయ భాషపై పరిశోధన విద్య కోసం ఒక కేంద్రాన్ని నెలకొల్పాలని, కేంద్రీయ విశ్వవిద్యాలయాలన్నింటిలో ఆచార్య పీఠాలను నెలకొల్పాలని యు.జి.సి.ని కోరినట్లు కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి తెలిపారు."
(ది హిందూ 18-9-2004)

27-5-2004న ఐక్య ప్రగతిశీల కూటమి ఉమ్మడి కనీస ప్రణాళికలో తమిళాని కిచ్చిన హామీ కేవలం నాలుగు నెలల్లోనే అమలయ్యేలా తమిళ మంత్రులు కృషి చేశారు. భాషల శాస్త్రీయతను నిర్ణయించే సాహిత్య అకాడమీ నిపుణుల బృందం దేశంలోని అన్ని భాషల నుండి ప్రతిపాదనలకు ఎప్పుడు స్వీకరించింది? అతి ప్రాచీనమైన సంస్కృతాని కంటే, దేశంలో రాజభాషగా రుద్దబడుతున్న హిందీకంటే, ముందుగానే తమిళాన్ని శాస్త్రీయ భాషగా గుర్తించటం వెనుక తమిళ మంత్రుల వత్తిడి తప్పని సరిగా ఉంది. వారి భాషకు వారు గుర్తింపు తెచ్చుకున్నారు. అందుకు ఎవరూ విచారపడనక్కర లేదు. కానీ మన తెలుగు భాషకు కూడా అలాంటి గౌరవం దక్కాలని మన తెలుగు మంత్రులు గట్టిగా అడగాలి. ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డిగారు అసెంబ్లీలోనూ ప్రజలతోను మంచి తెలుగులో మాట్లాడుతున్నారు. ఎంత క్లిష్టమైన విషయమైనా అతిసాధారణమైన తెలుగు భాషలో ఆయన మాట్లాడటం తెలుగు నాయకులందరికీ ఆదర్శనీయం.

మన స్పీకర్ సురేష్‌రెడ్డి గారికి, కేంద్ర సమాచారశాఖ మంత్రి జైపాల్‌రెడ్డి గారికి తెలుగుకంటే ఇంగ్లీష్ బాగా వస్తుందేమో అనిపిస్తుంది. మరివాళ్ళు చదివిన చదువులు అలాంటివి. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం కూడా కొన్నిచోట్ల మొదలుపెట్టారు. భవిష్యత్తులో ఇక మనకొచ్చే నాయకులు పూర్తిగా ఇంగ్లీషులోనైనా మాట్లాడుతారు, లేదా "తెల్గిష్" (50% తెలుగు 50% ఇంగ్లీష్) లేదా "తెంగ్లీష్" (10% తెలుగు 90% ఇంగ్లీష్)లోనైనా మాట్లాడుతారు. తెలుగుకు శాస్త్రీయ భాష హోదా రావటం

మాట దేవుడెరుగు, ఉన్నా ఆ కొద్దిపాటి తెలుగు కూడా ఊడ్చుకుపోయే దుర్దశ దాపురించింది. మన భాషను మనమే పాడుచేసుకుంటూ పోతున్నాం.

ఒక భాషకు శాస్త్రీయత కేవలం ప్రాచీనతను బట్టి మాత్రమే రాదు. ఆ భాష ప్రజల వాడకానికి అనువుగా ఉండాలి. వారి దైనందిన వ్యవహారాలలో ఆ భాష విరివిగా చలామణీ కావాలి. శాస్త్ర సాంకేతిక రంగాలలో తగిన పారిభాషిక పదాలు ఆ భాషలో పుట్టాలి. పాలనారంగం అంతా ఆ భాషలోనే నడవాలి. ప్రజల మనస్సు, వాక్కు, కర్మలన్నీ ఆ భాషతో నిండాలి. అప్పుడే ఆ భాషకు ఘనత, శక్తి, అలవోకగా వస్తాయి.

ఇటీవల ఒరిస్సాలోని గోపాలపురం బీచ్‌కెళ్ళాను. అక్కడ చేపలు పట్టే వాళ్ళంతా తెలుగు మాట్లాడుతున్నారు. వాళ్ళు పట్టిన చేపలన్నింటికీ కోనాలు, పారలు, చందువాయలు, మొదలైన పేర్లుపెట్టి పిలుస్తున్నారు. ఈ పేర్లు మన తెలుగు నిఘంటువుల్లో కనబడవు. భాషకు శక్తిరావాలంటే నిఘంటువు పెరగాలి. ప్రజలు మాట్లాడే ఏ పదాన్నీ నిఘంటువు వదలిపెట్టకూడదు.

హైదరాబాద్‌లోని "ఫ్లైఓవర్"లను చూసి కొందరు పల్లెవాసులు "పైదారులు" అన్నారు. తాను చూసిన వస్తువుకు తన భాషలో ప్రతి మనిషీ ఒకపేరు పెట్టుకుంటాడు. ఆ పేరును గౌరవించి నిఘంటువులో చేర్చుకున్న జాతి, ఆజాతి భాషలు బలపడ్డాయి. రాజ్యాలు ఏలాయి. ఇది చరిత్ర నేర్పిన సత్యం. మన పాలకులు, సాహితీవేత్తలు, అధికారులు ఈ సత్యాన్ని గ్రహించి ముందుకు నడవాలి.

ఇప్పుడు గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలకు పరీక్షలు జరగబోతున్నాయి. డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇస్తే, తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపే వాళ్ళు రంగప్రవేశం చేస్తారు. కొంతవరకైనా ఆఫీసుల్లో తెలుగు బ్రతుకుతుంది. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలొస్తాయన్న ఆశతో కొంత మందైనా తెలుగులో చదువుతారు. తెలుగులో చదివిన అధికారులు కార్యాలయాల్లో జరిగే పనులన్నిటికీ "కొత్తపదాలు" పుట్టిస్తారు. తెలుగు పదకోశాలు అమలవుతాయి. పరిపాలనకు పనికొచ్చే శాస్త్రీయ తెలుగు తయారవుతుంది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలనే పట్టుదల, ఆకాంక్ష ఉంటే తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయాలి.

**ఇక మీదట ఇలా చేయండి!**

ఒకసారి నేను బస్సులో వెళ్తుంటే, కండక్టర్‌తో కొంతసేపు తెలుగులో వాదించిన ఒక ప్రయాణికుడు, కోపావేశం ఎక్కువకాగానే నోరుమూయించడానికి ఇంగ్లీషులో మాట్లాడ్డం ప్రారంభించాడు. అప్పుడు కండక్టరు "ఏంటీ బొంగు, ఇంగ్లీషులో మాట్లాడతావ్. చాతనైతే తెలుగులో మాట్లాడు" అన్నాడు. దెబ్బతిన్న ప్రయాణికుడు నోరుమూసుకున్నాడు.

**అద్దేపల్లి రామమోహనరావు (వార్త ఆదివారం 26-9-2004)**



# అధికార భాషా సంఘానికి అధికారం కావాలి!

రాష్ట్ర అధికార బాషా, సంఘం ప్రస్తుత అధ్యక్షుడు ఏబికె ప్రసాద్‌గారు ప్రభుత్వానికి కొన్ని మంచి సిఫారుసులు చేసారు. (ఈనాడు: 19-5-2005)

1) తెలుగు మీడియంలో చదివిన వారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. 2) ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో కూడా అన్ని స్థాయిల్లో పదో తరగతి వరకు తెలుగు మీడియం ఉండాలి. 3) వ్యాపార సంస్థలు, దుకాణాలన్నీ తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయకపోతే వాటి లైసెన్సులు రద్దు చేసే అధికారం కన్నడ అధికార భాషా సంఘానికి ఉన్నట్లుగా, తెలుగు అధికార భాషా సంఘానికి కూడా ఉండాలి. 4) తమిళాన్ని ప్రాచీన భాషగా గుర్తించిన పద్ధతిలో తెలుగును కూడా ప్రాచీన భాషగా కేంద్రం గుర్తించాలి. దీని కోసం రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చెయ్యాలి. 5) తమిళనాడులో తెలుగు మాట్లాడే వాళ్ళు రెండవ స్థానంలో ఉన్నందున ఆ రాష్ట్రంలో తెలుగును రెండవ అధికార భాషగా ప్రకటించాలి. 6) రాజ్యాంగంతో సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను వాడుక బాషలోకి తేవాలి. 7) ఎనిమిదో షెడ్యూల్డ్‌లో పేర్కొన్న బాషలన్నిటినీ అప్పటికప్పుడు తర్జుమా చేసే విధంగా పార్లమెంటులో ఏర్పాటు చేయాలి. 8) స్థానిక న్యాయస్థానంలో తీర్పులు అధికార భాషలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. 9) మండల స్థాయి నుండి సచివాలయం వరకు అధికార భాషను అమలు చెయ్యని అధికారులపై చర్యలు తీసుకునే అధికారం అధికార భాషా సంఘానికి ఇవ్వాలి.

వావిలాల గోపాలకృష్ణయ్య గారి దగ్గర నుండి ఏబికె ప్రసాద్ గారి వరకు అధికార భాషా సంఘం అధ్యక్షుల్లో ఎక్కువ మంది ఈ కోర్కెలను పదేపదే ప్రభుత్వానికి విన్నవించారు కాని ఫలితం దక్కలేదు. ఇవి కొత్తగా కోరిన కోర్కెలు కావు. దీర్ఘకాలంగా అమలుకు నోచుకోని తెలుగు ప్రజల డిమాండ్లు. ఇప్పటికైనా పాలకులు ఈ కోర్కెలు తీర్చి తెలుగుకు అధికారం ఇస్తారని ఆశిద్దాం!

భాషను వాడటానికి అనుకూలంగా మార్చినపుడు ప్రజలే ఆ భాషను అధికారంలోకి తెస్తారు. వాడకానికి అనువుగా భాషను మార్చడం అంటే అనుదిన జీవితంలో, శాస్త్ర, సాంకేతిక విషయాలలో అవసరమైన పదసంపద నిరంతరం సమకూర్చుకుంటూ పోవటం, కంప్యూటర్లలో ఈ భాషను ఎటువంటి ఆటంకాలు లేకుండా సులభంగా ఉపయోగించ గలగటం కోసం లిపిని తీర్చిదిద్దటం, లేదా ఇప్పటికే మనలో పాతుకుపోయిన అంతర్జాతీయ ఆంగ్ల లిపిని జాతీయం చేసుకోవటం. ఇది తప్పు, ఇది ఒప్పు, ఇది సంప్రదాయం, ఇది

అప్రాచుర్యం అంటూ పండితులు చర్చలు జరుపుతూ ప్రజల్ని నియంత్రిస్తూ పోతే భాష వర్ధిల్లదు. ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా తమ భాషను ఎన్ని రూపాల్లోనైనా వినియోగించుకునే అవకాశం ఇవ్వాలి. విస్తృతంగా వాడబడే భాష వికసిస్తుంది. విడనాడబడిన భాష నశిస్తుంది. తెలుగు లిపి రాని తెలుగు వాళ్ళు ఇంగ్లీషు వారైనా సరే తెలుగు భాషను అమలు చేయవచ్చు

ఒక భాష ఏ లిపిలోనైనా వ్రాయవచ్చు. భాష భాషే, లిపి లిపే. భాషకు లిపికి సంబంధం శాశ్వత సంకెల లాగ చేయకూడదు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, కాకతీయుల నాటి తెలుగు లిపి ఇప్పుడుందా? ఒకవేళ ఆనాటి లిపిలోకి నేటి తెలుగు సాహిత్యాన్ని మార్చితే చదవగలిగే వారున్నారా? ప్రయత్నిస్తే చదవచ్చు. కాని అది కొద్దిమంది పరిశోధకులకు మాత్రమే పరిమితమై ప్రజాబాహుళ్యానికి సాధ్యం కాదు. అధికార భాషా సంఘానికి అపరిమితమైన అధికారాలిచ్చి చిత్తశుద్ధితో పని చేసే అధికారుల్ని నియమిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

రోమన్ ఉర్దూలో ఉన్న బైబిల్ చూసాను. నాకు ఉర్దూ రాదు, చదవటం అసలే రాదు. కాని ఆ బైబిల్ చదవగలిగాను. కారణం ఆ ఉర్దూ ఇంగ్లీషు లిపిలో ఉండటం. ఈ రకంగా ఒక భాషను మరో భాష లిపిలోకి మార్చడాన్ని లిప్యంతరీకరణ (Transliteration) అంటారు. వత్తులు, గుణింతాలతో బాధలు పెడుతున్న తెలుగు లిపి క్లేశాలకీ పద్ధతి సిద్ధౌషధంలాగా పనిచేస్తుంది. మనకు ఇష్టమున్నా లేకపోయినా ఆంగ్ల లిపి భారతీయు లందరికి వచ్చేసింది. ఆ ఆలు రాకపోయినా ABCD లు ఇండియా అంతటా అలుముకు పోయాయి. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌లు వచ్చాక ABCD లేకుండా ఎవరూ ఏ పని చేయలేని పరిస్థితి దాపురించింది. ఒకవేళ ఎవరి లిపి వాళ్ళు వాడుకుందా మనుకుంటే రక రకాల లిపి క్లేశాలు ఎదురౌతున్నాయి. భాష అర్థం కాకపోయినా చదవగలిగే స్థాయికి వాడగలిగే స్థాయికి మెజారిటీ జనాన్ని చేర్చవచ్చు. అయితే ఈ పద్ధతికి అధికార భాషా సంఘం ఆమోద ముద్రవేస్తే అధికారులు ముందుకొచ్చి అమలు చేస్తారు. ఆమోద ముద్ర వేసే అధికారాన్ని అధికార భాషా సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టాలి. ఉర్దూ ఇండియాలో పుట్టిన భాష. అయితే అరబీ, ఫారశీ భాషల లిపుల్ని వాడుకుంది. గిడుగు రామ్మూర్తి పంతులుగారు సవరభాషకు మరో లిపి తయారుచేసారు. లిపుల సంఖ్య ఎంత తగ్గితే ప్రపంచ ప్రజలకు అంత మేలు జరుగుతుంది. లిపినే భాషగా భావించే సంకుచితత్వం పండితులు వదిలేస్తే భాషలు స్వేచ్ఛగా నర్తిస్తాయి. అక్షరం ముక్క రాకపోయినా అయిదారు భాషలు మాట్లాడే వాళ్ళున్నారు. భాష వాడకానికి



అక్షరాలే ఆటంకాలైతే ఆ లిపి బాధలు తొలగించే పనిని అధికార భాషా సంఘం ఎందుకు చేపట్టకూడదు?

మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ భారతీయ భాషల్లో వాడకంలోకి తెస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆంధ్ర-ఆంగ్ల యంత్రానువాదం కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుమారుడు మళ్ళ ప్రశాంత్ కిరణ్ ఇటువంటి సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి ప్రశంసలు పొందాడు. కంప్యూటర్ లోని ఇంగ్లీషు టెక్స్ట్‌ను తెలుగులోకి తుర్జుమా చేయటం, వెబ్ పేజిలు తెలుగు లిపిలో చూడటం, డౌన్‌లోడ్ చేసుకున్న ఇంగ్లీష్ ఫైళ్ళను తెలుగు లిపిలో పొందటం, తెలుగు టెక్స్ట్‌కు ఇంగ్లీషు లిపిలో Transliteration పొందటం ఈ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకతలు. ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ మెంబర్ కిరణ్ చంద్ర (స్వేచ్ఛ సాఫ్ట్‌వేర్)తో ప్రశాంత్ కిరణ్‌ను కలిపాను. వీళ్ళంతా ఒక గ్రూపుగా ఏర్పడి తెలుగు సాఫ్ట్‌వేర్‌ను మరింత అభివృద్ధి పరచాలని కోరాను. వాళ్ళు ఆ ప్రయత్నంలో ఉన్నారు. ఇలాంటి నిపుణుల్ని అధికార భాషా సంఘం ఉపయోగించుకోవాలి. ఇందుకోసం నిధులు కేటాయించాలి.

అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో నిరంతరం వాడుక భాషపై పరిశోధన జరుగుతూ ఉండాలి. వివిధ ప్రభుత్వ శాఖల్లో అవసరమైన తెలుగు పదకోశాల్ని ఎప్పటికప్పుడు తాజా పరుస్తూ, వాటిని కంప్యూటర్లలో వాడేటప్పుడు తలెత్తే సమస్యలకు సత్వర పరిష్కారాలను సమకూర్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ ఉండాలి. ఛందస్సుతో కూడిన సాహిత్యం పండితులకు వదిలేసి, ప్రజలు మాట్లాడే భాష పరిపాలనా రంగంలోకి వచ్చేందుకు, అధికారులంతా ఆ భాషను కార్యాలయాల్లో వాడేందుకు ఎక్కడెక్కడ ఎలాంటి ఆటంకాలు వస్తున్నాయో కనుక్కోవాలి. ఉద్యోగుల్నే అడగాలి ఇంకా ఏం చేస్తే బాగుంటుంది అని. మంచి మంచి సూచనలు వస్తాయి. అమలు చెయ్యాలి. తెలుగు మీడియంలో చదివిన వాళ్ళకు మాత్రమే (చదివినా కూడా) ప్రభుత్వ ఉద్యోగాలిస్తామంటే తెలుగెందుకు చదవరు? సంతోషంగా చదువుతారు. తెలుగు బిడ్డలకా సంతోషం నిలవాలంటే అధికార భాషా సంఘం కోరిన కోర్కెలు తీర్చాలి. దానికి అధికారం ఇవ్వాలి.

**(గీటురాయి 3-6-2005)**

# ఆంగ్లప్రదేశ్‌కు స్వాగతం

"విశాఖపట్నం కార్పోరేషన్ పరిధిలోని 97 ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి 1, 2 తరగతుల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన ప్రారంభిస్తారు. దశలవారీగా అన్ని తరగతులకు ఇది విస్తరిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్ని పూర్తి ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళుగా మార్చడం మన రాష్ట్రంలో ఇంతవరకు ఎక్కడ జరగలేదు. దేశంలో చాలా రాష్ట్రాల్లో ఇలాంటి విధానం అమల్లో లేదు. ఆ ఘనత పూర్తిగా విశాఖ నగరపాలక సంస్థకే దక్కుతుంది. వాస్తవానికి ఇంగ్లీష్ మీడియం బోధనకు నగరపాలక సంస్థ గత సంవత్సరమే శ్రీకారం చుట్టింది. కార్పోరేషన్ హైస్కూళ్ళలో ఆరు ఏడు తరగతుల పిల్లలకు ఆంగ్లంలో బోధన ప్రారంభించింది. చిన్నప్పటినుంచే ఇంగ్లీషులో బోధిస్తేనే ప్రయోజనం ఉంటుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నగర పాలక సంస్థ కమీషనర్ శ్రీకాంత్ వివరించారు. కార్పోరేషన్ స్కూళ్ళలో ఇకపై అన్ని సబ్జెక్టుల్ని ఆంగ్లంలోనే బోధిస్తారు. తెలుగు ఒక పాఠ్యాంశంగా మాత్రమే ఉంటుంది. ఒకటి, రెండు తరగతులకు బోధిస్తున్న 150 మంది టీచర్లకు ఇంగ్లీష్ మీడియంలో బోధింటానికి ప్రైవేటు పాఠశాలల టీచర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తారు." (ఈనాడు, విశాఖపట్నం 22-5-2005)

"గవర్నమెంటు డిగ్రీ కాలేజీల్లోని మన ఇంగ్లీషు లెక్చరర్లకు యాంకీ యాక్సెంట్ (అమెరికన్ యాస) నేర్పటానికి త్వరలో హైదరాబాదుకు అమెరికా నుంచి నిపుణులు రాబోతున్నారు. కాలేజీ విద్యా కమీషనరేట్ ఉద్యోగులు వివిధ కాలేజీల నుండి లెక్చరర్లను ఈ శిక్షణ కోసం ఎంపిక చేస్తున్నారు. మన ఇంగ్లీషు లెక్చరర్లకు ఇంగ్లీషు ఎంత బాగా వచ్చినా ఆంగ్లేయుల యాస రాలేదు. పిల్లలకు ఈ తప్పుడు యాసే వీరు నేర్పుతున్నారు. పిల్లలందరికీ సరైన అమెరికన్ ఉచ్చారణ నేర్పటం కంటే గురువులందరికీ నేర్పితే శిష్యులకు వాళ్ళే నేర్పుకుంటారు అని ఓ అధికారి అన్నాడు". (డక్కన్ క్రానికల్ 28-5-2005)

తన దూడ పొదుగు కుమ్మి పాలు తాగితే ఊరుకుంటుంది గాని, పరాయి దూడ పాలు తాగితే ఉరుకుంటుందా? జంతువు కూడా తన పరబేధం పాటిస్తుంది. తెల్ల వాడు పాటిస్తున్నాడు కాని తెలుగువాడే విచిత్రంగా వ్యవహరిస్తున్నాడు. ఇది తన చేతగాని తనమా లేక వెర్రి వ్యామోహమా అర్థం గావటం లేదు. ఏ లాభం లేకుండా అమెరికా వాళ్ళు మన పిల్లలకు, పెద్దలకు తమ భాషను ఎందుకు నేర్పుతారు? దోచుకునే స్వభావం ఉన్నవాళ్ళకు దోచిపెట్టే బుద్ధి ఉంటుందా? తమ భాష ద్వారా ఆంగ్లేయులు ప్రపంచాన్ని ఏలగలుగుతామని సగర్వంగా చెప్పుకుంటున్నారు. అందుకోసం నిరంతరము శ్రమ పడుతున్నారు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని చెప్పుకునే మనం మన తెలుగు భాష రోజురోజుకి కృషించిపోవటానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం. తనను గట్ట తాళ్ళు తానే తెచ్చుకున్నట్లు తెలుగువాడు ప్రవర్తిస్తున్నాడు. కారణాలేమిటి?



"పరువు మాలిన నీ యనాదరణ కతన,
మేటి నీ భాష పొలిమేర దాటలేదు"
-గుర్రం జాషువా, తెలుగు వెలుగు

**"ఇందులో ఏదో ఉందిరోయ్ అని మూర్ఖులు భయపడేటట్లు భాష ఉన్నప్పుడే మూర్ఖులు దణ్ణం పెట్టి ఒప్పుకునేది"** -భమిడి పాటి, తుక్కుముక్కల హక్కు చిక్కు

**"మనుష్యుడు ఇంత భాషను పెంచుకున్నది ఆలోచనలు కలవ కుండా ఉండేందుకా?**
-మహీధర, దేశంకోసం

ఈ మూడు ముక్కల్లో 1. పరువుమాలిన తనం 2. అనాదరణ 3. పొలిమేర దాటకపోవటం 4. పరాయి భాషలోనే పాలించే సత్తా ఉందనే భావన 5. పాలకుల భాష సామాన్య ప్రజానీకానికి అర్థం కాకుండా ఉండాలనే తత్వం కారణాలుగా కనిపిస్తున్నాయి, వీటికి విరుగుడు చర్యలు ఏ పాలకులు అమలు చేస్తారో ఆ పాలితులు సుఖపడతారు. ఆ ప్రజలు గౌరవించబడతారు. ఆ ప్రజల సహజసిద్ధ జ్ఞానం అభివృద్ధి చెంది గొప్ప శాస్త్రవేత్తలు తయారౌతారు. అనుకరణకు బదులు అన్వేషణ మొదలౌతుంది.

**1. పరువు నిలపాలి :** ప్రతి వ్యక్తి మాతృభాషకు ఏదో ఒక స్థాయి పరువు ఉంటుంది. పరువు బాగా ఉంటే ప్రతిష్ట అదే వస్తుంది. భాష మాట్లాడే జనానికి ముందు ఆ భాష మీద గౌరవాభిమానాలు ఉంటే వాళ్ళు ఆ భాష పరువు నిలబెడతారు. తమ భాష మీద తమకే చిన్నచూపు ఉంటే, తమ భాష కంటే పరాయి భాషే గొప్పదని వాళ్ళు భావిస్తే, తమ భాష పరువు తీస్తారు, పరభాషా వ్యామోహులై తమ భాషను నాశనం చేసుకుంటారు. సొంత ఇంట్లోనే గౌరవం పొందలేని భాషకు పరువుపోతూ ఉంటుంది. తెల్లవాడు ఇంగ్లీషు పరువు నిలపటానికి ఏమేం పనులు చేశాడో, తెలుగు వాడు కూడా ఆయా పనుల్ని చేయాలి.

**2. ఆదరించాలి:** సొంత భాషలో చదువు నేర్పాలి. ఇంటి భాషగాని ఎటువంటి యాస గాని నిఘంటువులో చేర్చాలి. చదువులో, పాలనలో పరిశోధనల్లో సొంత భాషను బాగా వాడాలి. ఇప్పుడు దేశంలో ఇంగ్లీషును ఆదరించినంతగా తెలుగును కూడా ఆదరించాలి. తెలుగు మీడియంలో చదివినా ఉద్యోగాలొస్తాయనే వాతావరణం కల్పించాలి.

**3. పొలిమేర దాటాలి:** ఇంగ్లీషు తన జన్మస్థానాన్ని దాటి ప్రపంచ వ్యాప్తం అయ్యింది. అరబీ తన స్వస్థలాన్ని దాటి ప్రపంచ వ్యాప్తం అయింది. ఇలా పొలిమేరలు దాటి మిగతా ప్రాంతాలను ఆక్రమించిన భాషలే రాజ్యాలు ఏలుతున్నాయి. దేశమంతటా హిందీ రాజభాషగా అమలవుతూ పొలిమేరలు దాటింది. దేశంలో రెండవ జాతీయ అధికార భాషగా తెలుగు అమలుకావాలి. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో తెలుగు నేర్పే వాళ్ళను

ప్రోత్సహించాలి. ఇంగ్లీషు నేర్చుకోవటానికి ఎందుకు జనం ఎగబడుతున్నారో, అందుకే తెలుగు నేర్చుకోవటానికి కూడా జనం ఎగబడేలా చెయ్యాలి. ప్రపంచీకరణ ప్రక్రియ ద్వారా 15వ స్థానం నుండి 10వ స్థానానికి క్రమంగా ఎగబాకాలి.

4. పాలించే సత్తా తేవాలి: శాస్త్ర సాంకేతిక విద్యలు, చట్టాలు, శాసనాలు, కోర్టు తీర్పులు, ఇంగ్లీషులో ఎలా సునాయాసంగా సాగిపోతున్నాయో, అవన్నీ తెలుగులో కూడా అంత సులువుగా అమలు చేసే సత్తా తెలుగువాళ్ళకుందని నిరూపించుకోవాలి. తెలుగు సుతిమెత్తని భాషే కాదు తెలుగు వాడి జీవన రంగాలన్నింటిలో అలవోకగా అమలు చేయగల భాష కావాలి. సంస్కృత మంత్రానికి, ఇంగ్లీషు తీర్పుకు, అరబీ సూరాలకు ఎంతటి సత్తా ఉందో తెలుగులోని వాటికీ అంతటి సత్తా కావాలి.

5. ప్రజలకు అర్థం కావాలి: పురోహితుల భాష, పండితుల భాష, పాలకుల భాష, ప్రత్యేకంగా ఉంటే, అది పామరులైన ప్రజలకు అర్థం కాకుండా ఉంటే, వాళ్ళ ఆలోచనలు కలవవు. జాతి ఐక్యంగా పురోగమించదు. అధికారి రాసిన రాత పల్లెటూరిలో నివసించే నిరక్షరాస్యుడికి సయితం వినిపించినప్పుడు అర్థమవుతూ ఉంటే ఆ పాలన ప్రజారంజకంగా ఉందని అర్థం. క్రమేణా ఆ ప్రజల భాషా సంపద పెరుగుతుంది. పరిపాలన పారదర్శకంగా ఉంటుంది. ప్రజలు తమ భాషలో విన్నపాలు చేసుకుంటారు. తమ భాషలో నిలదీస్తారు. తమ భాషలోనే తీర్పులు తెచ్చుకుంటారు. ప్రజా జీవితంలోని అన్ని కార్యకలాపాలు తమ భాషలోనే స్వయంగా నిర్వహించుకుంటారు. అంతకంటే అదృష్టం ఏముంటుంది?

కాకపోతే మొదటి నుంచీ చెప్పుకుంటున్నట్లే పైన చెప్పిన అయిదు పనులూ మనవాళ్ళు తెలుగు భాష కోసం చేయకుండా ఇంగ్లీషు కోసం చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. ఆంధ్రులు ఆంగ్లాన్ని ఆదరించారు. దాని పరువు పెంచారు. పొలిమేరలు దాటి ఆంగ్లాన్ని బ్రతుకు తెరువు చూపే భాషగా వాడుతున్నారు. ఆంగ్లంతోనే పాలిస్తున్నారు. అసలు ఆంగ్లంలో మాట్లాడితేనే ఒకరికొకరు అర్థం అవుతున్నారు. ఇక ప్రైవేటు స్కూళ్ళతో పోటీపడి ప్రభుత్వ స్కూళ్ళలో కూడా తెలుగు బాలలకు ఇంగ్లీషు ఉగ్గుపాలు పడుతున్నారు. డబ్బురాని తెలుగు విద్య దారిద్ర్యానికే అనే సంగతి బాగా గ్రహించారు. అందుకే ఆంధ్ర ప్రదేశ్ ను "ఆంగ్లప్రదేశ్" గా మార్చే పని తలకెత్తుకున్నారు.

**"కంచెయే నిజముగా చేసు మేసిన కాదనువారెవరు**
**రాజే ఇది శాసనమని పలికిన ప్రతిఘటించువారెవరు"**

**(గీటురాయి 1-7-2005)**



# మాతృభాషలో చదివితే మనసుకు హత్తుకుంటుంది

కురాన్ అంటే దేవుని వాక్యం, అసంబద్ధాలు లేని పరమసత్యం, తేడాలను తేల్చి చెప్పే గీటురాయి అని మనం నమ్ముతాం. ఖుర్‌ఆన్ అని పండితులు పలికితే కురాన్ అని నాలాంటి సామాన్యులు సంబోధిస్తారు. (అంటే త్సునామీని సునామీ అన్నట్లు) ఈ పదానికి అసలైన అర్థం "చదవటం" అని. ఇది అరబీలోనే ఉండాలిగాని మరో భాషలో ఉండ కూడదని, అసలు కురాన్‌ను అనువదించటం అసాధ్యమనీ, మరో భాషలో దాని అర్థమే మారిపోతుందనీ కొందరు వాదిస్తున్నారు.

కురానును ప్రపంచ భాషల్లోకి అనువాదం చేయకపోతే దేవుని వాక్యం ఆయా ప్రజల భాషల్లో ప్రజలకు అందదు. ప్రజల భాషల్లో గీటురాళ్ళు లేనందువల్ల సత్యాసత్యాల నిర్ధారణ కోసం అరబీ భాష తెలిసిన వారి కోసం చూడాల్సి వస్తుంది. స్వభాషలో దైవ లేఖనాల పరిశోధన చింతన, తమ సమస్యలకు అన్వయింపు జరగాలంటే అనువాదం తప్పనిసరి. ప్రపంచంలో ఎన్ని భాషలున్నాయో అన్ని భాషల్లోకి దైవ వాక్యం అనువదించబడాలి.

అరబీ నుండి మరో భాషలోకి అనువదించడం ఎవరికీ చేతకాదు అనే వాదన వెనుక అరబీ దేవుని భాష, మిగతావి మానవ మాత్రుల భాషలు అనే అభిప్రాయం కొంతమందికి ఉంది. అసలు అనువాదం చేయడానికి మిగతా భాషలు వేటికీ సాధ్యం కాని కొన్ని పదాలు అరబీలో ఉన్నాయనే అభిప్రాయం మరికొంత మందికి ఉంది.

అందువలన చాలా కాలం అర్థంకాని దాన్ని చదివారు. అర్థం కాకపోయినా చదవటమే పుణ్యంగా, చదవటమే తప్పనిసరి బాధ్యతగా చదివారు. ఈ భూమండలం మీద ఉన్న ప్రతి మనిషికి దైవ వాక్యం అందాలని అది కూడా వారి వారి మాతృ భాషల్లో అందాలని, అది వారికి అర్థమై వారు స్పందించాలనీ ఆది నుంచి కోరుతున్న వాళ్ళూ ఉన్నారు. ఏమైతేనేం వారి కృషి ఫలించి కురాన్ ఈనాడు ఎన్నో భాషల్లో ప్రజలకు అందుతోంది. అమృత వాక్యాలను అందిస్తుంది.

యేసుక్రీస్తు సమరయ స్త్రీతో "మీరు మీకు తెలియని దానిని ఆరాధించువారు" అంటాడు (యోహాను 4:22) అలాగే అతేనైయుల దేవతా ప్రతిమల్లో ఒక బలిపీఠం మీద "తెలియబడని దేవునికి" అని రాసి ఉందట. దాన్ని చూసి పౌలు "మీరు తెలియక

దేనియందు భక్తి కలిగి ఉన్నారో, దానినే నేను మీకు తెలియజేస్తున్నాను" అంటాడు (అపో. కార్య. 17:23)

ఇలా ఒక మాటకు ఇంకో మాట లింకు చేసుకుంటూ, లంకె వేసుకుంటూ, ఆ మాట ఎక్కడెక్కడ ఉందో అలవోకగా రిఫరెన్సు బైబిల్లో వెతుక్కోవచ్చు. అలా 114సూరాల్లో చక్కగా, సునాయాసంగా దైవ వాక్యాన్ని వెతికి పట్టుకునేందుకు మనకు తెలుగు రిఫరెన్సు కురాను కావాలి. అరబీలో నాలాంటివాణ్ణి వెతకమంటే గుడ్లు తేలేయ్యాల్సిందే గాని ఫలితం ఉండదు. అదే తెలుగులో రిఫరెన్సు కురాను ఉంటే, అవసరమైన ఏ మాటైనా ఈ కళ్ళు వెలికి పట్టుకుంటాయి. తెలుగులో దేవుని వాక్యాలను చూసినప్పుడు మన కళ్ళు అర్ధవంతగా ప్రకాశిస్తాయి. మన మనస్సు ఆనందిస్తుంది. హెచ్చరికలకు భయపడుతుంది. ఆజ్ఞలకు లోబడుతుంది. నీతికి నిలబడుతుంది.

ఇదివరకు కోడిని కొయ్యాలంటే ఊళ్ళో ముల్లానో, అరబీ పలుకులు పలికే అయ్యానో వెతికి పట్టుకునే వాళ్ళు. అప్పట్లో ఆ లిటరేచరంతా ఉర్దూలోనే ఉండేది. ఇప్పుడు నమాజ్ ఎలా చెయ్యాలి, కోడిని ఎలా కొయ్యాలి, జనాజా ఎలా చెయ్యాలి, పెళ్ళి ఎలా చేయాలి లాంటి విషయాలన్నీ తెలుగులో విడమరచి చెబుతూ పుస్తకాలు వచ్చాయి. అజ్ఞానం లోంచి జ్ఞానంలోకి, చీకటి నుంచి వెలుగులోకి, తెలియని భాష లోంచి తెలిసిన భాషలోకి, మోయలేని కాడి క్రింద నుంచి అలవోకగా అర్థం చేసుకునే దశలోకి తెలుగు జనాన్ని నడిపించింది తెలుగు ఇస్లామిక్ సాహిత్యం.

విశ్వ ప్రభువును అరబ్ పక్షపాతిగానో, అరబీ భాషస్తుడిగానో భావించే మూఢనమ్మకం ఎవరిలోనైనా ఉంటే అది వదులుకోవాలి. ఆయనకు అన్ని భాషలు వచ్చు. అన్ని భాషలూ ఆయనలో నుండి పుట్టినవే. చివరికి దోమల భాష, చీమల భాష కూడా. లేకపోతే అన్ని జీవుల భాషల్లో నిరంతరం వెలువడే స్తోత్రం అర్థం చేసుకోటానికి ఆయనకు అనువాదకులు కావాలా? అక్కరలేదు. ఆయన సర్వజ్ఞాని, సకల భాషా కోవిదుడు. ఆదాము, ఇబ్రాహీము దగ్గర నుండి నేటి వరకు నెలకొన్న భాషలన్నీ ఆయన ఆరాధనకు ఉపయోగపడేవే. సులేమానుకు జంతువుల భాష, పక్షుల భాష అర్థం చేసుకునే జ్ఞానం దేవుడే గదా ఇచ్చింది? మరి చీమల భాషను అరబీ భాషలోకి మనకు అర్థం కావడం కోసం దేవుడే తర్జుమా చేసి చెప్పాడు గదా? (కురాన్ 27:18). దేవుడికో కొడుకున్నాడనో, మరో దేవదూషణో ఏ భాషలో చేసినా భూమ్యాకాశాలకు, పర్వతాలకు అర్థం అవుతుందని కురాన్ 19:90-91 చెబుతుంది. ఇక్కడ భాష కంటే భావం ముఖ్యం (కురాన్ 41:44,45,



26:198-201) అరబీ భాషలో విగ్రహారాధన చేస్తే అది అనుగ్రహ పాత్రం కాదు గదా?

ఒకనాడు మౌలానా మౌదూది వాఖ్యానం తెలుగులో లేదు. ఈనాడు మలిక్ గారి పుణ్యాన తెలుగులో చదువుకోగలుగుతున్నాం. చిలుకూరి నారాయణరావు గారు, మహమ్మద్ కాశింఖాన్ గారు, అబ్దుల్ గఫూర్ గారు, హమీదుల్లా షరీఫ్ గారు, అబుల్ ఇర్ఫాన్ గారు..... ఇంకా ఎందరెందరో దైవ వాక్యాన్ని ఇస్లాం సందేశాన్ని తెలుగు ప్రజలకు అందించారు. భవిష్యత్తులో తెలుగు రిఫరెన్సు కురాను, అలాగే తెలుగు కురానుకు కంకార్డెన్స్ కూడా వెలువడితే, తెలుగు ప్రజల పరిశీలనకు పరిశోధనకు, అనుదిన జీవితంలో ఉపయోగించుకునేందుకు అవి దోహదపడతాయి. తద్వారా తెలుగులో మరింత ఇస్లామిక్ సాహిత్యం వెలువడుతుంది. మాతృభాషలో అందే దైవసందేశం వల్ల మనోనేత్రాలు తెరువబడతాయి. అగమ్యగోచరమైన విషయం కరతలామలకమవుతుంది. అందని ద్రాక్ష అందుతుంది. అది పుల్లగా కాక తియ్యగానే ఉంటుంది. కురానుకు ఎన్ని అనువాదాలు వస్తున్నా ఆదరిస్తున్న తెలుగు ప్రజలే ఇందుకు సాక్షులు! ఇన్నాళ్ళూ దాగిన సత్యాలను రత్న మాణిక్యాల్లాగా తెలుగులో తేటతెల్లం చేసిన అనువాదకులందరికీ ఈ సేవాఫలం దక్కుతుంది.

ఒక భాష రాయటం, చదవటం వస్తే సరిపోదు. విని అర్థం చేసుకోవటం, తిరిగి మాట్లాడటం కూడా రావాలి. ఉర్దూ రాయటం, చదవటం రాకపోయినా జబర్దస్తీగా మాట్లాడే వాళ్ళు అసంఖ్యాకంగా ఉన్నారు. చదివినోళ్ళకంటే వీళ్ళే నయమనిపిస్తారు. ఈ సంగతి గమనించేనేమో మన "ఆంగ్ల"ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి డిగ్రీ, పిజి కోర్సుల్లో ఇంగ్లీషు వినడం, మాట్లాడటం సిలబస్‌లో చేర్చుతుందట. తెలుగు బాలలు, భావిపౌరులు అంతర్జాతీయ ఆంగ్లస్థాయిని అందుకోవటం కోసం మన ప్రభుత్వం శక్తివంచన లేకుండా పాటుపడుతోందని వేరే చెప్పాలా?

అయితే అదే సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో "స్వేచ్ఛ" అనే తెలుగు సాఫ్టువేర్ ఆవిష్కరించారు ఓపెన్‌సోర్స్ ఉద్యమ రూపకర్త రిచర్డ్ సాల్ట్‌మాన్. ఇంగ్లీషు రానివాళ్ళు కూడా తెలుగులో కంప్యూటర్ ఉపయోగించవచ్చు. వాల్ట్ డిస్నీ కార్టూన్ ఛానెల్ కూడా మన దేశంలో మొట్టమొదటిగా తెలుగు భాషనే ఎంచుకుంది. మనవాళ్ళు ఆంగ్లం వైపు వెళుతుంటే, వాళ్ళేమో మన భాషల్లోకి వస్తున్నారు. టి.వి. ప్రసారాల వల్ల తెలుగు వాడుక భాష జీవం పోసుకుంటున్నది. ఇంగ్లీషును ఏ యూరోపియన్ భాషల్లోకైనా

అనువాదం చేసే సాఫ్ట్‌వేర్‌లు ఉన్నాయి. అలాంటి సాఫ్ట్‌వేర్‌ను తెలుగు భాషకు కూడా రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్ మెంబర్ కిరణ్ చంద్ర చెబుతున్నారు. (ఈనాడు 10-2-2005)

ఇంతకీ మన అవసరం తెలుగు కురాన్‌కు కంకార్డెన్స్. అంటే అక్షర క్రమంలో తెలుగు కురాన్‌లోని ప్రతి మాటా రిఫరెన్సులతో సహా దొరికే నిఘంటువన్న మాట. తెలుగు సాఫ్ట్‌వేర్‌ల తయారీదారులు ఇప్పటి దాకా వ్యాపారబుద్ధితో గుత్తాధిపత్యం చేసి నందువల్ల తెలుగు వాడకం మందగించింది. ఇక స్వేచ్ఛ, స్వతంత్రం లాంటి సాఫ్ట్‌వేర్‌లు భవిష్యత్తులో ఏన్నో వస్తాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తెలుగు కురాన్‌కు మరిన్ని హంగులు, సదుపాయాలు కల్పించుకోవాలి. తద్వారా తెలుగు ప్రజలందరికీ ఇప్పటి వరకు "తెలియబడని దేవుడు" తెలుస్తాడు. తెలుగు పరిశోధకులు దైవవాక్యాన్ని వివిధ కోణాల నుండి అధ్యయనం చేసి విలువైన సంగతులు రాబడతారు. పదిమందికి పరమసత్యాలు అర్థమయ్యేలా రిఫరెన్సులతో సహా వివరిస్తారు. తెలుగు నేలపై వెలుగు పరుచుకుంటుంది.

**(గీటురాయి 25-2-2005)**



# తెలుగు మహా నిఘంటు నిర్మాణం జరగాలి

ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీన 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' జరుపుకోవాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. ఇందుకు ముఖ్యకారణం బంగ్లాదేశ్‌లో జరిగిన బెంగాలీ భాషోద్యమం. 1952 ఫిబ్రవరి 21న బెంగాలీ భాషా ఉద్యమకారులు కొంతమంది పాకిస్తాన్ ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో మరణించారు. అప్పట్లో తూర్పు బెంగాల్ తూర్పు పాకిస్తాన్‌గా ఉండేది. దరిమిలా అదే బంగ్లాదేశ్‌గా ఏర్పడి బెంగాలీలో ఆ దేశపాలన జరుగుతోంది. మాతృభాషకు ఆదేశ ప్రజలు పట్టం గట్టారు. మతం కంటే భాషే ఒక జాతిని శక్తివంతంగా కట్టడి చేస్తుందనీ, చైతన్య పరుస్తుందనీ రుజువయ్యింది. మతం కూడా తన భాషలో లేనప్పుడు మనిషి చెవులున్నా చెవిటివాడిలా, కళ్ళున్నా కబోదిలా, నోరున్నా మూగవాడిలా, జీవచ్ఛవంలా, కట్టు బానిసలా తయారై మొక్కుబడిగా పాటిస్తుంటాడు. ఇక తెలివి తేటలు ఉపయోగించాల్సిన వ్యవహారాలు తన భాషలోకాక ఇతర భాషల్లో నడవటం వికలాంగుడి విన్యాసంలా ఉంటుంది. జాప్యం, మధ్యవర్తుల మోసం, అర్థంకాని తనం, నోరు తెరవలేని తనం జాతిని కృంగదీస్తాయి. బానిసల మెదళ్ళు సృజనాత్మకతను కోల్పోయి, ఎదురు చెప్పకుండా ఆదేశాలను పాటించే చందాన పరభాషా పాలనలో మగ్గిపోయిన జాతి మెదడు బూజుపడుతుంది.

మాతృభాషాభిమానం వల్ల ఏర్పడిన బంగ్లాదేశ్, భాషా ప్రాతిపదిక మీద ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తమ తమ భాషల్లో, పాలించికోవటంలో ఏ మేరకు పురోగతి సాధించాయో విశ్లేషించుకుంటే విచారం కలుగుతుంది. భారతీయ భాషల్ని చాలాకాలం సంస్కృతం కబళిస్తే ఇప్పుడు ఆంగ్లం అన్ని భాషల్ని నమిలి మింగేస్తోంది.

తెలుగు భాషకు సంస్కృతం, ఇంగ్లీషు, అరబీ భాషలకున్న స్థాయి, పదసంపద, దైవాశీస్సులు లేవని మనవాళ్ళే కొంతమంది వాదిస్తున్నారు. అసలు ఈ తెలుగుభాష ఇక బతికుండటం అనవసరమనీ, కేవలం తెలుగునే నమ్ముకుంటే భుక్తి కూడా దొరకదని, ఇంగ్లీషొస్తే చాలు ఎక్కడైనా ట్యూషన్లు చెప్పుకొనైనా బ్రతకొచ్చు, తెలుగు ట్యూషన్ ఊరికే చెబుతామన్నా పిలిచేవాళ్ళు లేరనీ మన తెలుగు వాళ్ళే కొంతమంది చీదరిస్తున్నారు.

తెలుగు వాళ్ళకు రెండువేల ఏళ్ళ చరిత్ర ఉంటే, వెయ్యేళ్ళ సాహిత్యం ఉందనీ, ఇప్పుడు కేవలం వాడుక భాషగా మిగిలి చివరికి లిపిని కూడా కోల్పోబోతున్నదనీ కొందరు బాధపడుతున్నారు. అయితే కేంద్రీయ విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ భద్రిరాజు

కృష్ణమూర్తి 19వ శతాబ్దానికి ముందు తెలుగు పాఠశాలలనేవి లేనేలేవనీ, కేవలం సంస్కృత పాఠశాలలు మాత్రమే ఉన్నాయనీ, సంస్కృతం నేర్చుకున్న వాళ్ళ తప్ప మిగతా తెలుగు జనం అందరూ నిరక్షరాస్యులేనని తేల్చిచెప్పారు (వార్త: 22-2-2005). అంటే రెండువేల సంవత్సరాల నుండి నిరక్షరాస్యులే తెలుగు భాషను బ్రతికించుకున్నారన్నమాట. బడిలో తెలుగు నేర్పకపోయినా, తమ బిడ్డలకు ఒడిలోనే తెలుగు నేర్పుతూ ఈ భాషను ఇన్నేళ్ళపాటు బ్రతికించిన ఘనత నిరక్షరాస్యులైన తెలుగు తల్లులదన్నమాట!

ఎంత అద్భుతం? ప్రభుత్వ సహాయం, కవుల సహకారం, సాహితీ సంపదలాంటివి పెద్దగా లేకపోయినా, రెండువేల సంవత్సరాలు ఒకభాషను సామాన్యజనం కాపాడుకుంటూ రావటం నిజంగా అద్భుతమే. ఇంత శక్తిసామర్థ్యాలు, మాతృభాష పట్ల మమకారం ఉన్న మన గ్రామీణజనం ప్రభుత్వ సహాయం, మతపెద్దల సహకారం మన భాషకోసం అందజేస్తే తప్పకుండా తెలుగు భాషకు పట్టం గడతారు, జవజీవాలను అందజేస్తారు.

అయితే ప్రపంచంలోని 6700 భాషల్లో మూడువేల భాషలు కాలగర్భంలో కలసి పోతున్నాయనీ, మొత్తం జనాభాలో ఒక భాష నేర్చుకునేవాళ్ళ సంఖ్య 30 శాతం కంటే దిగువకు పడిపోతే ఆ భాష క్రమేణా నశించి పోతుందని ఐక్యరాజ్యసమితి లెక్క తేల్చిందట. మరి మన తెలుగు చదవడం, రాయడం వచ్చిన వాళ్ళ సంఖ్య 35 శాతం దగ్గర ఉందట. అంటే ఓ 6 శాతం తెలుగు భావిపౌరుల్ని మనం ఇతర భాషలకు ధారాదత్తం చేస్తే చాలు ఇక మన తెలుగు అంపశయ్య మీదకు చేరినట్లేనట!

అందుకేనేమో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "తెలుగు భాషను కాపాడండి" అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వ్యవహారాల్లో తెలుగు వాడకాన్ని తప్పనిసరి చేయాలని, రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అయిదో తరగతి వరకూ తెలుగులోనే బోధించాలనీ, వృత్తి విద్యాకోర్సులు కూడా తెలుగులోనే ఉండాలనీ, ఆంధ్రేతర ప్రాంతాల్లో నివసించే తెలుగువాళ్ళలో తెలుగును ప్రోత్సహించాలనీ కోరారు (ఈనాడు 22-2-2005) అయితే వీరి పాలనాకాలంలో గ్రూప్-1, గ్రూప్-2(ఎ) పరీక్షల్లో తెలుగు మీడియంలో డిగ్రీ చదివిన అభ్యర్థులకిచ్చే 5 శాతం వెయిటేజి మార్కులు ఇవ్వకూడదని హైకోర్టు తీర్పు ఇస్తే దానిపై అపీలు చేయలేదు. సరికదా ఈనాటి వరకు తెలుగ మీడియంలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాల్లో ఎటువంటి ప్రోత్సాహకాలూ ప్రకటించకపోగా, కొన్ని ప్రభుత్వ ప్రాథమికపాఠశాలల్లో కూడా ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టారు. ఇక తెలుగు వాడకం ఎలా పెరుగుతుంది? తెలుగు ఎలా బ్రతుకుతుంది?



మరో ప్రక్క ఇంగ్లీష్ వాళ్ళను చూడండి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వాళ్ళు ఈ మధ్య వెలువరించిన డిక్షనరీలో సెల్‌ఫోన్‌లో వాడే సంక్షిప్త సందేశాలు (ఎస్. ఎమ్. ఎస్) కూడా చేర్చారట. ATB (ఆల్ ద బెస్ట్), KIT (కీప్ ఇన్ టచ్), MYOB (మైండ్ యువర్ ఓన్ బిసినెస్) లాంటి పదాలతో పాటు నవ్వు, ఏడుపు, ఆశ్చర్యం, అర్థంగాకపోవటం, చికాకు వంటి భావాలను తెలిపే గుర్తులు కూడా నిఘంటువులో చేర్చారట. (ఈనాడు: 22-2-2005) మరి మన విశ్వవిద్యాలయాల వాళ్ళు మన తెలుగు నిఘంటు పద సంపదను పెంచేందుకు ఏ మేరకు కృషి చేస్తున్నారు? ఈ మధ్య తెలుగు అకాడమీ తెలుగు-తెలుగు నిఘంటువు చాలా కష్టపడి ముద్రించింది. సంపాదకవర్గం ముందుమాటలో "నిష్పన్నం" అనే మాటకు అర్థం కోసం వెదికితే ఆ మాట నిఘంటువులోనే లేదు. ఇదేం నిఘంటువు? ఆ పదం అర్థం కోసం మరో తెలుగు నిఘంటువులో చూడాలా?

అసభ్యమనో, మొరటు అనో, గ్రామీణమనో, ఛండాలమనో పేర్లు పెట్టి మన తెలుగు పదాలెన్నింటినో నిఘంటువులోకి ఎక్కకుండా నిషేధించారు. నిఘంటువులోకి చేర్చకపోయినా ఆ పదాలు వందలు, వేల సంఖ్యలో తెలుగు జనం నాలుకలపై పలుకు తున్నాయి. ఏటా వందలాది పరభాషా పదాలను సైతం తమ నిఘంటువులో చేర్చుకొని బలిసిపోతున్న ఇంగ్లీషు వాళ్ళను తెలుగు పండితులు ఆదర్శంగా తీసుకోవాలి. పరభాషా పదాలు పక్కన బెట్టినా కనీసం మన రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల జనం మాట్లాడే తెలుగు పదాలనైనా నిఘంటువుకు ఎక్కించే కృషి జరగలేదు. విశాఖపట్నం ఏరియాలో కాలువను గెడ్డ అంటారు, తిరునాళ్ళను పరస అంటారు. మరి ఈ గెడ్డ, పరస తెలుగు పదాలు కావా? ఇలాంటి వేలాది తెలుగు పదాలను జాతి కోల్పోతున్నది. నిఘంటువులో పదాల సంఖ్యను బట్టి భాష స్థాయిని నిర్ధారించవచ్చు. నీ పదాలను నీవే వాడకుండా నిర్మూలించుకుంటూ పరభాష చొరబడుతోందని గావు కేకలు పెట్టడం విచిత్రం.

కొంతకాలం క్రితం ఓ ఉన్నతాధికారి మరో మహిళాధికారిని పిర్ర మీద చరిచాడు. ఆమె కోర్టుకెళ్ళి నెగ్గింది. తెలుగు పత్రికల్లో పృష్టభాగం అన్నారు గాని పిర్ర అనలేదు. ఈ పదాలు తెలుగు ప్రజల వాడుకలో ఉంటాయి గాని, నిఘంటువులో దొరకవు. అదే ఇంగ్లీషు డిక్షనరీ చూడండి. అన్ని అసభ్య పదాలు ఉంటాయి. సభ్యత, అసభ్యత అనే తేడా లేకుండా, నాగరిక, అనాగరిక అనే తేడా లేకుండా జాతి మాట్లాడే పదజాలమంతా గుదికూర్చిందే సమగ్ర నిఘంటువంటే. కేవలం సంస్కృత సభ్య పండితులు దయతలచి గ్రంథస్తం చేసిన పదాల చిట్టా మాత్రమే సమగ్ర నిఘంటువు అవుతుందా? తెలుగు

భాష అసలు సిసలు రక్షకులైన బడుగు జీవుల పదజాలమంతా ఏమైపోయింది? అదంతా నిఘంటువు లోకి ఎక్కాలి.

గవర్నరు ఐ.ఎ.యస్., ఐ.పి.యస్. అధికారులు ఇతర రాష్ట్రాల వాళ్ళు వస్తున్నారు. "ప్రజలకోసం పనిచేయాల్సిన సివిల్ సర్వెంట్లకు ప్రజల భాషరాదు. ప్రజల ఘోష పట్టదు. ఇలాంటి అధికార శ్రేణుల వల్ల తెలుగు భాషకు రాష్ట్ర ప్రజానీకానికి వాటిల్లుతున్న చేటు అంతా ఇంతా కాదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు, చట్టాలు, న్యాయ స్థానాల్లో వాదనలు, తీర్పులు వంటివన్నీ తెలుగులోనే జరిగిన నాడు 'ప్రజల వద్దకు పాలన' నిజమవుతుంది." (ఈనాడు: సంపాదకీయం 22-2-2005)

అధికారులకు తెలుగులో చట్టాలు అందించటం, తెలుగులో సాంకేతిక విద్యలు అందించటం, తెలుగులో చదివిన వారికి ఉద్యోగాలివ్వడం, తెలుగులో వృత్తి పదకోశాలు నిరంతరం తాజాపరచటం, మహా నిఘంటువు నిర్మించటం నేటి అవసరాలు.

**(గీటురాయి 11-3-2005)**



# భాషను నీవు రక్షిస్తే - భాష నిన్ను రక్షిస్తుంది!

తమిళనాడులోని జాతీయ రహదారుల వెంట మైలురాళ్ళ మీద హిందీలో పేర్లు రాయకూడదని, కేవలం తమిళం, ఇంగ్లీషుల్లో మాత్రమే ఉండాలని జయలలిత కేంద్రానికి అల్టిమేటం పంపారు.

ఇక్కడ మన రాష్ట్రంలో ఓ వ్యక్తి తన కారుకు నంబరు ప్లేటు తెలుగులో రాయించాడని సతాయించి ఫైను వేశారు.

తమిళనాడులో ప్రతిదీ తమ మాతృభాష తమిళంలోనే ఉండాలనే ఉద్దేశంతో తమిళ పరిరక్షణ ఉద్యమం జరుగుతోంది. తమిళ చిత్రాలకు తమిళ పేర్లే ఉండాలని కూడా అడుగుతున్నారు. కమలహాసన్ నటించిన "ముంబాయి ఎక్స్‌ప్రెస్" పేరు మార్చాలని గొడవకు దిగారు. పేర్ల గురించి కూడా తమిళకింత పిచ్చా అనిపించవచ్చు.

తమిళులకు తమ భాష పట్ల అంత మక్కువ పట్టుదల, మొండితనం ఉండబట్టే తమిళం ఈనాటికి సగర్వంగా, తలెత్తుకుని నిలబడగలగింది. ఇండియాలో దాదాపు 30 భాషల్లో సాహితీ సంపద పుష్కలంగా ఉంది. అన్ని భాషలకూ సమాన గౌరవం దక్కలేదు. మొండిగా, మూర్ఖంగా ఎదురు తిరిగి వాదించిన వాళ్ళ భాషే వికసించింది. కర్కశంగా ఇతరుల మీద రుద్దిన వాళ్ళభాషే అభివృద్ధి చెందింది. నోరూ, వాయీ పడిపోయిన బానిసల్లాగా, చెప్పిందానికల్లా తలాడించిన వాళ్ళ భాష వాడిపోయింది.

విజ్ఞాన శాస్త్రాన్ని మాతృభాషలో బోధిస్తేనే ప్రగతి సాధ్యం అని మన పాఠశాల విద్యాశాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి 21-1-2005న దక్షిణాది రాష్ట్రాల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో అన్నారు. ఇది ఎంతో మంచి మాట. కాని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇంగ్లీషు మీడియం ప్రారంభించినది వీరి హయాంలోనే.

23-1-2005న విశాఖపట్నంలో మహారాష్ట్ర మండలి స్వర్ణోత్సవ వేడుకలకు గవర్నర్ సుశీల్ కుమార్ షిండే హాజరై మహారాష్ట్రీయులు ఇతర రాష్ట్రాలలో ఉన్నప్పటికి తమ పిల్లలకు మరాఠీ నేర్పించాలని, మరాఠీ భాషను కాపాడుకోవాలనీ పిలుపునిచ్చారు. మరాఠీ మండలి సభ్యులు తమ పిల్లలకు మరాఠీలో ప్రాథమిక విద్య కావాలని మరాఠిలో అడిగితే మనవాళ్ళు ఆనందంగా అంగీకరించారు. మన ఎం.పీ సుబ్బరామిరెడ్డి మరో అడుగు ముందుకేసి మరాఠీ భవన నిర్మాణానికి అయిదు లక్షల రూపాయల తన ఎం.పీ నిధుల్లోంచి మంజూరు చేసారు.

ఈ మాత్రం సహాయం మన తెలుగు ప్రజలు ఏయే రాష్ట్రాలలో ఉన్నారో ఆయా

రాష్ట్రాల ఎం.పీలందరూ చేస్తే ఎంత బాగుండు! భాషాభిమానం, రాష్ట్రాభిమానం మనిషిలో తప్పక ఉంటుంది. మాతృభాష వద్దని ఏ మనిషీ బాహాటంగా చెప్పలేడు. చెబితే మిగతా ప్రజలతో వ్యతిరేకత వస్తుంది.

"ఏటిలోని కెరటాలు ఏరు విడిచిపోవు

ఎదలోపలి మమకారం ఎక్కడికి పోదు

ఊరు విడిచి వాడ విడిచి ఎంత దూరమేగినా

సొంత ఊరువారు తన అంతరాన ఉందురోయ్"

అనే పాట మాతృభాష మీద మమకారం లేని వాళ్ళకు వర్తించదు. తల్లినీ, తల్లి భాషనూ, నీచంగా చూసే వాళ్ళు పరభాషా వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్నారు. వీళ్ళ బానిసబుద్ధి వల్ల సామాన్య జనం అన్ని వ్యవహారాల్లో భాషాపరమయిన దౌర్జన్యానికి గురై మూగబోతున్నారు. తెలుగు "యానాం" తమళ 'పాండిచ్చెరి'లో నేటికి మగ్గిపోవటం సమైక్య వాదులకెలా రుచిస్తోంది?

ఏలేరు భూసేకరణపై విచారణ కమీషన్ చైర్మన్ జస్టిస్ సోమశేఖర గారు విశాఖపట్నం వచ్చినప్పుడు తనది కర్నాటక రాష్ట్రమనీ, కన్నడం తన మాతృభాషనీ చెబుతూ మన తెలుగువాళ్ళు మైసూర్‌పాక్, మైసూర్ బజ్జీ, బెంగుళూరు మిరపకాయలు, మైసూర్ ఎడ్లు, కర్నాటక సంగీతం, ఉడిపి హోటల్.... లాంటి ఎన్నో పేర్లు ఉపయోగిస్తున్నారనీ కన్నడ పదాలెన్నో తెలుగు వాళ్ళు వాడుతున్నారని సంబరపడ్డారు.

హిందీవాళ్ళు, తమిళులు, కన్నడీలు, మరాఠీలు, ఉర్దూవాళ్ళు, ఆంగ్లేయులు, చివరికి ఒరియావాళ్ళు కూడా తెలుగులో వాడకంలోకి వచ్చిన తమ తమ భాషాపదాలు ఏమేమి ఉన్నాయో అత్యంత శ్రద్ధాసక్తులతో వెతికి పట్టుకొని తెలుగువాళ్ళకే గొప్పగా చెప్పు కుంటున్నారు. మన పండితులు పరిశోధకులు కూడా "తెలుగు భాషపై ఫలానా భాష ప్రభావం" అని శోధించి శాస్త్ర గ్రంథాలు రాశారు, రాస్తున్నారు కూడా. అలాగే "ఫలానా భాషపై తెలుగు ప్రభావం" అనే పరిశోధక గ్రంధాలు వస్తే బాగుండును. మన విశ్వ విద్యాలయాల వాళ్ళు ఈ అంశం మీద పరిశోధన చేసే వాళ్ళను ప్రోత్సహించాలి. ఈ మధ్యే నా కంటబడ్డ సంగతి: 1-2-2005 పెదవాల్తేర్ జంక్షన్ దగ్గర, ఓ తండ్రీ కొడుకూ దారిన వెళుతున్నారు. పిల్లవాడికి కుక్క కనబడింది. "నాన్నా, కుక్క" అన్నాడు. వెంటనే తండ్రి "అదేరా, డాగ్గు" అన్నాడు. కుక్కని డాగ్గు అనాలని తండ్రి పిల్లవాడికి నేర్పుతున్నా డన్నమాట. పిల్లవాడు తెలుగు పలుకులు పలక్కుండా ఇంగ్లీషు ముక్కలు పలికితేనే



డాబుసరిగా ఉంటుందనే బడాయి లక్షణం ఆ తండ్రిది. పిల్లలకు ఏది నేర్పితే అదే వస్తుంది. తెలుగులో మాట్లాడితే ఫైన్ వేసే స్కూళ్ళు అంత నిర్భయంగా, అదేదో చట్టసమ్మత మయిన హక్కులాగా తెలుగు నేల మీదే నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయంటే ఇలాంటి తల్లిదండ్రుల పిచ్చి మద్దతే కారణం. మావాడు దెబ్బలకు ఓర్చుకుంటాడురా అంటే విడిపించే దిక్కులేక అన్నట్లు.

29-1-2005న విశాఖపట్నం సమాచార కేంద్రంలో "సంస్కృత భాషా ప్రశస్తి" అనే అంశం మీద కార్యక్రమం జరిగింది. అందులో పాల్గొన్న తెలుగు పెద్దలు తేల్చిన సారం ఏంటంటే "సంస్కృతం దేవతలు మాట్లాడే భాష కాబట్టి అది దేవభాష. మహా కావ్యాలు సంస్కృతంలో ఉండటానికి ఇదే కారణం. సమస్త మానవ జీవితానికి ఇదే మూలభాష. సంస్కృత భాషను కంఠస్థం చేసే సంప్రదాయం ఉన్నందువల్లనే ఆ భాష ఇప్పటి వరకు తన ఉనికిని కాపాడుకోగలిగింది. సంక్లిష్ట పదజాలంతో గొప్ప భావాన్ని వ్యక్తీకరించగలిగే శక్తి ఈ భాషకుంది. ప్రతి అక్షరానికి కొంత శక్తి ఉంది, దానికి ఒక ఆదిదేవతను, రంగును, లక్షణాన్ని పూర్వీకులు ధృవీకరించారు. శబ్దానికి గల శక్తిని చూపడానికే మంత్రాలను ప్రవేశపెట్టారు. ఇది ఉత్తరాధి భాషలకు జన్మను, దక్షిణాది భాషలకు కండపుష్టిని ఇచ్చింది."

"అరబీ భాషా ప్రశస్తి" అనే కార్యక్రమం ఏర్పాటు చేస్తే కూడా ఇంచుమించు ఇలాంటి అమూల్య అభిప్రాయాలే వస్తాయి. మన గ్రంధాలు ఏ భాషల్లో వెలువడితే ఆ భాషలు గొప్పవనే భావన ప్రజలకుంటుంది. ఎందుకంటే సాక్షాత్తూ దేవుడే ఆ భాషను వాడుకున్నాడు గనుక. మరి మిగతా భాషల సంగతి ఏంటి? వాటిని దేవుడు చులకనగా చూశాడని ఎవరూ చెప్పలేరుగాని మన గ్రంథం ఉద్భవించిన భాషను మిగతా భాషల వాళ్ళు నేర్చుకోవాలంటారు. కనీసం మత ధర్మాలను, నియమనిష్టలను అనుసరించటం కోసమైనా ఆ భాష తప్పనిసరి అంటారు. కాదు ఎవరి భాష వారికింపు అంటే "ఇట్టి దైవధిక్కారమును సైతుమా?" అంటారు.

ప్రజలు తమ అవసరాల కోసం భాషల్ని పుట్టించుకున్నారు అని కొందరంటే, కాదు ప్రజలకోసమో భాషలు పుట్టాయి అని కొందరంటారు. భాష భాష కోసమే అని కొందరంటే, కాదు అదీ ప్రజల ఉపయోగం కోసం అని కొందరంటారు. భాష లోతుల్లోకి వెళితే రత్నాలు, మాణిక్యాలు దొరుకుతాయి అని కొందరంటే, పొట్టకూటి కోసం వెతుకులాడే జనానికి గులకరాళ్ళ భాష సరిపోతుందిలే అంటారు మరికొందరు.

ఇంతకీ చెప్పొచ్చిందేంటంటే, ఎవరి కంపు వారికింపు, పరుల కంపు ఓకరింపు అనే సామెత జన సామాన్యానుభవంలోంచి వచ్చింది. అంటే ఎవడి భాష వాడికి మధురంగా ఉండటం, పరాయి భాష కర్ణ కఠోరంగా ఉండకపోయినా దానికి రెండో స్థానమే ఇవ్వటం సహజం. మనిషి తన స్వంత భాషను ఇష్టపడటం సహజలక్షణం. ప్రపంచంలోని ఎన్నో భాషలవాళ్ళ స్పందన ఇలా సహజంగా ఉంటున్నది. కాని అదేం విచిత్రమో కానీ తెలుగు వాళ్ళు అసహజ లక్షణాలు ప్రదర్శిస్తున్నారు. తమ భాషను విసిరిపారేసి అణగదొక్కి, పరాయి భాషల్ని నెత్తికెత్తుకుని కావలనే తొక్కించుకుంటున్నారు. ఆవులు ఆవులు పోట్లాడుకుని లేగల కాళ్ళు విరగదొక్కినట్లుగా సామాన్య గ్రామీణ జనం తాము చేయని తప్పుకు శిక్షించబడుతున్నారు. పండితుల బడాయికి, అధికారుల అసహజ లక్షణాలకు, నాయకుల మూర్ఖత్వానికి మామూలు తెలుగు జనం బలైపోయారు. తెలుగు నేలపై తెలుగు పాలన లేదు. తెలుగు క్షీణిస్తున్నది. తెలుగు పెద్దలారా, తెలుగును పోషించండి. లేకపోతే మిమ్మల్ని పోషించటానికి ఈ భాషే ఉండదు జాగ్రత్త! భాషో రక్షతి రక్షిత:!

**(గీటురాయి 25-3-2005)**



# మనం తెలుగువాళ్ళం - ఏమీచాతగాని వాళ్ళం

"జనగణమన అధినాయకుడెవరనుకున్నారు? జార్జి మహారాజు" (మారుతీరావు "మళ్ళీ మధుమాసం") "మైలాగియిలా ఈ ఇంగ్లీషువారికి లక్ష్యం లేదు" (గురజాడ అప్పారావు "కన్యాశుల్కం")

"తాజా కాలిన్స్ ఇంగ్లీష్ డిక్షనరీలో బద్మాష్, చంగా, చుడ్డీ, దేశీ, ఆంటీజీ, అంకుల్‌జీ, గోరా, కుర్తా, కుత్తా, కుత్తి, హరామ్‌జాదా, హరామ్‌జాదీ, యార్, మహల్, లాంటి పదాలు చోటుచేసుకున్నాయి. 'ఇంగ్లీషు ఇంత అందమైన భాష కావటానికి కారణం అది మొదటి నుండీ ఇతర భాషల నుండి పదాలను స్వీకరించటమే' అని ఎడిటర్ ఇన్‌చీఫ్ జెరిమీ బట్టర్ ఫీల్డ్ అనారు". (దక్కన్ క్రానికల్ 9-6-2005)

మహారాజా, మహారాణి, మహాత్మాలాంటి ఎన్నో భారతీయ పదాలు ఇంగ్లీషు డిక్షనరీల్లోకి ఎప్పుడో ఎక్కేశాయి. కనీసం ఈ పదాలు ఫలానా భాష నుండి అరువు తెచ్చుకున్నవని కూడా ఇంగ్లీషు నిఘంటువుల్లో గుర్తులు పెట్టడం లేదు. అవి ఇంగ్లీషు వాళ్ళు స్వంతం చేసుకుంటున్నారు. ఇలాంటి పని మన భారతీయ భాషల వాళ్ళు ఎంత మాత్రం చేయటం లేదు. అంటరానితనం వంటబట్టించుకున్న జనం అప్రాచ్యపు భాషల పట్ల గూడా ఇదే తత్వాన్ని ఆచరిస్తున్నారు. హింగ్లీష్, తెల్గిష్, భాషలు మాట్లాడుతూ అప్రాచ్యులతో ఉపాధికోసం అంటకాగుతున్న వారే, స్వదేశంలో సంస్కృతి, సంప్రదాయం, సాహితీవిలువలు అంటూ ప్రజలు వాడుకలోకి తెచ్చిన అప్రాచ్యపు పదాలను కూడా నిఘంటువుల్లోకి తేకుండా భాష శక్తివంతం కాకుండా అడ్డుకుంటున్నారు.

తెలుగువాళ్ళ గురించి, ఇంగ్లీషువాళ్ళ గురించి, కొన్ని పాత్రలతో మన తెలుగు ప్రముఖ రచయితలు కొన్ని మరువరాని మాటలు చెప్పించారు. (సంకలనం: బూదరాజు రాధాకృష్ణ 2004): "తిట్లకు ఇంగ్లీషూ, దీవించటానికి సంస్కృతమూ అయితే, తెలుగు కూరలు బేరం చేయడానికి తప్ప దేనికీ పనికి రాదు" -కొడవటిగంటి, ఐశ్వర్యా

"తెలుగులో అచ్చుతప్పులు లేకుండా పుస్తకం వస్తుందని గ్యారంటీ లేదు" -కొడవటిగంటి, అనామిక

"ఇంగ్లీషుకి తండ్రి ల్యాటిన్. తెలుక్కి తల్లి సంస్కృతం, అవటం చేత ఇంగ్లీషు తెలుగూ కలవ్వేమో అని కొందరికి డౌటేహం" -భమిడిపాటి, బాగుబాగు

తెలుగులో నూటికి తొంభైతొమ్మిది అనుకరణం -భమిడిపాటి, తెలుగు వ్యాకరణం

తెలుగులో తలకట్లు ప్రత్యేకించి పిలకలు అయిపోయినాయి అందుకని అక్షరాల తెలుగు వ్యక్తులు కచటతపలు. - భమిడిపాటి, కచటతపలు.

తెలుగులో ప్రార్ధనేమిటి నీ మొహం? దేవుడికి తెలుగురాదు. –భమిడిపాటి, వేషం తగాదా

తెలుగు వాళ్ళందరినీ భర్జించేది తెలుగుతో నిమిత్తం లేనిదే. –భమిడిపాటి, తుక్కుముక్కల హక్కుచిక్కు

ఈ పదేళ్ళ మధ్య మన యూనివర్శిటీలు మూడు కనీసం యాభై మంది తెలుగు డాక్టర్లను తయారుచేశాయి. కాని మన భాషలో విమర్శ సాహిత్యం ఇంచుమించు లేనేలేదు. –మహీధర, స్వయంవరణం

తెలుగురాని వాళ్ళు తెలుగు పుస్తకం ఎలాగూ చదవరు. ఇంగ్లీషు చదివిన తెలుగు వాళ్ళు తెలుగు పుస్తకం కేసి చూడనైనా చూడరు. అందుకే తెలుగు రచయిత ఈనాడు అరకప్పు కాఫీకి దిక్కులేక అలమటిస్తున్నాడు. –సూర్యారావు, నీలితెరలు

మనం తెలుగువాళ్ళం, ఏమీ చాతగాని వాళ్ళం. –కొడవటిగంటి, అనామిక

గొప్ప తెలుగువాళ్ళు తెలుగు వచ్చినా వాడరు. తెలుగు వాడకుండా ఉంటేగానీ తెలుగు వాళ్ళచేత గొప్పవాళ్ళనిపించుకోలేరు. –భమిడిపాటి, తెలుగు

గర్వించవేలరా తెలుగోడా గత కీర్తి తలబరువు గలవాడా –మల్లారెడ్డి, ఆంధ్రప్రబోధము

మనకి ఇంగ్లీషు అచ్చిరాదని చెబితే విన్నావు కావు. ఈ వెధవ ఇంగ్లీషు చదువు నించి బ్రాహ్మణీయం చెడిపోతుంది. మన శాస్త్రాల్లో మాటలు మనం మరిచిపోయినాము. ఆ మాటలే తెల్లవాళ్ళు దొంగతనంగా పట్టుకుపోయి శాస్త్రం చెప్పినట్లలా ఆచరించి మనరాజ్యం లాగుకున్నారు.

ఇంగ్లీషువాడు 'థింక్' అన్నాడోయ్. ఆలోచిస్తేగానీ నిజం బోధపడదు. ఇంగిలీషువ ఆడు సోమరితనం వొప్పడండీ. మన పుస్తకాల్లో మర్మం కనుక్కొని దొర్లు బాగుపడుతున్నారు. మన పుస్తకాలు బూజెక్కించి మనం చెడుతున్నాం. –గురజాడ, కన్యాశుల్కం

ఇంగ్లీషు చదువుకునే వారందరూ దౌరవాది నరకాలలో పడిపోతారు. –కందుకూరి, హాస్య సంజీవని

తెలుగులో కోపం ఎట్లా వస్తుందోయ్, ఇంగ్లీషులో అన్నా –గంగాధరరావు, బంగారు సంకెళ్ళు

మనకి ఇంగ్లీషు రాజభాషే కాకుండా మన్మధభాష కూడా అయిపోయింది. –లక్ష్మణరావు, అతడు –ఆమె ఇంగ్లీషులో మాట్లాడుతుంటే కులం ఏదయిందీ అసలు



తెలుసుకోలేం. –కొడవటిగంటి, అనుభావం.

ఇంగిలీషోడి అమల్లో ఏపని చేసిన బంగారం పలుకుతుంది. ఈ ఇంగ్లీషువాళ్ళు చదువులు పెట్టి మన వేళ్ళతో మనకళ్ళే పొడుస్తున్నారు. –గురజాడ, కొండుభట్టీయము

ఈ మాటలన్నీ మన భాషపట్ల మక్కువతో అన్నవే. దురుద్దేశమేమీ లేదు. మంచి పలుకు లెప్పుడైనా, ఎవరివైనా ఉఆహరించవచ్చు.

'మన వాళ్ళు వట్టి వెధవాయలోయ్' అంటే ఇక మనవాళ్ళు ఎన్నటెన్నటికి వెధవాయలుగా ఉండిపోవాల్సిందే అనే కోర్కె ఆ మాట అన్నవాడికి లేదు. వీళ్ళు బాగుపడాలి అనే ఆశ అందులో ఉంది. అసలు ఎప్పటి కైనా బాగుపడతారా అనే అనుమానమూ ఉంది. ఇదేం జాతిరా బాబూ ఇలాంటి మాటలతో పొడిస్తేనన్నా కదులుతారనే తాపత్రయమూ ఉంది. ఇంగ్లీషు వాళ్ళు తమ భాషాభివృద్ధి కోసం ఎంత శ్రమ పడుతున్నారో అలాంటి శ్రమ మన తెలుగు వాళ్ళు కూడా పడాలని వారికోరిక.

రచయితల మనోభావాల్ని అర్ధం చేసుకోలేనంత అజ్ఞానులెవరూ తెలుగు ప్రజల్లో లేరు. కాకపోతే వందల సంవత్సరాల పాటు పరభాషల పాలనలో మగ్గిపోయి నందువల్ల సంక్రమించిన బానిస మనస్తత్వం స్వేచ్ఛ స్వాతంత్రం లభించిన తరువాత కూడా వదుల్చుకోలేక పోయారు. దానికి నాయకులు, అధికారులే వందలాది కారణాలు చెబుతున్నారు. కారణం తెలిసినప్పుడు తెలివిగలవాడెవడైనా పరిష్కారం కనుక్కుంటాడు. పరిష్కారం అక్కరలేదు అనుకునేవాడు ప్రయత్నించడు. ప్రయత్నమే చెయ్యనివాడు పరాన్నజీవిలా బ్రతుకుతాడు. పరాన్నజీవికి స్వంత ఆలోచనలు, ఆవిష్కరణలు ఉండవు. మరొకడు అభివృద్ధి పరిచిందాన్ని పడి మేయటం తప్ప, తాను కూడా శ్రమపడడు. ఒకవేళ శ్రమ పడినా ఆయాచితంగా ఫలాలు వచ్చి పడటం కోసమే శ్రమ పడతాడు. స్వంత గుర్తింపు లేనందుకు సిగ్గుపడడు. సిగ్గుపడితే, స్వేచ్ఛ వచ్చాక కూడా బానిస బుద్ధి ప్రదర్శించడు. తన భాషకు కూడా అధికారం ఇస్తాడు. అధికారపూర్వకంగా తన భాషను ఉపయోగిస్తాడు. అదేమి విచిత్రమో కానీ తెలుగువాడు భాషపేరుతో ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించాడు కానీ తన భాషకు అధికార దండం అందించలేక పోయాడు.

అధికార భాషా సంఘానికి కొన్ని అధికారాలను ఇస్తూ చట్టంలో మార్పులు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు 8–6–2005న ఎ.బి.కె. ప్రసాద్ గారు నాతో చెప్పారు. ఆయన కృషి ఫలించాలని ఆశిద్దాం.

**(గీటురాయి 15-7-2005)**

# దిక్కులేని భాషలకు ఇంగ్లీషే దిక్కు

చరిత్రలో ఎప్పుడైనా తెలుగువాళ్ళు మరో దేశం మీద దండయాత్ర చేసి వాళ్ళ మీద మన తెలుగు భాషను రుద్దారా? పోనీ వ్యాపారం పేరుతో తెలుగు దేశపు కంపెనీ ఒకటి పెట్టి నౌకలు వేసికెళ్ళి ఇతర దేశాలను తమ పాలనలోకి తెచ్చుకున్నారా? విదేశీయుల్ని విభజించి పాలించారా? మంచి లాభాలు సంపాదించి మన తెలుగుదేశానికి పట్టుకొచ్చారా? ఇలాంటి కబ్జాకోరు పనులు తెలుగువాళ్ళు చేసినట్లు నా చెవిని పడలేదుగాని ఆంగ్లేయులు అన్ని జాతుల వాళ్ళ మీద, అన్ని భాషల వాళ్ళ మీద చేసినట్లు తెలుస్తోంది. ఇంగ్లీషు అంతర్జాతీయ భాష కావటానికి ప్రధాన కారణం ఆంగ్లేయుల సామ్రాజ్యవాదమే.

ఇంగ్లీషు వాళ్ళు ఏదేశం మీద కాలుపెడితే ఆ దేశంలో స్కూలు, చర్చి, కోర్టు ఖచ్చితంగా నెలకొల్పేవారట. ఒకవేళ స్కూలు పెట్టకపోయిన చర్చి, కోర్టు తప్పనిసరిగా పెట్టేవారట. ఈ మూడింటిలో తమ భాష అమలు జరిపేవారట. తెలుగువాళ్ళు తమ పనేదో తాము చూసుకొనిపోయే రకమే గాని, దురాక్రమణ తత్వం గల వాళ్ళు కాదు. అవసరమైతే తమ భాషను వదిలేసి, ఇతర భాషలను నేర్చుకుని మరీ ఊడిగం చేసి పొట్టపోసుకునే రకమేగాని, అవతలి వాళ్ళను తమ భాషతో పాలించే రకం కాదు.

తెలుగువాడి దగ్గరున్న సంపదను దోచుకుపోవటానికి ఎవరెవరో ఎక్కడెక్కడి నుండో వచ్చి దోచుకుపోయారు. మన తెలుగువాడు ఎన్నడు దోచుకురావడానికి బయలుదేరలేదు. అటువంటి అవసరం మన వాళ్ళకు కలగలేదు. ఒకవేళ అలాంటివి గుర్తించిన తెలుగు రాజులు తమలో తామే కలహించుకొని చెరో పక్షమై నశించిపోయారు గాని ఇతరులది దోచుకొచ్చి చెరిసగం పంచుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కూడా బానిసగా సంపాదించుకునేదే తెలుగువాడికి బాగా రుచించింది కానీ, తానే యజమానై ఇతర భాషల వాళ్ళకు జీతాలివ్వటం అనే ఆలోచన అసమంజసంగా, విడ్డూరంగా, అసలు వినటానికే అసహ్యంగా ఉంటూ వచ్చింది.

ఒక్క తెలుగువాళ్ళే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎవరెవరి భాషలు నాశనమైపోతున్నాయో వాళ్ళందరి తత్వం ఇలాంటిదే. మా వాడు దెబ్బలకోరుస్తాడు అంటే విడిపించే దిక్కులేక అన్నాడట. అంతర్జాతీయ భాషలు కొడుతున్న దెబ్బలకు జాతీయ, ప్రాంతీయ భాషలు విడిపించే దిక్కులేక ఓర్చుకుంటున్నాయి. ఇక ఆయా ప్రాంతాల్లో ఒకటో అధికార భాష, రెండో అధికార భాష తలపడి, కలబడి ఒకదాన్నొకటి తిరస్కరించుకొని, అంతార్జాతీయ



భాషనే అంతిమ శరణ్యంగా ఆశ్రయిస్తున్నాయి. దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు అన్నట్లు ఈ ప్రపంచంలో ఎన్నో దిక్కుమాలిన భాషలకు ఇంగ్లిషే దిక్కయింది. అవసరం అలాంటిది. బడి, గుడి, తీర్పు ఈ మూడూ ఇంగ్లీషులో నడిచేలా ఆంగ్లేయులు ముందు తమ దేశంలో అమలు చేశారు. తరువాత ఇతర దేశాల మీద పడ్డారు. భాష విషయంలో ఇంగ్లీషులో వాళ్ళు ఇంటగెలిచాకే రచ్చ గెలిచారు. తెలుగు వాళ్ళతో పాటు మరెన్నో భాషల వాళ్ళు ఇంట గెలవలేదు. తమ బడుల్ని, గుడుల్ని, తమ తీర్పుల్నీ తమ భాషల్లోకి తెచ్చుకోలేదు. అందుకే వారివి ఆంగ్ల పాలిత ప్రాంతాలుగా మారిపోయాయి.

"చంక నాకే వాడిని సంభావన అడిగితే ఏదో చేశాడన్నట్లు, "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం" పేరుతో ప్రపంచ వ్యాప్తంగా నాశనమైపోతున్న భాషలను ఉద్ధరించాలని ఐక్యరాజ్యసమితి మొక్కుబడి ప్రయత్నాలు చేస్తోంది. ఏమీ ప్రయోజనం లేదు. తెలుగు లాంటి మిగతా భాషలన్నీ పీకల లోతు ఆంగ్లంలో దిగబడి ఉన్నాయి. అలా అన్ని దేశాలూ ఆంగ్లమే శరణం అనే పద్ధతిలోకి వచ్చేలా మొదటి నుండీ ఆంగ్లేయులు కృషి చేశారు.

మనిషిని ఒక భాషకు గత్యంతరం లేని బానిసలాగా మార్చే రంగాల్లో మతం, వ్యాపారం చాలా ముఖ్యమైనవి.

1. మతం: ఇంగ్లీషు దేశాల వాళ్ళ మతం క్రైస్తవం. క్రైస్తవ లేఖనాలు హెబ్రూ, గ్రీకు భాషల్లో ఉంటాయి. మత లేఖనాలు ఏ భాషలో ఉంటే ఆ భాష దేవుడి భాషలాగా గౌరవం పొందుతుంది. ప్రపంచంలో ఆ మతస్తులంతా లేఖన భాషనే తప్పనిసరిగా వినియోగిస్తారు. అర్థం కాకపోయినా సరే. లేఖనం వెలువడిన భాష లిపికి, శబ్దానికి అంత ప్రాధాన్యత నిస్తారు. ఒక పొల్లు తేడా వచ్చినా అపచారంగా భావిస్తారు. హిందువులు సంస్కృత లేఖనాలకు, ముస్లిములు అరబీ లేఖనాలకు, శిక్కులు పంజాబీ లేఖనాలకు ఇచ్చే విలువ ఎలాంటిదో అందరికీ తెలుసు. అయితే హెబ్రూ, గ్రీకు భాషలలో ఉన్న క్రైస్తవ లేఖనాలను ఆంగ్లేయులు పూర్తిగా ఇంగ్లీషులోకి మార్చుకోవటమే గాక వారి మత వ్యవహారాల్లో లేఖనాల మూల భాషలకు ఏ మాత్రం ప్రాముఖ్యతో లేకుండా చేశారు. అంతా ఆంగ్లమయం చేశారు. ఆసియాలో పుట్టిన క్రైస్తవం అమెరికాలో, ఆంగ్లంలోనే పుట్టిందా అన్నట్లు మార్చుకున్నారు. అసలు యేసుక్రీస్తు ఆంగ్లేయుడేమో అనుకునేలా చేశారు. ఇప్పుడు ప్రపంచంలో క్రైస్తవ లేఖనాలకు కింగ్‌జేమ్స్ వర్షన్, రివైజడ్ స్టాండర్డ్ వర్షన్ లాంటి ఎన్నో ఆంగ్లానువాదాలే అనుసంధానంగా ఉన్నాయి గాని హెబ్రూ, గ్రీకు

భాషలు కాదు. పైగా ప్రపంచంలో ఏ మతం గురించి తెలుసుకోవాలన్నా సమస్త మతాల విజ్ఞానం ఆంగ్లీ కరించబడింది. ఆంగ్లం ద్వారానే మతాల పరిజ్ఞానం కూడా విస్తారంగా దొరుకుతోంది. వత్తులు, గుణింతాల బెడదలేకుండా లిపి సౌలభ్యంతో పాటు దాన్ని మతంతో కలగలిపి, మత భాషగా కూడా అభివృద్ధి పరచటం ద్వారా ఇంగ్లీషు అంతర్జాతీయ ఆదరణ పొందింది. తెలుగు లిపిని సంస్కరించేందుకు గానీ ఆంగ్లేయుడిలాగా తెలుగువాడు కృషి చేయలేదు.

2. వ్యాపారం: ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ, వరల్డ్ వైడ్ వెబ్, ఐక్యరాజ్యసమితి లాంటి పేర్లు, వింటే ఇంగ్లీషు ఎంత వచ్చి తీరాల్సిన భాషగా చేయబడిందో అర్థమవుతుంది. "(www)" అనే ఆంగ్ల అక్షరాలు ఇంటర్‌నెట్ వాడే అందరికీ ఆవశ్యం. అంటే ప్రపంచాన్ని అల్లుకున్న సాలెగూడు అని అర్థం. ఇంగ్లీషే ఆ సాలెగూడు. ఆంగ్లేయుడే ఆ సాలెపురుగు. అప్పిచ్చే వాడికి అప్పు తీసుకున్న వాళ్ళు లోకువ. అప్పిచ్చేవాడి భాషను అప్పు తీసుకునేవాళ్ళు నేర్చుకోక తప్పదు. రాసుకున్న ఒప్పందం అప్పు ఇచ్చేవాడి భాషలోనే ఉంటుంది. తెలుగు వాళ్ళు అంతర్జాతీయ వ్యాపారంలో ఆరితేరి ఇతర దేశాలకు అప్పులిచ్చే స్థితికి ఎదిగి వస్తే అప్పుడు వాళ్ళు కూడా తెలుగు నేర్చుకుంటారు. అది కూడా తెలుగువాళ్ళు తెలుగులోనే ఒప్పందాలు చేస్తూ ఉంటేనే సాధ్యం. చింతలూరు ఆయుర్వేదం మందుల సీసాల మీద కూడా ఇంగ్లీషు పేర్లు లేకపోతే అమ్ముడుపోని రోజులివి. ఇంకెక్కడి తెలుగు? దాన్ని బతికించు కోవాలంటే ఇంగ్లీషు వాడు పడినన్ని కష్టాలు పడాలి.

అయితే మన తెలుగు ప్రముఖుల మనస్తత్వం ఎలా ఉందో చూడండి:

"జార్జి చక్రవర్తి న్యూఢిల్లీ వచ్చినప్పుడు ఆయన దర్శనం కోసం గుంటూరు నుండి 'దేశభక్త' బిరుదాంకితుడు కొండా వెంకటప్పయ్య పంతులు వెళ్ళాడు. ఆయనకు కూర్చునే చోటు దొరకలేదు. అందుకని దూరంగా మెట్ల మీద నిలుచునే చోటును టిక్కెట్టు పెట్టి కొనుక్కున్నాడు. ఆంధ్రప్రదేశ్ నుండి ఇంకా చాలా మంది వెళ్ళారు. వారంతా జార్జి గారి పట్టాభిషేకం చూచి తరించారు. "జార్జి రాజేంద్ర వైభవ నిర్జితేంద్ర" అంటూ చక్రవర్తిపై పద్యాలు వ్రాసింది ఎవరో తెలుసునా? సాక్షాత్తు తిరుపతి వెంకటేశ్వర కవులు. వారికీ దుర్గతి ఎందుకు పట్టింది?

"ఆచార్య బి. రామరాజుగారు ఎం.ఏ. తెలుగు చదువు కోవాలని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళాడు. అక్కడి తెలుగు శాఖాధిపతి 'నీకు బుద్ధిలేదా? తెలుగు చదువు కుంటానని వచ్చావు? అని తిట్టాడు. ఆ తిట్టింది మరెవరో కాదు, మహా దేశభక్తుడు



మాతృ భాషాభిమాని రాయప్రోలు సుబ్బారావు గారు. దీని వల్ల ఏం తెలుస్తున్నది. ఆదర్శానికి ఆచరణకు చాలా అంతరం ఉంటుంది. భారతీయులకు దేశభక్తి ఎప్పుడూ లేదు. కేవలం రాజభక్తి, దైవభక్తి మాత్రమే ఉంది."

–ముదిగొండ శివప్రసాద్, ఆంధ్రభూమి (10-7-2005)

మరి ప్రపంచంలో ప్రతి ఏటా ఎన్నో భాషలు రక్షించే దిక్కులేక నశిస్తున్నాయని చెబుతున్నారు. వాటిలో తెలుగు కూడా త్వరలో చేరిపోతుందనీ అంటున్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు ఎ.బి.కె. ప్రసాద్‌గారు ఏమంటున్నారో చూడండి:

"ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ తదితర సంస్థల ద్వారా అమెరికా తదితర పెట్టుబడి దేశాలు చిన్న దేశాలపై పట్టు కలిగి ఉండాలని చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఇంగ్లీషుకు ప్రాధాన్యం లభిస్తోంది. వర్ధమాన దేశాల మార్కెటింగ్‌ను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఇంగ్లీషును ప్రాచుర్యంలోకి తెస్తున్నారు. ....ప్రపంచంలో అనేక దేశాల్లో వందలాది భాషలు కనుమరుగయ్యాయి. తెలుగు కూడా కనుమరుగు కాకుండా దానికి సరైన ప్రాధాన్యత నివ్వాలి. ఇందుకు ప్రాథమికవిద్యా స్థాయిలోనే తెలుగు బీజం పడాలి." (ఆంధ్రభూమి, 3-7-2005). శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్‌గారు దీనికి కారణం పరిష్కారం రెండూ చేప్పారు. "ఏ భాషైనా నశించిపోవడానికి ఇతర భాషల పెత్తనం ఎక్కువ కావటంతో పాటు ప్రజల్లో చైతన్యం లేకపోవటం కూడా కారణమే." (ఆంధ్రభూమి, 3-7-2005).

అంటే ఇతర భాషల పెత్తనం మన మీద తగ్గాలి. ఆయా భాషలు మన మీద ఎందుకు పెత్తనం చేస్తున్నాయి? ఎలా పెత్తనం చేయగలుగుతున్నాయి? మనం ఆ భాషల పెత్తనానికి ఎందుకు తలవంచాల్సి వస్తున్నది? మన భాష మరెవరి మీద ఎందుకు పెత్తనం చేయలేక పోతున్నది? మన భాష మన మీదే కాకుండా ఇతరుల మీద కూడా పెత్తనం చెయ్యాలంటే మనం ఏం చెయ్యాలి? మన భాష పరిస్థితి ఇలాగే ఉంటే అసలు పెత్తనం చేసేందుకు వీలుందా? పెత్తనం చేసేవాళ్ళు ఏ భాష వాళ్ళయి ఉండాలి? ఆ భాషకున్న ఆధిక్యత ఏమిటి? 'దానికా ఆధిక్యత ఎలా వచ్చింది?' మన భాషకు కూడా అటువంటి ఆధిక్యత, సౌలభ్యత తేలేమా? మొదలైన ప్రశ్నలు చైతన్యం ఉన్న ప్రజలు వేసుకుంటారు. పరాన్న జీవులు ప్రశ్నించరు. ప్రశ్నించలేరు. ఎందుకంటే వారు పరులపై ఆధారపడిన పరాన్న జీవులు కాబట్టి. తమ కాళ్ళపై తాము నిలబడి స్వంతంగా బ్రతికే

శక్తి సామర్థ్యాలు లేవు కాబట్టి. అటువంటి వాళ్ళ భాషే బలహీనంగా చచ్చే దశలో ఉంటుంది. అంపశయ్య మీద పడుకోబెట్టిన భాషకు జవజీవాలను ప్రసాదించడం పరాన్న జీవులవల్ల కానేకాదు.

కాబట్టి తెలుగు భాషకు ముందు కావలసింది స్వయం పోషకత్వం. ఇతర భాషల జోలికి వెళ్ళకపోయినా తన మట్టుకు తాను బ్రతకగలిగే అవకాశం. ఇలాంటి పరిస్థితి లేనేలేదు. రానేరాదు అని మన తెలుగు మేధావులే తేల్చి చెప్పేస్తుంటే ఈ భాషను బ్రతికించేదెవరు? పైగా వేమన పద్యాన్ని తెలుగు జనానికి తెగ వినిపిస్తున్నారు, వేరే దిక్కు లేదంటున్నారు.

**"చిక్కియున్న వేళ సింహంబునైనను**
**బక్క కుక్కయైన బాధ సేయు**
**బలిమి లేని వేళ పంతముల్ చెల్లవు**
**విశ్వధాభిరామ వినురవేమ."**
**(గీటురాయి 5-8-2005)**



# తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన విశిష్టవ్యక్తులు

## అధికారభాషా సంఘం అధ్యక్షులు

| | పనిచేసిన కాలం | |
|---|---|---|
| | నుండి | వరకు |
| 1. వావిలాల గోపాలకృష్ణయ్య | 19-3-74 | 14-2-77 |
| 2. టి. అనుసూయమ్మ | ---- | 1-8-78 |
| 3. వందేమాతరం రామచంద్రరావు | 2-8-78 | 31-8-81 |
| 4. సి. నారాయణరెడ్డి | 4-9-81 | 13-8-85 |
| 5. కొత్తపల్లి వీరభద్రరావు | 2-12-85 | 31-12-86 |
| 6. నండూరి రామకృష్ణమాచార్య | 1-11-87 | 31-1-90 |
| 7. పి. యశోదరెడ్డి | 5-2-90 | 28-2-93 |
| 8. అబ్బూరి వరద రాజేశ్వరరావు | 17-3-93 | 3-5-93 |
| 9. గజ్జెల మల్లారెడ్డి | 17-5-93 | 21-6-95 |
| 10. తూమాటి దొణప్ప | 21-6-95 | 4-9-95 |
| 11. మాడుగుల నాగఫణిశర్మ | 27-5-95 | 27-5-2002 |
| 12. పరుచూరి గోపాలకృష్ణ | 19-2-2003 | 19-3-2005 |
| 13. ఎ.బి.కె. ప్రసాద్ | 20-3-2005 | ఈరోజు వరకు |

## తెలుగు విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్లు

| | | |
|---|---|---|
| 1. తూమాటి దొణప్ప | 08-01-1986 | 20-06-1989 |
| 2. సి. నారాయణరెడ్డి | 21-06-1989 | 04-11-1992 |
| 3. పేర్వారం జగన్నాథం | 05-11-1992 | 04-11-1995 |
| 4. నాయని కృష్ణకుమారి | 05-01-1996 | 24-03-1999 |
| 5. యన్. గోపి | 25-03-1999 | 23-03-2002 |
| 6. జి.వి. సుబ్రహ్మణ్యం | 27-05-2002 | 30-05-2005 |
| 7. ఆవుల మంజులత | 6-08-2005 | |

## తెలుగు అకాడమి డైరెక్టర్లు

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ పి.ఎస్.ఆర్ అప్పారావు | 29-6-68 | 1-7-74 |
| 2. | కె. వీరభద్రరావు | 2-7-74 | 4-8-75 |
| 3. | యన్. వెంకటస్వామి | 5-8-75 | 16-11-80 |
| 4. | జి. మనోహరరావు | 17-11-80 | 9-5-82 |
| 5. | జి. గోపాలకృష్ణన్ | 10-5-82 | 5-9-83 |
| 6. | టి. వెంకారెడ్డి | 6-9-83 | 10-8-85 |
| 7. | వి. కొండలరావు | 11-8-85 | 10-8-90 |
| 8. | డా॥ కె. భక్తవత్సలరావు | 11-8-90 | 1-1-91 |
| 9. | సి.ఎస్.వి. సుబ్బారెడ్డి | 1-1-91 | 31-7-92 |
| 10. | కె. హేమలత | 1-8-92 | 30-11-92 |
| 11. | అ. హైమవతి | 1-12-92 | 16-3-93 |
| 12. | చ. నర్సిరెడ్డి | 17-3-93 | 6-3-94 |
| 13. | దీవి సుబ్బారావు | 7-3-94 | 31-7-98 |
| 14. | డా॥ విజయభారతి | 1-8-98 | 30-11-99 |
| 15. | ఆవుల మంజులత | 1-12-99 | 5-10-2005 |
| 16. | జె. ప్రతాప రెడ్డి | 6-10-2005 | ఈరోజువరకు |

## ఆంధ్ర విశ్వవిద్యాలయం - తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | పింగళి లక్ష్మీకాంతం | 1931 - 49 |
| 2. | గంటి సోమయాజి | 1949 - 63 |
| 3. | కె.వి.ఆర్ నరసింహం | 1963 - 74 |
| 4. | తూమాటి దొణప్ప | 1974 -76 |
| 5. | యస్.వి. జోగారావు | 1976 -79 |
| 6. | కొర్లపాటి శ్రీ రామమూర్తి | 1979 - 82 |
| 7. | చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి | 1982 - 85 |
| 8. | లకంసాని చక్రధరరావు | 1985 - 88 |
| 9. | కోలవెన్ను మలయవాసిని | 1988 - 91 |
| 10. | వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి | 1991 - 93 |
| 11. | పల్లికొండ ఆపదరావు | 1993 - 96 |



| | | |
|---|---|---|
| 12. | మర్రిబోయిన జయదేవ్ | 1996 - 99 |
| 13. | బాల అరుణకుమారి | 1999 - 2001 |
| 14. | పర్వతనేని సుబ్బారావు | 2001 - 2005 |
| 15. | ఇ. విశ్వనాథరెడ్డి | 2005 - |

## ఉస్మానియావిశ్వవిద్యాలయం - తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | రాయప్రోలు సుబ్బారావు | 1919 - 1946 |
| 2. | ఖండవల్లి లక్ష్మీరంజనం | 1946 - 1964 |
| 3. | దివాకర్ల వేంకటావధాని | 1964 - 1973 |
| 4. | బి. రామరాజు | 1973 - 1983 |
| 5. | గోపాల కృష్ణారావు | 1983 - 1984 |
| 6. | నాయిని కృష్ణకుమారి | 1984 - 1986 |
| 7. | ఎం. కుల శేఖరరావు | 1986 - 1988 |
| 8. | ఎ. రాజేశ్వర వర్మ | 1988 - 1989 |
| 9. | వేటూరి ఆనందమూర్తి | 1989 - 1990 |
| 10. | ఎస్.వి.రామారావు | 1990 - 1992 |
| 11. | సీతా కళ్యాణి | 1992 - 1994 |
| 12. | ఎన్. గోపి | 1994 - 1996 |
| 13. | ఎల్లూరి శివారెడ్డి | 1996 - 1998 |
| 14. | రఘుమన్న | 1998 - 2000 |
| 15. | ఎల్లూరి శివారెడ్డి | 2000 - 2001 |
| 16. | కసిరెడ్డి వెంకటరెడ్డి | 2002 - |

## శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
## తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | రాయప్రోలు సుబ్బారావు | 1956-1959 |
| 2. | భూపతి లక్ష్మన్నారాయణ | 1959-1961 |
| 3. | పింగళి లక్ష్మీకాంతం | 1961-1965 |
| 4. | జి.యన్. రెడ్డి | 1965-1981 |
| 5. | జె. సూర్యనారాయణ | 1981-1982 |

| | | |
|---|---|---|
| 6. | యం. సుబ్బారెడ్డి | 1982-1984 |
| 7. | జి. నాగయ్య | 1984-1986 |
| 8. | కె. సర్వోత్తమరావు | 1986-1988 |
| 9. | పి.సి. నరసింహా రెడ్డి | 1988-1990 |
| 10. | ఎస్.జి.డి. చంద్రశేఖర్ | 1990-1991 |
| 11. | పి. నరసింహ రెడ్డి | 1991-1993 |
| 12. | కె. సర్వోత్తమ రావు | 1993-1996 |
| 13. | పి. నరసింహ రెడ్డి | 1996-1999 |
| 14. | యస్.జి.డి. చంద్రశేఖర్ | 1999-2002 |
| 15. | జి. చలపతి | 2002-2004 |
| 16. | జె. ప్రతాప్ రెడ్డి | 2004-2005 |
| 17. | డి.వి. చంద్రశేఖరరెడ్డి | 2005- |

## శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతులు

| | పేరు | పనిచేసిన కాలం |
|---|---|---|
| 1. | కోరాడ మహదేవశాస్త్రి | 1981 |
| 2. | మద్దూరి సుబ్బారెడ్డి | 1982 |
| 3. | తుమ్మపూడి కోటేశ్వరరావు | 1983 |
| 4. | కోరాడ మహదేవశాస్త్రి | 1984 |
| 5. | కొలకలూరి ఇనాక్ | 1985 - 86 |
| 6. | శలాక రఘునాథ శర్మ | 1987 - 88 |
| 7. | హెచ్.యస్. బ్రహ్మానందం | 1989 - 90 |
| 8. | పి.యల్. శ్రీనివాస రెడ్డి | 1991 - 92 |
| 9. | ఆర్. చంద్రశేఖర రెడ్డి | 1993 - 96 |
| 10. | కొలకలూరి ఇనాక్ | 1996 - 99 |
| 11. | శలాక రఘునాథ శర్మ | 1999 - 2001 |
| 12. | యం.కె. దేవకి | 2001 - 2005 |
| 13. | నరసింహులు | 2005 - |



## నాగార్జునవిశ్వవిద్యాలయం - తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | తూమాటి దొణప్ప | 1976-1985 |
| 2. | బి. పురుషోత్తం | 1986-1987 |
| 3. | టి. నిర్మల | 1988-1989 |
| 4. | ఎస్. గంగప్ప | 1990-1991 |
| 5. | ఎ. పున్నారావు | 1992-1993 |
| 6. | వై. బాలగంగధరరావు | 1994-1995 |
| 7. | జి. కృపాచారి | 1996-1998 |
| 8. | ఎన్. అనంతరామశాస్త్రి | 1999-2000 |
| 9. | టి. సత్యవతి | 2001-2002 |
| 10. | పి. వరప్రసాదమూర్తి | 2002-2004 |
| 11. | జి.వై. ప్రభావతి | 2004- |

## కాకతీయ విశ్వవిద్యాలయం - తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | కె.వి. రామకోటిశాస్త్రి | 1973-1979 |
| 2. | ఎ. రాజేశ్వర శర్మ | 1979-1981 |
| 3. | కె.వి. రామకోటి శాస్త్రి | 1981-1987 |
| 4. | పి. జగన్నాథం | 1987-1990 |
| 5. | కె. సుప్రసన్నాచార్య | 1990-1993 |
| 6. | హెచ్. శివకుమార్ | 1993-1995 |
| 7. | ఎ. భూమయ్య | 1995-1997 |
| 8. | కె. కాత్యాయని | 1997-1999 |
| 9. | పి. జ్యోతి | 1999-2001 |
| 10. | బి. ఐలయ్య | 2001-2003 |
| 11. | కె. యాదగిరి | 2003- |

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం - తెలుగు విభాగాధిపతులు

| | | |
|---|---|---|
| 1. | పి. కుసుమకుమారి | 1989-2001 |
| 2. | ఎమ్. విజయలక్ష్మి | 2001-2004 |
| 3. | డి. కృష్ణ కుమారి | 2004- |

# వాపు కాదు బలుపే

కాలగమనంలో ప్రతి భాషా మారుతూనే ఉంది. ఇతర భాషల నుంచి మాటలను తనలో విలీనం చేసుకుంటూ అభివృద్ధి చెందుతోంది. కొత్తదనాన్ని సంతరించుకుంటోది. ఇతర భాషల నుంచి అవసరాన్ని బట్టి మాటలను చేర్చుకోటం ప్రతి భాషకు అవసరం. ఇందులో తప్పు పట్టడానికేమీ లేదు. అయితే కొందరు సంప్రదాయ వాదులు ఇటువంటి మార్పును సహించలేరు. భాష అభివృద్ధి చెందుతుందని కాక భ్రష్టుపట్టిపోతుందని వారు బాధపడుతుంటారు. కాని అటువంటి బాధ అర్థం లేనిది. రోజురోజుకూ ప్రపంచం కొత్తదనంతో పల్లవిస్తూ ఉంటుంది. కొత్త అభిప్రాయాలు కలుగుతుంటాయి. కొత్త సంఘటనలు సంభవిస్తాయి. నూతన వస్తువులు పుట్టు కొస్తుంటాయి. వీటన్నిటి కోసం కొత్త మాటలు వెతుక్కోవాల్సి ఉంటుంది. అవసరమైతే ఇతర భాషలలోని పదాలను స్వీకరించాల్సి ఉంటుంది. ఇటువంటివన్నీ సహజ పరిణామాలే. అవసరం ఉన్నా లేకపోయినా ఇతర భాషలకే ప్రాధాన్యం ఇస్తూ పరభాషా మోజును పెంచుకుంటూ మాతృభాషను చులకనగా చూడటం మాత్రం తగని పని. ఇతర భాషలు సొంత భాషపై పెత్తనం చేసే పరిస్థితినీ కల్పించకూడదు.

ఏ భాష అయినా ఒక నది వంటిది. నదులు తమ ప్రవాహ వేగంలో ఇతర ఉపనదులను కలుపుకొని మహానదులుగా మారి కదిలిపోయినట్లుగా భాషలు కూడా ఇతర భాషల్లోని పదాల నెన్నిటినో తమలో విలీనం చేసుకొని విస్తరిస్తుంటాయి. సంస్కృత, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు, పారశీక భాషలలోని ఎన్నో పదాలు తెలుగులో కలిసిపోయి తెలుగు మాటలుగానే చెలామణీ అవుతున్నాయి.

ఇతర భాషా పదాలను తనలో కలుపుకోటంలో ఇంగ్లీషు మరీ ముందంజలో ఉందని చెప్పాలి. మొదటినుంచీ ఇంగ్లీషు అనేక భాషల సమ్మేళనంగానే వర్ధిల్లుతూ వచ్చింది. ఇటీవల ఆ ధోరణి మరీ ఎక్కువైంది.

ఈ విధంగా అన్యభాషా పదాలను ఇంగ్లీషులోకి చేర్చుకోవటం వల్ల ఆ భాష తన స్వచ్ఛతను కోల్పోతుందనీ ఆ విధంగా సాధించే అభివృద్ధి వాపే కాని బలుపు కాదని సంప్రదాయవాదులు ఆ వాదనతో ఏకీభవించటంలేదు. దేశాల మధ్య దూరాలు తగ్గిపోతూ ప్రపంచమంతా ఏకమవుతున్న ఈ తరుణంలో ఇతర భాషలలోని పదాలను తనలో ఐక్యం చేసుకుంటూ ఇంగ్లీషు గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోందని ఇది బలుపే కాని వాపు కాదని వారంటున్నారు!

**(ఈనాడు సంపాదకీయం 25 జూలై 2004)**

"దేశభక్తి అంటే మాతృభాష మీద అభిమానమే. మాట్లాడుతున్న భాషను కాదని మృతభాషను పూజించటం ఎలాంటిదంటే, ఆకలితో మాడిచస్తున్న సాటిమనిషికి అన్నంపెట్టకుండా, చనిపోయిన వారి పేరుతో శ్రాద్ధభోజనం పెట్టడం లాంటిది".

**- గిడుగు వేంకటరామమూర్తి.**



# క్రీ.శ.1900 సంవత్సరానికి పూర్వపు తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులు

| సంవత్సరం | నిఘంటు నిర్మాత | నిఘంటువు పేరు, ప్రచురించ బడిన ప్రదేశం |
|---|---|---|
| 1818 | డబ్ల్యు. బ్రౌన్ | A Vocabulary of Gentoo andEnglish మద్రాస్. |
| 1821 | ఎ.డి. కేంప్‌బెల్ | A Dictionary of the Teloogoo Language మద్రాస్. |
| 1835 | జె.సి.మోరిస్ | A Dictionary, English and Teloogoo మద్రాస్. |
| 1839 | డబ్ల్యు. కార్పెంటర్ | A Dictionary of English synonyms లండన్. |
| 1841 | సి. రామకృష్ణ శాస్త్రులు | A Vocabulary, in English and Teloogoo మద్రాస్. |
| 1841 | జె. నికోలాస్ | A Vocabulary of English and Teloogoo మద్రాస్. |
| 1844 | ఇ. బాల్ఫోర్ | Vocabularies Telagoo కలకత్తా. |
| 1847 | డబ్ల్యు. ఇల్లియట్ | Language of the Goands with terms in Telugu కలకత్తా. |
| 1849 | బి.హెచ్. హాడ్జ్‌సన్ | Vocabularies of Southern India కలకత్తా. |
| 1852 | చార్లెస్‌ఫిలిప్ బ్రౌన్ | A DICTIONARY, Telugu and Eng1ish మద్రాస్. |
| 1854 | చార్లెస్‌ఫిలిప్ బ్రౌన్ | A Dictionary of the Mixed Dialects మద్రాస్. |
| 1862 | రెవరండ్ పెర్సివల్ | Telugu - Eng1ish DICTIONARY మద్రాస్. |
| 1868 | సర్.ఎ.జె. ల్యాల్ | A Vocabulary in Hindustani, English,Telugu నాగపూర్. |
| 1886 | రెవరండ్ పెర్సివల్ | Anglo-Telugu Dictionary మద్రాస్. |
| 1889 | వీరస్వామి మొదలియార్ | Vocabulary in English and Telugu మద్రాస్. |
| 1891 | పి. శంకర నారాయణ | English - Telugu Dictionary మద్రాస్. |
| 1895 | చార్లెస్‌ఫిలిప్ బ్రౌన్ | A DICTIONARY, Eng1ish and Telugu మద్రాస్. |
| 1898 | జి.డబ్ల్యు. టేలర్ | An English-Telugu Vocabulary మద్రాస్. |
| 1900 | పి. శంకర నారాయణ | Telugu - English Dictionary మద్రాస్. |
| 1900 | పి. హోలర్ | Telugu Nighantuvulu రాజమండ్రి. |

## ప్రముఖ గ్రాంధిక భాషావాదులు



జయంతి రామయ్య
1860–1941



వేదం వెంకటరాయ శాస్త్రి
1853–1929



కొమర్రాజు లక్ష్మణరావు
1877–1923



విలకొలను సుబ్బారావు
1863–1939



కొక్కండ వెంకటరత్నం
1842–1915



రావు వెంకట కుమార మహీపతి
సూర్యారావు బహద్దర్ 1885-1965



## ప్రముఖ వ్యావహారిక భాషావాదులు



గిడుగు రామ్మూర్తి
1863–1940



జె.ఎ. ఏట్స్
1874–1951



పి.టి. శ్రీనివాసయ్యంగారు
1863–1931



కిళాంబి రామానుజాచార్యులు
1853–1928



సెట్టి లక్ష్మినరసింహం
1879–1938



బుర్రా శేషగిరిరావు
1884–1941